
‘ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+20 వెల: ₹5.00
సంపుటి: 11
సంచిక: 317

గురువారం 7-2-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మళ్లీ 11,000 పైకి నిఫ్టీ
ఐదో రోజూ లాభాలు.. 358 పాయింట్ల లాభంతో 36,975కు సెన్సెక్స్ -బిజినెస్‌లో



తొలి టీ20లో పరాజయం
కివీస్ చేతిలో 80 పరుగుల తేడాతో ఓటమి పాలైన భారత్ -స్పోర్ట్స్‌లో



“ బూత్ కమిటీ సభ్యులందరూ వచ్చే ఎన్నికల్లో గట్టిగా బాధ్యతలు తీసుకుని పార్టీని గెలిపించేందుకు కృషి చేయండి. ఇవాళ వైఎస్సార్‌కు ఎవరైనా ఉన్నారంటే అది మీరే. నాన్నగారు చనిపోతూ ఆయన ఇచ్చిన అతి పెద్ద కుటుంబం నాకు తోడుగా ఉందని భావిస్తున్నాను. నాతో పాటు మీరంతా కష్టాలను అనుభవించారు. అందరికీ ఒకటే చెబుతున్నాను. ఒక రాత్రి ముగిశాక పగలు మళ్లీ కచ్చితంగా ఉంటుంది. చీకటి తర్వాత వెలుగు ఉంటుంది. రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ అందరి బాగోగులకు నేను తోడుగా ఉంటానని మీకు హామీ ఇస్తున్నాను.

- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

వృద్ధాప్య పింఛన్ రూ.3,000

రూ.2 వేల నుంచి రూ.3 వేల దాకా పెంచుకుంటూ వెళతాం

అవ్వాతాతలకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ భరోసా

- ఇంటింటికీ నవరత్నాలను తీసుకెళ్లండి
- మన పోరాటం చంద్రబాబుపైనే కాదు, పచ్చమీడియాపై కూడా..
- ధర్మానికి, అధర్మానికి, న్యాయానికి, అన్యాయానికి మధ్య జరుగుతున్న పోరాటమిది
- మీ బాధలు, కష్టాలు నాకు తెలుసు.. మీరు నా గుండెల్లో ఉన్నారు
- రేపు మన ప్రభుత్వం రాగానే మీపై పెట్టిన దొంగ కేసులన్నింటినీ ఉపసంహరిస్తాం
- బాబు డబ్బు మూటలతో వస్తున్నాడు.. అప్రమత్తంగా ఉండండి
- బాబు మోసాలను జనానికి వివరించండి
- వైఎస్సార్‌సీపీ ఓట్లు తొలగిస్తున్నారు.. ఎప్పటికప్పుడు సరిచూడండి
- ప్రతి ఇంట్లో ఓటర్లను తీసుకెళ్లి ఓటు వేయించండి
- ఎన్నికలొచ్చాయని ఇవాళ బాబు మన పథకాలను కాపీ కొడుతున్నారు
- ఇదే విషయాన్ని ప్రజలందరికీ చెప్పండి
- తిరుపతి సమర శంఖారావం సభలో బూత్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం

2లో



బుధవారం తిరుపతి శివారులో జరిగిన సమర శంఖారావం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం. ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

రాష్ట్రంలో పరిస్థితి మార్చేందుకు

సలహాలివ్వండి

- తటస్థ ప్రభావితులతో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ముఖ్యమంత్రి చంద్రబాబే పెద్ద దళారీ
- తమ లాభాల కోసం రైతులను నట్టేట ముంచుతున్నారు.
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి
- పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టం
- ఏపీపీఎస్సీ ద్వారా 2.40 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం

- వివరాలు 4లో

జీశాట్–31 ప్రయోగం సక్సెస్



- దేశ సమాచార వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రయోగించిన జీశాట్–31 సమాచార ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 2.31 గంటలకు ఫ్రాన్స్ దేశానికి చెందిన ఫ్రెంచ్ గయానాలోని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి ఏరియన్–5 ఉపగ్రహ వాహక నౌక ద్వారా జీశాట్–31 కమ్యూనికేషన్ ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్లింది.

- వివరాలు 11లో



వలసదారులతో సుసంపన్నం

- చట్టబద్ధంగా అమెరికాకు వస్తున్న వలసదారులతో దేశానికి ఎన్నో విధాలుగా మేలు జరుగుతోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అలాగే అమెరికా పౌరుల ఉద్యోగాలు, ప్రాణాల్ని పరిరక్షించే ఒక సుదృఢ వలస వ్యవస్థను రూపొందించాల్సిన నైతిక బాధ్యత తమపై ఉందని ఉద్ఘాటించారు. కాంగ్రెస్‌లోని ఉభయ సభల్ని ఉద్దేశించి ఆయన ‘స్టేట్ ఆఫ్ ది యూనియన్’ పేరిట బుధవారం ప్రసంగించారు.

- వివరాలు 11లో

ఈడీ విచారణకు

రాబర్ట్ వాద్రా

- ఆయన విచారణకు రావడం ఇదే తొలిసారి
- తోడుగా వచ్చి దిగబెట్టి వెళ్లిన ప్రియాంక గాంధీ
- ముడుపులతో లండన్‌లో వాద్రా అక్రమాస్తులు కొన్నారు: బీజేపీ

“ నాకు విదేశాల్లో ఎలాంటి అక్రమాస్తులూ లేవు, రాజకీయ కుట్రతోనే ఇదంతా జరుగుతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం నన్ను వేధిస్తున్నారు.

- వాద్రా

11లో





‘ట్రావెన్‌కోర్’ యూటర్న్

- కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలోకి రుతుస్రావ వయసున్న (18 నుంచి 50 ఏళ్లలోపు) మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకించిన ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు బుధవారం అనూహ్యంగా మనసు మార్చుకుంది. ఆలయంలోకి రుతుస్రావ మహిళల ప్రవేశంపై గతేడాది ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సమర్థిస్తున్నట్లు బోర్డు తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేది కోర్టుకు తెలిపారు.

- వివరాలు 11లో

ఇదండీ సంగతి



అప్పుడే ఎందుకు సార్! వచ్చే ఎన్నికల దాకా ఆగి ఒకేసారి కలిపి ప్రశ్నించుకుందాం!!

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్

ఈ వారంలోనే!

- అసెంబ్లీ ఎన్నికలకు ముందే నిర్వహణకు ఈసీ సమాయత్తం
- మార్చి 29వ తేదీతో ఖాళీ కానున్న ఎనిమిది స్థానాలు
- ఎమ్మెల్యేల కోటాలో ఐదుగురు, పట్టభద్రుల ఎమ్మెల్సీల్లో ఇద్దరు, టీచర్ ఎమ్మెల్సీల్లో ఒకరి పదవీ కాలం మార్చితో పూర్తి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలకు ముందే పలు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 58 మంది సభ్యులు ఉండే శాసనమండలిలో ఈ ఏడాది మార్చి 29వతేదీతో ఎనిమిది మంది ఎమ్మెల్సీల పదవీ కాలం ముగియనుంది. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా కొనసాగుతున్న 20 మందిలో ఐదుగురు సభ్యుల పదవీకాలం మార్చి నెలలో పూర్తి కానుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీల్లో ఇద్దరు, ఉపాధ్యాయ పట్టభద్రులల్లో ఒక సభ్యుడి పదవీ కాలం కూడా ముగియనుంది. ఈ నేపథ్యంలో పదవీ కాలం ముగియనున్న ఈ ఎనిమిది మంది సభ్యుల స్థానంలో కొత్తవారిని ఎన్నుకునేందుకు ఈ వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని ఎన్నికల సంఘం వర్గాలు పేర్కొంటున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 9వతేదీన ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ మార్చి 20వ తేదీ నాటికి

మిగతా 5వ పేజీలో ▶

కరువు, తుపాన్లు వచ్చినా

11 శాతం వృద్ధి రేటు!



గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చలో సీఎం చంద్రబాబు

- నల్లధనాన్ని తెచ్చి పేదలకు రూ.15 లక్షల చొప్పున ఇస్తానన్న మోదీ మాట్లాడరేం?
- రుణమాఫీకి సహకరించకపోగా డబ్బులివ్వొద్దని ఆర్బీఐకి చెప్పారు
- కుట్రలు చేస్తున్నారంటూ విపక్ష నేతపై అసెంబ్లీలో సీఎం నిందారోపణలు

సాక్షి, అమరావతి:

కేంద్రం సహకరించకుండా అడుగడుగునా అడ్డుపడినా అభివృద్ధిలో దూసుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో కరువులు, తుపాన్లు వచ్చినప్పటికీ 11 శాతం వృద్ధి రేటును సాధించామన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో (ఎఫ్‌డీఐ) అత్యధికంగా రాష్ట్రంలో 300 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా బుధవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ నల్ల ధనాన్ని వెనక్కి తెచ్చి పేదల ఖాతాల్లో రూ. 15 లక్షలు చొప్పున జమ చేస్తానన్న నరేంద్ర మోదీ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షలు చొప్పున ప్రకటిస్తే కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద కేవలం రూ. 6 వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంటోందని విమర్శించారు. రుణమాఫీకి సహకరించాలని ప్రధాని మోదీని కోరితే అందుకు సహకరించకపోగా డబ్బులు ఇవ్వొద్దంటూ ఆర్బీఐకి చెప్పారని ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజల కనీస అవసరాలను తీర్చే ప్రయత్నమే చేయలేదన్నారు. పేదలపై మానవత్వం చూపకుండా సబ్సిడీ చక్కెరను సైతం రద్దు చేసిందన్నారు. మహిళలకు

మిగతా 7వ పేజీలో ▶

జయరాం కేసు తెలంగాణకు బదిలీ



- తప్పనిసరి పరిస్థితుల్లో ఏపీ డీజీపీ నిర్ణయం
- ఏపీ పోలీసులపై నమ్మకం లేదన్న జయరాం భార్య
- కేసు దర్యాప్తు తీరుపై ఆది నుంచీ అనుమానాలే
- దర్యాప్తుపై ప్రభావం చూపిన టీడీపీ నేతలు

7లో

ఐపీఎస్‌ల బదిలీలు

- ఎక్సైజ్ కమిషనర్ లక్ష్మీనర్సింహం చేనేత – జౌళి శాఖకు బదిలీ
- లిక్కర్ లాబీ, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన సర్కారు
- ఎన్నికల ముందు మద్యాన్ని ఇష్టానుసారంగా విక్రయించడమే లక్ష్యం!

4లో

ఫీజుల భారం తగ్గేదెప్పుడు?

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.35 వేలకే పరిమితం
- మిగతా భారమంతా విద్యార్థులపైనే
- రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచాలని నిపుణుల కమిటీ సూచించినా పట్టించుకోని సర్కార్
- తాజాగా ఇంజనీరింగ్ సహా వివిధ వృత్తి విద్యా కోర్సుల ఫీజుల పెంపుపై కసరత్తు

4లో



మీరంతా నా కుటుంబ సభ్యులు

నాతో పాటు 9 సంవత్సరాలు నడిచారు. నాకు అండగా నిలిచారు. కేసుల్ని భరించారు. ఆస్తుల్ని పోగొట్టుకున్నారు. కొందరైతే కుటుంబ సభ్యుల్ని పోగొట్టుకున్నారు. ఈ రోజు మిమ్మల్ని ఇక్కడ చూస్తుంటే అన్యాయానికి, అధర్మానికి ప్రతీకగా నిలిచిన చంద్రబాబు ప్రభుత్వాన్ని.. కౌరవ సామ్రాజ్యాన్ని ఓడించడానికి సిద్ధంగా ఉన్న పాండవ సైన్యంగా కనిపిస్తున్నారు. బాబు పాలనలో పడరాని పాట్లు పడ్డారు. బాధలు అనుభవించారు. మీకు తగిలిన ప్రతి గాయం నాకు తగిలింది. మీ బాగోగులు నేను చూసుకుంటాను. మీరంతా నా కుటుంబ సభ్యులు. దేవుడు ఆశీర్వదించి మనందరి ప్రభుత్వం రాగానే మిమ్మల్ని ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా పైకి తీసుకొస్తా. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడకుండా ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందాలి. ఈ కార్యక్రమంలో మీ అందరి పాత్రా కీలకమైంది. కొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూలు విడుదల కానుంది. ఇక మీరందరూ సవ్యసాచులవ్వాలి. చంద్రబాబు నాయుడు మారీచుడు లాంటి వాడు. గెలవడానికి ఎన్ని గిమ్మిక్కులై చేస్తాడు. వాటిని మీరు తిప్పి కొట్టాలి.

వృద్ధాప్య పింఛన్ రూ.3,000

సమర శంఖారావం సభలో బూత్ కమిటీ సభ్యుల మధ్యకు వెళ్లి వారి సందేహాలను నివృత్తి చేస్తున్న వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

అమ్మా.. అక్కా.. అన్నా.. అని అడగాలి

- బూత్ కమిటీ సభ్యులు అమ్మా.. అక్కా.. అన్నా.. అంటూ ప్రతి ఓటరును మంచి మాటలతో పలకరించండి.
- రూ.2 వేలకో, రూ.3 వేలకో మోసపోవద్దని విజ్ఞప్తి చేయండి.
- రేపు మన ప్రభుత్వం వస్తుందని, అందరికీ మేలు జరుగుతుందని చెప్పండి.
- మన పిల్లలను బడికి పంపిస్తే చాలు సంవత్సరానికి రూ.15 వేలు జగన్ ప్రతి అమ్మ చేతిలో పెడతాడని చెప్పండి.
- రేపు మన అన్న ముఖ్యమంత్రి అవుతాడు, ప్రతి ఏటా మే మాసం వచ్చేటప్పటికి రూ.12,500 ప్రతి రైతు చేతిలో పెడతాడని చెప్పండి.
- అన్న ముఖ్యమంత్రి అయ్యాక, మన ఇళ్లల్లో 45 ఏళ్లు నిండిన ప్రతి అక్కకు వైఎస్సార్ చేయూత పథకం కింద నాలుగేళ్లలో రూ.75,000 ఉచితంగా చేతిలో పెడతారని చెప్పండి.
- రేపు అన్న ముఖ్యమంత్రి అయ్యాక అవ్వా తాతల ముఖాల్లో చిరునవ్వు చూడటానికి వారి పింఛన్‌ను పెంచుతూ పోతాడు.. రూ.3 వేలకు తీసుకుపోతాడు.. అని చెప్పండి. (సభా ప్రాంగణంలో అరుపులు, కేకలు, హర్షధ్వానాలు)
- వాళ్లిచ్చే రూ.2000కు మోసపోవద్దని చెప్పండి.
- జగనన్న.. నవరత్నాల ద్వారా మనం అప్పులపాలు కాకుండా మన పిల్లలను ఇంజినీర్లుగా చేస్తాడని చెప్పండి.
- ఇలా నవరత్నాలను ప్రతి ఇంటికీ తీసుకు వెళ్లండని మీ అందరినీ కోరుతున్నాను.

తిరుపతి నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : దేవుడి ఆశీర్వాదం, ప్రజలందరి దీవెనలతో రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవ్వా తాతల పింఛన్‌ను రూ.3000 దాకా పెంచుతూ వెళతానని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రలోభాలకు లొంగవద్దని బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్లు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. మన పోరాటం ఒక్క చంద్రబాబునాయుడుతోనే కాదని, ఆయనకు దన్నుగా నిలుస్తున్న పచ్చమీడియాపై కూడా మనం యుద్ధం చేయాలని అన్నారు. చిత్తూరు జిల్లా తిరుపతి వెంకన్న పాదాల చెంత నుంచి బుధవారం ఆయన సార్వత్రిక ఎన్నికల సమర శంఖారావం పూరించి గంటన్నరకు పైగా బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. రేణిగుంట సమీపంలోని యోగానంద ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో జరిగిన ఈ సమావేశంలో జగన్.. సభ్యుల మధ్యకు వెళ్లి పలువురి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే..

ఈ రెండు నెలలు అప్రమత్తంగా ఉండండి

ఈ నెలలో ఎన్నికల షెడ్యూలు వస్తుంది. మార్చి – ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగుతాయి. ఈ రెండు నెలల కాలం చాలా అప్రమత్తంగా ఉండాలి. ఈనాడు, ఆంధ్రజ్యోతిలో వారికి సంబంధించిన టీవీల్లో రక రకాలుగా ప్రజలను నమ్మబుచ్చే కథనాలు వస్తాయి. అబద్ధాలను నిజమని చూపించే కథనాలు వస్తాయి. ఆ కథనాలను తిప్పి కొట్టే కార్యక్రమాలు చేయాల్సిన బాధ్యత మీపైనే ఉంది. 50 ఇళ్లకో, 35 ఇళ్లకో ఒక బూత్ కమిటీ సభ్యుడు బాధ్యులుగా ఉన్నారు. వీరు ప్రతి ఇంటికి వెళ్లి వారిని ఓటు వేయించే దాకా తీసుకు రావాలని కోరుతున్నాను. ఓటర్లను ప్రభావితం చేయడానికి చంద్రబాబు డబ్బులిస్తాడు. డబ్బులిచ్చినా వాటికి లొంగకుండా బూత్ కమిటీ సభ్యులు మన మంచి తనంతో ప్రతి ఓటరును పోలింగ్ బూత్‌కు తీసుకుని పోవాలి.

ఆ రోజు అందుకే జనం కాంగ్రెస్‌ను నమ్మలేదు

వారానికి ఒక సారి సినిమా మారినపుడల్లా వాల్ పోస్టర్లు మారుతుంటాయి. చంద్రబాబునాయుడు వాగ్దానాలు కూడా అలాగే ఉంటాయి. కాపీ కొట్టే వారిని కాపీ రాయుడు అంటాం. చంద్రబాబు నాయుడు లాంటి కాపీ రాయుడికి, ప్రథమ శ్రేణి విద్యార్థికి మధ్య ఒక తేడా ఉంటుంది. ఆ తేడా ఎలా ఉంటుందంటే.. 1982లో ఎన్టీ రామారావు టీడీపీని స్థాపించాక ఎన్నికలకు ఆరు నెలల ముందు ప్రజలకు రూ.2కే కిలో బియ్యం ఇస్తానని ప్రకటించారు. ఆ ప్రకటన చేశాక ఎన్టీఆర్‌కు ప్రజల్లో విశేషమైన ఆదరాభిమానాలు లభించాయని చెప్పి, అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కూడా ఎన్నికలకు కేవలం కొద్ది రోజుల ముందు రూ.1.90కే కిలో బియ్యం పథకాన్ని ప్రారంభించి ప్రజలకు ఇవ్వడం మొదలు పెట్టారు. రూ.2కే కిలో బియ్యం అంటూ ఎన్టీఆర్ ప్రకటించాక ప్రజలు తమకు ఎన్నికల్లో ఓట్లేయరేమోనని భయపడి అప్పుడు కోట్ల విజయభాస్కరరెడ్డి రూ.1.90కి కిలో బియ్యం చొప్పున ఆరు నెలల పాటు ఇచ్చాడు. కానీ ప్రజలు మాత్రం ఏమనుకున్నారంటే.. నాలుగున్నర సంవత్సరాల పాటు మమ్మల్ని పట్టించుకోకుండా.. ఎన్నికలొస్తున్నాయనగానే.. అది కూడా ఎన్టీఆర్ ప్రకటించారు కనుక మీకు మేం గుర్తుకొచ్చామనుకుని, మీలాంటి వ్యక్తులను నమ్మం అని అప్పట్లో కాంగ్రెస్‌కు ఓట్లు వేయలేదు. ఇవాళ ఇదే చంద్రబాబును చూస్తున్నప్పుడు కూడా ప్రజలకు అదే అనిపిస్తోంది. నాలుగున్నరేళ్ల పాటు ఆయనకు ప్రజలు గుర్తుకు రాలేదు. ఎన్నికలు మూడు నెలలున్నాయనగానే ఇప్పుడు కొత్త స్కీములు పెడుతున్నారు. ఇలాంటి మనిషిని చూసి ప్రజలు నిన్ను నమ్మం బాబూ.. అంటున్నారు.

చివరి సినిమానే ఆరో బడ్జెట్

చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు చూపిస్తున్న మూడో సినిమా చూడండి. ఈ సినిమా నిన్ననే తీశాడు. ఆ సినిమా పేరు ఆరో బడ్జెట్. తనది కాని బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నాడు. తన హయాంలో రాని బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నాడు. మూడు నెలల తర్వాత ఎవరు ముఖ్యమంత్రి అయ్యేది ప్రజలు, దేవుడు నిర్ణయిస్తారు. అలాంటిది ఈ పెద్ద మనిషి ఆరో బడ్జెట్‌ను రూ.2 లక్షల 26 వేల కోట్లతో ప్రవేశ పెట్టాడు.

పచ్చ మీడియా, బాబు డబ్బుతో కూడా పోరాడాలి

రేపటి ఎన్నికల్లో మనం చంద్రబాబుకు కొమ్ము కాస్తున్న పచ్చ మీడియాపై పోరాటం చేయాల్సి ఉంటుందని మన కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులంతా గమనించాలి. ఈ మీడియా అంతా కూడా లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లుగా చూపిస్తుంది. చంద్రబాబు పాలన గురించి అబ్బో.. అబ్బో... అంటూ వీరంతా చెప్పుకొస్తారు. అన్యాయాలపై, మోసాలపై పోరాటం చేయాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో మీరంతా అప్రమత్తం కావాలి. ఓట్లను తొలగించే కార్యక్రమాల పట్ల అప్రమత్తం కావాలి. మొట్టమొదటిగా దానిని అరికట్టే దిశగా అడుగులు వేయాలి. ఫారం–6ను ఎలా తీసుకోవాలో మీకందరికీ తెలుసు. ఆ ఫారంను తీసుకున్న మీరు ఓటర్లను ఎక్కడైనా తీసేసి ఉంటే మళ్లీ చేర్పించే కార్యక్రమం చేయాలి. ఎక్కడైతే చంద్రబాబుకు సానుభూతి పరులైన ఓటర్లు ఉన్నారో అక్కడ వారు రెండు ఓట్లను ఎక్కించే కార్యక్రమం చేస్తున్నారు. అలాంటి వాటిని కూడా కనుక్కొని వాటిని తొలగించే కార్యక్రమం చేయాలి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే ఇక చంద్రబాబునాయుడు డబ్బుతో కూడా మనం యుద్ధం చేయాల్సి ఉంది. ఎన్నికల్లో ఈ పెద్ద మనిషి ఊరకే రాడు. మూటలు, మూటలు డబ్బు తీసుకుని వస్తాడు. రూ.2000, రూ.3000 ప్రతి ఒక్కరి చేతుల్లోనూ పెడతాడు. అప్పటికీ ఇంకా ప్రజలు ఓట్లేస్తారని నమ్మకుండా వారి చేత దేవుని మీద ప్రమాణం చేయించుకుంటాడు. ఈ విషయాన్ని మీరంతా ప్రజలకు చెప్పాలి.



> **బూత్ కమిటీ సభ్యులుగా మనం చేయాల్సిన ముఖ్యమైన పని, బాధ్యత ఒక్కటే. ఐదు సంవత్సరాల కిందట చంద్రబాబును నమ్మి మోసపోయి ఓట్లేశాం. ఆ తర్వాత అన్ని రకాలుగా మోసం చేసి సినిమాలు చూపించాడు. ఆ తర్వాత మళ్లీ ఘరానా మోసం చేయడం కోసం మన ముందుకొచ్చి ఓట్లడుగుతున్నాడని చెప్పండి. ఐదేళ్లు ఇష్టానుసారం ప్రజల సొమ్మును లూటీ చేశారు. ఆ లూటీ చేసిన సొమ్ము నుంచి కాస్తో, కూస్తో తీసి బిస్కెట్లలాగా పంచే కార్యక్రమం చేస్తున్నాడు. అలాంటి వ్యక్తిని నమ్మం బాబూ అని చెప్పాల్సిన సమయం వచ్చిందని చెప్పాలి. ఇకపై ఆ పెద్దమనిషి చేయబోయే మోసాలను ఎలా అరికట్టాలో కూడా మీరంతా ఆలోచించాలి.**

చంద్రబాబు సినిమాలు ఎన్నెన్నో..

చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు మొదటి సినిమా చూపించారు. ఏ టీవీలో, పత్రికలో చూసినా ఆయనొస్తున్నాడంటూ ఊదరగొట్టాడు. జాబు రావాలంటే.. బాబు రావాలి అంటూ ప్రజలను మభ్యపెట్టారు. ఆయన రాగానే వ్యవసాయ రుణాలన్నీ మాఫీ అవుతాయంటూ రైతులకు ఆశ పెట్టారు. రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి.. రైతుల ఖర్చు మీద 50 శాతం లాభం వేసి కనీస మద్దతు ధర ఏర్పాటు చేస్తామన్నారు. మొదటి సంతకంతో బెల్టు షాపులు రద్దు చేస్తామన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తా అన్నారు. తాకట్టు పెట్టిన బంగారం ఒక నెలలోనే ఇంటికొస్తుందని హామీ ఇచ్చారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా చదివిస్తానని చెప్పారు. పేదలందరికీ ఇళ్లు కట్టిస్తానన్నారు. ఇంటికో ఉద్యోగం, లేకుంటే రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని, ప్రతి ఏటా ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తామని డైలాగులు కొట్టాడు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానన్నారు. రూ.2కే 20 లీటర్ల మినరల్ వాటర్ ఇస్తానని చెప్పారు. ప్రత్యేక హోదా 5, 10 కాదు, 15 సంవత్సరాలు కావాలని డైలాగులు కొట్టారు. వాల్మీకులు/బోయలు, మత్స్యకారులను ఎస్టీలుగా, కురుబలను ఎస్సీలుగా, గాండ్లను బీసీ–బీ నుంచి ఎస్సీలుగా, సగరలను బీసీ–బీ నుంచి బీసీ–ఏలుగా, పద్మశాలీలను బీసీ–బీ నుంచి బీసీ–ఏలుగా చేస్తానని హామీ ఇచ్చి.. ప్రతి కులానికి ఒక పేజీని కేటాయించాడు. ప్రతి కులాన్నీ ఏ విధంగా మోసం చేయాలనే విషయంలో చంద్రబాబు ఏకంగా పీహెచ్‌డీ చేశారు. మూడేళ్లలో పోలవరం పూర్తి చేస్తానని చెప్పి సినిమా డైలాగులు కొట్టారు. ఆపదలో ఉన్న మహిళలు ఫోన్ చేస్తే ఐదు నిమిషాల్లో కాపాడే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల చుట్టూ రింగ్ రోడ్డు వేస్తానన్నారు. అద్భుతమైన రాజధాని కడతానన్నారు. ఎన్నికలు అయిపోయాయి. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. మొదటి సినిమాలో చూపించిన విషయాలను మీరందరూ ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి. కనీసం ఒక్క హామీ అయినా నెరవేర్చలేదంటూ ప్రజలకు చెప్పండి.

ఎన్నికల తర్వాత కొత్త స్టోరీ..

ఎన్నికల్లో గెలిచిన తర్వాత చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలి అని కొత్త స్టోరీ మొదలు పెట్టారు. ఒక్క మంచి పని కూడా చేయలేదు. ఒక్క హామీ నెరవేర్చలేదు. ఏ భూములు ఎలా అమ్ముకోవాలి, ఏ కాంట్రాక్టుల్లో ఎంత దోచుకోవాలి, మట్టి, ఇసుక, ఖనిజాలు, కరెంటు కొనుగోలు, రాజధాని, విశాఖ భూములు, గుడి, దళితుల భూములు కూడా వదిలిపెట్టలేదు. ఈ ఐదు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోపిడీ చేశారు. గ్రామ స్థాయిలో జన్మభూమి కమిటీల మాఫియా పెట్టి.. పల్లెలను కూడా దోచేశారు. అమరావతిలో కూర్చొని రాష్ట్రాన్నే దోచేయడం మొదలు పెట్టాడు. ఎన్నికలకు ఆరు నెలల ముందు.. మూడు నెలల కోసం అంటూ ఈ మధ్య కాలంలో రెండో సినిమా మొదలు పెట్టారు. ఇది అందరికీ గుర్తుండే ఉంటుంది. ఆయన తీస్తున్న సినిమాలు, ఆడుతున్న నాటకాలు కళ్ల ముందే ఉన్నాయి. నాలుగు సంవత్సరాలు బీజేపీతోనూ, పవన్ కల్యాణ్‌తోనూ కలిసి రాష్ట్రాన్ని ముంచేశాడు. ఇప్పుడు మాత్రం వారితో పోరాడుతున్నట్లు నటిస్తూ డ్రామాలాడుతున్నాడు. పోలవరం కట్టకుండానే జాతికి అంకితం చేయడం రెండో సినిమా కథ. ఎవరైనా ఇల్లు కట్టడం పూర్తయ్యాక భోజనాలకు పిలుస్తారు. పోలవరం ప్రాజెక్టు పునాది గోడలు దాటకముందే ఈయన జాతికి అంకితం చేశాడు. ఎన్నికలకు ఆరు నెలల ముందు.. మూడు నెలల కోసం అన్న ఈ సినిమాలో ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టాడు. హోదా గురించి ఎవరైనా మాట్లాడితే జైల్లో పెట్టిస్తానన్నాడు, పీడీ యాక్టులు పెట్టాడు. కేసులు పెట్టించే కార్యక్రమాలు చేశారు. ఇప్పుడు నల్ల చొక్కా వేసుకుని ధర్మపోరాట దీక్ష అంటూ డ్రామాలు మొదలు పెట్టాడు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఐదు సంవత్సరాల పాటు పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల రుణ మాఫీ అన్న సంగతే ఎత్తలేదు. ఈ మూడు నెలల కోసం పసుపు – కుంకుమ అంటూ మొదలు పెట్టాడు. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల రుణాలు ఆయన ముఖ్యమంత్రి అయ్యే నాటికి వడ్డీతో సహా రూ.14 వేల కోట్లుంటే.. ఇప్పుడు రూ.25 వేల కోట్లకు చేరాయి. రుణాలు మాఫీ చేయకుండా మోసం చేశారు. రైతుల జీవితాలతో ఐదేళ్లు ఆటలాడుకున్నారు. కానీ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రైతులకు చెవిలో పూలు పెడుతూ రూ.5 వేల కోట్లు ఇస్తానని ప్రకటించారు. రాజధాని కోసం రైతులు ఇచ్చిన భూములు వేల ఎకరాలు అమ్ముకున్నాడు. రాజధానిలో బాహుబలి సెట్టింగులు చూపిస్తున్నాడు. చివరి మూడు నెలల్లో 1.72 కోట్ల నిరుద్యోగులుంటే 3 లక్షల మందికి భృతి ఇస్తున్నామంటున్నారు. ఇది కూడా ఎన్నికలు వస్తున్నందుకే.

ప్రతి కులానికీ కార్పొరేషన్లు

ప్రస్తుతం ఉన్న కార్పొరేషన్ల వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తానని, ప్రతి కులానికి కార్పొరేషన్ పెడతానని నేను చెబితే.. ఇప్పుడు చంద్రబాబు ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ అంటున్నాడు. 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలోని ప్రతి అక్కకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.75 వేలు ఉచితంగా ఇస్తామని మనం చెప్పాం. ఇన్నాళ్లూ పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు ప్రతి కులానికీ కార్పొరేషన్ అంటూ అందుకున్నాడు. ఆశ్చర్యంగా బీసీల డిక్లరేషన్ గురించి మాట్లాడుతున్నాడు. 2013లో బీసీల కోసం పెట్టిన డిక్లరేషన్ ఎన్నికల తర్వాత గుర్తుకు రాలేదు. రాజమండ్రిలో బీసీల సభ పెట్టి బీసీ డిక్లరేషన్ అంటూ మరోసారి మభ్యపెడుతున్నాడు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, హోంగార్డులకు జీతాలు పెంచాలంటే చంద్రబాబుకు మనసు రాదు. పాదయాత్రలో మనం హామీ ఇచ్చిన తర్వాత వారికి జీతాలు పెంచినట్లుగా డ్రామాలాడతాడు. 57 నెలలు కడుపు మాడ్చి, ఇప్పుడు కడుపు నిండుగా అన్నం పెడతానని నాటకాలాడుతున్నాడు. ఈ మనిషిని అన్నా అనాలా.. దున్న అనాలా.. అనేది మీరే ఆలోచించండి.

> **చంద్రబాబు డబ్బులిస్తాడు.. ఇస్తే తీసుకోండి.. జేబులో పెట్టుకోండి.. ఈ రాక్షసుడికి మాత్రం ఓట్లేయం అని మనసులో దేవుణ్ని అనుకోండి.. ఏ దేవుడైనా అవినీతి సొమ్ము తీసుకుని ఓట్లేయమని చెప్పడనే విషయాన్ని మీరు ప్రజలకు చెప్పాలి. చంద్రబాబు డబ్బులిస్తే తీసుకోండి కానీ ఓట్లు వేసేటప్పుడు మాత్రం మీ మనస్సాక్షి ప్రకారం ఓట్లేయండి.. అని మీరంతా ప్రజల్లోకి వెళ్లి చెప్పాల్సిన అవసరం ఎంతో ఉంది.**
>
> **ఇప్పుడు చంద్రబాబు ప్రవేశ పెట్టిన బడ్జెట్.. రేపు ప్రజల దీవెనలు, దేవుడి ఆశీర్వాదంతో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మనం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌ను కాపీ కొడితే ఎలాగుంటుందో ఇంచు మించుగా అలా ఉంది. అయితే అది కూడా సరిగా కాపీ కొట్టలేని విధంగా ఉంది. కనీసం కాపీ కొట్టడం కూడా చేతగాని కాపీ రాయుడు ఈ చంద్రబాబునాయుడు. ఈయన గారి ఈ మూడో సినిమా గురించి ప్రజల్లోకి వెళ్లి బాగా చెప్పండి.**

> **చంద్రబాబు 57 నెలల పాటు అవ్వాతాతలను పట్టించుకోలేదు. వారి పింఛన్ మొత్తాన్ని పెంచుతామని మేము చెప్పగానే రూ.2 వేలకు పెంచేశాడు. ఆటోలు, రైతుల ట్రాక్టర్ల రోడ్డు ట్యాక్స్‌ను రద్దు చేస్తామని పాదయాత్రలో మనం చెప్పాం. ఆటోకు రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చాం. కానీ చంద్రబాబు నాయుడు దీన్ని కూడా కాపీ కొట్టాడు. ఎన్నికలొస్తున్నాయి కాబట్టే.. ఖాకీ చొక్కా వేసుకొని రోడ్డుపైకొచ్చాడు. చంద్రబాబుకు ఆటోవాలాల కష్టాలు తెలియవు. ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకొస్తారు.**

> **ఈ ఎన్నికలు మోసానికి.. విశ్వసనీయతకు, ధర్మానికి.. అధర్మానికి, న్యాయానికి.. అన్యాయానికి, డబ్బుకు.. ఆప్యాయతకు మధ్య జరిగేవి. రేపటి ఎన్నికల్లో మనం పోటీ చేసేది ఒక్క చంద్రబాబు పైనే కాదు, చంద్రబాబుకు కొమ్ము కాస్తున్న పచ్చ మీడియా మొత్తంతో పోటీ పడాల్సి ఉంటుంది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, ఏబీఎన్, ఈటీవీ.. ఇలా పచ్చ టీవీ చానెళ్లన్నింటిపైనా పోరాటం చేయాల్సి ఉంటుందని మన కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులంతా గమనించాలి.**

పోలీసులను చంద్రబాబు ప్రభుత్వం సొంత సంస్థలాగా వాడుకుంటోంది. మేం పార్టీ కార్యక్రమాలు చేయాలంటే ఇబ్బందులు పెట్టడంతో పాటు కేసులు పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మేము ఏం చేయాలి?

– సుధీర్, పూతలపట్టు (కాణిపాకం పోలింగ్ బూత్ నెంబర్ 49)

జగన్ : పోలీసులు వేధిస్తున్నారు.. ప్రజా వ్యతిరేక చర్యలపై ఏ ధర్నా చేసినా దొంగ కేసులు పెడుతున్నారు.. అని వేలాది మంది బూత్ కమిటీ సభ్యులు చెబుతున్నారు. ప్రతి బూత్ కమిటీ సభ్యునికీ ఇక్కడి నుంచి నేను సంకేతాలిస్తున్నాను. ధర్నాలు చేస్తే కేసులు పెడుతున్నారనే విషయం నాకు తెలుసు. సుధీర్‌కు, యావత్ 13 జిల్లాల్లో ఉన్న బూత్ కమిటీ సభ్యులకు ఇదే చెబుతున్నాను. ప్రతి కార్యకర్తకూ, ప్రతి వైఎస్సార్ కుటుంబ సభ్యునికీ చెబుతున్నాను. మనందరి ప్రభుత్వం రాగానే ఈ పోలీసులు పెట్టిన దొంగ కేసులన్నింటినీ కూడా ఉపసంహరిస్తాను.

చంద్రబాబు ప్రత్యేక హోదా సాధిస్తానని ఇదే తిరుపతిలో చెప్పి మనలను మోసం చేశాడు. ప్రత్యేక హోదా సాధనకు మనం ఏ విధంగా పోరాటం చేస్తాము?

– సురేష్, శ్రీకాళహస్తి (చోడవరం బూత్ నెంబర్ 256)

జగన్ : చంద్రబాబు ఇవాళ నల్లచొక్కాలు వేసుకుని, ధర్మపోరాట దీక్షలు చేస్తూ మోసం చేస్తున్నారు. రేపు ఎన్నికల్లో రాష్ట్రంలో 25కు 25 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ గెలిచే విధంగా ఓట్లు వేయాలని ప్రజలకు గట్టిగా విజ్ఞప్తి చేయండి. కేంద్రంలో పరిస్థితి చూస్తే రేపు ఎన్నికలు ముగిశాక ఏ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చే పరిస్థితులు లేవు. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో 25 స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ గెలుచుకుంటే మనకు హోదా తప్పకుండా వస్తుంది. ప్రత్యేక హోదా అనే అంశాన్ని చట్టంలో పెట్టకుండా కాంగ్రెస్ మనల్ని మోసం చేసింది. ఆ పార్టీని నమ్మకండి. బీజేపీ అధికారంలోకి వచ్చి కూడా మోసం చేసింది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రత్యేక హోదా అంశాన్ని పెట్టారు. అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ దేవుని సన్నిధిలో ఇచ్చిన హామీకే దిక్కూ దివాణం లేకుండా పోయింది. అందుకే వీళ్లనూ నమ్మొద్దు. చంద్రబాబునూ నమ్మొద్దండి. ఆయన పూటకో మాట మార్చి ఏపీని రోడ్డు మీదకు తెచ్చాడు. వీరెవ్వరినీ నమ్మొద్దండి అని ప్రజలకు చెప్పండి. 25 స్థానాలను మనం గెల్చుకున్న తర్వాత ఎవరైతే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని సంతకం చేస్తారో వారికే మన మద్దతు ఇస్తామని గట్టిగా ప్రజలకు చెప్పండి.



సమర శంఖారావం సభలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పాదయాత్ర ద్వారా మీరు ప్రజాభిమానాన్ని విశేషంగా చూరగొన్నారు. మీరు ముఖ్యమంత్రి అయ్యేది ఖాయం. అందువల్ల మీరు ఏ పార్టీతో కూడా ఎన్నికల పొత్తు పెట్టుకోవద్దని మా విన్నపం. ఒంటరిగానే పోటీ చేయాలని కోరుతున్నాం. ఒంటరిగానే మీరు ముఖ్యమంత్రి కావాలి.

– కోటేశ్వరపిళ్లై, పూతలపట్టు (బూత్ నెం 164)

జగన్ : ఇంతకు ముందు ఎన్నికల్లో కూడా మనం ఎవరితోనూ పొత్తు పెట్టుకోలేదు. వచ్చే ఎన్నికల్లో కూడా మనకు ఎవరితోనూ పొత్తు ఉండదని స్పష్టం చేస్తున్నాను. ప్రతి చోటా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను భుజాన వేసుకుని తిరిగిన వారు మన వాళ్లే ఉన్నారు. వాళ్లెవరికీ అన్యాయం జరక్కుండా చూస్తాను. ప్రతి చోటా వైఎస్సార్ కాంగ్రెస్ జెండా ఎగిరేటట్లుగా చేస్తాను. ఇవాళ ఉన్న ఈ పార్టీలన్నీ నైతిక విలువలను పూర్తిగా మరచి పోయాయి. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, పవన్ కళ్యాణ్ (జనసేన) పార్టీలు ప్రజలకు ఇది చేస్తాం, అది చేస్తాం.. ప్రత్యేక హోదా ఇస్తామని నమ్మించారు. వీళ్లందరూ ఒక్కటై రాష్ట్ర ప్రజలను మోసం చేశారు. రాష్ట్రం అనేది ఒక మనిషైతే వీళ్లలో ఒకరు ఆ మనిషి కాళ్లు, చేతులు పట్టుకున్నారు. మరొకరు కత్తిని ఇచ్చారు. ఇంకొకరు ఆ కత్తితో పొడిచారు. కాబట్టి ఇలాంటి వారెవరితోనూ పొత్తు ఉండదని మీ అందరితో గట్టిగా చెబుతున్నాను.

ఎన్నికల సమయంలో చంద్రబాబు చాలా ఉచిత హామీలు, తప్పుడు హామీలు ఇస్తున్నారు. వీటిపై బూత్ కమిటీ సభ్యులుగా ఎలా స్పందించాలి?

– డేవిడ్, సత్యవేడు (కేబీపీ పురం, బూత్ నెంబర్ 216)

జగన్ : ఎన్నికలొచ్చేటప్పటికి చంద్రబాబు రకరకాల దొంగ హామీలిస్తున్నారు. ప్రజల వద్దకు మీరు వెళ్లినప్పుడు ఒకే ఒక్క మాట చెప్పండి. అమ్మా.. అన్నా.. అక్కా.. నాలుగున్నర సంవత్సరాలు చంద్రబాబు మనకేమీ చేయక పోగా అబద్ధాలు చెప్పాడు. మోసాలు చేశాడు. కేవలం ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి, అది కూడా జగనన్న చెప్పాడు కాబట్టి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చంద్రబాబు ఇవాళ దొంగనాటకాలు ఆడుతున్నాడు.. మోసాలు చేస్తున్నాడని చెప్పండి. నాలుగున్నర సంవత్సరాలుగా అమ్మకు అన్నం పెట్టని వాడు అవసరం వచ్చినపుడు చిన్నమ్మకు బంగారు గాజులు కొనిస్తానని అన్నాడట ఒకడు. ఇదే మాదిరిగా చంద్రబాబు పరిస్థితి ఉంది అని ప్రజలకు చెప్పండి. ఎన్నికలు వచ్చాయి కాబట్టి చంద్రబాబుకు మనం గుర్తుకొచ్చాం. ఎన్నికలయ్యాక మళ్లీ మనలను దగా, మోసం చేస్తాడని ప్రజలకు గట్టిగా చెప్పండి.

జనం సొమ్ముతో సొంత ప్రచారమా?

- సుప్రీం తీర్పు స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం తీరు
- నిబంధనలకు పాతరేస్తూ ప్రచార ప్రకటనలు జారీ
- ప్రజాధనంతో అధికార పార్టీకి అనుకూలంగా ప్రకటనలా?
- రూ.13.76 కోట్లతో సీఎం చంద్రబాబు వ్యక్తిగత ఇమేజ్ పెంచేందుకు ప్రకటనలు జారీ చేయడంపై కాగ్ అభ్యంతరాలు
- చివరి నిమిషంలో సీఎం, సీఎంవో ఆదేశాలతో తప్పుడం లేదని సమాచార శాఖ వివరణ
- సంతృప్తి చెందని కాగ్... సుప్రీం మార్గదర్శకాలపై కమిటీ ఏదని ప్రశ్న

సాక్షి, అమరావతి: అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సర్కారు ప్రజాధనంతో సొంత ప్రచారం నిర్వహించుకోవడాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తప్పుబట్టింది. సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి విరుద్ధంగా అధికార పార్టీకి అనుకూలంగా ప్రచార ప్రకటనల కోసం ప్రజాధనాన్ని ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించింది. 2015 మే నెలలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని దూషిస్తూ రూ.13.76 కోట్లతో సర్కారు ప్రచార ప్రకటనలు జారీ చేయడం పట్ల కాగ్ అభ్యంతరం వ్యక్తం చేసింది.

ప్రకటనల జారీపై సుప్రీం స్పష్టమైన మార్గదర్శకాలు...

'ప్రకటనల పేరుతో రాజకీయ లబ్ధి కోసం ప్రజాధనాన్ని వినియోగించరాదు. ప్రభుత్వం బాధ్యతతో పనిచేసేలా మాత్రమే ప్రచార ప్రకటనలు ఉండాలి. ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రచార మెటీరియల్ ఆబ్జెక్టివ్‌గా ఉండాలి. అధికార పార్టీ ఇమేజ్ పెంచేలా, వ్యక్తులకు రాజకీయంగా ఉపకరించేలా ప్రజాధనంతో ప్రచార ప్రకటనలు జారీ చేయరాదు. న్యాయపరంగా, ఆర్థిక నియంత్రణతో కూడినవిగా ప్రకటనలు ఉండాలి' అని సుప్రీం కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసిందని కాగ్ తెలిపింది. అయితే చంద్రబాబు సర్కారు సుప్రీం మార్గదర్శకాలను పూర్తిగా ఉల్లంఘించిందని కాగ్ తప్పుబట్టింది.

సీఎం, సీఎంవో ఆదేశాల మేరకే...

సుప్రీంకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా, టీడీపీ సర్కారుకు అనుకూలంగా ప్రజాధనంతో ప్రచారం నిర్వహించడంపై వివరణ ఇవ్వాలని సమాచారశాఖ కమిషనర్‌ను 'కాగ్' లిఖిత పూర్వకంగా కోరింది. ఈ నేపథ్యంలో సమాచార శాఖ కమిషనర్ దీనిపై స్పందిస్తూ చివరి నిమిషంలో ముఖ్యమంత్రితోపాటు ఆయన కార్యాలయం మౌఖికంగా ఆదేశాలు జారీ చేస్తుందని, వాటిని అమలు చేయడం తమ బాధ్యతంటూ వివరణ అందచేశారు. సీఎం, ఆయన కార్యాలయం ఆదేశాల మేరకే తాము వ్యవహరించినట్లు అందులో సమాచార శాఖ కమిషనర్ పేర్కొన్నారు. అయితే ఈ వివరణపై సంతృప్తి చెందని 'కాగ్' అసలు సుప్రీం కోర్టు తీర్పు మార్గదర్శకాలను అమలు చేసేందుకు ఏవైనా ఆదేశాలను జారీ చేశారా? లేదా? ఒకవేళ జారీ చేయకుంటే అందుకు కారణాలను వెల్లడించాలని సమాచారశాఖకు సూచించింది. సుప్రీం కోర్టు మార్గదర్శకాల అమలుకు కమిటీని ఏర్పాటు చేయలేదని సమాచార శాఖ కమిషనర్ వివరణలో పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వ్యక్తిగత ప్రతిష్ట కోసమే సీఎం దీక్షలు

- గత ఏడాది ఏప్రిల్ 20వతేదీన తన పుట్టిన రోజు సందర్భంగా జన్మనిచ్చిన భూమి కోసం చంద్రబాబు నిరాహార దీక్ష పేరుతో రూ.1.91 కోట్లతో ప్రచార ప్రకటనలు జారీ చేశారని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆ దీక్ష చేశారని, అయితే పూర్తిగా చంద్రబాబు వ్యక్తిగత ప్రతిష్ట పెంచుకునేందుకే దీక్ష చేశారని కాగ్ తూర్పారబట్టింది.
- గత ఏడాది జూన్ 30వ తేదీన 'అంబేడ్కర్ ఆశయం.. చంద్రన్న ఆచరణ' పేరుతో రూ.3.01 కోట్లతో ప్రచార ప్రకటనలు జారీ చేశారు. చంద్రన్న ఆచరణ అనడం పూర్తిగా చంద్రబాబు వ్యక్తిత్వాన్ని పెంచడానికేనని, ఈ ప్రకటన సుప్రీం మార్గదర్శకాలకు విరుద్ధమేనని కాగ్ పేర్కొంది.
- గత ఏడాది జూన్ 2వ తేదీన నవ నిర్మాణ దీక్ష పేరుతో కేంద్రానికి వ్యతిరేకంగా చంద్రబాబును పొగుడుతూ ఏకంగా రూ.4.08 కోట్ల ఖర్చుతో సమాచార శాఖ ప్రచార ప్రకటనలు జారీ చేయడాన్ని కాగ్ తప్పుబట్టింది. ఏరువాక పౌర్ణమి పేరుతో రూ. 0.77 కోట్లతో ప్రచార ప్రకటనలు జారీ చేయడం సుప్రీం మార్గదర్శకాల ఉల్లంఘన కిందకే వస్తుందని కాగ్ స్పష్టం చేసింది.
- గత ఏడాది ఏప్రిల్ 20వ తేదీన ధర్మపోరాట దీక్ష పేరుతో చంద్రబాబు ఫొటోలతో హోర్డింగుల ఏర్పాటుకు రూ.3.99 కోట్ల ఖర్చు చేయడాన్ని కూడా కాగ్ తప్పుబట్టింది.

సీఐసీ నియామకంపై నిర్ణయం తీసుకోలేదు

హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ (సీఐసీ) నియామకంపై ఇంత వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. సీఐసీ విషయంలో నిర్ణయం తీసుకున్నామంటూ పత్రికల్లో వచ్చిన వార్తా కథనం ఆధారంగా పిటిషన్ దాఖలు చేశారని, దీనికి ఎలాంటి విచారణార్హత లేదని తెలిపింది. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు సైతం చెప్పిందని వివరించింది. ఆ తీర్పులను తమ ముందుంచాలన్న హైకోర్టు తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఆ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సీఐసీగా ఐఎఫ్ఎస్ అధికారి అశోక్ కుమార్ జైన్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీని వెనుక దురుద్దేశాలున్నాయని హైకోర్టులో పిల్ దాఖలైంది. సీఐసీ పోస్టు కోసం అశోక్ జైన్ దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా నోటిఫికేషన్ల గడువు తేదీని కూడా రెండు సార్లు పొడిగించిదని, అందువల్ల నోటిఫికేషన్ల అమలును నిలిపేయాలని కోరుతూ పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరానికి చెందిన భూపతిరాజు రామకృష్ణంరాజు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తరపున ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) డి.రమేశ్ వాదనలు వినిపిస్తూ, సీఐసీ నియామకం విషయంలో ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

పదోన్నతులివ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తోంది

వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రెడ్డి శేఖరరెడ్డి



మాట్లాడుతున్న రెడ్డి శేఖరరెడ్డి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయుల పదోన్నతులకు కోర్టు అనుమతి ఇచ్చినా ప్రభుత్వం వాటిని చేపట్టకుండా మోసం చేస్తోందని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రెడ్డి శేఖరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో సీపీఎస్ రద్దు అంశాన్ని కనీసం ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకటరెడ్డి మాట్లాడుతూ మంగళవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 11వ పీఆర్సీ, ఐఆర్‌లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడం విద్యాశాఖకు అవసరమైనన్ని నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. రూ. 398 వేతనంతో పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గెడ్డం సుధీర్ మాట్లాడుతూ పాఠశాల గ్రాంట్లు పూర్తిగా అకౌంట్లలో జమ చేయాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సాంబశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెబేలు, గౌరవ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌సన్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పి. రాహేలమ్మ, నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎం. రత్నకుమార్, ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యు.ప్రసన్నకుమార్, కేవీ సత్యనారాయణ, పి.వెంకట్రావు పాల్గొన్నారు.

'ఇది హరినాథ్ పర్యాటకాభివృద్ధి సంస్థ'

టూరిజం కార్పొరేషన్ పేరు మార్చి ఉద్యోగుల వినూత్న నిరసన



పన్నాడ హరినాథ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అని బ్యానర్ కట్టి నిరసన తెలుపుతున్న సిబ్బంది

సాక్షి, విజయవాడ: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ)లో అధికారి పెత్తనానికి వ్యతిరేకంగా సిబ్బంది వినూత్న నిరసన తెలిపారు. జనరల్ మేనేజర్ పన్నాడ హరినాథ్ కార్పొరేషన్‌లోని ఫోకల్ పదవుల్ని నిర్వహిస్తున్నారు. ఆయన తీరుపై ఆగ్రహించిన సిబ్బంది ఆటోనగర్‌లోని కార్పొరేట్ కార్యాలయానికి బుధవారం ఉదయం చేరుకున్నారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరును తొలగించి పన్నాడ హరినాథ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా మార్చివేసి బ్యానర్లు ఏర్పాటు చేశారు. అదే పేరుతో ఈ సంస్థను పిలవాలంటూ నిరసన తెలిపారు. పర్యాటక సంస్థలో కీలకమైన అడ్మిన్ జనరల్ మేనేజర్, హోటల్స్ జనరల్ మేనేజర్ పదవులు హరినాథ్ నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ విభాగం కూడా ఆయనే పర్యవేక్షిస్తున్నారు. హరినాథ్‌కు చెక్ పవర్ ఇవ్వడంతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. కాంట్రాక్టర్ల వద్ద పర్సంటేజ్‌లు వసూలు చేస్తున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. హరినాథ్‌ను కీలక పదవుల నుంచి తప్పించాలని సిబ్బంది కోరుతున్నారు. నిరసన కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, వీరనారాయణ, సురేంద్రరెడ్డి, ఎన్‌వీ ప్రసాద్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ సభ్యునిగా రామరాజు నియామకం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యునిగా ఎంవీ రామరాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామరాజు సుదీర్ఘకాలంగా సచివాలయంలోని సాధారణ పరిపాలన శాఖలో కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం సాధారణ పరిపాలన శాఖ అదనపు కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇప్పుడు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థానంలో రామరాజును సభ్యునిగా ప్రభుత్వం నియమించింది.

మారిన 'కారుణ్య' వీఆర్వో సర్వీసు నిబంధనలు

సాక్షి, అమరావతి: విలేజ్ రెవిన్యూ ఆఫీసర్ల (వీఆర్వో) కారుణ్య నియామకాల సర్వీసు నిబంధనలను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కారుణ్య నియామక వీఆర్వోలు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత కలిగిన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలని, సర్వీసులో చేరిన రెండేళ్లలోగా నాలుగు నెలల సర్వే ట్రైనింగ్ కోర్సును పూర్తి చేయడమే కాకుండా, మూడేళ్లలోగా ఏపీ సర్వీస్ కమిషన్ నిర్వహించే కనీస కంప్యూటర్ పరిజ్ఞానం టెస్ట్ పూర్తి చేయాలంటూ నిబంధనలు మార్చారు. విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు (వీఆర్ఏ) పదోన్నతి కింద వీఆర్వోలుగా అవ్వడానికి కూడా ఈ మూడు నిబంధనలు తప్పనిసరి అని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎంపీటీసీకి చేనేత పింఛన్!

ఇతర కులస్తులకూ మంజూరు



కొత్త ఫింఛన్ మంజూరు చేయించుకున్న ఆళ్లమోహనరావు (వృత్తంలో ఉన్న వ్యక్తి)

ఏలూరు రూరల్: నిరుపేదలు, ఆదరణ లేనివారికి దక్కాల్సిన పింఛన్లను టీడీపీ నేతలు మెక్కుతున్నారు. టీడీపీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులకు వారి సానుభూతి పరులకు, కుటుంబీకులకు పింఛన్లు మంజూరవుతున్నాయి. ఈ విచిత్రం ఏలూరు మండలం శనివారపుపేటలో బుధవారం బయటపడింది. శనివారపుపేటకు చెందిన టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ ఆళ్ల మోహనరావు గవర కులానికి చెందిన వ్యక్తి. ఈయన చేతివృత్తిదారుడిగా పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులూ గుడ్డిగా మంజూరు చేసేశారు. ప్రజాప్రతినిధిగా ఉన్న ఎంపీటీసీ కులం మార్చుకున్నా.. అధికారులు గుర్తించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే కోవలో మరికొందరు చేనేత వృత్తిదారులుగా దొంగ ధ్రువీకరణ పత్రాలు పుట్టించి పింఛన్లు మంజూరు చేయించుకున్నట్టు సమాచారం. శనివారపుపేట ఇందిరాకాలనీకి చెందిన జొన్నకూటి రామ్మోహనరావు, చాట్ల ఆశబాబు, బయ్యారపు సూర్యచంద్రరావుతో పాటు బయ్యారపు వెంకటేశ్వరరావు, సాగర్‌బాబు తదితరులు 15 మందికిపైగా ఎస్సీలకు చర్మకారుల ఫించన్లు మంజూరయ్యాయి. వీరిలో అనేక మంది చర్మకారుల వృత్తిలో లేరు. రియల్‌ఎస్టేట్, వ్యాపారస్తులు, వార్డు సభ్యులుగా చలామణి అవుతున్నారు. పైగా పెద్ద భవంతుల్లో ఉంటున్నారు.

పాతబస్టాండ్ వద్ద ఫొటోలు

కొద్దిరోజులు క్రితం ఏలూరు పాతబస్టాండ్ వద్ద రోడ్డుపై చర్మకారుల వృత్తి చేస్తున్నట్టుగా ఫొటోలు దిగి వీరు ఫించన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. వీరందరికీ ప్రభుత్వం ఫించన్లు మంజూరు చేయడంతో గ్రామంలో పేదలు ముక్కున వేలేసుకుంటున్నారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్ మంజూరు చేసేందుకు సవాలక్ష ప్రశ్నలు వేసే అధికారులు అనర్హులకు గుడ్డిగా ఎలా మంజూరు చేశారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పునర్నిర్మాణ ప్రాజెక్టులకు రూ.6,400 కోట్ల రుణం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మండల కనెక్టివిటీ, రూరల్ కనెక్టివిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు(ఏపీఎంసీఆర్‌సీఐపీ), ఏపీ రోడ్లు, బ్రిడ్జిల పునర్నిర్మాణ ప్రాజెక్టు(ఏపీఆర్‌బీఆర్‌పీ)లకు రుణ సాయం చేసేందుకు న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) అంగీకరించింది. ఎన్‌డీబీ 70% రుణ సాయమందిస్తే, ప్రభుత్వం 30% భరించనుంది. రెండు ప్రాజెక్టులకు కలిపి ఎన్‌డీబీ రూ.6,400 కోట్ల రుణ సాయం అందించనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ జీవో జారీ చేశారు.

ఆటోలకు, ట్రాక్టర్లకు ఎంవీ ట్యాక్స్ ఎత్తివేత

ఆటోలు, ట్రాక్టర్లకు మోటారు వెహికల్ ట్యాక్స్ నుంచి మినహాయింపునిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. మూడు చక్రాల గూడ్స్ వాహనాలకు ట్యాక్స్ మినహాయింపునిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఇచ్చారు.

రాష్ట్రంలో పరిస్థితిని మార్చేందుకు సలహాలివ్వండి

- తటస్థ ప్రభావితులతో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ముఖ్యమంత్రి చంద్రబాబే పెద్ద దళారీ
- తమ లాభాల కోసం రైతులను నట్టేట ముంచుతున్నారు
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే దళారీ వ్యవస్థ నిర్మూలనకు కృషి
- రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి
- పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టం
- ఏపీపీఎస్సీ ద్వారా 2.40 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం
- తెలుగు భాషా పరిరక్షణకు కొత్త చట్టాలు తెస్తామన్న ప్రతిపక్ష నేత




తటస్థ ప్రభావితులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

తిరుపతి రూరల్/తిరుచానూరు: 'మీలో డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, విద్యావేత్తలు ఉన్నారు. రాష్ట్రంలో ఎటువంటి పాలన సాగుతోందో మీరు గమనిస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు సలహాలు, సూచనలు ఇవ్వండి' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తటస్థులను కోరారు. తిరుపతిలో బుధవారం తటస్థ ప్రభావితులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశం ఒక్క రోజుతో అయిపోదని, దీర్ఘకాలం పాటు కొనసాగుతుందన్నారు. ప్రజలకు మరింత సేవ చేసేందుకే ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబే పెద్ద దళారి అని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే దళారీ వ్యవస్థను అరికట్టేందుకు కృషి చేస్తామని, అన్ని వర్గాలవారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

■ పార్టీలో న్యాయవిభాగాన్ని పటిష్టం చేస్తే మేలు..



ప్రభుత్వంపై పోరాడే వారికి వైఎస్సార్‌సీపీ అండగా నిలవాలి. పార్టీ తరఫున లీగల్ సెల్‌ను పటిష్టం చేస్తే అన్యాయాన్ని ధైర్యంగా ఎదుర్కొంటారు. పార్టీకి కూడా ప్రజల్లో ఆదరణ మరింత పెరుగుతుంది. ప్రతిపక్ష పార్టీ ఓట్లను అన్యాయంగా తొలగిస్తున్నారు. ఇటువంటి వాటిపై పోరాడాలంటే భయపడుతున్నారు. దీనిపై ఆలోచించండి..
– వాణి, న్యాయవాది, తిరుపతి

● వైఎస్ జగన్: దీనిపై ఆలోచిస్తాం. కచ్చితంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తాం.

■ మీ చొరవతో రైతులకు మేలు జరుగుతుంది



వైఎస్సార్ పాలనలో మామిడి రైతుకు గిట్టుబాటు ధర లభించేది. ఇప్పుడు మార్కెట్లోకి దళారులు ప్రవేశించారు. జిల్లాలో టమాటా ఎక్కువగా సాగవుతోంది. పండించిన పంటలకు 20 శాతానికి పైగా మార్కెట్ యార్డుల్లో సెస్ వసూలు చేయడం దారుణం. మార్కెటింగ్ చట్టాలను మార్చాలి. రైతులకు గిట్టుబాటు ధరల విషయంలో అవగాహన కల్పించాలి. ఆ దిశగా మీరు చొరవ చూపితే రైతులకు మేలు జరుగుతుంది.
– పీవీ రెడ్డి, చార్టెర్డ్ అకౌంటెంట్, పీలేరు

● వైఎస్ జగన్: రాష్ట్రంలో అతి పెద్ద దళారి చంద్రబాబే. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి హెరిటేజ్‌లో మూడునాలుగింతలు ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. తెలుగుదేశం ఎంపీ గల్లా జయదేవ్, ఎమ్మెల్యే సత్యప్రభలు కూడా ప్రైవేటు ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేసి దోచుకుంటున్నారు. తమ లాభాల కోసం రైతులను నట్టేట ముంచుతున్నారు. మనందరి కెప్టెనే దళారిగా వ్యవహరిస్తుంటే ధరలు ఎలా పెరుగుతాయి? చిత్తశుద్ధి ఎలా ఉంటుంది? మన ప్రభుత్వం రాగానే రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తాం. ఈ రూ.3 వేల కోట్లు ప్రతి సంవత్సరం ఖర్చయినా సరే.. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. సీజన్ ప్రారంభం ముందే ప్రతి పంటకూ గిట్టుబాటు ధర ప్రకటిస్తాం. మన ప్రభుత్వం వస్తే ప్రభుత్వం తరఫున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తాం. ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజీలను నిర్మిస్తాం. మన ప్రభుత్వం రాక ముందు.. వచ్చాక.. అంటూ ఫొటోగ్రాఫ్స్‌తో రైతులకు వివరించే కార్యక్రమం కూడా చేపడతాం.

■ కుప్పంలో తీవ్ర నీటి సమస్య



కుప్పంలో తీవ్ర నీటి సమస్య ఉంది. పాలారు ప్రాజెక్టును నిర్మిస్తే కొంత మేలు జరుగుతుంది. వైఎస్సార్ దీన్ని ప్రారంభించారు కూడా. కొన్ని సమస్యల వల్ల ఆగిపోయింది. దీన్ని పూర్తి చేయాలని మా మనవి.
– ప్రసన్నకుమార్, కుప్పం

● వైఎస్ జగన్: మన ఖర్మేంటంటే చంద్రబాబునాయుడు గతంలో తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. 2004–09 మధ్యలో నాన్న సీఎంగా ఉన్నప్పుడు ప్రారంభించారు. ఆయన చనిపోయాక దాన్ని పట్టించుకునే నాథుడే లేడు. వందల కిలోమీటర్ల నుంచి హంద్రీనీవా ప్రాజెక్టు అంటాడే కానీ.. పక్కనే ఉన్న పాలారు ప్రాజెక్టును పూర్తి చేస్తే కుప్పం ప్రజలకు మేలు జరుగుతుందని మాత్రం ఆలోచించడు. కుప్పానికి చంద్రబాబు ఏం చేయలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన కొడుకు ప్రాజెక్టును పూర్తిచేశారని భవిష్యత్తులో చెప్పుకుంటారు.

■ భూములు తీసుకుని ఉద్యోగాలివ్వలేదు..



మన్నవరం ప్రాజెక్టు పూర్తయి ఉంటే ఐదు వేల ఉద్యోగాలొచ్చేవి. కాళహస్తికి చుట్టుపక్కల చాలా ఫ్యాక్టరీలున్నాయి. వీటిని స్థాపించేందుకు భూములు తీసుకుని ఉద్యోగాలివ్వలేదు. ఇచ్చినా సెక్యూరిటీ గార్డు పని ఇస్తున్నారు. స్థానికులకు మంచి అవకాశాలివ్వాలి.
–హేమచంద్ర, శ్రీకాళహస్తి

● వైఎస్ జగన్: మన్నవరం ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడంలో నాన్నగారు ఎంతో కృషి చేశారు. ఆయన చనిపోయాక ప్రాజెక్టు పూర్తిగా ఆగిపోయే పరిస్థితి వచ్చింది. ఈ ప్రభుత్వంలో పెద్ద పెద్ద ప్రాజెక్టులే రావడం లేదు. వచ్చినా స్థానికులకు ఉద్యోగాలివ్వాలని కోరే వారే లేరు. మన ప్రభుత్వం వచ్చాక విప్లవాత్మక మార్పులు తెస్తాం. మొదటి శాసనసభలోనే 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని చట్టం చేస్తాం. దీనిని ప్రతి కంపెనీ కచ్చితంగా అమలు చేసేలా చూస్తాం. ఈ చట్టాన్ని ఒప్పుకుంటేనే రాయితీలిస్తాం. ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఎంతమందికి ఉద్యోగాలిచ్చామన్నదాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటాం. ఏపీపీఎస్సీ ద్వారా 2.40 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం కనీసం ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదు. 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రేషనలైజేషన్‌తో స్కూళ్లను మూసివేస్తున్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయి. మన ప్రభుత్వంలో గ్రామ సెక్రటేరియేట్‌లను నెలకొల్పుతాం. పదిమంది చదువుకున్న యువతకు వాటిలో ఉద్యోగాలిస్తాం. గ్రామ సచివాలయానికి అనుబంధంగా ఉండేలా ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమిస్తాం. వారికి రూ.5 వేలు జీతం ఇస్తాం. వారి ద్వారా ప్రతి సంక్షేమ పథకాన్ని నేరుగా ప్రజలకు చేరేలా ప్రణాళికలు రూపొందించాం. ఇళ్లు, పింఛన్, రేషన్ కార్డుల కోసం లంచాలు ఇవ్వాల్సిన పనిలేకుండా చేస్తాం. ఏ పథకం అయినా.. లబ్ధిదారులకు ఖర్చు లేకుండా అందిస్తాం.

■ చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది



చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తీసుకురావడంతో వారి బతుకులు బక్కచిక్కిపోయాయి. టెక్స్‌టైల్ వ్యాపారాలు తీవ్రంగా నష్టపోయాయి. మీరు అధికారంలోకి వచ్చాక ఏ విధంగా చేనేత కార్మికులను ఆదుకుంటారు? ఎలాంటి భరోసా కల్పిస్తారు?
– భక్తవత్సలం, నారాయణవనం

● వైఎస్ జగన్: రాష్ట్రంలో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నది నిజమే. వారిని ఆదుకోవడానికి నాన్నగారి హయాంలో రూ.210 కోట్లతో సాయం అందించారు. ఆయన మరణానంతరం చేనేత కార్మికులు తీవ్ర అప్పులు ఊబిలోకి కూరుకుపోయారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేతలను అన్ని విధాలా ఆదుకుంటాం. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆప్కో ద్వారా ఈ ఏడాది రూ.200 కోట్లు బకాయిలు పడింది. నవరత్నాల పథకాలతో పాటు మగ్గం ఉన్న ప్రతి ఇంటికీ రూ.2 వేలు ప్రోత్సాహకంగా అందిస్తాం.. అని వైఎస్ జగన్ చెప్పారు. ఇంకా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ.. తెలుగు భాషా పరిరక్షణకు కొత్త చట్టాలు తీసుకొస్తామని, అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థి చదువుకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూస్తామని చెప్పారు. న్యాయశాస్త్రాన్ని పూర్తి చేసుకున్న న్యాయవాదులకు స్టైఫండ్ కింద నెలకు రూ.5 వేల చొప్పున అందిస్తామన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఫీజులను అందుబాటులోకి తెస్తామని, వైద్యానికి రూ.వెయ్యి మించి ఖర్చయితే పూర్తిగా ఆరోగ్యశ్రీ వర్తించేలా నవరత్నాల్లో ప్రకటించామన్నారు. వైద్యాధికారుల అసోసియేషన్ నాయకులతో మాట్లాడి దీనిని ఇంకా మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.

గ్రాండ్ సక్సెస్

- సమర శంఖారావం విజయవంతంతో పార్టీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం
- ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యోన్ముఖులను చేసిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

తిరుపతి నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: వచ్చే ఎన్నికల్లో గెలుపు సాధించడమే లక్ష్యంగా ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తిరుపతి వేదికగా పూరించిన సమర శంఖారావం సభ గ్రాండ్ సక్సెస్ అయింది. వైఎస్ జగన్ ప్రసంగంతో కార్యకర్తలు, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. వేలాది మంది బూత్ కమిటీ సభ్యులు, పార్టీ శ్రేణులతో సమర శంఖారావం సభ కిటకిటలాడింది. వచ్చే ఎన్నికల సమరాన్ని ఎదుర్కోవడానికి పార్టీ శ్రేణులు, కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయడంలో ప్రతిపక్ష నేత సఫలీకృతమయ్యారు. ప్రజా సమస్యలపైనా, రాష్ట్ర ప్రయోజనాలపైనా వైఎస్ జగన్ చేసిన పోరాటాలు ఫలించాయని కార్యకర్తల కదన కుతూహలంతో స్పష్టమైంది. ప్రజా సమస్యలపైనే కాకుండా పార్టీ సంస్థాగత నిర్మాణంపై కూడా వైఎస్ జగన్ అంతర్లీనంగా ఎంత దృష్టి సారించారో వెల్లడైంది. వేలాది మంది బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్లు, ముఖ్య కార్యకర్తలు, నేతలు హాజరైన సభను చూసినప్పుడు ప్రతి పల్లెలోనూ అధికార పార్టీ దాష్టీకాలకు ఎదురొడ్డి పోరాడే కార్యకర్తలు ప్రతిపక్ష పార్టీకి లభించారని తేటతెల్లమైంది. కార్యకర్తల్లోనే కాకుండా పార్టీ నేతల్లోనూ, ఎమ్మెల్యేల్లోనూ, ప్రజాప్రతినిధుల్లోనూ ఆత్మవిశ్వాసం అదే స్థాయిలో కనిపించింది. కీలక సమయాల్లో దిశానిర్దేశం చేయగలిగిన నాయకుడుగా వైఎస్ జగన్ ఉండటం, ఆయన సై అంటే ముందుకు ఉరికే కార్యకర్తల బలం చూస్తే వచ్చే ఎన్నికలను అలవోకగా ఎదుర్కోగలమనే ధీమాను పలువురు సీనియర్ నాయకులు వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. అధికార పార్టీకి ఎప్పుడు గుణపాఠం చెబుదామా అని కార్యకర్తలు ఎదురుచూస్తున్నట్లుగా ఉందని సమర శంఖారావం సభ విజయవంతం అయిన తీరు చెప్పకనే చెప్పింది.

కడపలో నేడు సమరశంఖారావం

- ఏర్పాట్లు పూర్తి చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- గ్లోబల్ కళాశాలలో తటస్థులతో ముఖాముఖి
- మున్సిపల్ స్టేడియంలో బూత్‌లెవల్ కమిటీలతో సమావేశం



సభావేదికను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి ప్రతినిధి కడప: కడపలో వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో సమరశంఖారావం చేపట్టనున్నారు. మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈనెల 6వ తేదీ నుంచి 13 జిల్లాల్లో కేడర్‌ను కార్యోన్మోఖులను చేసేందుకు సమరశంఖారావం సభలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు కడపలో గురువారం నిర్వహించనున్నారు. హైదరాబాద్ నుంచి కడపకు విమానంలో రానున్న ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 11 గంటలకు గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో తటస్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. మ. 1 గంటకు బూత్ కమిటీ కన్వీనర్లు, పార్టీ శ్రేణులతో మున్సిపల్ స్టేడియంలో సభ ఏర్పాటు చేశారు. బూత్ కమిటీ సభ్యులతో సంభాషించేలా నాలుగు వైపులా ర్యాంపులు ఏర్పాటు చేశారు. ఇది వరకు ఏ బహిరంగ సభలకూ లేని విధంగా ఈ సభకు ఇలాంటి ప్రత్యేక సదుపాయం కల్పించారు. జిల్లాలో ఉన్న పది నియోజకవర్గాల వారికి ప్రత్యేకంగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి 2,500 మంది చొప్పున 25 వేల మందికి ఏర్పాట్లు చేశారు. సభా వేదికతోపాటు, ప్రాంగణాన్నంతా వైఎస్సార్‌సీపీ జెండాలోని ఆకుపచ్చ, తెలుపు, నీలివర్ణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కాగా, కడప ఎమ్మెల్యే అంజద్‌బాషా, పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫీజుల భారం తగ్గేదెప్పుడు?

ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.35 వేలకే పరిమితం ● మిగతా భారమంతా విద్యార్థులపైనే

- రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచాలని నిపుణుల కమిటీ సూచించినా పట్టించుకోని సర్కార్
- ఇప్పటికే ఇంజనీరింగ్‌లో గరిష్ట ఫీజు రూ.1.08 లక్షలు
- ఇతర కోర్సుల్లోనూ భారీగానే దండుకుంటున్న కళాశాలలు
- తాజాగా ఇంజనీరింగ్ సహా వివిధ వృత్తి విద్యా కోర్సుల ఫీజుల పెంపుపై కసరత్తు
- కాలేజీల ప్రతిపాదనలను పరిశీలిస్తున్న ఏఎఫ్ఆర్‌సీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్నత, సాంకేతిక, వృత్తి విద్యాకోర్సుల ఫీజులకు సంబంధించి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచకపోవడంతో విద్యార్థులపై పెనుభారం పడుతోంది. ఈ కోర్సులు అభ్యసించే విద్యార్థుల కుటుంబాలు భారీగా ఉన్న ఫీజులు చెల్లించడానికి అప్పులు చేసి రుణ ఊబిలో కూరుకుపోతున్నాయి. అప్పులు చేసే స్థోమత కూడా లేని విద్యార్థులు ఫీజులను చెల్లించలేక మధ్యలోనే చదువు మానుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. మరికొంతమందికి చదువులు ముగిసినా ప్రభుత్వం బకాయిలు చెల్లించని కారణంగా కాలేజీలు సర్టిఫికెట్లను ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. దీంతో విద్యార్థులే ఆ డబ్బునూ చెల్లించి తమ సర్టిఫికెట్లను తీసుకుంటున్నారు. ఆయా కోర్సుల ఫీజులను ప్రతి మూడేళ్లకోసారి పెంచుతున్న ప్రభుత్వం ఆ మేరకు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్క ఇంజనీరింగ్ మాత్రమే కాకుండా ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్, ఫార్మా తదితర కోర్సుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

రీయింబర్స్‌మెంట్ పెంచకుండా ఫీజుల పెంపు

ఇంజనీరింగ్ సహా వివిధ వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన ఫీజులను ప్రభుత్వం ప్రతి మూడేళ్లకు పెంచుతోంది. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నిబంధనల మేరకు కాలేజీల నిర్వహణకు అయ్యే ఖర్చులకు అనుగుణంగా ఈ ఫీజులను ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఏఎఫ్ఆర్‌సీ) ఖరారు చేస్తుంటుంది. 2016–17, 2018–19 విద్యా సంవత్సరాల ఫీజులను మూడేళ్ల క్రితం ఏఎఫ్ఆర్‌సీ సిఫార్సుల మేరకురాష్ట్ర ప్రభుత్వం పెంచింది. దీంతో అన్ని కోర్సుల ఫీజులు అమాంతం పెరిగిపోయాయి. అయితే ఫీజులను పెంచిన చంద్రబాబు ప్రభుత్వం విద్యార్థులపై ఆ భారం పడకుండా ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచకుండా రూ.35 వేలకే పరిమితం చేసింది. దీంతో విద్యార్థులపై ఫీజుల భారం తడిసిమోపెడైంది. బీటెక్ కోర్సునే తీసుకుంటే విద్యార్థులు అదనంగా రూ.70 వేల వరకు భరించాలి. నాలుగేళ్ల కోర్సు పూర్తయ్యేటప్పటికీ ప్రతి విద్యార్థి దాదాపు రూ.3 లక్షలు అప్పు చేయాల్సి వస్తోంది. ఇది ఫీజు వరకు మాత్రమే. దీనికి అదనంగా వసతి, భోజన ఖర్చులను కూడా కలుపుకుంటే ఈ అప్పుల భారం మరింత పెరుగుతుంది.

నిపుణుల నివేదికను పెండింగ్‌లో పెట్టిన ప్రభుత్వం

విద్యార్థులపై ఫీజుల భారం అధికంగా ఉంటోందని, ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. నిపుణులు కూడా ఫీజురీయింబర్స్‌మెంట్ పెంచాలని ప్రభుత్వానికి సూచించారు. దీనిపై గతేడాది ప్రభుత్వం.. అధికారులు, నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఫీజులు భారీగా ఉన్నందున ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని రూ.35 వేల నుంచి రూ.65 వేలకు పెంచాలని కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ప్రస్తుతం ఈ నివేదికను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఫీజురీయింబర్స్‌మెంట్‌ను పెంచకుండా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తోంది.

2016లో నిర్ణయించిన ఫీజులిలా..

రాష్ట్రంలో 307 ఇంజనీరింగ్, 354 ఎంబీఏ, 131 ఎంసీఏ, 119 ఫార్మసీ, 75 ఫిజికల్ ఎడ్యుకేషన్, 70 లా కాలేజీలు, 439 బీఈడీ, 229 ఎంటెక్ కాలేజీలున్నాయి.

కోర్సు	కనిష్ట ఫీజు	గరిష్ట ఫీజు
బీఈ, బీటెక్	రూ.35 వేలు	రూ.1.08 లక్షలు
బీఫార్మసీ	రూ.35 వేలు	రూ.90 వేలు
ఫార్మ్‌డీ	రూ.68 వేలు	రూ.1.29 లక్షలు
ఎంఫార్మసీ	–	రూ.1.39 లక్షలు
ఎంఈ, ఎంటెక్	రూ.55 వేలు	రూ.లక్ష
ఎంబీఏ	రూ.27 వేలు	రూ.68 వేలు
ఎంసీఏ	రూ.27 వేలు	రూ.65 వేలు
బీఆర్క్	–	రూ.65 వేలు

ఇవే కాకుండా పాలిటెక్నిక్ కోర్సులకు సంబంధించి గతంలో రూ.15 వేలు ఉన్న ఫీజును ప్రభుత్వం గతేడాది రూ.25 వేలకు పెంచింది.

ఫీజుల పెంపునకు ఏఎఫ్ఆర్‌సీ కసరత్తు

మరోవైపు 2019–20, 2021–22 విద్యా సంవత్సరాలకు ఫీజులు నిర్ణయించడానికి ఏఎఫ్ఆర్‌సీ కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఆయా కాలేజీల నుంచి ప్రతిపాదనలను కోరింది. ఆయా కోర్సుల నిర్వహణకయ్యే వ్యయంపై కాలేజీలు సమర్పించే ఖర్చులను పరిశీలించి ప్రస్తుత ఫీజులను పెంచనున్నారు. ఏఐసీటీఈ నియమించిన జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ సిఫార్సుల మేరకు ఫీజులు పెంచాలని కాలేజీలు ప్రభుత్వాన్ని, ఏఎఫ్ఆర్‌సీని కోరుతున్నాయి. ఏఐసీటీఈ నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిస్తున్న ప్రమాణాల మేరకు కాలేజీలను నిర్వహించాలంటే ప్రస్తుత ఫీజులు సరిపోవడం లేదని అంటున్నాయి. బీటెక్‌లో గరిష్ట ఫీజు రూ. 1.44 లక్షల నుంచి రూ.1.58 లక్షలుగా, బీఫార్మసీలో రూ.1.41 లక్షల నుంచి రూ.1.55 లక్షలుగా, ఎంబీఏలో రూ.1.57 లక్షల నుంచి రూ.1.71 లక్షలుగా, ఎంటెక్‌లో రూ.2.31 లక్షల నుంచి రూ.2.51 లక్షలుగా ఉండొచ్చని శ్రీకృష్ణ కమిటీ సూచించింది. ఈ మేర ఫీజులు పెరిగితే విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కూడా పెంచాల్సిన అవసరముంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

ఐఏఎస్‌ల బదిలీ

- ఎక్సైజ్ కమిషనర్ లక్ష్మీనర్సింహం చేనేత – జౌళి శాఖకు బదిలీ
- లిక్కర్ లాబీ, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన సర్కారు
- ఎన్నికల ముందు మద్యాన్ని ఏరులై పారించడం, ఇష్టానుసారంగా విక్రయించడమే లక్ష్యం!

సాక్షి, అమరావతి: అక్రమ మద్యం విక్రయాల నియంత్రణంతోపాటు నిర్ణీత ధర కన్నా అధికంగా విక్రయించకుండా అడ్డుపడుతున్న ఎక్సైజ్ కమిషనర్ పి.లక్ష్మీనర్సింహంపై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. రాష్ట్రంలో ఇద్దరు కలెక్టర్లు, పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

లిక్కర్ లాబీ ఒత్తిళ్లతోనే...

ఎన్నికల ముందు మద్యం ఏరులై పారకుండా, ఇష్టానుసారంగా విక్రయించకుండా అడ్డుపడుతున్న లక్ష్మీనర్సింహంను ఆ పదవి నుంచి తప్పించాలని అధికార పార్టీ నేతలతో పాటు లిక్కర్ లాబీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఎప్పటి నుంచో తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెస్తోంది. అయితే ఆయన ఒక్కరినే బదిలీ చేస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని గ్రహించి ఇప్పుడు మిగతా ఐఏఎస్‌లతోపాటు ఎక్సైజ్ కమిషనర్ లక్ష్మీనర్సింహంను కూడా బదిలీ చేశారు. పి.లక్ష్మీనర్సింహంను తాజాగా చేనేత– జౌళి శాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. పర్యాటక, యువజన సర్వీసుల కార్యదర్శిగా ఉన్న ముఖేశ్‌కుమార్ మీనాను ఎక్సైజ్ కమిషనర్‌గా బదిలీ చేశారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు పర్యాటక, యువజన సర్వీసుల బాధ్యతలను కూడా ఆయనే నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రీకాకుళం, కృష్ణా కలెక్టర్ల బదిలీ..

శ్రీకాకుళం, కృష్ణా జిల్లా కలెక్టర్లతో పాటు పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చేనేత–జౌళి శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాస శ్రీనరేశ్‌ను గనులశాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. శ్రీనివాస శ్రీ నరేశ్‌కు గనుల శాఖ డైరెక్టర్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గనుల శాఖ కార్యదర్శి బి.శ్రీధర్‌ను పశు సంవర్ధక శాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డిని పర్యాటక అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.రామారావును శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతంను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ మహ్మద్ ఇంతియాజ్‌ను కృష్ణా జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి, భాస్కర్‌ను సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ కె.విజయను సాధారణ పరిపాలన శాఖ డిప్యూటీ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న క్రితికా శుక్లాను కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. పర్యాటక శాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్న హిమాన్షు శుక్లాను గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు.

ముగ్గురు ఐపీఎస్‌ల బదిలీ

సాక్షి, అమరావతి: ముగ్గురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు రేంజ్ ఐజీపీగా పనిచేస్తున్న కె.వి.వి.గోపాలరావును ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీపీగా బదిలీ చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీపీ రాజీవ్ కుమార్ మీనాను గుంటూరు రేంజ్ ఐజీపీగా బదిలీ చేశారు. విజయవాడ సిటీ డీసీపీగా పనిచేస్తున్న గజరావు భూపాల్‌ను మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు.

ఎస్ఎస్ఏ నిధుల మళ్లింపుపై స్పందించిన హైకోర్టు

- ప్రభుత్వానికి నోటీసులు.. కౌంటర్ల దాఖలుకు ఆదేశం..
- విచారణ 18కి వాయిదా

సాక్షి, అమరావతి: సర్వశిక్షాభియాన్ (ఎస్ఎస్ఏ) కింద విడుదలైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాల్లోకి మళ్లించిందంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్, తూర్పు గోదావరి జిల్లా ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ అధికారికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పు గోదావరి జిల్లాలో ఎస్ఎస్ఏ కింద మరుగుదొడ్ల నిర్వహణతో పాటు పనుల కోసం కేటాయించిన నిధులు ప్రభుత్వం తన ఖాతాల్లో మళ్లించిందంటూ వన్నెచింతలపూడికి చెందిన న్యాయవాది బాబ్జీ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ. సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ, గతంలో కూడా ప్రభుత్వం ఇలాగే నిధులను మళ్లించిందని తెలిపారు. అప్పుడు కూడా న్యాయపోరాటం చేశామన్నారు. ఎస్ఎస్ఏ సొమ్మును పాఠశాల యాజమాన్య కమిటీ ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం, దీనిపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

నేడు సీపీఎస్ ఉద్యోగుల చలో అసెంబ్లీ

సాక్షి, అమరావతి: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు గురువారం చలో అసెంబ్లీ నిర్వహించనున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో సీపీఎస్ రద్దు తీర్మానం చేయాలని, ఎన్ఎస్‌డీఎల్ రికవరీలను ఆపాలని, 653, 654, 655 జీవోలను రద్దు చేయాలన్న డిమాండ్లతో ఈ చలో అసెంబ్లీని నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో చైర్మన్ పి. బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు బుధవారం తెలిపారు. కాగా, సీపీఎస్ రద్దు కోరుతూ చేపట్టిన 3 రోజుల మహాపాదయాత్ర విజయవాడ ధర్నాచౌక్‌కు చేరాక బహిరంగ సభ నిర్వహించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరరావు, జేపీసీ చైర్మన్ పాల్గొన్నారు.

జీవో 43పై ముగిసిన వాదనలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మైనారిటీ, నాన్ మైనారిటీ ఎయిడెడ్ పాఠశాలల్లో బోధనా, బోధనేతర సిబ్బంది నియామకాల విషయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో43ను సవాలు చేస్తూ పలు పాఠశాలల యాజమాన్యాలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై బుధవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తిలతో కూడిన ధర్మాసనం తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వం తమ హక్కుల్ని హరించేలా జీవో 43 జారీ చేసిందని, ఇందులో జోక్యం చేసుకోవాలని కోరుతూ పలు పాఠశాలల యాజమాన్యాలు గత ఏడాది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి.

అటవీ సహజ ఉత్పత్తుల్ని సేకరించకూడదా!

గిరిజనులపై ఆంక్షల పట్ల హైకోర్టు విస్మయం

సాక్షి, హైదరాబాద్: అడవుల్లోకి వెళ్లి చీపురు పుల్లలు, కుంకుడు కాయలు వంటి అటవీ ఉత్పత్తుల్ని సేకరించుకునేందుకు గిరిజనుల్ని అనుమతించకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. సహజ ఉత్పత్తుల సేకరణలో గిరిజనులకు అడ్డంకిగా ఉన్న నిబంధనల్ని సవాలు చేస్తూ 2015లో పిటిషన్ దాఖలైతే.. ఇంత వరకూ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మూడేళ్లు ఎందుకు సమయం తీసుకున్నారని, పది రోజుల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గడువులోగా కౌంటర్ దాఖలు చేయకపోతే.. స్వయంగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని అటవీ, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను పది రోజులకు వాయిదా వేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అటవీ సహజ ఉత్పత్తులను సేకరించేందుకు అవకాశం లేకుండా ఏపీ పంచాయతీ షెడ్యూల్డ్ ప్రాంత నిబంధనలు అడ్డంకిగా ఉన్నాయని తూర్పుగోదావరి జిల్లా చెక్కవాడకు చెందిన బోరమ్మ 2015లో హైకోర్టును ఆశ్రయించారు.

దివ్యాంగులపై టీడీపీ సర్కార్ చిన్నచూపు

హామీలు ఘనం.. ఆచరణ శూన్యం

- నాలుగున్నరేళ్ల పాలనలో దివ్యాంగులకు అనేక హామీలిచ్చిన చంద్రబాబు
- రూ.2 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్, బ్రెయిలీ ప్రెస్ నిర్మాణం, ప్రత్యేక స్టడీ సర్కిల్ హామీలు గాలికి
- ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం హామీ!
- ఎన్నికల వేళ రూ.3 వేలు పింఛన్ అంటూ దివ్యాంగులను మభ్యపెట్టే ప్రయత్నం

సాక్షి, గుంటూరు: దివ్యాంగుల సంక్షేమాన్ని టీడీపీ ప్రభుత్వం విస్మరించింది. నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం చంద్రబాబు బూటకపు హామీలు ఇచ్చి వారిని నిలువునా దగా చేశారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది దివ్యాంగుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన టీడీపీ సర్కార్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రూ.3 వేల పింఛన్‌లు, రెండు చేతులు లేని వారికి నెలకు రూ.10 వేలు అంటూ మరోసారి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని దివ్యాంగులు, ఆ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. స్వయంగా సీఎం చంద్రబాబు వివిధ సందర్భాల్లో అనేక హామీలు ఇచ్చి ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం చివరి బడ్జెట్‌లోనూ తమపై కరుణ చూపలేదని ఆవేదన చెందుతున్నారు.

పత్తా లేని డిజేబుల్డ్ హోమ్‌లు

80 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు 2500 మోటారు, బ్యాటరీ వాహనాలు పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించి రెండేళ్లయినా పట్టించుకోలేదు. దీంతో గతేడాది దివ్యాంగుల దినోత్సవాన్ని బ్లాక్ డేగా పాటిస్తామని దివ్యాంగుల జేఏసీ నాయకులు హెచ్చరించడంతో గత డిసెంబర్ 3న ప్రకటించిన విధంగా 2500 వాహనాలు కాకుండా అరకొర పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. అదేవిధంగా ప్రతి జిల్లాలో డిజేబుల్డ్ హోమ్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఒక్కటి కూడా నిర్మించలేదు. వారంలోగా దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్‌లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు దాన్ని గాలికొదిలేశారు. దివ్యాంగులు.. సర్టిఫికెట్‌ల కోసం మీసేవా కార్యాలయాలు, సదరం క్యాంప్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. అదేవిధంగా ఇటీవల రెండు చేతులు లేని వారికి నెలకు రూ.10 వేలు ఇస్తామని సీఎం చెప్పడంతో ఈ మాటలు నమ్మి పింఛన్ కోసం వెళ్లినవారికి కేవలం రూ.3 వేలు, మరికొంతమందికి రూ.4,500 మాత్రమే ఇచ్చారు. ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ హామీని కూడా నెరవేర్చలేదని దివ్యాంగ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

దివ్యాంగుల అవస్థలు పట్టించుకోవడం లేదు

వైకల్య శాతంతో సంబంధం లేకుండా పింఛన్‌ను మంజూరు చేయాలి. పర్సంటేజీల పేరుతో పింఛన్‌లో కోత పెట్టడం సమంజసం కాదు. వారంలోగా సదరం సర్టిఫికెట్‌లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు సర్టిఫికెట్‌ల కోసం నెలల తరబడి దివ్యాంగులు అవస్థలు పడుతున్నా పట్టించుకోవడంలేదు. – **గుణశేఖర్, దివ్యాంగ జేఏసీ రాష్ట్ర పర్యవేక్షణ కమిటీ అధ్యక్షుడు**

రూ. 4,500లే ఇచ్చారు



చంద్రబాబు రెండు చేతులు లేని వారికి ఫిబ్రవరిలో రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. తీరా పింఛన్ తీసుకోవడానికి వెళ్తే రూ.4,500 మాత్రమే ఇచ్చారు.

– నాగేంద్ర, దివ్యాంగుడు, పశ్చిమ గోదావరి జిల్లా

సీఎం, మంత్రులు ఇచ్చిన వాగ్దానాలు ఇలా..

2014, డిసెంబర్‌లో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాజమండ్రిలో ఇచ్చిన హామీలు..

- ఏటా బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయిస్తాం.
- అన్ని జిల్లాల్లో హోమ్‌లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం
- రిజర్వేషన్లు పెంచుతాం.

2015, 2016 డిసెంబర్ 3న, విజయవాడలో..

- విజయవాడలో స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేస్తాం.
- గుంటూరులో 2.70 కోట్లతో బ్రెయిలీ ప్రెస్ ఏర్పాటు.
- రూ.20 కోట్లు ఖర్చు చేసి బాల్యంలో అంగవైకల్యం, అనారోగ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటాం.
- ఏటా బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం.
- 2500 మందికి మోటారు, బ్యాటరీ వాహనాలు.
- సదరం సర్టిఫికెట్‌లు వారంలోగా మంజూరు

2017, డిసెంబర్ 3న కర్నూలులో..

- ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం.
- కర్నూలు జిల్లాలో రూ.6.94 కోట్లతో సెన్సార్ పార్క్ నిర్మిస్తాం.

వర్ధమాన టీవీ నటి ఝాన్సీ ఆత్మహత్య

- ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణం
- ప్రేమ వ్యవహారమే కారణమన్న కుటుంబ సభ్యులు
- ఏడాది కిందట సూర్య అనే యువకుడితో పరిచయం
- ఆరు నెలల క్రితం పెళ్లికి ఒప్పుకొని.. 2 నెలలుగా దూరం పెట్టిన వైనం
- అనుమానంతో వేధించడం వల్లే ఝాన్సీ ఆత్మహత్య!
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



హైదరాబాద్: వర్ధమాన టీవీ నటి సువ్వాడ నాగ ఝాన్సీ (21) మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. హైదరాబాద్ అమీర్‌పేటలోని తన నివాసంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఆమె మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం ఒదిలి గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు, సంపూర్ణ దంపతులకు కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె నాగ ఝాన్సీ ఉన్నారు. వారు మూడేళ్ల క్రితం హైదరాబాద్ వలస వచ్చారు. ఝాన్సీ ఓ తెలుగు టీవీ చానల్‌లో ప్రసారమయ్యే పవిత్రబంధం అనే సీరియల్‌లో నటించేది. ఈ క్రమంలో ఏడాది క్రితం ఝాన్సీకి విజయవాడకు చెందిన సూర్యతేజతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఆరు నెలల క్రితం ఝాన్సీ ఇంట్లో ప్రేమ విషయం చెప్పడంతో వారు కూడా ఒప్పుకున్నారు. అయితే రెండు నెలలుగా ఝాన్సీపై సూర్య అనుమానం వ్యక్తం చేస్తూ తీవ్ర వేధింపులకు గురిచేస్తూ వచ్చాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అతని వేధింపుల వల్లే ఝాన్సీ నటన ఆపేసి అమీర్‌పేటలో అను బ్యూటీపార్లర్ ఏర్పాటు చేసుకుదని తెలిపారు.

వేధింపుల వల్లే ఆత్మహత్య...

గత నాలుగు రోజులుగా ఝాన్సీ తీవ్ర డిప్రెషన్‌లో ఉందని ఆమె సోదరుడు దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి తాను ఇంటికి రాగా తలుపు లోపల నుంచి గడిగ ఉందని, కిటికీలోంచి లోపలకు వెళ్లి బెడ్‌రూం తలుపు విరగ్గొట్టి చూడగా ఝాన్సీ ఉరేసుకొని వేలాడుతూ కనిపించిందన్నారు.

ఆమె ప్రవర్తనలో మార్పు వల్లే: సూర్య

ఇటీవల ఝాన్సీ ప్రవర్తనలో మార్పు వచ్చిందని, పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు చెప్పినా మారకపోవడంతో తాను ఝాన్సీకి దూరంగా ఉన్నానని సూర్య ఓ చానల్‌తో మాట్లాడుతూ చెప్పాడు. ఝాన్సీకి బాబీ, గిరి అనే సినీ బ్రోకర్లతో గతం నుంచే పరిచయం ఉందన్నాడు. కాగా, నాగ ఝాన్సీ మృతిపై తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పంజాగుట్ట ఏసీపీ విజయ్ కుమార్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థినిపై ప్రేమోన్మాది దాడి

14 చోట్ల తీవ్రగాయాలు.. వెంటిలేటర్‌పై చికిత్స

హైదరాబాద్: హైదరాబాద్‌లో ప్రేమోన్మాదం బుసలు కొట్టింది. ప్రేమించడంలేదనే కోపంతో ఇంటర్ విద్యార్థినిపై డిగ్రీ చదువుతున్న యువకుడు కొబ్బరిబొండాలు నరికే కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. బర్కత్‌పుర సత్యనగర్‌కు చెందిన మంగ రాములు, ఉదయ దంపతుల రెండో కుమార్తె మధులిక (17) నల్లకుంట శివం రోడ్డులోని శరత్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే బస్తీలో నివసిస్తున్న వేణుగోపాల్, కళ్యాణి దంపతుల కుమారుడు చిట్కూరి భరత్ అలియాస్ సోను (19) రాంకోఠిలోని జాగృతి డిగ్రీ కాలేజీలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఏడాదిగా మధులికను ప్రేమించమంటూ వేధిస్తున్నాడు. వెంటపడుతున్నా ప్రేమించకపోవడంతో ఆమెపై కక్ష కట్టాడు. రెండు రోజుల క్రితం కాచిగూడలోని ఓ కొబ్బరిబొండాల దుకాణం నుంచి కత్తి చోరీ చేశాడు. బుధవారం ఉదయం 8 గంటలకు కళాశాలకు బయలుదేరిన మధులికతో వాగ్వాదానికి దిగాడు. విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు. ఆమె మెడ, చేతులు, ముఖం, పొట్ట, ఛాతీలో మొత్తం 14 చోట్ల గాయాలయ్యాయి. బాధితురాలి అరుపులు విన్న స్థానికులు భరత్ చేతిలో కత్తి ఉండటంతో అతడిని ఆపే ధైర్యం చేయలేకపోయారు. భరత్ పారిపోయిన తర్వాత పోలీసులకు సమాచారమిచ్చి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు భరత్‌ను అరెస్టు చేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని వాటర్ ట్యాంక్ ఎక్కిన మహిళ

పశ్చిమగోదావరి జిల్లాలో ఘటన



పశ్చిమగోదావరి జిల్లా కాకుల ఇల్లిందలపర్రులో వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న మహిళ

తణుకు టౌన్: పదేళ్లుగా తిరుగుతున్నా..ఇళ్ల స్థలాలు ఇవ్వలేదనే ఆవేదనతో ఓ మహిళ మంచినీటి ట్యాంక్ ఎక్కి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం కాకుల ఇల్లిందలపర్రులో బుధవారం జరిగింది. గ్రామంలో పదేళ్ల క్రితం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు భూసేకరణ చేసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇటీవల కొంతమందికి పట్టాలు ఇచ్చారు. అయితే కొందరికి పట్టాలు రాలేదు. దీంతో గ్రామంలోని ఇళ్లస్థలాల సాధన సమితి నాయకురాలు కోరాటి వెంకటలక్ష్మి గ్రామంలోని టీడీపీ నాయకుడిని ఈ విషయంపై నిలదీశారు. ఆయన తనకు తెలియదని, ఎమ్మెల్యేను అడగాలని సూచించడంతో మనస్తాపం చెందిన వెంకటలక్ష్మి బుధవారం మధ్యాహ్నం వాటర్ ట్యాంక్ ఎక్కి దూకే యత్నం చేసింది. స్పందించిన స్థానికులు ఆమెను నిలువరించారు. అనంతరం పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని గ్రామస్తులు, లబ్ధిదారులతో చర్చించారు. విషయం కోర్టులో ఉందని, పరిష్కారం కాగానే పట్టాలు ఇస్తామని చెప్పడంతో ఆమె ట్యాంక్ దిగి కిందకు వచ్చారు.

బ్రహ్మోత్సవాల నాటికి

ఒంటిమిట్టలో కల్యాణ వేదిక: టీటీడీ ఈఓ

ఒంటిమిట్ట: ఏప్రిల్ 12న ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా ఆలోపు శాశ్వత కల్యాణ వేదిక నిర్మాణాన్ని పూర్తి చేస్తామని టీటీడీ ఈఓ అనిల్ కుమార్‌సింఘాల్ తెలిపారు. వైఎస్సార్ జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్టలో ఏకశిలపై వెలిసిన శ్రీ కోదండ రామాలయం అభివృద్ధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. సింఘాల్ మాట్లాడుతూ..ఆలయ లోపల ఫ్లోరింగ్‌ను మార్చేందుకు పురావస్తు శాఖకి నిధులిచ్చామని వచ్చే నెలలో పనులను ప్రారంభమవుతాయని చెప్పారు. ఏప్రిల్ మొదటి వారంలోగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పూర్తి చేస్తామన్నారు. అనంతరం కోదండ రామస్వామిని ఈవో దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ సీవీఎస్‌ఓ గోపినాథ్ జెట్టి, చీఫ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, టీటీడీ డీఎఫ్‌ఓ ఫణికుమార్ నాయుడు, ఈఈ జగన్‌మోహన్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, చంద్రశేఖర్, ఒంటిమిట్ట ఏఈఓ రామరాజు, రాజంపేట ట్రాన్స్‌కో డీఈ కె.చంద్రశేఖర్ రెడ్డి, ఒంటిమిట్ట ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్ రెడ్డి, తహశీల్దార్ శిరీష, ఒంటిమిట్ట ఎస్ఐ ధనుంజయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ఈ వారంలోనే!

▶ మొదటి పేజీ తరువాయి

ముగిసే అవకాశం ఉందంటున్నారు.

మూర్తి మృతితో మరో స్థానానికి కూడా..?

విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ప్రతినిధిగా ఎన్నికైన ఎంవీవీఎస్ మూర్తి మృతి కారణంగా ప్రస్తుతం ఆ స్థానం ఖాళీ కావడంతో ఎనిమిది ఎమ్మెల్సీ స్థానాలతో పాటే దీనికి కూడా ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఎంవీవీఎస్ మూర్తి 2015 జూన్‌లో ఎమ్మెల్సీగా ఎన్నిక కాగా 2021 జూన్ వరకు ఆయన ఆ బాధ్యతలో కొనసాగాల్సి ఉంది. అయితే మూర్తి మృతి చెందినందున ఆ స్థానంలో కొత్తగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యే వారు ఆరేళ్ల పాటు కాకుండా 2021 జూన్ వరకే బాధ్యతల్లో కొనసాగుతారని ఎన్నికల సంఘం వర్గాలు చెబుతున్నాయి.

అసెంబ్లీ రికార్డుల్లో ఆ 22 మంది వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలుగానే..

ఎమ్మెల్యేల కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రస్తుతం శాసనసభలో ఉన్న బలాబలాల ప్రకారం చూస్తే టీడీపీ నాలుగు సీట్లు, వైఎస్సార్ సీపీ ఒక స్థానాన్ని గెలిచే అవకాశం ఉంది. ఒక్కో ఎమ్మెల్సీ ఎన్నికకు కనీసం 29 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. అసెంబ్లీ రికార్డుల ప్రకారం వైఎస్సార్ సీపీకి 66 మంది శాసనసభ్యుల బలం ఉంది. ఆ లెక్క ప్రకారం ఐదింటిలో రెండింటిని వైఎస్సార్ సీపీ సునాయసంగా గెలుచుకునే అవకాశం ఉంటుంది. నలుగురు మంత్రులతోపాటు మరో 18 మంది ఎమ్మెల్యేలు వైఎస్సార్‌సీపీ టికెట్‌పై గెలిచి తర్వాత టీడీపీలోకి ఫిరాయించినా అసెంబ్లీ రికార్డుల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌సీపీ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతుండటం గమనార్హం.

మార్చి 29వ తేదీతో పదవీ కాలం పూర్తయ్యే ఎమ్మెల్సీలు..

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీలు

1. యనమల రామకృష్ణుడు
2. పి. నారాయణ
3. శమంతకమణి
4. ఆదిరెడ్డి అప్పారావు
5. లక్ష్మీశివకుమారి

పట్టభద్రుల ఎమ్మెల్సీలు..

1.కె.రవికిరణ్‌వర్మ (గోదావరి జిల్లాల నియోజకవర్గం)
2.బొడ్డు నాగేశ్వరరావు (కృష్ణా, గుంటూరు జిల్లాల నియోజకవర్గం)

ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు

1. జి.శ్రీనివాసులనాయుడు(ఉత్తరాంధ్ర జిల్లాల నియోజకవర్గం)

(నోట్: ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల్లో ఆదిరెడ్డి అప్పారావు అసెంబ్లీ రికార్డుల్లో వైఎస్సార్ సీపీ సభ్యుడిగా కొనసాగుతున్నప్పటికీ టీడీపీలో చేరారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన లక్ష్మీ శివకుమారిని అసెంబ్లీ రికార్డుల్లో కాంగ్రెస్‌గా పేర్కొంటున్నప్పటికీ ఆమె అనధికారికంగా టీడీపీ ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్నారు)



సహాయ నటి దారుణ హత్య

- ముక్కలుగా కోసి హతం.. సినీ దర్శకుడైన భర్తే నిందితుడు
- రెండు వారాల తర్వాత వీడిన మిస్టరీ



సంధ్య (ఫైల్)

సాక్షి ప్రతినిధి, చెన్నై: సినీ సహాయ నటి అయిన భార్య వివాహేతర సంబంధాన్ని అతను తట్టుకోలేకపోయాడు. మందలించినా ఆమెలో మార్పురాకపోవడంతో సినీ దర్శకుడైన భర్త ఆమెను దారుణంగా హత్య చేశాడు. మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోసి పలు చోట్ల పడేశాడు. పోలీసులు రెండువారాల పాటు శ్రమించి నిందితుడిని బుధవారం అరెస్ట్ చేశారు. తమిళనాడులో ఈ ఘటన జరిగింది. చెన్నై శివారు పెరుంగుడిలోని చెత్తకుప్పల్లో గుర్తుతెలియని యువతికి చెందిన రెండు కాళ్లు, ఒక చేయిని గత నెల 21న పోలీసులు గుర్తించారు. మృతురాలి ఆచూకీ కోసం ఆనాటి నుంచి అనేక చోట్ల వెతికారు. చెన్నై ఈక్కాడుతాంగల్‌లో నివసించే కన్యాకుమారీ జిల్లా నాగర్‌కోవిల్‌కు చెందిన సంధ్య (38) అనే యువతి కొన్నిరోజులుగా కనపడడం లేదని పోలీసులు గుర్తించారు. అదృశ్యమైన యువతి భర్త సినీ దర్శకుడైన బాలకృష్ణన్‌ను మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకుని విచారించి కేసును ఛేదించారు. నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం పోలీసుల కథనం ఇలా ఉంది. భార్య, భర్తలిద్దరూ సినీపరిశ్రమకు చెందిన వారు కావడంతో వీరికి పరిచయాలు పెరిగాయి. సంధ్య కొందరితో వివాహేతర సంబంధాలు పెట్టుకున్నట్లు భర్త అనుమానించాడు. రాత్రివేళల్లో సెల్‌ఫోన్‌లో గంటల తరబడి మాట్లాడడం, బయటకు వెళ్లడం వంటి చర్యలకు సంధ్య పాల్పడుతుండటంతో దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. భర్త బాలకృష్ణన్ అనేకసార్లు మందలించినా ఆమె వినిపించుకోలేదు. తన జీవితానికి అడ్డురావద్దని ఆమె ఎదురు తిరగడంతో పాటూ ఇరువురూ విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దశలో సంధ్య తన భర్త ఎదురుగానే ప్రియునితో మరింత విచ్చలవిడిగా వ్యవహరించడంతో పాటు ప్రియునితోనే ఉంటానని తేల్చిచెప్పగా గత నెల 19న దంపతులు ఘర్షణపడ్డారు. అప్పటికే తగిన ఏర్పాట్లలో ఉన్న బాలకృష్ణన్ జంతువులను చంపే కత్తితో ఆమెను విచక్షణారహితంగా పొడిచి హతమార్చాడు. పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు మరుసటి రోజున ఆమె మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా చేసి నాలుగు పార్శిళ్లుగా నగరంలోని పలు ప్రాంతాల్లో పడేశాడు. పెరుంగుడి చెత్తకుప్పల నుంచి హతురాలి అవయవాలు బైటపడడంతో పోలీసులు కూపీలాగి నిందితుడిని అరెస్ట్ చేశారు.



సాక్షి
గురువారం, ఫిబ్రవరి, 7

అర్థంలేని ఆర్థికం

లేని నదిపైన వంతెన నిర్మిస్తానంటూ వాగ్దానం చేసేవాడు రాజకీయ నాయకుడని సోవియట్ యూనియన్ అధినేత నికితా కృశ్చేవ్ ఆరవై ఏళ్ళ కిందటే వ్యాఖ్యానించారు. ఆదాయానికీ, ఖర్చుకీ లంగరు అందకుండా అమలు సాధ్యం కాని వ్యయానికి సంబంధించిన అంచనాలతో లేని నిధులు కేటాయిస్తూ బడ్జెట్ ప్రతిపాదనలు శాసనసభలో ప్రవేశపెట్టడం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాతికేళ్ళ క్రితమే ఆరంభించారు. ఆర్థికమంత్రి తానైనా, అశోక్‌గజపతిరాజైనా, యనమల రామకృష్ణుడైనా, అవిభక్త ఆంధ్రప్రదేశ్ అయినా విభజన తర్వాత మిగిలిన రాష్ట్రమైనా చంద్రబాబునాయుడు హయాంలో బడ్జెట్ ప్రతిపాదనలు ఆకాశమార్గంలోనే ఉంటాయి. అంకెలు హెచ్చులకు పోతాయి. 2014 ఎన్నికల ప్రణాళికలో చేసిన ఆరు వందల వాగ్దానాలు ఎంత బాగా అమలు జరిగాయో మంగళవారంనాడు ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్ ప్రసంగంలో చేసిన హామీలు సైతం అంతే బాగా నెరవేరతాయి. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి వల్లించే గణాంకాలు వాస్తవానికి దూరం. దేశ ప్రగతి రేటు 7 శాతం ఉంటే ఆంధ్రప్రదేశ్ ప్రగతి 11 శాతం ఉన్నదని అలవోకగా ఆర్థికమంత్రి చెప్పారు. పెట్టుబడి వ్యయం (కేపిటల్ ఎక్స్‌పెండిచర్) అతి తక్కువ ఉన్న రాష్ట్రంలో అభివృద్ధి ఇతర రాష్ట్రాలలో కంటే చాలా ఎక్కువ వేగంతో పరుగులు తీస్తున్నదంటే నమ్మడం కష్టం.

నిజానికి యనమల రామకృష్ణుడు అనామతు పద్దు ప్రవేశపెట్టవలసి ఉంది. రాబోయే ఎన్నికల వరకూ ఎంత ఖర్చు అవుతుందో, ఆదాయం ఎంత ఉంటుందో చెబితే సరిపోయేది. ఎన్నికలకు మూడు మాసాల ముందు తగుదునమ్మా అంటూ పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టడం రాజ్యాంగవిరుద్ధం. కేంద్రంలో పీయూష్‌గోయల్ చేసిన తప్పిదాన్నే ఆంధ్రప్రదేశ్‌లో యనమల చేశారు. రాజ్యాంగాన్ని పనికట్టుకొని ఉల్లంఘిస్తామని అధికారంలో ఉన్న వ్యక్తులు పట్టుబడితే ఎవరు మాత్రం ఏమి చేయగలరు? ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు ముందూ, పాదయాత్రలోనూ చేసిన వాగ్దానాలలో కొన్నింటినైనా అమలు చేస్తానని చెప్పడం వరకే బడ్జెట్ ప్రసంగం పరిమితం. ప్రతిపక్ష నేత చేసిన వాగ్దానాలను ఎన్నికలకు ముందుగానే అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి అమలు చేయడం హర్షదాయకమే. ఏదో విధంగా ప్రజలకు మేలు జరుగుతుందని సంతోషించవచ్చు. కానీ వాగ్దానాల అమలుకు అవసరమైన నిధులు కేటాయించకుండా గొప్పలు చెప్పుకుంటే ఏమి ప్రయోజనం? చర్వితచర్వణమే అయినా కొన్ని నిష్ఠురసత్యాలు చెప్పుకోక తప్పదు. ఎన్నికల ప్రణాళికలో రైతుల రుణాలు మాఫ్ చేస్తానని తెలుగుదేశంపార్టీ (టీడీపీ) అధినేత చేసిన వాగ్దానం ఖరీదు అక్షరాలా రూ. 87,600 కోట్లు. అధికారంలోకి వచ్చిన తర్వాత రకరకాల నిబంధనలు పెట్టి దాన్ని రూ. 24వేల కోట్లకు కుదించి అయిదు వాయిదాలలో చెల్లిస్తామని చెప్పి మూడు వాయిదాలు మాత్రమే చెల్లించారు. నిరుడు ఎగకొట్టారు. ఈ సంవత్సరం ఎన్నికల ముందు ఇవ్వడానికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులను ప్రతిపాదించలేదు. అంటే రైతులకు శూన్యహస్తం ఇస్తూనే 'వైఎస్ఆర్ రైతు భరోసా' వాగ్దానాన్ని పోలిన 'అన్నదాతా సుఖీభవ' అనే పథకాన్ని ప్రతిపాదించి దానికి రూ. 500 కోట్లు కేటాయించారు. ఎట్లా ఇస్తారో, ఎంత ఇస్తారో వెల్లడించలేదు. అంటే ఇంత వరకూ ఆలోచించలేదు. డ్వాక్రా మహిళలకూ అంతే. నాలుగున్నర సంవత్సరాల కిందట సుమారు 80 లక్షల మంది డ్వాక్రా మహిళల రుణభారం రూ. 14,200 కోట్లు. దాన్ని కూడా కుదించి వాయిదాలలో చెల్లిస్తామని చెప్పారు. మాట తప్పారు. ఇప్పుడు పదివేల రూపాయల వంతున 93 వేల మంది డ్వాక్రా మహిళలకు పోస్ట్‌డేటెడ్ చెక్కులు ఇస్తామంటూ ఘనంగా ప్రకటించారు. బడ్జెట్‌లో మాత్రం అరకొర కేటాయింపులే.

ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగికి నెలకు రెండు వేల రూపాయల వంతున భృతి ఇస్తామని వాగ్దానం చేసి, జాబు రావాలంటే బాబు రావాలని ప్రచారం చేసుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకూ పంగనామాలు పెట్టారు. నాలుగున్న సంవత్సరాలు మిన్నకుండి కేవలం రెండు మాసాల కింద నిరుద్యోగికి వెయ్యి రూపాయలు ఇస్తామంటూ లబ్ధి పొందేవారి సంఖ్యను విపరీతంగా తగ్గించివేశారు. ఎటువంటి అసెట్ (ఆస్తి) సృష్టించకుండా అప్పుల భారాన్ని రూ. 2.60 లక్షలకోట్లకు పెంచివేసిన ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుందని ఆశించడం అత్యాశ. నిరుటి బడ్జెట్‌లో చేసిన కేటాయింపులెన్ని, వాస్తవంగా విడుదల చేసిన మొత్తాలెన్ని వివరంగా చెప్పాలన్న స్పృహ యనమలకు లేదు. వాగ్దానాల అమలులో విఫలమైతే ఒప్పుకోవాలన్న నియమం లేదు. ఎన్నికల సంవత్సరం కనుక సంక్షేమ పథకాలపైన ఖర్చు అధికంగా ఉండటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ, నిధులు కేటాయించకుండా సంక్షేమమంత్రం వల్లించడం వ్యర్థం. కాపులకు రూ. 400 కోట్లు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రూ.700 కోట్లు కేటాయించడం ఆకర్షణీయంగా ఉంటుంది. కానీ గడిచిన నాలుగు ఆర్థిక సంవత్సరాలలో ఈ పద్దుల కింద ఏటా ఎంతెంత ఖర్చు చేశారో చూస్తే సర్కారు నిజాయితీ ఏపాటిదో తెలిసిపోతుంది. పార్లమెంటులో తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను 'పోస్ట్‌డేటెడ్ చెక్'లుగా అభివర్ణించి ఎద్దేవా చేసిన చంద్రబాబునాయుడు డ్వాక్రా మహిళలకు అటువంటి చెక్కులే ఇస్తానంటూ హామీ ఇచ్చారని గమనించాలి. తాను చేసిన తప్పులే ఇతరులు చేసినప్పుడు తీవ్రంగా ఆక్షేపించడం, తిరిగి తాను అవే తప్పులు అదే పనిగా చేయడం చంద్రబాబునాయుడిని దేశ రాజకీయాలలో ప్రత్యేకమైన నాయకుడిగా నిలబెట్టాయి. 2018–19లో రూ. 1.50 లక్షల కోట్ల రెవెన్యూ వ్యయాన్ని యనమల ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తున్న రూ. 65వేల కోట్లు చేతికందితేనే ఈ స్థాయి వ్యయం సాధ్యం. కేంద్రంలో ఎవరొస్తారో, ఏమిస్తారో? అయినా, మూడు నెలల తర్వాత అధికారంలో ఉంటారో లేదో తెలియనివారి ప్రతిపాదనలకు విలువ ఏముంటుంది?

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి శు.తదియ పూర్తి, నక్షత్రం శతభిషం ఉ.10.24 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం సా.5.24 నుంచి 7.09 వరకు, దుర్ముహూర్తం ఉ.10.20 నుంచి 11.06 వరకు, తదుపరి ప.2.52 నుంచి 3.37 వరకు, అమృతఘడియలు... తె.3.56 నుంచి 5.41 వరకు (తెల్లవారితే శుక్రవారం).

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ప. 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

ఆ 'సవరణ' బిల్లు ఎవరి లబ్ధికోసం?

విశ్లేషణ



డాక్టర్ ఏపీ విఠల్

ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకి పరాభవం కలిగిన నేపథ్యంలో, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయంపై కలిగిన కలవరం ఫలితంగానే అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. ఈబీసీలకు రిజర్వేషన్ రేపటి ఎన్నికలాట కోసం విప్పిన వరాలమూటే తప్ప మరేం కాదు. అడుగంటిపోయిన ఉపాధి, ఉద్యోగ అవకాశాల మధ్య అగ్రకులాలకు రిజర్వేషన్ ఎవరికీ మేలుకలిగించేది కాదు. జనాభా ప్రాతిపదికన 85 శాతం రిజర్వేషన్ కల్పిస్తే అన్ని వర్గాల, కులాలకు మేలు జరుగవచ్చు. రాజకీయ ప్రయోజనాలకై తీసుకొచ్చిన ఈ రాజ్యాంగ సవరణ ఎవరికీ లబ్ధి కలిగించదు.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొద్దిమంది ఎంపీలు తప్ప మిగిలిన అందరు సభ్యుల మద్దతుతో, దాదాపు ఏకగ్రీవమైన ఆమోదంతో, మన రాజ్యాంగానికి 124వ సవరణ ద్వారా కొత్త చట్టాన్ని తెచ్చింది. ఇప్పుడు ఎస్టీ, ఎస్సీ, బీసీలకు ఉన్న రిజర్వేషన్ దాదాపు 50 శాతంగా ఉండగా, ఈ కొత్త రాజ్యాంగ సవరణ ద్వారా అగ్రవర్ణాలలోని ఆర్థికంగా వెనుకబడిన (ఈబీఎస్) వారికి విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు మొదలైన వాటిలో మరో 10 శాతం మందికి రిజర్వేషన్ లభిస్తుంది. అంతేకాదు, వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉన్న అగ్రవర్ణాల వారందరికీ ఈ రిజర్వేషన్ అమలవుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అనుకూలంగా ప్రభుత్వాలు వ్యవహరించడం వలన ఈ కులప్రాతిపదిక రిజర్వేషన్ల వల్ల తమకు అవకాశాలులేకుండా పోతున్నాయని అగ్రవర్ణాలు బలంగా విశ్వసిస్తున్నారు. మేధాసంపత్తి కాకుండా, కులం ఆధారంగా రిజర్వేషన్ల వలన దేశ ప్రగతి కుంటుపడుతున్నదనీ తమలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆ వెసులుబాటు లేకపోవడం వల్ల, తాము నష్టపోతున్నామన్న భావన అగ్రవర్ణాల్లో ఉండటంలో ఆశ్చర్యం లేదు. ఇప్పుడు ఓబీసీలకు 10 శాతం రిజర్వేషన్ వలన తమకూ విద్య, ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో వీరున్నారు. ఈ భావన, ఆశ ప్రభావమెంతో ముందు పరిశీలిద్దాం.

ఈ రిజర్వేషన్ ప్రస్తుతానికి ప్రభుత్వ ఉద్యోగాలకు మాత్రమే వర్తిస్తుంది. ప్రైవేట్ సంస్థలకు వర్తించదు. అసలు వాస్తవమేమిటంటే, మొత్తం ఉద్యోగ మార్కెట్లో ప్రభుత్వ ఉద్యోగాల వాటా 3.5 శాతం మాత్రమే. ఇందులో 10 శాతం అంటే ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల కంటే 0.35 శాతం మాత్రమే మేలు జరగవచ్చేమో! అయితే మోదీ ప్రభుత్వ హయాంలో ఈ ఉద్యోగ కల్పన దిగజారుతున్నది. నిజానికి మూడు నెలల క్రితమే విడుదల చేయవలసిన దేశ నిరుద్యోగ పరిస్థితిని మోదీ ప్రభుత్వం వెల్లడించడానికే భయపడుతోందనిపిస్తోంది. కొత్త ఉద్యోగాలు కల్పించలేకపోగా, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి విధానం వలన దేశవ్యాప్తంగా ఉద్యోగులు చిరుద్యోగులవుతున్నారు. చిరుద్యోగులు నిరుద్యోగులయ్యారు. వీరి సంఖ్య లక్షల్లో ఉంటోంది. మన చంద్రబాబు విషయానికివస్తే బాబు వస్తే జాబు వస్తుందని చేసిన ఊకదంపుడు ప్రచారం ఆచరణలో ఉన్న జాబులు ఊడిపోవడంగా ప్రతిఫలించింది. కనుక రిజర్వేషన్ వల్లనే తమ నిరుద్యోగ సమస్య తీరుతుందనుకోవడం భ్రమ. ప్రధానంగా కావలసింది కోట్లలో ఉద్యోగ కల్పన. ఇది చాతగాని ప్రభుత్వాలు ఏదో గోసాయి చిట్కాల వంటి సవరణ ద్వారా ఉద్యోగ కల్పన చేస్తున్నట్లు ప్రజలను మభ్యపెట్టి ప్రయోజనం లేదు.

అగ్రవర్ణ విద్యావంతులు సైతం ఆలోచించవలసిన విషయం మరొకటి. కేవలం తమ కులం ఆధారంగానే, తగిన విద్య మేధాసంపత్తి లేకపోయినా ఐఏఎస్, ఐపీఎస్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో సైతం ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారు ప్రతిభ లేకపోయినా నెగ్గుకొస్తున్నారన్న అభిప్రాయం వీరిలో ఉంది. సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల కోసం ఒక లెక్కప్రకారం ఏటా 4,50,000 మంది ప్రయత్నిస్తుంటారు. కానీ వారిలో అంతిమంగా 1100 మంది అర్హత సాధిస్తారు. ఇలాంటి పరిస్థితిలో, ఏదో పరీక్ష రాస్తే చాలు, రిజర్వేషన్ వర్తించే విద్యార్థులకు ఉద్యోగాలు వస్తున్నాయని భావింపగలమా? అంతే కాదు. ప్రతిభ, మేధోసంపత్తులకు ఈరోజుల్లో పరీక్షలో వారు సాధించిన మార్కులే కొలబద్ద! అసలీ మార్కుల కొలబద్దే వాస్తవానికి ప్రశ్నార్థకం కూడా. ఈ మార్కుల విషయం ఆలోచిస్తే, ప్రస్తుత పరిస్థితిలో ఈ మార్కుల సాధన, ఆ విద్యార్థి కుటుంబ పరిస్థితి, చదువుకునే వెసులుబాటు, వాతావరణం, తగిన ప్రోత్సాహం, దానితో పాటు వ్యక్తిగత మేధోసంపత్తి వీటన్నింటిపై ఆధారపడి ఉంటుంది.



ఈ వర్ణవ్యవస్థ దుర్మార్గం కారణంగా అంబేడ్కర్, ఎన్నో కష్టాలు, అవమానాలు స్వయంగా అనుభవించవలసి వచ్చింది. తన గురువుగారి ప్రోత్సాహం, ఆయన సమకూర్చిన సాయం, తన వ్యక్తిగత ప్రతిభ వలన ఆయన ఇంగ్లండ్, అమెరికా, దేశాలకు విద్యార్జన కోసం వెళ్లి రెండు డాక్టరేట్ డిగ్రీలు తీసుకుని భారతదేశం తిరిగొచ్చారు. కానీ మనదేశం తిరిగి వచ్చిన తర్వాత మామూలు కిరాయిబండి తోలుకునే వ్యక్తి కూడా, అంబేడ్కర్‌ని తన బండి ఎక్కించుకోలేదు. కారణం దళితుడి నీడ సైతం అంటరానిదే అనే తరతరాల భావదాస్యంలో ఉన్నవాడే ఆ వ్యక్తి కూడా. అంబేడ్కర్‌కు దాహం తీర్చుకోవడానికి మంచినీళ్లు ఇచ్చేందుకు సైతం మిగిలిన కులాలవారెవరూ సిద్ధపడలేదు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, పార్సీ మతస్థులు కూడా ఎవరూ అంబేడ్కర్‌కు ఒక గది ఇచ్చేందుకు అంగీకరించలేదు. చివరకు తన ఆఫీసులో తన కింద పనిచేసే ప్యూన్ ఆఫీసు ఫైల్ సైతం అంబేడ్కర్ చేతికి అందించేవాడు కాడట. మైలపడిపోతామన్న మూఢవిశ్వాసమే కారణం. అందుకే అంబేడ్కర్ ఈ వర్ణ వ్యవస్థ అంతమయితే గానీ మన దేశానికి విముక్తి ఉండదని 'కులనిర్మూలన' అనే గొప్ప గ్రంథం రచించారు.

కానీ మన సామాజిక జీవనంలో నేటికీ ఈ కులోన్మాద వికృత రూపం కనబడుతున్నది. భారతదేశం ప్రపంచంలోనే 5వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా పురోగమించినా, నేటికీ సామాజిక జీవనంలో, ఈ కులవ్యవస్థ అలాగే ఉంది. అందుకే సామాజిక న్యాయ సాధన అవసరం నేటికీ ఉంది. నిజానికి దళితుల ఆర్థికపరిస్థితి చెప్పనక్కరలేదు. నేడు విద్య, ఉద్యోగ, రాజకీయ పదవుల్లో ఈ మేరకైనా దళితుల అభివృద్ధి సాధ్యమైందంటే అందుకు రిజర్వేషన్లే ప్రధాన కారణం. గతంతో పోలిస్తే చాలా మంది దళితులు మధ్యతరగతి స్థాయికి వచ్చారు. కానీ ఇంకా ఎంతటి వ్యత్యాసం ఉందంటే పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన దళిత, గిరిజనులు 0.4 శాతం కూడా లేరు. కనుక ఆర్థిక సమానత్వం పేరుతో, సామాజిక అన్యాయాన్ని తోసిరాజనడం సబబు కాదు.

ఈ స్థితిలో కొత్తగా వచ్చిన ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా ప్రభుత్వం తెచ్చిన 10 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని కూడా స్థూలంగా పరిశీలిద్దాం. బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, వెలమ, వైశ్య, క్షత్రియ ఇత్యాది అగ్రకులాలు జనాభాలో 23 శాతం మించి ఉండరు. మామూలుగా ఈ చట్టం చేయబోయేముందే అలాంటి కులాల గణాంకాలు, వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులు అన్నింటినీ సాధికారంగా ప్రభుత్వాలు ఇచ్చి ఉండాల్సింది. నిరుద్యోగ పరిస్థితిపై అంచనాను కేంద్రంలో మోదీ నేతృత్వంలో ఉన్న బీజేపీ (ఎన్డీఏ) ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దాచి ఉంచింది. కొత్తగా దళితులపై మైనారిటీలపై గోరక్షణ పేరుతోనో, మరో వంకతోనో బీజేపీ, వీహెచ్‌పీ వంటి మతతత్వ సంస్థల మూకదాడులు పెరిగిపోయాయి. దానికితోడు సాధారణ ప్రజల జీవన ప్రమాణాలు తరిగిపోతున్నాయి. మోదీ డబ్బా వాయించుకున్న అవినీతి, అధికార కేంద్రీకరణ మరింతగా పెరిగిపోతోంది. మన రాజ్యాంగ వ్యవస్థలు చివరకు సర్వోన్నత న్యాయవ్యవస్థ సైతం ఈ విలువలు దిగజారుతున్న ఆరోపణలకు గురవుతున్నాయి. అన్నిటికీ మించి ఒకే దేశం, ఒకే జాతి, ఒకే పన్నుల విధానం, ఒకేసారి ఎన్నికలు, రాష్ట్రాల్లో, కేంద్రంలో ఒకే పార్టీ పాలన వంటి ప్రచారంతో ప్రజల్లో మోదీ ప్రతిష్ట మసకబారుతోంది. అందుకు ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలే నిదర్శనం. దీనిపై తమ విజయంపై ఆందోళన చెందుతున్న బీజేపీ నేతలు, అగ్రవర్ణాల ఓటర్లను మరింతగా ఆకర్షించడమే మార్గం అని తన విశ్వసనీయమైన సర్వేల ద్వారా నిజనిర్ధారణకు వచ్చిందట! ఆ ఎన్నికలాటలో, వరాల మూటలో రూపొందినదే ఆర్థికంగా వెనుకబడిన కులాల రిజర్వేషన్ పేరుతో వచ్చిన చట్టం.

పార్లమెంటు ఆమోదం పొందిన ఈబీసీ రిజర్వేషన్ వల్ల 8 లక్షల వార్షికాదాయం ఉన్న అగ్రవర్ణాల వారందరికీ విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో రిజర్వేషన్లు లభించినట్లే. ఆమేరకు రిజర్వేషన్ అనుభవిస్తున్న దళిత, ఆదివాసీ, బీసీలకు ప్రాధాన్యత తగ్గుతుంది. ఆర్థిక సమానత్వం ఉంటేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని చెబుతూనే ఇంకా ఆ స్థాయికి మన దేశం చేరుకోలేదు కాబట్టి అది సాధించాలని రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లో దాన్ని చేర్చారు. ఇప్పుడు ఈ కొత్త చట్టం వల్ల సామాజిక న్యాయం మరింత దిగజారే అవకాశం ఉంది కనుక, విరుగుడుగా మరో 25 శాతం రిజర్వేషన్లను పెంచితే ఇప్పుడు కొత్తగా చేరినవారితో కలిపి దేశంలో 85 శాతం రిజర్వేషన్ అమలవుతుంది. నిజానికి వివిధ వర్గాల జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇస్తే అణగారిన వర్గాలకే కాదు.. జనాభా మొత్తానికి సామాజిక న్యాయం తగురీతిలో జరుగుతుంది. ఇప్పటికే తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు 69 రిజర్వేషన్లను కల్పించాయి కాబట్టి 85 శాతం రిజర్వేషన్ అసాధ్యం అని కొట్టిపారవేయాల్సిన అవసరం లేదు. నిజానికి ప్రతి వ్యక్తికీ పని కల్పించి, కనీస అవసరాలు తీర్చే తరహా సామాజిక వ్యవస్థను నెలకొల్పడం ఈ ప్రభుత్వాలకు అసాధ్యం కాబట్టే దేశంలో నిరుద్యోగుల సంఖ్య హనుమంతుని తోకలాగా పెరిగిపోతోంది.

ఈ స్థితిలో దళిత, గిరిజన, ఇతర వెనుకబడిన కులాలకు కనీసం ఇప్పుడున్న రిజర్వేషన్‌కి ఏదో మేర నష్టం కలుగకుండా నిలబెట్టుకోవాలి. కమ్యూనిస్టులు, ఎస్పీ, బీఎస్పీ తదితర పార్టీలు సైతం రిజర్వేషన్ చట్టానికి సవరణలు కావాలని కోరుతూ పార్లమెంటులో ఓటింగులో పాల్గొనకుండా ఉండాల్సింది. కానీ దాదాపుగా అన్నిపార్టీలూ ఈ 124వ రాజ్యాంగ సవరణకు మద్దతు ఇచ్చాయి. సామాజిక న్యాయ అంశాన్ని కూడా ఓటు బ్యాంకు రాజకీయాల దృష్టితో చూడటం సరికాదు. ఓట్లాటలో మధ్యతరగతి ముఖ్యం కనుక వారి ఓట్లకోసమే అన్ని పార్టీలు రాజ్యాంగ సవరణను ఏకగ్రీవంగా అంగీకరించాయని అనుకోవాలి. ఈరోజు ప్రగతిశీల శక్తులు ఎన్నికల విజయాన్ని మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకూడదు. సామాజిక న్యాయసాధన అవసరమైన అన్ని వర్గాల, అస్తిత్వ పోరాట శక్తుల ఐక్యత పునాదిగా సమరశీల ప్రజా ఉద్యమమే సామాజిక న్యాయ సాధనకు పరిష్కారం.

వ్యాసకర్త మార్క్సిస్టు విశ్లేషకులు | మొబైల్ : 98480 69720

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఛాందసం




"పాశ్చాత్య కోణంలో చెప్పాలంటే భారత్‌లో రైట్ వింగ్ అనేది లేదు. మన రైట్ వింగ్ సంప్రదాయవాదం కాదు, కానీ దుడుకుతనం ఉంటుంది. దీని ఆర్థిక ఆలోచనలు సామ్యవాద విలక్షణలతో ఉంటాయి. ఇది పునరుద్ధరణవాదమేకానీ, పిడివాదం కాదు. పాశ్చాత్యులు క్రైస్తవాన్ని చూసినట్టే, ఇది హిందూత్వను లౌకిక భావనగా చూస్తుంది. అటువంటప్పుడు దీన్ని రైట్ వింగ్ అని కాకుండా ఇంకెలా పిలుస్తారు?"
– అభిజిత్ మజుందార్, జర్నలిస్ట్

అవార్డు



"మద్దతు ఇస్తున్నామన్న వారిలో నలుగురు కనిపించరు. ఉన్న వారు సభను సజావుగా సాగనీయరు. ఇంత అద్భుతంగా నటిస్తున్నప్పటికీ కర్ణాటకకు చెందిన ఒక్క ఎమ్మెల్యేకు కూడా సంగీత నాటక అకాడమీ అవార్డు రాకపోవడం కాస్త అసంతృప్తిని కలిగిస్తోంది. ఇది అన్యాయం"
– స్మితా ప్రకాష్ జర్నలిస్ట్

అచ్ఛేదిన్



"ఇంజనీరింగ్ చదివినవారు, ఎంబీఏ చేసినవారు, గ్రాడ్యుయేషన్ చేసిన వారు సుమారు నాలుగు వేలమంది అభ్యర్థులు తమిళనాడులోని 14 స్వీపర్ ఉద్యోగాల కోసం పోటీ పడుతున్నారు. ఇంత తీవ్రమైన ఉద్యోగ సంక్షోభాన్ని అచ్ఛేదిన్ పేరిట భారతీయ యువతకు ప్రధాని నరేంద్ర మోదీ బహుమతిగా ఇచ్చారు"
– షమా మహ్మద్, కాంగ్రెస్ నేత

రియల్



"అసలు వాస్తవమేమిటంటే అమెరికాకు నిజంగా ఒక నిజమైన గోడ కావాలి. ఎందుకంటే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆ గోడ అవతల ఉంచడానికి"
– రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు

ముందుచూపు



"యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ప్రముఖ భారతీయుడు డాక్టర్ రామ్ బుక్సానీని కలుసుకున్నా. తాను అరవయ్యేళ్ల క్రితం దుబాయ్‌కి వచ్చినప్పుడు కరెంట్ లేదు, పైపుల ద్వారా నీటి సరఫరా లేదు, ఫోన్లు లేవు, ఒక్క కారు కూడా కనబడేది కాదని ఆయన చెప్పారు. ఇంత అభివృద్ధికి కారణం ముందుచూపున్న నాయకత్వం, క్రమశిక్షణ గల పౌరులు, అన్ని దేశాల వారినీ సాదరంగా ఆహ్వానించడమేనని ఆయన చెప్పారు. సహనం విషయంలో భారత్ వ్యతిరేక దిశలో వెళుతోంది. ముస్లిం అరబ్ దేశమైన యూఏఈ తన సౌభ్రాతృత్వాన్ని చాటుకోవడానికి పోప్ ఫ్రాన్సిస్‌ను ఆహ్వానించింది"
– సుధీంద్ర కులకర్ణి, రచయిత

రామ... రామ

జీవన కాలమ్



గొల్లపూడి మారుతీరావు

సాధారణంగా నేను వివాదాల జోలికి పోను. అది నా ప్రమేయమూ, స్వభావమూ కాదు. కానీ మొన్న పొరుగు దేశంలోని ఓ దౌర్భాగ్యుడు– తినడానికి తిండి కూడా సరిగా లేని దేశంలో బోర విరుచుకు తిరుగుతున్న ఓ దౌర్జన్యకారుడు మసూద్ అజర్– అంటాడు కదా: ఇండియాలో రామ మందిరం నిర్మిస్తే దేశం మంటల్లో భగ్గుమంటుందని. అనడానికి ఎవడు వీడు? ఏమిటి వీడి గుండె ధైర్యం? ఈ మాటలకి కడుపు మండి ఈ నాలుగు మాటలూ.

ఈ దేశం ముస్లిం సోదరులను శతాబ్దాలుగా అక్కున చేర్చుకుంది. రాజకీయ రంగంలో, కళా రంగంలో, ఆఖరికి ఆధ్యాత్మిక రంగంలోనూ వారు మనకు ఆప్తులు. ఇటు వేంకటేశ్వరునికీ, అటు భద్రాద్రి రామునికీ ముస్లిం భక్తుల కథలు మనకు తెలుసు. మనకు ముగ్గురు రాష్ట్రపతులు ముస్లింలు. ఉపరాష్ట్రపతులు ముస్లింలు.

ఈ హెచ్చరికకు రెచ్చి, ఈ దేశంలో ముస్లింలంతా ఏకమయి– 'మీరు పక్కకు తప్పుకోండి బాబూ. మేం రామమందిరాన్ని నిర్మిస్తాం' అని ముందుకు రారేం?

షియా వక్ఫ్ బోర్డు చైర్మన్ వసీం రిజ్వీ రామ మందిర నిర్మాణానికి మాకు అభ్యంతరం లేదన్నారు. గవర్నమెంటు పూనుకోకపోతే నాలుగు నెలల్లో రామమందిర నిర్మాణానికి పూనుకుంటామన్నారు ఆరెస్సెస్ అధ్యక్షులు మోహన్ భగవత్ గారు. పద్మభూషణ్ బాబా రామ్‌దేవ్– అయోధ్యలో వివాదాస్పద స్థలానికి పక్కన ఉన్న చోట రామమందిరం నిర్మించడానికి ఏం పోయేకాలం? అని వాక్రుచ్చారు.

అలనాడు కాశీ విశ్వేశ్వర ఆలయాన్ని ఆనుకుని మసీదు వెలిసినప్పుడు, మధురలో శ్రీకృష్ణుడు జన్మించిన గది గోడని ఆనుకుని మసీదు వెలసినప్పుడు హిందువులు గొంతులు ఎత్తలేదేం? సామరస్యం కారణమా? అలనాటి పాలకుల పట్ల భయమా? తాటస్థ్యమా? నిర్వేదమా? మరి ఇలాంటివేవీ గత 77 సంవత్సరాలుగా ముస్లిం సోదరులు చూపలేదేం? వారి ఓట్లకు రాజకీయ పార్టీల కక్కుర్తి కారణమా?

విజయ్‌సింగ్ ఆలేఫ్ ఈ మధ్య రాసిన "Ayodhya: City of Faith, City of discord' అనే పుస్తకాన్ని సమీక్షిస్తూ వచ్చిన వ్యాసంలో మొదటి వాక్యాలు ఉటంకిస్తాను: 'రాజకీయ ప్రయోజనాలకు మతాన్ని దుర్వినియోగం చేస్తే, ఏ దేశానికీ ఫలితాలు సామరస్యంగా ఉండవు. వ్యవస్థల మతపరమైన వివాదాలను న్యాయసమ్మతంగా, సామరస్యంతో, సత్వరంగా పరిష్కరించలేకపోవడానికీ ఇదే కారణం'.

ఇంతకీ పాకిస్తాన్‌లో 'వాగిన' దౌర్జన్యకారుడికి– ఇద్దరు సీనియర్ ముస్లిం నాయకులు స్పందించి: 'నువ్వు నోర్మూయవయ్యా. ఇది మా దేశం సమస్య. మేం చూసుకుంటాం' అంటే ఎంత గంభీరంగా ఉంటుంది? అంత Objective nobility మన సోదర ముస్లిం నాయకులకి ఉందా?

అవకాశవాదం అటకెక్కితే సంకల్ప బలానికి 'చేవ' కుదురుతుంది. ఇన్ని సంవత్సరాల అయోధ్య వివాదం హిందువుల నిస్సహాయతకు మాత్రమే నిదర్శనం కాదు. తమలో ఒకరుగా, తమలో వారుగా భావించే ముస్లిం సోదరుల 'చిన్న' మనసుకి కూడా నిదర్శనం.

దేశంలో అక్కడక్కడా మత విధ్వంసాలు ఉంటాయి. ఇలాంటి ఉన్నత లక్ష్యాలకు అవి అడ్డ పడకూడదు. పక్కవాడు 'ఉసి'కొల్పడం అందుకు మన మౌనం మన మానసిక 'సంకుచితతత్వాని'కి నిదర్శనమనిపిస్తుంది. పెద్దల మనస్సుల్లోనూ ఇంకా 'చీకటి' గదులున్నాయనిపిస్తుంది.

ఈ దేశంలో ఒక రాజకీయ పార్టీకి మతం పెట్టుబడి. అందుకని మిగతా పార్టీలు వారి ఆలోచనలకు కలసిరావు. సరే. మరి రాముడు ఈ దేశానికే ఆరాధ్య దైవం కదా? అయినా రాజకీయ రంగంలో ఆయన పరపతి చెల్లదా?

దీనికి పరిష్కారం– దమ్మున్న వ్యవస్థ. గుండెబలం ఉన్న నాయకత్వం. నిజానికి ఆనాటి మెజారిటీ హిందువులను విస్మరించి – కాశీ, మధుర దేవాలయాల పొరుగున మసీదుల నిర్మాణమే ఇందుకు తార్కాణం.

ఇప్పుడు కేంద్రం సుప్రీం కోర్టుని ఆశ్రయించింది. 'అయ్యా– అయోధ్యలో 'వివాదం' లేని 67.39 ఎకరాల స్థలాన్ని మాకు అప్పగించండి'– అని. కాంగ్రెస్ భయం అప్పగిస్తుందని కాదు. తీరా అప్పగిస్తే తమ 'పరపతి' మాటేమిటని. 'ఇప్పుడు ఇలా సుప్రీంకోర్టుని ఆశ్రయించడంలో మర్మమేమిట'ని కాంగ్రెస్ కత్తి దూసింది. కాంగ్రెస్ భయం తీరా సుప్రీంకోర్టు తలూపుతూ ఉందేమోనని!

ఇక్కడ తగాదా 'రాముడు' కాదు– ఓట్లు. ఇదీ మన దరిద్రం. ఇందుకే ఈ సమస్య ఇన్నాళ్లు మురిగింది. ఇంకా మురుగుతుంది.

సీపీఎస్ ఉచ్చులో ఉద్యోగులు విలవిల

'కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు అంశం రాష్ట్రం చేతిలో లేదు. ఇది కేంద్ర ప్రభుత్వం చొరవతోనే సాధ్యమవుతుంది. కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం తప్ప ఏమీ చేయలేను'–తిరుపతి ఎన్జీఓల మహాసభ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యలివి.

'సీపీఎస్ రద్దు అంశం ఉద్యోగుల ప్రాథమిక హక్కు. ఆర్థిక భారమే అయినా ఉద్యోగులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వానికుంది. సీపీఎస్ కుటుంబాలను దత్తత తీసుకుంటున్నా. అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ రద్దు చేస్తాం' ప్రజా సంకల్ప యాత్రలో ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భరోసా.

సీపీఎస్.. ప్రస్తుతం రాష్ట్రంలోని 1.60 లక్షల మంది ఉద్యోగులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇది ప్రైవేటు సంస్థలకు కాసులు కురిపించే కార్పొరేట్ పెన్షన్ స్కీమ్ అంటూ ఉద్యోగులు దుయ్యబడుతున్నారు. ఈ సీపీఎస్ మాకొద్దంటూ గొంతెత్తి నినదిస్తున్నారు. నేడు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. 'చలో పోరాడుదాం సమష్టిగా' అంటూ సీపీఎస్‌కు కొత్త భాష్యం చెబుతున్నారు.

పీఎఫ్ఆర్‌డీఏ, ఎన్ఎస్‌డీఎల్, సీఆర్ఏ అనే మూడు సంస్థల అధీనంలో సీపీఎస్ అమలవుతోంది. ప్రైవేటు కార్పొరేట్ శక్తుల అధీనంలో నడిచే ఈ మూడింటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అజమాయిషీ లేదు. వీటి నిర్వహణా ఖర్చు కూడా ఉద్యోగుల ఖాతాల నుంచే వినియోగిస్తారు. నష్టాలు వస్తే ఉద్యోగులే బలికావడం, లాభాలు వస్తే ప్రభుత్వాలు బాగుపడటం తప్ప సగటు ఉద్యోగికి ఏ రకంగానూ లాభదాయకం కాదు.

అప్పుడే కొత్తగా ఉద్యోగంలో చేరినవారికి మొదటి నెల జీతం రావాలంటే విధిగా పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్ (పీఆర్ఏఎన్–ప్రాన్) పత్రాలపై సంతకాలు చేయాలనే షరతుతో సీపీఎస్‌లో నిర్బంధంగా చేర్పించారు. ఇదిలాఉంటే 2015 నుంచే సీపీఎస్‌పై వ్యతిరేకత పెల్లుబికింది. అనంతపురం జిల్లా గుమ్మఘట్టకు చెందిన కె.కన్నప్పరావు గ్రామరెవెన్యూ అధికారిగా 2016లో ఉద్యోగ విరమణ పొందారు. ఎనిమిదేళ్ల సర్వీసుకు అతనికి నెలకు కేవలం రూ. 668 మాత్రమే పింఛను జమయ్యింది. ప్రకాశం జిల్లా కొనకనమిట్లకు చెందిన టి. వెంకటాద్రి వీఆర్‌ఓగా పనిచేస్తూ 2011లో రిటైరయ్యారు. అతనికి ఎలాంటి పింఛనూ అందలేదు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 460 ఉపాధ్యాయ, ఉద్యోగ కుటుంబాలు సీపీఎస్ బాధితులుగా మారాయి. దీంతో ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. ఇదిలా ఉండగా సీపీఎస్ రద్దులో జాప్యానికి ఉద్యోగ సంఘాల పాత్ర ఉందనే ఆరోపణలున్నాయి. 2015లో సీపీఎస్ రద్దు అనే ఏకైక డిమాండ్‌తో ఏర్పడిన ఏపీసీపీఎస్ఈఏ తప్ప అన్ని సంఘాల నేతలు ప్రభుత్వానికి భజన చేస్తున్నారని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి బాజీ పటాన్ తప్పుబడుతున్నారు. తమిళనాడు, కర్ణాటకల్లో సంఘాలన్నీ ఏకమై సీపీఎస్ రద్దుకు సమ్మె చేస్తుంటే, ఇక్కడి నాయకులు మాత్రం నీరుగారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీపీఎస్‌తో ఇవీ నష్టాలు

1. స్థిరమైన నెలరాబడి లేకపోవడం: పాత పెన్షన్ విధానంలో రిటైర్మెంట్ సమయంలో జీత భత్యాలలో 50 శాతం నెల ఆదాయం పొందేవాడు. వేతన సవరణ జరిగిన, కరువు భత్యం పెరిగిన సందర్భంలో అవి విశ్రాంత ఉద్యోగులకు, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు వర్తిస్తాయి. సీపీఎస్‌లో ఇవేమీ వర్తించవు.

2. చందా పెన్షన్: పాత పెన్షన్ విధానంలో ఉద్యోగి పదవీ విరమణ చేసినా, మరణించినా ఉద్యోగానికి అనర్హుడిగా ప్రకటించినా, సస్పెండ్‌కు గురైనా ఏడు రకాల పెన్షన్లు అతని కుటుంబానికి ఆసరాగా నిలుస్తాయి. కానీ సీపీఎస్‌లో పే/డీఏలలో 10 శాతం చందా తప్పనిసరిగా చెల్లిస్తేనే షేర్‌మార్కెట్ ఆధారిత పెన్షన్ సమకూరుతుంది. కానీ, షేర్‌మార్కెట్ తలకిందులైతే పెన్షన్ సొమ్ము గల్లంతే. అది కూడా 70 ఏళ్లవరకే వస్తుంది. పాత విధానంలో ఉద్యోగి చందా చెల్లింపు పద్ధతి లేదు.

3. గ్రాట్యుటీ: 2004 వరకు ఉద్యోగి పదవీ విరమణ పొందినా, మరణించినా నాలుగేళ్ల 240 రోజులు ఉద్యోగం చేసి ఉంటే 1972 యాక్ట్ ప్రకారం అతనికి గ్రాట్యుటీ వర్తిస్తుంది. ఉద్యోగి సర్వీసు కాలానికి అనుగుణంగా గరిష్ఠంగా 12 లక్షల వరకు గ్రాట్యుటీని చెల్లించే వీలుంది. సీపీఎస్‌లో ఇలాంటి సౌకర్యం లేదు. వీటితోపాటు పన్ను మినహాయింపుల్లోనూ నష్టపోయే ప్రమాదముంది.

సీపీఎస్ జీఓలు 653, 654, 655 రద్దు చేయకుండా కేవలం అసెంబ్లీలో తీర్మానించి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులిపేసుకుంటుంది. సీపీఎస్ రద్దు కావాలంటే పీఎఫ్ఆర్‌డీఏని కేంద్రమే రద్దు చేయాలంటూ చెప్పుకొస్తోంది. దీనిపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తే సీపీఎస్ రద్దు పెద్ద పనేం కాదు.

దాదాపు 1.60లక్షల మంది ఉద్యోగులకు మేలు చేసే నిర్ణయానికి సంకల్పించకుంటే మరిన్ని కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదముంది. విచిత్రమేమిటంటే 2018 లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తామంటూ హామీ ఇచ్చిన ఇదే తెలుగుదేశం పెద్దలు ఏపీలో అధికారంలో ఉండి మరీ కేంద్రంపై నెపం వేయడం హాస్యాస్పదమని వారు అంటున్నారు.

(నేడు సీపీఎస్ రద్దును డిమాండ్ చేస్తూ ఏపీ ఉద్యోగుల 'చలో అసెంబ్లీ' ముట్టడి సందర్భంగా)

తిరుమల శ్రీనివాస్ కరుకోల
హైదరాబాద్ | మొబైల్ : 81438 14131

జయరాం కేసు తెలంగాణకు బదిలీ

- తప్పనిసరి పరిస్థితుల్లో ఏపీ డీజీపీ నిర్ణయం
- ఏపీ పోలీసులపై నమ్మకం లేదన్న జయరాం భార్య పద్మశ్రీ
- కేసు దర్యాప్తు తీరుపై ఆది నుంచీ ఎన్నో అనుమానాలు
- దర్యాప్తుపై ప్రభావం చూపిన టీడీపీ నేతలు


రోడ్డు పక్కన పొలాల్లో కారులో జయరామ్ మృతదేహాన్ని వదిలివెళ్లిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) శిఖాచౌదరి (ఫైల్)

సాక్షి, అమరావతి/సాక్షి, అమరావతి బ్యూరో: వ్యాపారవేత్త, ఎన్నారై చిగురుపాటి జయరాం హత్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. కేసు దర్యాప్తును తెలంగాణకు బదిలీ చేస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పథకం ప్రకారం జయరాంను ఇంటికి రప్పించి హత్య చేసిన రాకేశ్‌రెడ్డి.. ఆ తర్వాత ఇద్దరు తెలంగాణ పోలీసు అధికారుల సలహా మేరకు మృతదేహాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొచ్చి ప్రమాద ఘటనగా చిత్రీకరించే యత్నం చేశాడు. ఈ హత్య సంఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే ఆయన మేనకోడలు శిఖాచౌదరి చుట్టే కేసు తిరిగింది. ఆమెపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మీడియాలో అనేక కథనాలు వచ్చాయి. కేసు నుంచి శిఖాను బయటపడేసేందుకు ఏపీలోని కొందరు టీడీపీ నేతలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరిగింది. చివరకు రాకేశ్ రెడ్డి ప్రధాన నిందితుడని నందిగామ పోలీసులు పేర్కొన్నగా.. ఏపీ పోలీసులపై తనకు నమ్మకం లేదని జయరాం భార్య పద్మశ్రీ చెప్పడంతో కేసు మరో కీలక మలుపు తిరిగింది.

అన్నీ అనుమానాలే..?

అమెరికా పౌరసత్వమున్న జయరాంకు వందల కోట్ల ఆస్తులున్నాయి. ఆ స్థాయి వ్యక్తి రాకేశ్‌రెడ్డి వద్ద రూ. 4.17 కోట్లు ఎందుకు అప్పుగా తీసుకున్నాడన్న అంశం పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది. శిఖాచౌదరిని పెళ్లిచేసుకోవాలని భావించిన రాకేశ్‌రెడ్డి కేవలం డబ్బు కోసమే జయరాంను హత్య చేశాడా? జయరాంను హత్య చేశాక ఆ సమాచారం శిఖాచౌదరికి చెప్పలేదా? హత్య విషయాన్ని ఇద్దరు తెలంగాణ పోలీసు అధికారులకు చెబితే వారెందుకు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదు? ఇలా చాలా ప్రశ్నలకు సమాధానం లేదు. జయరాం స్థాపించిన అన్ని కంపెనీల్లోనూ డైరెక్టర్ హోదాలో పనిచేసిన శిఖాచౌదరి పాత్రపై అనేక ఆరోపణలు వెల్లువెత్తినా.. నందిగామ పోలీసులు ఎందుకు నిర్లక్ష్యం చేశారు? శిఖాచౌదరి పోలీసులను ప్రభావితం చేసిందా..? అంటూ అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. నందిగామ పోలీసులు హైదరాబాద్‌లో రాకేశ్‌రెడ్డి, జయరాం నివాసాలను పరిశీలించడంతోపాటు సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. జయరాం కాల్‌డేటా ఆధారంగా ఆయన ఎక్కడెక్కడ తిరిగారు? ఎవరెవరితో కలిశారు? అన్న కోణంలోనూ ఆధారాలను సేకరించారు. శిఖాచౌదరి, రాకేశ్‌రెడ్డి, సంతోష్‌రెడ్డిలతోపాటు పలువురిని సుదీర్ఘంగా విచారించారు. హత్యానేరాన్ని అంగీకరిస్తూ రాకేశ్‌రెడ్డి వాగ్మూలంలో ఇచ్చిన సమాచారంతోపాటు సేకరించిన ఆధారాలకు ఎక్కడా పొంతన లేదని తెలుస్తోంది. సాంకేతికంగానూ సాక్ష్యాల సేకరణ కష్టంగా మారిందని, ఈ సాక్ష్యాలతో కేసు నిలబడదని, నేరస్తులు తప్పించుకునే అవకాశం ఉందని పోలీసు నిపుణులు చెబుతున్నారు. కేసులో సాంకేతికంగా సాక్ష్యాలను సేకరించాల్సి ఉందని జిల్లా ఎస్పీ త్రిపాఠి పేర్కొనడం నిపుణుల వాదనకు బలాన్ని చేకూరుస్తోంది.

నిందితులకు రిమాండ్

నందిగామ: జయరాం హత్య కేసులో నిందితులైన రాకేశ్‌రెడ్డి, దున్నే శ్రీనివాస్‌లను నందిగామ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చామని ఎస్‌హెచ్‌ఓ పి.వెంకటరమణ తెలిపారు. నిందితులకు 20వ తేదీ వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

కేసు తెలంగాణతో ముడిపడడం వల్లే: ఏపీ ప్రభుత్వం

చిగురుపాటి జయరాం హత్య కేసును తెలంగాణకు బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆంధ్రా పోలీసులపై నమ్మకం లేదని, కేసును తెలంగాణ పోలీసులే దర్యాప్తు చేయాలని కోరుతూ మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులకు జయరాం భార్య పద్మశ్రీ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కేసును తెలంగాణకు అప్పగిస్తూ బుధవారం నిర్ణయం తీసుకుంది. కేసు వ్యవహారాలన్నీ తెలంగాణతో ముడిపడి ఉండటంతో కేసుపై ఈ నిర్ణయం తీసుకున్నామని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ మీడియాతో మాట్లాడుతూ..'చిగురుపాటి జయరాం హత్యకేసును తెలంగాణకు బదిలీ చేస్తున్నాం. న్యాయపరమైన అనుమతులు రాగానే కేసు బదిలీ అవుతుంది. హత్య హైదరాబాద్‌లో జరిగిన నేపథ్యంలో కేసు దర్యాప్తు అక్కడ నుంచి జరగడమే శాస్త్రీయంగా ఉంటుంది' అని చెప్పారు.

'చినబాబు'కు సన్నిహితుడే.. రాకేశ్!

- కుత్బుల్లాపూర్‌లో టీడీపీ నేతగా చురుగ్గా కార్యకలాపాలు
- ఏపీలో చినబాబుకు, ఆయన సన్నిహితుడికి కూడా అప్తుడే!
- రాకేశ్ చెప్పాడంటే టీటీడీ ఎల్–1 జాబితాలో చేరాల్సిందే


రాకేశ్‌రెడ్డి (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరామ్ హత్యకేసులో నిందితుడైన కొండ్ల రాకేశ్‌రెడ్డిలో రాజకీయ కోణం కూడా వెలుగుచూస్తోంది. కుత్బుల్లాపూర్‌లో నివాసముంటున్న సమయంలో తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన రాకేశ్ ఆ పార్టీ ముఖ్య నేతలతో సన్నిహిత సంబంధాలను ఏర్పాటు చేసుకున్నారనే చర్చ సాగుతోంది. కుత్బుల్లాపూర్‌లో ఉంటున్న సమయంలోనే రాజకీయ నాయకుల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేయడం దగ్గర నుంచి మొదలు పెడితే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ నాయకుడి(చినబాబు)తో సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసుకునేంత వరకు రాకేశ్ రాకెట్ వేగంతో వెళ్లిపోయాడని టీడీపీ వర్గాలే అంటున్నాయి. ఎంతగా అంటే ఏపీ యువనేతకు సన్నిహితుడైన ఓ వ్యక్తి ద్వారా ఎల్‌బీనగర్‌లో యువనేతకు దగ్గరయిన రాకేశ్ ఆయన సెక్రటరీ, వ్యక్తిగత సిబ్బందితో సంబంధాలు పెట్టుకుని సులభంగా అపాయింట్‌మెంట్లు ఇప్పించే స్థాయికి ఎదిగిపోయారని ట్రస్ట్ భవన్ వర్గాలంటున్నాయి. మరో విశేషమేమంటే.. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో వీవీఐపీలకు అతిథి మర్యాదలు కల్పించడంలో కూడా రాకేశ్ దిట్ట అని తెలుస్తోంది. తనకున్న పలుకుబడి ద్వారా ఎల్–2లో ఉన్న పేర్లను కూడా ఎల్–1 జాబితాలో చేర్చి అత్యధిక ప్రాధాన్యమిచ్చే దర్శన ఏర్పాట్లు చేస్తారని చెబుతున్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, యువమోర్చా, మంత్రులు వ్యక్తిగతంగా వెళ్లినప్పుడు మాత్రమే వారిని ఎల్–1 జాబితాలో చేర్చే టీటీడీ అధికారులు... రాకేశ్ చెప్పాడంటే ఎల్–1 జాబితాలో చేర్చేవారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

తెలంగాణ ముఖ్య నేతతో టచ్‌లో..

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నేతతో కూడా రాకేశ్ సత్సంబంధాలు కొనసాగించాడు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ దగ్గర నుంచి ఆ పార్టీకి రాష్ట్రస్థాయిలో ఉన్న ముఖ్య నాయకుడి వరకు దూసుకెళ్లిపోయాడని, టికెట్లు ఇప్పిస్తానని చెప్పి గత ఎన్నికల సందర్భంగా కుత్బుల్లాపూర్‌కు చెందిన ముగ్గురు నాయకులను ఆ ముఖ్య నాయకుడి వద్దకు తీసుకెళ్లాడని అంటున్నారు. వీరిని ఏపీకి చెందిన యువనేతకు కూడా కలిపించాడనే ప్రచారం జరుగుతోంది. తెలంగాణకు చెందిన ముఖ్య నాయకుడి ఇంటికి తరచూ రాకేశ్ వెళుతుండేవారని, గత ఎన్నికల్లో టికెట్ల కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ చుట్టూ ప్రదక్షిణలు చేశాడని తెలుస్తోంది.

హత్యానంతరం ఒక నేతతో సంభాషణ..

చినబాబు, ఆయన ప్రత్యేక అధికారికి అన్నీ తానై వ్యవహరించిన రాకేశ్‌పై 2016లో కూకట్‌పల్లిలో ఓ హోటల్ యజమానిని డబ్బుకోసం బెదిరించిన కేసుతో పాటు 2017లో తమను పట్టించుకోవటం లేదంటూ ఆయన తల్లిదండ్రులు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదయ్యాయి. పెద్దబాబు, చిన్నబాబుతో సన్నిహిత సంబంధాలున్న రాకేశ్‌రెడ్డికి, తెలంగాణలో పార్టీ ముఖ్యనేతతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఎన్నారై జయరామ్‌ను హత్య చేసిన అనంతరం రాకేష్ పలువురు పోలీస్ అధికారులతో పాటు హైదరాబాద్‌లోని టీడీపీ ముఖ్యనేతతో చాలా సేపు ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

ఎవరైనా అప్పు ఇప్పిస్తే ఉద్యోగుల సమస్యలు తీరుస్తా: సీఎం



ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభలో అశోక్‌బాబు దంపతులను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల లోపు ప్రభుత్వ ఉద్యోగుల రెండు మూడు ప్రధాన డిమాండ్లను పరిష్కరిస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆర్థికశాఖతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని, అయితే మరీ ఎక్కువగా ఆశించవద్దని చెప్పారు. ఎవరైనా అప్పు ఇప్పిస్తే ఆ మొత్తాన్ని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేటాయిస్తానని వ్యాఖ్యానించారు. తాత్కాలిక భృతి చెల్లింపు కోసం ఉద్యోగ సంఘాల నాయకులు పలుమార్లు తనను సంప్రదించినట్టు తెలిపారు. బుధవారం రాత్రి విజయవాడలో ఏపీ ఎన్జీవోల సంఘం మాజీ అధ్యక్షుడు పి.అశోక్‌బాబు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఢిల్లీలో చేపట్టే ఆందోళనకు ఉద్యోగులంతా మద్దతు పలకాలని కోరారు. అశోక్‌బాబును ఎమ్మెల్సీగా చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

కరువు, తుపాన్లు వచ్చినా 11% వృద్ధి రేటు!

▶ మొదటి పేజీ తరువాయి
వారి తల్లిదండ్రులు పసుపు కుంకుమ ఇచ్చినట్లే తాను ఒక అన్నగా ఈ పథకాన్ని నిరంతరం కొనసాగిస్తానన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా బీసీల కోసం 20 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు కేటాయించకపోయినా రాత్రింబవళ్లు పనులు జరుగుతున్నాయన్నారు. పోలవరం డీపీఆర్–2ను కేంద్రం ఆమోదించకుంటే ఈనెల 11వతేదీన ఢిల్లీలో నిర్వహించే ధర్నాలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని ప్రకటించారు. ఈ నెలాఖరులోగా కృష్ణా జలాలను మడకశిరకు తరలిస్తామన్నారు.

నిండుసభ సాక్షిగా విపక్ష నేతపై నిందారోపణలు..

రాష్ట్రంలో నీతిమాలిన ప్రతిపక్షం ఉందంటూ శాసన సభ సాక్షిగా సీఎం చంద్రబాబు నిందారోపణలు, దూషణలకు దిగారు. రాష్ట్ర అభివృద్ధికి ఏమాత్రం సహకరించకుండా తప్పుడు పనులు చేస్తున్నారని ఆరోపించారు. కుట్రలు, కుతంత్రాలు, అశాంతిని సృష్టిస్తున్నారన్నారు. పోలవరం కాలువను తెగ్గొట్టడమే కాక.. తునిలో రైలుకు నిప్పు పెట్టారన్నారు. 'కాపులకు రిజర్వేషన్లు ఇచ్చే అంశం తన పరిధిలో లేదని జగన్ అన్నారు... తునిలో రైలుకు నిప్పు పెట్టేది మాత్రం నీ పరిధిలో ఉందా?' అంటూ సీఎం వ్యక్తిగత విమర్శలు చేశారు. రాష్ట్రంలో అసలు ప్రతిపక్షం ఉందా...? వారికి ప్రజలు ఓట్లు ఎందుకు వేశారో అర్థం కావడం లేదన్నారు. ప్రజా సమస్యలు అసెంబ్లీలో చర్చించాల్సి ఉన్నా వారు రావడం లేదు, అలాంటప్పుడు జీతాలెందుకు తీసుకోవాలి? అని ప్రశ్నించారు. కేసుల భయంతోనే ప్రత్యేక హోదా గురించి ప్రధాని మోదీని గట్టిగా అడగటం లేదన్నారు. ఎన్నికలొస్తున్నాయని భయపెట్టేందుకు పశ్చిమ బెంగాల్‌లో కేంద్రం సీబీఐతో దాడులు చేయిస్తే ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ సీఎం కేసీఆర్ ఎందుకు ఖండించలేదన్నారు. మోదీ ఫ్రంట్ పెట్టించి భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యర్థులపై కేంద్ర ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. కాంగ్రెస్ హయాంలో పారిశ్రామిక వేత్తలను బెదిరించడం వల్లే విశాఖలో ఏర్పాటు చేయాల్సిన ఫోక్స్ వ్యాగన్ కంపెనీ పుణెకు తరలి వెళ్లిందన్నారు. బొత్స సత్యనారాయణ వాటాల కోసం బెదిరించడం వల్లే పరిశ్రమ రాకుండా పోయిందని ఆరోపించారు.

17 లక్షల పంపుసెట్లను సోలార్‌కు మారుస్తాం..

దేశంలో విద్యుత్ సంస్కరణలకు ఆద్యుడిని తానేనని, ఇప్పుడు చేపట్టే వినూత్న కార్యక్రమాలతో ప్రపంచం తనను చూసి నేర్చుకుంటుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'పవరింగ్ ఏపీ' పేరిట విజయవాడలో రెండు రోజులు పాటు జరిగిన ఎనర్జీ ఇన్నోవేషన్ ముగింపు సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 50,000 పంపుసెట్లను సోలార్ పంపుసెట్లుగా మార్చామని, మొత్తం 17 లక్షల పంపుసెట్లను సోలార్ పంపుసెట్లుగా మార్చడమే కాకుండా మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించేలా కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. పంపుసెట్ల నుంచి వచ్చే మిగులు విద్యుత్‌ను రైతుల నుంచి యూనిట్ రూ.1.50 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. దేశంలో టెలికాం సంస్కరణలను కూడా తానే చేపట్టానని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్(ఈవోడీబీ)లో వరుసగా రెండేళ్లుగా మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు.

'పద్మశ్రీ' ఎస్‌వీఎస్ శాస్త్రి కన్నుమూత


ఎస్‌వీఎస్ శాస్త్రి (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, పద్మశ్రీ ఎస్‌వీఎస్ శాస్త్రి (90) బుధవారం హైదరాబాద్ బర్కత్‌పురాలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. వ్యవసాయ రంగంలో ఆయన చేసిన విశిష్ట పరిశోధనలకుగాను 1971లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రదానం చేసింది. 1974లో ప్రతిష్టాత్మక బోర్లాగ్ అవార్డును సైతం ఆయన అందుకున్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీలో సభ్యుడిగా ఉన్నారు. ప్లాంట్‌బ్రీడింగ్, జెనిటిక్స్, సైటోజెనిటిక్స్, టాక్సానమీ, ఫిజియాలజీ, క్రాప్‌సైన్సెస్, అగ్రానమీ వంటి అంశాల్లో పరిశోధనలు నిర్వహించి పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. ఆయన గుంటూరు జిల్లాలో 1928 నవంబర్ 4న జన్మించారు. గుంటూరు హిందూ కళాశాల, బాపట్ల వ్యవసాయ కళాశాలల్లో చదువుకున్నారు. అమెరికాలోని విస్కాసిన్ వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు గురువారం బర్కత్‌పురాలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలవరంపై 11న ఢిల్లీలో టీఏసీ భేటీ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనల(డీపీఆర్–2)పై చర్చించేందుకు ఈనెల 11న ఢిల్లీలో సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్ బుధవారం రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాశారు. రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి, పోలవరం ఈఎన్‌సీ తదితర అధికారులను ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో పోలవరం డీపీఆర్–2 భవితవ్యంపై స్పష్టత వచ్చే వీలుంది.

పవన్‌పైకి టీడీపీ ప్రేమ బాణాలు

అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వ్యంగ్యాస్త్రాలు



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై ఉన్నట్టుండి ప్రేమ కురిపిస్తున్నారని, ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ప్రేమ ఎక్కువైపోయిందని బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మొన్నటి వరకూ టీడీపీ నేతలు ప్రతి ఒక్కరూ పవన్‌ను తిట్టారని, ఇప్పుడేమో ప్రేమ బాణాలు విసురుతున్నారని, ఈ ప్రేమకు సమాధానం టీడీపీ నేతలే చెప్పాలని ఆయన అన్నారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంగా రాజు ఈ వ్యాఖ్యలు చేశారు. విమర్శల విషయంలో పవన్ స్థానంలో కేసీఆర్‌ను ఎందుకు పెట్టారో ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు. తానేదో జగన్‌కు అనుకూలంగా మాట్లాడుతున్నట్టు టీడీపీ నేతలు అంటున్నారని, హోదా విషయంలో ఎవరు యూటర్న్ తీసుకున్నారో అందరికీ తెలిసిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 650 అవార్డులు వచ్చాయంటున్నారు.. మళ్లీ అమిత్‌షా, మోదీపై బురదజల్లుతారు.. ఇదేం సంస్కృతి అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులిస్తే, రాష్ట్రమే అంతా చేసిందని డబ్బాలు కొట్టుకుంటున్నారని చెప్పారు. అలాగే విశాఖపట్నంలోని కింగ్‌జార్జి ఆస్పత్రిలోని దారుణ పరిస్థితులే రాష్ట్రంలోని వైద్య రంగం పనితీరుకు ఉదాహరణ అని చెప్పారు.

రైల్వే జోన్ కూడా ప్రారంభించేస్తారా?
'కడపలో స్టీల్‌ప్లాంటు నిర్మిస్తామంటూ ఒక రాయి వేశారు. రేపు విశాఖ రైల్వే జోన్ నిర్మిస్తామంటూ మరో రాయి వేస్తారేమో' అంటూ విష్ణుకుమార్ రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా కడపలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటుపై టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు కలుగజేసుకుంటూ స్టీల్ ప్లాంట్‌పై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

బాబు, లోకేష్‌లపై పొగడ్తల కోసమా?

శాసనమండలిలో టీడీపీ నేతల ప్రసంగాలపై బీజేపీ సభ్యుల మండిపాటు


సోము వీర్రాజు


మాధవ్

సాక్షి, అమరావతి: గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనమండలిలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా అధికార టీడీపీ ఎమ్మెల్సీలు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లను పొగుడుతూ ఉపన్యాసాలు చేయడంపై బీజేపీ ఎమ్మెల్సీలు మండిపడ్డారు. 'గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ అంటే చంద్రబాబు, లోకేష్‌బాబుల పొగడ్తల కోసం పెట్టుకున్న చర్చా..' అంటూ విమర్శించారు. చర్చ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్ర ప్రసాద్ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను పొగుడుతూ.. మోదీ, అమిత్‌షాలతోపాటు బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. మోదీ రాష్ట్రానికి ఎలా వస్తారంటూ వ్యాఖ్యలు చేయడంతో బీజేపీ ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమయంలో టీడీపీ, బీజేపీ ఎమ్మెల్సీలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు.

డ్వాక్రా మహిళలను మోసం చేశారు..
లబ్ధిదారులకు పోస్టు డేటెడ్ చెక్కుల్ని పంపిణీ చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందని.. దేశంలో మరే ప్రభుత్వం ఇలా చేయలేదని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ విమర్శించారు. గత ఎన్నికల్లో డ్వాక్రా రుణ మాఫీ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మహిళలను మోసం చేశారని, ఇప్పుడు మహిళల బంగారం జప్తునకు బ్యాంకులు నోటీసులు జారీ చేస్తున్నాయని తెలిపారు. పాఠశాల విద్యాశాఖలో 23 వేల టీచరు పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 7 వేల పోస్టుల భర్తీకే ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి తప్పుపట్టారు. కాగా, శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో ఓ ప్రశ్నకు మంత్రి దేవినేని ఉమా బదులిస్తూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు ఐదేళ్లలో రూ. 51 వేల కోట్లకుపైగా ఖర్చు చేసినట్లు చెప్పారు. దీనిపై బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ స్పందిస్తూ.. రాజధాని అమరావతి నిర్మాణం దగ్గర్నుంచి విజయవాడ, గుంటూరు నగరాలకు, నీటి ప్రాజెక్టులకు కేంద్రప్రభుత్వం రూ. వేల కోట్ల నిధులిస్తోందని, సభలో వాటి గురించి ప్రస్తావన వచ్చినప్పుడు ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నించారు.


సీబీఐని తరిమేసినట్టే.. సీపీఎస్ రద్దు చేయాలి

ఏడీఎఫ్ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం

సాక్షి, అమరావతి: సీబీఐని మెడపట్టి తరిమేసినట్టే కేంద్రం తెచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను కూడా తరిమేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రమణ్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో సీపీఎస్ విధానం రద్దు చేసే విషయమై చర్చకు అనుమతించాలంటూ బుధవారం శాసనమండలిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఇన్‌చార్జ్ చైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం తిరస్కరించారు. దీంతో చర్చకు అనుమతించాలని పట్టుపడుతూ ఎమ్మెల్సీలు బాలసుబ్రమణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, కత్తి నరసింహారెడ్డి, వై.శ్రీనివాసులురెడ్డి, రాము సూర్యారావు వెల్‌లో నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. మండలి సమావేశాలు ముగుస్తున్న తరుణంలోనూ సీపీఎస్ విధానంపై ప్రభుత్వ వైఖరి చెప్పకపోవడం సరికాదని వారు తప్పుబట్టారు. సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం స్పందించకపోతే టీచర్లు, ఉద్యోగులు సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. మంత్రిని పిలిపించి సీపీఎస్ విషయమై ఎమ్మెల్సీలతో చర్చించేలా చూస్తానని మండలి చైర్మన్ హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

గ్రోత్ సెంటర్ల ద్వారా 75 వేల మందికి ఉపాధి

రాజ్యసభలో విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన విజయనగరం, అనంతపురం జిల్లాల్లోని బొబ్బిలి, హిందూపురంలో నెలకొల్పనున్న గ్రోత్‌సెంటర్ల (పారిశ్రామిక పార్కులు) అభివృద్ధి, ఆధునీకరణ పనులు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 75 వేల మందికి ఉపాధి లభిస్తుందని వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సీఆర్ చౌధురి తెలిపారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాత పూర్వకంగా జవాబిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. దేశంలోని వెనుకబడిన ప్రాంతాల్లో గల ఇండస్ట్రియల్ ఎస్టేట్స్, పార్కులు, గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులలో పారిశ్రామిక మౌలిక వసతులను అభివృద్ధి చేయడానికి ప్రవేశ పెట్టిన పథకంలో భాగంగా హిందూపురం, బొబ్బిలిలోని పారిశ్రామిక క్లస్టర్స్ అభివృద్ధి, ఆధునీకరణకు 2016లో కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు. రూ. 54 కోట్లతో హిందుపురంలోని గ్రోత్‌సెంటర్, గొల్లపురంలోని పారిశ్రామిక పార్కు, రూ. 10 కోట్లతో బొబ్బిలిలోని పారిశ్రామిక గ్రోత్‌సెంటర్ అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు.

డీపీఆర్ అసమగ్రంగా ఉంది: విశాఖపట్నం ఫిషింగ్‌హార్బర్ ఆధునీకరణ, అభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వం సమర్పించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) అసమగ్రంగా ఉన్నందునే దానిని తిప్పి పంపినట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సీఆర్ చౌధురి తెలిపారు. ఎంపీ వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాత పూర్వకంగా వివరణ ఇచ్చారు.

డిజిటల్ విద్యాబోధనకు ప్రత్యేక సంస్థ

డిజిటల్ విద్యాబోధన ప్రజ్ఞాపాటవాల కేంద్రం బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

సాక్షి, అమరావతి: డిజిటల్ విద్యాబోధన ద్వారా సమగ్ర విద్యాభివృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంస్థను ఏర్పాటుచేయనుంది. ప్రపంచస్థాయిలో డిజిటల్ విద్యాబోధనల ప్రజ్ఞాపాటవాల కేంద్రం (ఏపీఐజీహెచ్‌డీపీ) పేరిట దీన్ని స్థాపించనుంది. ఇందుకు సంబంధించిన బిల్లును బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదించారు. యునెస్కో ఎంజీఐఈపీ సహకారంతో ప్రపంచస్థాయి డిజిటల్ విద్యాబోధనల ప్రజ్ఞాపాటవాల కేంద్రం స్థాపించడానికి, నిర్వహణకు అవసరమయ్యే రూ. 245 కోట్లను ప్రభుత్వం రుణంగా ఈ సంస్థకు అందించనుందని బిల్లులో పేర్కొన్నారు.

ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టానికి సవరణ: రాష్ట్ర ప్రైవేటు వర్సిటీల చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో మరో బిల్లు ప్రవేశపెట్టింది. తమిళనాడుకు చెందిన ఆర్‌ఎస్ ట్రస్టుకు సంబంధించిన వెల్‌టెక్ వర్సిటీని చిత్తూరు జిల్లాలో ఏర్పాటు చేయడం, కర్ణాటకలోని గట్టివ్యాలీ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌కు చెందిన భారతీయ ఇంజనీరింగ్ సైన్స్, సాంకేతిక విజ్ఞాన వినూత్న కల్పన విశ్వవిద్యాలయాన్ని అనంతపురంలో ఏర్పాటుచేయడానికి వీలుగా ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

చుక్కల భూముల సవరణ బిల్లు: ఏపీ చుక్కల భూముల క్రమబద్ధీకరణ సవరణ బిల్లు– 2019ని అసెంబ్లీ ఆమోదించింది. చుక్కల భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రస్తుతం జిల్లా స్థాయి కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నారు. అలాగే క్రమబద్ధీకరణ కోసం వచ్చే అర్జీలను 6 నెలల్లో పరిష్కరించాలని ప్రస్తుత చట్టంలో ఉంది. అయితే జిల్లా స్థాయి కమిటీకి బదులు సబ్ డివిజనల్ కమిటీని సవరణ బిల్లులో పెట్టారు. దరఖాస్తులను 6 నెలల్లో కాకుండా రెండు నెలల్లోనే పరిష్కరించాలని గడువు కుదించారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ప్రతిపాదించిన సవరణ బిల్లును సభ ఆమోదించింది.

అసైన్డ్ ల్యాండ్స్ సవరణ బిల్లు: ఏపీ అసైన్డ్ ల్యాండ్స్ (బదలాయింపు నిషేధ) అమెండ్‌మెంట్ బిల్లు– 2019ను సభ ఆమోదించింది. ప్రభుత్వం నుంచి దరఖాస్తు పట్టా కింద ఇళ్ల స్థలాలు/ఇళ్లు పొందిన వారికి ప్రస్తుతం విక్రయ హక్కులు లేవు. ఈ బిల్లు చట్ట రూపం దాల్చితే పట్టాలు పొందినప్పటి నుంచి 20 ఏళ్ల తర్వాత ఇలాంటి ఇళ్ల స్థలాలు/ ఇళ్లను విక్రయించుకునే హక్కు అనుభవదారులకు లభిస్తుంది. అలాగే గతంలో పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌పై అదనంగా వసూలు చేస్తున్న రూ. 2 తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంపై గతంలో జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఇప్పుడు బిల్లును శాసన సభ ఆమోదించింది.

మూడు బిల్లుల ప్రతిపాదన: శాసన సభలో బుధవారం 3 సంక్షేమ బిల్లులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రతిపాదించారు. బీసీ ఉప ప్రణాళిక బిల్లు –2019, ఈబీసీ (విద్యా సంస్థల్లో సీట్లు, నియామకాల్లో కాపులకు రిజర్వేషన్) చట్టం –2019, కాపులు కాకుండా ఏపీలో ఆర్థికంగా బలహీన వర్గాల (విద్యా సంస్థల్లో సీట్లు, పదవుల్లో రిజర్వేషన్లు) బిల్లు– 2019 ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి.

ఎమ్మెల్యేలకు నిధులిచ్చే ప్రశ్నేలేదు: మంత్రి యనమల
ఎమ్మెల్యేలకు నిధులిచ్చే ప్రశ్నేలేదని మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలకు నిధుల కేటాయింపుపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు గతంలో అడిగిన లిఖితపూర్వక ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి నిధుల పథకం ఇప్పుడు అమల్లో లేదని, దీనికింద ఎవరికీ నిధులు ఇవ్వలేదన్నారు.

నకిలీ విత్తనాలపై కఠిన చర్యలేవీ?

- అసెంబ్లీలో ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి నిలదీత
- కట్టడికి చర్యలు తీసుకుంటామన్న మంత్రి ప్రత్తిపాటి


ఎమ్మెల్యే మోదుగుల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నకిలీ, నాసిరకం విత్తనాల వల్ల రైతులు దారుణంగా నష్టపోతున్నా ప్రభుత్వం ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి నిలదీశారు. ఇలాంటి విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా ఎందుకు నియంత్రించలేకపోతున్నారని ప్రశ్నించారు. గుంటూరు కేంద్రంగా నకిలీ విత్తనాల దందా కొనసాగుతోందని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ చెప్పారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఈ అంశంపై చర్చ జరిగింది. రాష్ట్రంలో సీడ్ సర్టిఫికేషన్ అథారిటీని ఎప్పుడు నియమిస్తారని మోదుగుల ప్రశ్నించారు. ఫిర్యాదులు చేస్తే నకిలీ విత్తనాలను పట్టుకుని సీజ్ చేస్తున్నారే తప్ప దోషులపై చర్యలు తీసుకోవడం లేదని, కేసులు పెట్టడం లేదని ఆక్షేపించారు. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో అధికారులకు తెలుసని, తెరవెనుక చాలా పెద్ద వ్యవహారం సాగుతోందని మోదుగుల, శ్రావణ్ కుమార్ దుయ్యబట్టారు. ఈ సందర్భంగా స్పీకర్ కోడెల శివప్రసాద్ కలుగజేసుకుని 'కల్తీ విత్తనాలు నిజం. నాలుగైదు చోట్ల ఈ విషయం నా దృష్టికి కూడా వచ్చింది. నాసిరకం, నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టే మోసగాళ్లపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోకపోతే చాలా నష్టం జరుగుతుంది. ఇది చాలా తీవ్రమైన సమస్య' అని అన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సమాధానమిచ్చారు. సమస్య తీవ్రతను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. 986 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను సీజ్ చేశామని, 13 కంపెనీల లైసెన్సులను ఏడాదిపాటు సస్పెండ్ చేశామని ప్రత్తిపాటి తెలిపారు. సీజ్ చేయడం పరిష్కారం కాదని, సీజ్ చేస్తే వెంటనే మరోపేరుతో నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వస్తాయని స్పీకరు కోడెల పేర్కొన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాల కట్టడికి ఏం చేయాలో చర్చించి, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రత్తిపాటి బదులిచ్చారు.

'చుక్కలు' చూపిస్తున్న సర్కారు
చుక్కల భూముల పేరుతో ప్రజలకు సర్కారు చుక్కలు చూపిస్తోందని, ప్రైవేటు ఆస్తులను నిషేధిత ఆస్తుల జాబితాలో పెట్టే జబ్బులు రెవెన్యూ శాఖకు చికున్ గున్యా, డెంగ్యూలా విస్తరించాయని బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు, టీడీపీ సభ్యుడు రామకృష్ణబాబు అన్నారు. 'విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, మధురవాడ తదితర ప్రాంతాలను నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చారు' అని టీడీపీ సభ్యుడు రామకృష్ణ బాబు ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్య వాస్తవమే...
చుక్కల భూముల విషయంలో సమస్య వాస్తవమేనని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అంగీకరించారు. చుక్కల భూముల సమస్య పరిష్కారం కోసం గతంలో చట్ట సవరణ చేశామని, అయినా సమస్య పరిష్కారం కానందున ఇప్పుడు గతంలో ఇచ్చిన జీవోలో ఏ ఒక్క ఆధారం ఉన్నా వారి పేర్లతోనే క్రమబద్ధీకరించాలని సవరణ బిల్లు పెడుతున్నామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే రాఘవరావు మృతికి సంతాపం

సాక్షి, అమరావతి: మాజీ శాసన సభ్యుడు జాగర్లమూడి రాఘవరావు మృతి పట్ల రాష్ట్ర అసెంబ్లీ సంతాపం తెలిపింది. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. రాఘవరావు మృతికి సంతాప సూచికంగా శాసన సభ్యులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

మండలి చైర్మన్ పదవికి షరీఫ్ నామినేషన్


మండలి చైర్మన్ పదవికి మంత్రులతో కలిసి నామినేషన్ వేస్తున్న షరీఫ్

సాక్షి, అమరావతి: శాసన మండలి చైర్మన్ పదవికి టీడీపీ ఎమ్మెల్సీ ఎంఏ షరీఫ్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ పదవికోసం షరీఫ్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం కానుంది. షరీఫ్ ఎంపికను ఇన్‌చార్జ్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం గురువారం అధికారికంగా ప్రకటించనున్నారు. ఆ వెంటనే ఆయన బాధ్యతలు చేపడతారు. అంతకుముందు చైర్మన్ పదవికి ఎన్నికకు సంబంధించిన షెడ్యూలును ఇన్‌చార్జ్ చైర్మన్ బుధవారం శాసన మండలిలో ప్రకటించారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, గురువారం ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు కార్యదర్శి సత్యనారాయణ నోటిఫికేషన్ జారీ చేయగా.. షరీఫ్ ఒక్కరే ఈ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్ఎండీ ఫరూక్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో మండలి చైర్మన్ పదవికి ఖాళీ ఏర్పడిన విషయం తెల్సిందే. ఇన్‌చార్జి చైర్మన్‌గా ప్రస్తుతం రెడ్డి సుబ్రహ్మణ్యం వ్యవహరిస్తున్నారు.

ఎన్నికల వేళ.. 3 ప్రాజెక్టులకు అనుమతి

రూ. 7365.78 కోట్లతో వంశధార–బాహుదా అనుసంధానం, కోటపాడు– చానుబండ– విస్సన్నపేట, వరికపుడిశెల ఎత్తిపోతలకు పరిపాలన అనుమతి
బడ్జెట్‌లో ఈ పథకాలకు నిధులు కేటాయించని సర్కార్
ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకే పనులు దక్కేలా తక్షణమే టెండర్లు
మొబిలైజేషన్ అడ్వాన్సుల కోసమే ఈ పథకాలు మంజూరు చేశారంటోన్న అధికారులు

సాక్షి, అమరావతి: మరికొన్ని రోజుల్లో ఎన్నికల షెడ్యూలు వెలువడనుండగా.. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం మూడు ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వంశధార–బాహుదా నదుల అనుసంధానం, ఎత్తిపోతల, వరికపుడిశెల ఎత్తిపోతలకు రూ.7,365.78 కోట్లతో పరిపాలన అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.16,852.27 కోట్లు కేటాయిస్తే, అందులో ఈ మూడు ప్రాజెక్టులకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు ఇవ్వకపోవడం గమనార్హం. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చేలోగా ఆ మూడు పథకాలకు టెండర్లు పిలిచి.. ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకే అప్పగించాలని జలవనరుల శాఖ అధికారులపై సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నికలకు ముందు కమీషన్‌ల కోసమే ఈ ప్రాజెక్టులు మంజూరు చేశారని అధికారులు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు శంకుస్థాపనలు చేసి రైతులను కనికట్టు చేయడం.. ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకే పనులు అప్పగించి మొబిలైజేషన్ అడ్వాన్సులు కట్టబెట్టి, వాటినే కమీషన్‌లుగా వసూలు చేసుకోవడమే లక్ష్యంగా కొత్త ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్)లతో సంబంధం లేకుండా కేవలం ఉజ్జాయింపు (లైన్) అంచనాల ఆధారంగా పంపిన ప్రతిపాదనలను ఆర్థిక శాఖ తిరస్కరిస్తే.. వాటిపై సాక్షాత్తూ సీఎం చంద్రబాబే సంతకం చేయడంపై అధికారవర్గాలు విస్తుపోతున్నాయి. ఇప్పటికే ఇదే తరహాలో రాయలసీమలో రూ. 6,017.87 కోట్లతో నాలుగు కొత్త ప్రాజెక్టులను జనవరి 29న మంజూరు చేసిన సర్కార్, వాటికి ఆగమేఘాలపై టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పుడు రూ. 6,326.62 కోట్లతో వంశధార–బాహుదా నదుల అనుసంధానం, రూ.698.90 కోట్లతో కోటపాడు–చానుబండ–విస్సన్నపేట ఎత్తిపోతల, రూ.340.26 కోట్లతో వరికపుడిశెల ఎత్తిపోతలకు అనుమతి ఇచ్చింది.

హైడ్రలాజికల్ క్లియరెన్స్ లేకుండానే..

చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా తొలుత తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లో రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించాలని ప్రతిపాదించారు. ఆ తర్వాత టీడీపీ సర్కార్ ఆ పథకం సామర్థ్యాన్ని పెంచి.. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద 2.20 లక్షల ఎకరాలకు నీళ్లందించే పనులను చేపట్టింది. కానీ.. ఇప్పుడు చింతలపూడి ఎత్తిపోతల ప్రధాన కాలువపై కృష్ణా జిల్లా చాట్రాయి మండలంలో 89.90 కి.మీ వద్ద 50 క్యూసెక్కులను ఎత్తిపోసేలా కోటపాడు, 98.20 కి.మీ వద్ద 100 క్యూసెక్కులు ఎత్తిపోసేలా చానుబండ, 100.50 కి.మీ వద్ద మూడు దశల్లో 800 క్యూసెక్కులు ఎత్తిపోసేలా విస్సన్నపేట ఎత్తిపోతల ద్వారా విస్సన్నపేట, ముసునూరు, రెడ్డిగూడెం, చాట్రాయి, నూజివీడు మండలాల్లో 50 వేల ఎకరాలకు నీళ్లందించడానికి రూ. 698.90 కోట్లతో పథకాన్ని చేపట్టడానికి కృష్ణా డెల్టా సీఈ ప్రతిపాదనలు పంపారు. గుంటూరు జిల్లా వెల్దుర్తి మండలం గంగుల కుంట వద్ద వరికపుడిశెల వాగు నాగార్జునసాగర్‌లో కలుస్తుంది. సాగర్ జలవిస్తరణ ప్రాంతంలో గంగుల కుంట వద్ద వరికపుడిశెల వాగు నుంచి నీటిని తరలించి 24,900 ఎకరాలకు నీటిని అందించాలన్న లక్ష్యంతో వరికపుడిశెల ఎత్తిపోతలకు రూ. 340.26 కోట్లతో కృష్ణా డెల్టా సీఈ ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు ఎత్తిపోతల పథకాలకు హైడ్రలాజికల్ క్లియరెన్స్ లేకపోవడం.. నిధులు కేటాయించకపోవడం.. అంచనా వ్యయం అధికంగా ఉండటంతో వాటిని ఆర్థిక శాఖ తోసిపుచ్చింది. అయినా.. వాటిని సీఎం ఆమోదించడం గమనార్హం. ఈ మూడు ప్రాజెక్టులకు ఇలా అనుమతి ఇచ్చారో లేదో వెంటనే టెండర్లు పిలవాలంటూ తమపై ఒత్తిడి తెస్తున్నారని అధికారవర్గాలు తెలిపాయి. వాటిని ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకే కట్టబెట్టి.. మొబిలైజేషన్ అడ్వాన్సులు ముట్టజెప్పే సొమ్మును తొలి విడత కమీషన్‌లుగా వసూలు చేసి.. వాటినే ఎన్నికల్లో వెదజల్లాలనేది సీఎం చంద్రబాబు వ్యూహమని చెబుతున్నారు.



కమీషన్‌ల అనుసంధానం..

వంశధార ప్రాజెక్టు రెండో దశలో మిగిలిపోయిన 35 శాతం పనుల అంచనా వ్యయాన్ని పెంచేసి, పాత కాంట్రాక్టర్లపై వేటు వేసి వాటిని టీడీపీ ఎంపీ సీఎం రమేష్ సంస్థకు అప్పగించిన సీఎం చంద్రబాబు కమీషన్‌లు వసూలు చేసుకున్నారు. ఆ ప్రాజెక్టును పూర్తి చేయడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లా రైతులకు తీవ్రంగా అన్యాయం చేసింది. వంశధార–బాహుదా నదులను అనుసంధానం చేసి కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో 90 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు కొత్తగా 1.10 లక్షల ఎకరాలకు సాగునీళ్లు.. ఉద్దానం ప్రాంతానికి తాగునీళ్లు అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. వంశధార ప్రాజెక్టు రెండో దశలో భాగమైన హిరమండలం రిజర్వాయర్ నుంచి వంశధార నది మీదుగా 116 కిమీల పొడవున కెనాల్ తవ్వి దానికి అనుబంధంగా 8.30 టీఎంసీల సామర్థ్యంతో పెద్దలోగిడి, రంగసాగరం, మల్లివీడు, ఆళ్లుకోల, కంచిలి రిజర్వాయర్లను నిర్మించడం ద్వారా రెండు నదులను అనుసంధానం చేయాలని డీపీఆర్‌లో ప్రతిపాదించారు. ఈ పనులకు కేవలం ఉజ్జాయింపు అంచనాల ఆధారంగా రూ. 6,326.62 కోట్లతో అనుమతి ఇచ్చారు. అంచనా వ్యయం అధికంగా ఉండటం.. భారీ అక్రమాలు జరిగినట్లు గుర్తించిన ఆర్థిక శాఖ వాటిని తోసిపుచ్చినా సీఎం చంద్రబాబు ఖాతరు చేయకపోవడం గమనార్హం.

ధర్నా పేరుతో టీడీపీ నేతల అతి

- గోళ్ళపాడులోని సేఫ్ కంపెనీ వద్ద రోడ్డుపై రాస్తారోకో
- నిలిచిపోయిన వాహనాలు
- ప్రశ్నించిన ప్రయాణికులపైన దురుసు ప్రవర్తన


ధర్నాలో పాల్గొన్న కోడెల అనుచరులు ఎ.వెంకటేశ్వరరావు, రాంబాబు (వృత్తాల్లో ఉన్న వ్యక్తులు)

సాక్షి, గుంటూరు/ముప్పాళ్ళ(సత్తెనపల్లి): సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడులో స్పీకర్ కోడెల తనయుడు కోడెల శివరామకృష్ణ అనుచరులు బుధవారం హల్‌చల్ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో పేదలకు పెడుతున్న అన్నం పక్కదారి పడుతున్న వ్యవహారంపై ఈ నెల 3న 'హవ్వ.. మరీ ఇంత కక్కుర్తా' శీర్షికతో సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. సత్తెనపల్లి నియోజకవర్గంలోని కోడెల కుమార్తెకు చెందిన సేఫ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు నరసరావుపేట, సత్తెనపల్లి పట్టణాల్లో ఉన్న అన్న క్యాంటీన్‌లకు వచ్చే ఆహారాన్ని రూ.5 చొప్పున కొనుగోలు చేసి కార్మికుల దగ్గర రూ.25 వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నట్టు సోషల్ మీడియాలో వైరల్ కావటం, దానిపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపణలు చేయటం తెలిసిందే. దీంతో వ్యవహారం మొత్తం బయటపడి అన్న క్యాంటీన్ బువ్వ స్పీకర్ కోడెల కుమార్తె సొంత కంపెనీలకు తరలుతోందని సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు ఊపందుకున్నాయి. మూడు షేర్లు.. ఆరు లైక్‌లతో ఈ వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దీంతో తమ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని భావించిన స్పీకర్ తనయుడు, తనయ ధర్నా పేరుతో హైడ్రామా నడిపారు. తమపై వచ్చిన ఆరోపణలను ఖండించకపోగా ఏకంగా కంపెనీలో పనిచేసే కార్మికులనే ఒత్తిడి చేసి, రోడ్డుపై కూర్చోవాలంటూ కంపెనీ యజమాని, స్పీకర్ కుమార్తె ఆదేశాలు జారీ చేశారు. అంతటితో ఆగకుండా ఆ రెండు నియోజకవర్గాల్లో తన ముఖ్య అనుచరులను కంపెనీకి పిలిపించి వారితో దగ్గరుండి రాస్తారోకో నిర్వహింపచేశారు. రాస్తారోకోలో పాల్గొన్న కార్మికులు మాత్రం భోజనాల దగ్గర రాజకీయాలు చేసి తమ పొట్ట కొట్టొద్దంటూ ప్లకార్డులతో రోడ్డుపై బైఠాయించారు.

వాస్తవం అంగీకరించినట్టేనా...

కార్మికులకు అన్న క్యాంటీన్ భోజనం అందిస్తున్నామనే వాస్తవం అంగీకరించినట్టేనా అనే గుసగుసలు వినిపించాయి. నిప్పు లేనిదే పొగ రాదన్న చందంగా వ్యవహారం ఉందని ప్రయాణికులు చర్చించుకున్నారు. అన్న క్యాంటీన్ భోజనాలు తరలించకపోతే అంత ఉలుకెందుకో వీళ్లకి అన్న మాటలు వినిపించాయి.

ప్రయాణికులపై దురుసు ప్రవర్తన

రాస్తారోకో సందర్భంగా సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అంతా ఆఫీసులకు పోయే సమయం కావటంతో బస్సుల్లో ఉన్న అధికారులు, సామాన్యులు ఆందోళనకారులతో మాట్లాడితే వారితో వాగ్వాదానికి దిగారు. ఆఫీసు సమయం మించిపోతోందని, తమ ఇబ్బందులు పట్టించుకోండని బతిమాలినా పట్టించుకోకుండా వారిపై దురుసుగా ప్రవర్తించారు. కొంతమంది వాహనదారులు పొలాల్లో గుండా రోడ్డు దాటుతున్నా అడ్డగించి వారి వాహనాలను నిలిపివేయించారు.

ధర్నాలో టీడీపీ నేతలు...

సేఫ్ కంపెనీ వద్ద జరిగిన ధర్నాలో కార్మికుల పేరుతో టీడీపీ నేతలు హల్‌చల్ చేశారు. స్పీకర్ కుమార్తెకు ముఖ్య అనుచరులైన వారు ముందుండి కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసరావుపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎ. వెంకటేశ్వరరావు, మరో వ్యాపారి రాంబాబు, సత్తెనపల్లికి చెందిన మరో అనుచరుడు బొమ్మిశెట్టి శ్రీనివాస్‌తో పాటుగా మరికొంతమంది యువకులు రాస్తారోకోలో అంతా తామై వ్యవహరించారు. కూలీలు మాత్రం మౌనంగానే కూర్చోవటం గమనార్హం. సమాచారం అందుకున్న ముప్పాళ్ళ ఎస్ఐ జి. ఏడుకొండలు సంఘటనా స్థలానికి చేరి ఆందోళనకారులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. ఈ వ్యవహారంపై సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టారన్న నెపంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సత్తెనపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావును సత్తెనపల్లి డీఎస్పీ కాలేషావలి స్టేషన్‌కు పిలిపించి ప్రశ్నించడం కొసమెరుపు.

స్టిక్కర్ వేద్దాం... ఫిక్స్ చేద్దాం


- సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఇళ్లకు 'చంద్రబాబు' స్టిక్కర్లు
- టీడీపీకి ఓటేయకపోతే పథకాలు తొలగిస్తామంటూ హెచ్చరికలు చేసేలా ప్లాన్
- అధికార పార్టీ నేతలను వెంటబెట్టుకెళ్లాలని జిల్లా అధికారులకు ప్రభుత్వ ఆదేశం

సాక్షి, అమరావతి బ్యూరో: రానున్న ఎన్నికల్లో ఓటర్లను బెదిరించి తమకు అనుకూలంగా మలచుకునే దిశగా టీడీపీ ప్రభుత్వం మరో పన్నాగానికి సన్నద్ధమవుతోంది. టీడీపీకి ఓటేయకపోతే ఇంతవరకు అందిస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని చెప్పేందుకు స్టిక్కర్ రాజకీయానికి తెరతీసింది. ఓ వైపు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ.. మరోవైపు టీడీపీ నేతల బెదిరింపులకు లైసెన్స్ ఇచ్చేలా వ్యవహరిస్తోంది. సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు చంద్రబాబు ఫొటోతో ప్రత్యేక స్టిక్కర్లు అతికించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లాల్లో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లు, చిరునామా, ఇతర వివరాలను కుటుంబాల వారీగా జాబితాలను రూపొందించాలని చెప్పింది. స్థానిక టీడీపీ నేతలను వెంటబెట్టుకుని మరీ ఇంటింటికి తిరుగుతూ ఆ స్టిక్కర్లు అతికించాలని ప్రభుత్వం చెప్పడం గమనార్హం. ఈ వ్యవహారాన్ని వారం రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఇంటికి స్టిక్కర్ వేసే సమయంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీకే ఓటు వేయాలని, లేకపోతే సంక్షేమ పథకాలు అందకుండా చేస్తామని అధికారుల ఆధ్వర్యంలో అధికార పార్టీ నేతలు హెచ్చరికలు చేస్తారు. కాగా, ప్రభుత్వ నిర్ణయాన్ని అధికార యంత్రాంగం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇంతవరకు రాష్ట్రంలో ఇలాంటి విధానాన్ని ఏ ప్రభుత్వం అనుసరించలేదనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. స్థానిక టీడీపీ నేతలతో స్టిక్కర్లు అతికించడానికి సిద్ధపడితే ప్రజలు తిరగబడతారని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీని వల్ల గ్రామాల్లో వివాదాలు, ఘర్షణలు జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులమైన తామెందుకు వివాదాస్పదం కావాలని వారు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికే ఉద్యోగులు తమ ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం మాత్రం లబ్ధిదారుల ఇళ్లకు స్టిక్కర్లు అతికించాలన్న పట్టుదలతో ఉంది. మరి ఈ వ్యవహారం ఎలాంటి పరిణామాలకు దారితీయనుందో వేచి చూడాల్సిందే.

అదో డూప్లికేట్ బడ్జెట్

నవరత్నాల్లోని పథకాలను కాపీ కొట్టారు

- రాష్ట్ర బడ్జెట్‌పై పీఏసీ చైర్మన్ బుగ్గన ధ్వజం
- సినిమా టైటిళ్ల తరహాలో పథకాల పేర్లు
- ఎన్టీఆర్ బతికుంటే కచ్చితంగా మాకే ఓటేసేవారు
- కేంద్రం నుంచి వచ్చే ఆదాయంపైనా పొంతన లేని లెక్కలు
- అర్హత లేని వాళ్లను ఐపీఎస్ పోస్టుల్లో నియమిస్తున్నారు
- కీలక పోలీస్ పోస్టుల్లో సీఎం సామాజిక వర్గానికే పెద్దపీట



సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనసభకు ఆర్థిక మంత్రి యనమల సమర్పించిన బడ్జెట్ డూప్లికేట్ బడ్జెట్ అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అభివర్ణించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలలోని పథకాలను కాపీ కొట్టడమే కాకుండా.. కేంద్రం ప్రవేశపెట్టిన తరహాలో (డూప్లికేట్) బడ్జెట్‌ను వండి వార్చారని ధ్వజమెత్తారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను అకౌంట్ ఫర్ ఓట్స్ (ఓట్ల కోసం బడ్జెట్)గా మార్చారని విమర్శించారు. హైదరాబాద్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం రూ. 2.26 లక్షల కోట్ల బడ్జెట్ అంటూ ప్రవేశపెట్టినా ఆర్థిక మంత్రికి కేవలం రూ. 65,869 కోట్లు మాత్రమే ఖర్చు చేసే అవకాశం ఉంటుందన్నారు. జీతాలు, పెన్షన్లు, తెచ్చిన అప్పులపై వడ్డీలు మాత్రమే చెల్లించే అవకాశం ఉంటుందని వివరించారు. గత ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించి అన్నదాతా సుఖీభవ అంటూ కొత్త పథకాన్ని ప్రకటించి మరో మోసానికి తెరతీశారన్నారు. ఎన్టీఆర్ పేరిట పెట్టిన పించన్ల మొదలు ఏ కార్యక్రమాన్నీ సరిగా అమలు చేయడం లేదని, ఎన్టీఆర్ ఉండి ఉంటే కచ్చితంగా వైఎస్సార్ సీపీకే ఓటేసే వారన్నారు. అక్క చెల్లెళ్లకు ఇవ్వాల్సిన డబ్బునే వాళ్లకు ఇస్తూ పసుపు కుంకుమ అంటూ సినిమా టైటిళ్ల మాదిరిగా పేర్లు పెడుతున్నారని మండిపడ్డారు. 2017–18లో రాబడి రూ. 1,05,000 కోట్లుంటే రెండేళ్లలో 2019–20 నాటికి రూ. 1,78,000 కోట్లకు చేరుతుందా? ఇంత రాబడి ఎక్కడా చూడలేదన్నారు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ 2017–18లో రూ. 22 వేల కోట్లుగా చూపారని, ఇప్పుడు అది 2019–20 నాటికి రూ. 60 వేల కోట్లకు ఎలా చేరుతుందని ప్రశ్నించారు. ఒకపక్క కేంద్రం నుంచి నిధులు రావడం లేదంటూ మరోపక్క ఈ అంకెల గారడీ ఏమిటని నిలదీశారు. ఇవన్నీ చూస్తే టీడీపీ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా డూప్లికేట్ అని అర్థమవుతోందన్నారు. అమరావతికి చంద్రబాబు ఈ బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు.

కీలక పోలీసు పోస్టింగులపై చర్చకు సిద్ధమా?

తెలుగుదేశం ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వాళ్లను ఐపీఎస్‌లుగా నియమిస్తుంటే ఆలిండియా పోలీసు అధికారులు ఎవరూ మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని బుగ్గన అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు ఎస్పీలుగా నియమితులైన దామోదర్, వెంకటరత్నం నిజానికి ఐపీఎస్‌లు కాదని, అయినా వారిని నియమించడం వెనుక పరమార్థం ఏమిటని ప్రశ్నించారు. అసాధారణ పరిస్థితులలో మాత్రమే ఐపీఎస్ కాని వారిని నాన్ క్యాడర్ ఎస్పీలుగా నియమించాల్సి ఉన్న విషయం పోలీసు బాసులకు తెలియదా? అని ప్రశ్నించారు. ఎస్పీ, అడిషనల్ ఎస్పీ పోస్టుల్లో ఐపీఎస్ అధికారులే ఉండాలని, నాన్ కేడర్ వారిని ఎలా నియమించారని ప్రశ్నించారు. దీన్ని ప్రశ్నించాల్సిన ఐపీఎస్ అధికారుల సంఘం మౌనం దాల్చడం మంచిది కాదన్నారు. 121 కీలక (ఫోకల్) పోస్టులుంటే నలుగురు కాపులు, ఐదుగురు ఎస్సీలు తప్ప మిగతావి ఎవరి చేతుల్లో ఉన్నాయో చెప్పాలన్నారు. డీఎస్పీ పోస్టులలో కీలకమైనవాటిలో ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి చెందిన వారినే నియమించారన్నారు. దీన్ని కాదన్నవారు తమతో చర్చకు సిద్ధం కావాలని సవాల్ చేశారు. 38 డీఎస్పీ పోస్టులలో కేవలం నాలుగు మినహా మిగతా 34 పోస్టులకు చంద్రబాబు తన సామాజిక వర్గానికి చెందిన వారినే ఎంపిక చేశారనే దానికి తమ వద్ద ఆధారాలున్నాయన్నారు. సూపర్ న్యూమరరీ పోస్టుల్లో కొనసాగుతున్న ముగ్గురు సీఎం సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో శాంతిభద్రతల విభాగంలో వారికి పోస్టులిచ్చారన్నారు. ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారిగా ఏబీ వెంకటేశ్వరరావు, ఓఎస్డీలుగా మాధవరావు, యోగానంద్ నియమితులయ్యారని, ఆర్ఐవోగా గీతాదేవి ఉన్నారని, వీరంతా చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారు కాదా అని ప్రశ్నించారు. వ్యవస్థలను చంద్రబాబు భ్రష్టు పట్టించారని విమర్శించారు. మంత్రి అచ్చెన్నాయుడి తమ్ముడు ప్రభాకర్ షాడో సీపీగా వ్యవహరిస్తూ 25 ఏళ్లుగా విశాఖ ప్రాంతంలోనే ఉండిపోయారని, ఆయన సీబీఎన్ (చంద్రబాబు నాయుడు) ఆర్మీ మీట్ అని రాసి ఉన్న ప్లకార్డును పట్టుకుని ప్రదర్శించడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని చంద్రబాబు నడిపిస్తున్న తీరు ప్రజలు గమనించాలని కోరారు. ఆయనకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో రాహుకేతు పూజలు

నూతన ఆర్జిత సేవగా ప్రారంభం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి రాహుకేతు పూజలను ప్రారంభించారు. వీటిని దేవస్థానం ఆర్జిత సేవగా ప్రవేశపెటింది. రూ.1,116 టికెట్‌పై ఉభయదాతలు ఈ పూజలో పాల్గొనవచ్చు. బుధవారం పూజలను ప్రారంభించినప్పటికీ 9వ తేదీ నుంచి భక్తులు పాల్గొనవచ్చు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజస్వామి వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై జంట సర్పాల శిలా విగ్రహాలు, రాహుకేతు విగ్రహాలను ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ స్థానాచార్య, వైదిక కమిటీ, ఆలయ అర్చకులు రాహుకేతు పూజలను జరిపించారు. ఆలయ ఈవో వీ కోటేశ్వరమ్మ, పాలక మండలి చైర్మన్ గౌరంగబాబు, జిల్లా కలెక్టర్ బీ లక్ష్మీకాంతం దంపతులు, నగర పోలీస్ కమిషనర్ ద్వారకా తిరుమలరావు, పాలక మండలి సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆప్కో చైర్మన్‌ను తొలగించాలి: రామకృష్ణ

సాక్షి, అమరావతి: కోట్లాది రూపాయిల అవినీతికి పాల్పడ్డ ఆప్కో చైర్మన్ గుజ్జల శ్రీనును ఆ పదవి నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన సీఎంకు లేఖ రాశారు. గుజ్జల శ్రీను రాజీనామా చేయాలంలూ ఈ నెల 8న మంగళగిరిలోని ఆప్కో కార్యాలయ ముట్టడికి చేనేత కార్మిక సంఘం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆప్కో చైర్మన్‌ను విధుల నుంచి తొలగించి విచారణ చేపట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. శ్రీనుకు బినామీ సొసైటీలు ఉన్నాయని, ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీని రకరకాల పేర్లతో కాజేస్తున్నారని ఆరోపించారు.

26 కాలేజీల్లో వ్యవస్థాపకత అభివృద్ధి కార్యక్రమం

ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ డాక్టర్ కృతిక శుక్లా

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 26 కాలేజీల్లో ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు ఆ సంస్థ ఎండీ–సీఈవో డాక్టర్ కృతిక శుక్లా తెలిపారు. వెంచర్ ఇంక్యుబేషన్ హబ్ (వీఐహెచ్)లు ఏర్పాటు చేయబోయే కాలేజీల ప్రతినిధులతో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13 ఇంజనీరింగ్ కాలేజీల్లో వెంచర్ ఇంక్యుబేషన్ హబ్‌లు (వీఐహెచ్), మరో 13 ఇంజనీరింగ్ కాలేజీల్లో వెంచర్ ఇన్సియేషన్ సెంటర్లు (వీఐసీ) అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఐడియా ల్యాబ్స్, వాద్వానీ ఫౌండేషన్, టాటా ట్రస్ట్, టీఐఈ ప్రతినిధులతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన 26 కాలేజీల్లో 500 మందితో మెంటార్స్, ఇన్వెస్టర్ నెట్‌వర్క్స్ ఏర్పాటు చేస్తామన్నారు.

అప్పల బాధతో అన్నదాత బలవన్మరణం

అనంతపురం జిల్లాలో ఘటన


రాము (ఫైల్)

ఉరవకొండ రూరల్: వర్షాభావంతో వ్యవసాయంలో తీవ్ర నష్టం రావడం, అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు పెరగడంతో ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ జనార్దననాయుడు తెలిపిన వివరాలు.. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం పెద్దముష్టూరుకు చెందిన బోయ రాము (26) మూడెకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ, ఆముదం పంటలు సాగు చేస్తున్నాడు. పెట్టుబడుల కోసం రూ.3 లక్షల దాకా అప్పులు చేశాడు. వర్షాభావంతో పంటలు దెబ్బతిని పెట్టుబడులు కూడా రాలేదు. అప్పులిచ్చిన వాళ్ల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో మద్యానికి బానిసయ్యాడు. రోజూ తాగొచ్చి భార్య భాగ్యలక్ష్మితో గొడవపడేవాడు. ఈ క్రమంలో భార్య.. తమ నాలుగేళ్ల కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో అప్పులోళ్ల ఒత్తిళ్లు మరింత పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం తెల్లవారుజామున ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించిన పోలీసులు.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ రెండు సీట్లూ మాకివ్వాల్సిందే

డోన్, పత్తికొండపై చంద్రబాబుకు స్పష్టం చేసిన కేఈ కుటుంబం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యేందుకు ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, ఆయన కుటుంబసభ్యుల రెండు రోజుల ఎదురుచూపులు ఎట్టకేలకు ఫలించాయి. బుధవారం రాత్రి ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాలులో కేఈ తన సోదరుడు ప్రతాప్, కుమారుడు శ్యాంబాబుతో కలిసి చంద్రబాబుతో సమావేశమయ్యారు. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఆయన కుటుంబీకులతో ఇటీవల చంద్రబాబు సమావేశం కావడంపై కేఈ అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కర్నూలు జిల్లాలో తమకు ప్రత్యర్థులుగా ఉన్న వారిని పార్టీలో చేర్చుకునేందుకు సిద్ధపడడం, తన సోదరుడు కేఈ ప్రతాప్ గత ఎన్నికల్లో పోటీ చేసిన డోన్ స్థానాన్ని కోట్ల సూర్యప్రకాష్‌కు ఇవ్వాలని అడగడంపై కేఈ అసహనం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో కేఈ కృష్ణమూర్తి ఇదే విషయాన్ని చంద్రబాబుకు చెప్పినట్లు తెలిసింది. తన స్థానంలో తన కుమారుడు శ్యాంబాబుకు పత్తికొండ, గత ఎన్నికల్లో ఇచ్చినట్టే తన సోదరుడు ప్రతాప్‌కు డోన్ టిక్కెట్ ఇవ్వాలని స్పష్టం చేసినట్లు సమాచారం. కోట్ల కుటుంబానికి కర్నూలు ఎంపీ స్థానం కేటాయిస్తే తమకు అభ్యంతరం లేదని, డోన్ ఎమ్మెల్యే స్థానాన్ని మాత్రం తమకే ఇవ్వాలని కోరగా చంద్రబాబు స్పష్టత ఇవ్వలేదని సమాచారం.

ఎన్నికల కోసమే బాబు తాయిలాలు

వైఎస్సార్ సీపీ విప్ ఎమ్మెల్యే పీఆర్కే



మాచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను అప్పులపాలు చేస్తూ, మోసగిస్తూ బడ్జెట్‌లో ఎన్నికల ముందు ప్రజలను ఆకర్షించేందుకు నామమాత్రంగా తాయిలాలు ప్రకటించిందని వైఎస్సార్ సీపీ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. అన్ని వర్గాలను మోసగించడంలో రాష్ట్ర ప్రభుత్వం మొదటి స్థానంలో ఉందని ఎద్దేవా చేశారు. చీటింగ్ నాయకుడిగా సీఎం చంద్రబాబు వ్యవహరించగా ఆయన తొత్తుగా ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్ ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. ఆయన బుధవారంహైదరాబాద్ బయలుదేరి వెళ్తూ మాచర్లలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలను అప్పుల పాలు చేసేలా రూ.2లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. డ్వాక్రా మహిళలకు ఎటువంటి నిధులు చెల్లించే పరిస్థితి లేదన్నారు. సీఎం చంద్రబాబుకు నాలుగున్నరేళ్ల ఆయా వర్గాలు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ప్రజలను ఎల్లకాలం మోసం చేయగలననే ఆలోచనతో సీఎం చంద్రబాబు అన్ని రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రజలను దారుణంగా మోసగించే పనిలో ఉన్నారని విమర్శించారు. నాలుగున్నర సంవత్సరాల పాటు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా నెల కిందట రూ.1000 ప్రకటించి, ఈ సారి రూ.2వేలు అంటున్నారని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు మోసాలను గమనించిన ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధం కావాలని కోరారు.

తిత్లీ బాధితులకు ఇళ్లు మంజూరు

సాక్షి, అమరావతి: తిత్లీ తుపాను వల్ల ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. శ్రీకాకుళం జిల్లాలో 18 వేలు, విజయనగరం జిల్లాలో 152 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో యూనిట్ ధర రూ.2.50 లక్షలుగా నిర్ణయిస్తూ గృహ నిర్మాణ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను కలెక్టర్లు తయారు చేస్తారని పేర్కొన్నారు. అర్హుల జాబితాను పంచాయతీ కార్యాలయంలో పబ్లిష్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

9 నుంచి తేలికపాటి వర్షాలు

తగ్గుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఈనెల 9వ తేదీ నుంచి తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంపై పశ్చిమ ఆటంకాల ప్రభావం కొనసాగుతోంది. తొమ్మిదో తేదీ నుంచి మరొక రాష్ట్రం మీదుగా ప్రయాణించనుంది. అదే సమయంలో ఆగ్నేయ, తూర్పు గాలులు దీనికి తోడు కానున్నాయి. వీటి ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి వానలకు ఆస్కారం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం రాత్రి నివేదికలో తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రం మీదుగా ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయి. ఫలితంగా పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతుండగా, కోస్తాంధ్రలో రాత్రి ఉష్ణోగ్రతలు 2–4 డిగ్రీల వరకు తగ్గుతున్నాయి. దీంతో రాత్రి వేళ చలి ప్రభావం కొనసాగుతోంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు రాష్ట్రంలో అత్యల్పంగా కళింగపట్నంలో 15 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

రాష్ట్రంలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రత
కళింగపట్నం	15
విశాఖపట్నం	16
ఆరోగ్యవరం	17
తిరుపతి	18
జంగమహేశ్వరపురం	18
బాపట్ల	19
తుని	19
అనంతపురం	19
నంద్యాల	19

రాజధానిలో నక్సల్స్ కదలికలు!

మదనపల్లె అరెస్టులతో బయటపడ్డ లింకులు

తాడేపల్లిరూరల్: రాజధాని ప్రాంతంలో నక్సలైట్ల కదలికలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. ఈ మధ్య కాలంలో గుంటూరు జిల్లా, అమరావతి రాజధాని పరిధిలోని తుళ్లూరులో మహిళా నక్సలైట్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు రాజధాని ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిని చిత్తూరు జిల్లా మదనపల్లెలో నక్సల్స్‌కు సహకరిస్తున్నాడని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తాడేపల్లి పరిధిలోని నులకపేటలో నివాసం ఉండే మాజీ నక్సలైట్ బూసిరెడ్డి కొండారెడ్డిని చిత్తూరు నుంచి అనంతపురం వెళ్తుండగా, మార్గమధ్యలో మదనపల్లె వద్ద స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎస్ఐబీ) అధికారులు అరెస్టు చేసి, మదనపల్లె సబ్‌జైలుకు పంపినట్లు సమాచారం. కొండారెడ్డి గతంలో నక్సల్స్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిసింది. ఈ మధ్యకాలంలో కార్యకలాపాలు ఏమీ లేకపోవడంతో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు. 2009లో నులకపేటలో భారీగా జిలెటిన్‌స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు కొండారెడ్డితో పాటు మరికొంత మందిపై కేసులు నమోదు చేశారు. కాలక్రమేణా కొండారెడ్డి ఉద్యమానికి దూరంగా ఉంటున్నట్లు అందరి దృష్టి మరలించారు. కానీ వివిధ ప్రాంతాల్లో నక్సలైట్లకు సమాచారాన్ని చేరవేస్తున్నాడని ఎస్ఐబీ గుర్తించినట్లు సమాచారం. కొండారెడ్డి నివసించే నులకపేట రాజధాని పరిధిలోకి రావడంతో నిఘా వర్గాలు ఆయన కదలికలపై నిఘా ఉంచి మదనపల్లె వద్ద పట్టుకున్నట్లు తెలుస్తోంది.



సాక్షి స్పోర్ట్స్
గురువారం
7-2-2019



8 మంది బ్యాట్స్‌మెన్‌తో... ఛేదించాల్సిన లక్ష్యమే ఇది

ఇదొక కఠినమైన మ్యాచ్. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో మేం రాణించలేదు. ఓపెనింగ్‌లో శుభారంభం దక్కలేదు. 200 పైగా పరుగుల లక్ష్యాన్ని అందుకోవడం కష్టమని తెలుసు. కానీ, గతంలో పలుసార్లు ఛేదించాం. ఇందుకోసమే 8 మంది బ్యాట్స్‌మెన్‌తో బరిలో దిగాం. కానీ, ఈసారి చిన్న చిన్న భాగస్వామ్యాలు కూడా నెలకొల్పలేకపోయాం. ఇదే పనిని న్యూజిలాండ్ చేసింది. ఆ జట్టు బాగా ఆడింది. మేమిక ఆక్లాండ్ వెళ్లి అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకోవాల్సి ఉంది.

–రోహిత్ శర్మ, భారత కెప్టెన్



అన్నదమ్ములు బరిలోకి...

అన్నదమ్ములు కృనాల్, హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌లో టీమిండియా తరఫున తొలిసారి బరిలో దిగారు. మొహిందర్ అమర్‌నాథ్, సురీందర్ అమర్‌నాథ్... యూసుఫ్ పఠాన్, ఇర్ఫాన్ పఠాన్ తర్వాత దేశానికి ఒకే మ్యాచ్‌లో ప్రాతినిధ్యం వహించిన సోదరులు వీరే కావడం గమనార్హం. మరోవైపు యువ శుబ్‌మన్ గిల్‌ను పక్కనపెట్టిన భారత్... ఆల్ రౌండర్ విజయ్ శంకర్‌ను ఆడించింది. అతడిని అనూహ్యంగా వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు పంపింది.

ఒకటి పట్టాడు... రెండు వదిలాడు



మ్యాచ్‌లో లాంగాన్ బౌండరీ లైన్ వద్ద మిచెల్ క్యాచ్‌ను దినేశ్ కార్తీక్ అద్భుతంగా అందుకున్నాడు. సరిగ్గా రోప్ ముందర బంతిని పట్టుకున్న అతడు... లోపలకు నెట్టి బౌండరీని దాటాడు. తిరిగివచ్చి గాల్లో ఉన్న బంతిని ఒడిసిపట్టాడు. అయితే, తొలుత కృనాల్ బౌలింగ్‌లో సీఫెర్ట్ క్యాచ్, తర్వాత హార్దిక్ ఓవర్లో రాస్ టేలర్ క్యాచ్‌లను అతడు జారవిడిచాడు. మరోవైపు సీఫెర్ట్ 17 పరుగుల వద్ద ఉన్నప్పుడు కృనాల్ బౌలింగ్‌లో ధోని కొంత క్లిష్టమైన క్యాచ్‌ను వదిలేశాడు. భారత ఇన్నింగ్స్‌లో రోహిత్, దినేశ్ కార్తీక్, హార్దిక్ ఇచ్చిన క్యాచ్‌లను కివీస్ ఆటగాళ్లు చక్కగా పట్టారు.



ఫెర్గూసన్ బౌలింగ్‌లో శిఖర్ ధావన్ క్లీన్ బౌల్డ్

తేలిపోయారు

- బౌలింగ్, బ్యాటింగ్‌లో టీమిండియా విఫలం
- తొలి టి20లో 80 పరుగులతో భారత్ పరాజయం
- అదరగొట్టిన న్యూజిలాండ్
- రేపు ఆక్లాండ్‌లో రెండో టి20 మ్యాచ్

వాళ్ల ఓపెనర్లు విధ్వంసక ఆరంభాన్నిచ్చారు... మనవారు పవర్ ప్లే ముగిసేలోపే ఔటయ్యారు... వాళ్ల మిడిలార్డర్ సాధ్యమైనన్ని పరుగులు చేసింది...మనవారు నిలదొక్కుకోకుండానే వెనుదిరిగారు...వాళ్ల పేస్, స్పిన్ ప్రభావవంతంగా కనిపించాయి... మనవారు పూర్తిగా తేలిపోయారు...! వాళ్ల ఫీల్డర్లు మైదానంలో పాదరసంలా కదిలారు...మనవారు చేతుల్లోకి వచ్చిన క్యాచ్‌లను వదిలేశారు...!

ఫలితం... తొలి టి20లో న్యూజిలాండ్ చేతిలో టీమిండియా భారీ పరాజయం. అన్ని రంగాల్లో సమష్టిగా రాణించిన ఆతిథ్య జట్టు అద్వితీయమైన విజయంతో శుభారంభం చేసింది. కివీస్ గడ్డపై టి20 గెలుపు రుచి చూడాలంటే భారత్ మరో మ్యాచ్ వరకు ఆగాల్సి వచ్చింది.

వెల్లింగ్టన్: వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్, ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ (43 బంతుల్లో 84; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా విజృంభించిన వేళ... భారత్‌తో బుధవారం ఇక్కడ జరిగిన తొలి టి20లో న్యూజిలాండ్ 80 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అతడికి తోడుగా ఓపెనర్ కొలిన్ మున్రో (20 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు); కెప్టెన్ కేన్ విలియమ్సన్ (22 బంతుల్లో 34; 3 సిక్స్‌లు) రాణించడంతో కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరు చేసింది. టీమిండియా బౌలర్లలో యజువేంద్ర చహల్ (1/35) మాత్రమే కాస్తంత మెరుగ్గా బౌలింగ్ చేశాడు. అనంతరం బ్యాట్స్‌మెన్ వైఫల్యంతో లక్ష్య ఛేదనలో భారత్ 19.2 ఓవర్లలో 139 పరుగులకే ఆలౌటైంది. వెటరన్ మహేంద్ర సింగ్ ధోని (31 బంతుల్లో 39; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. ఓపెనర్ శిఖర్ ధావన్ (18 బంతుల్లో 29; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), విజయ్ శంకర్ (18 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మోస్తరుగా ఆడారు. ఆతిథ్య జట్టు పేసర్లు టిమ్ సౌతీ (3/17), ఫెర్గూసన్ (2/22); స్పిన్నర్లు సాన్‌ట్నర్ (2/24), ఇష్ సోధి (2/26) ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా బంతులేయడంతో పాటు వికెట్లు పడగొట్టారు. సీఫెర్ట్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. రెండో టి20 శుక్రవారం ఆక్లాండ్‌లో జరుగుతుంది.

ఆది నుంచే తడాఖా...

మంచు కారణంగా ప్రత్యర్థి బౌలర్లకు బంతిపై పట్టు చిక్కదని, ఛేదన సులువవుతుందని భావించాడో ఏమో... టాస్ గెలిచిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ నిర్ణయం తప్పని కాసేపటికే తేలింది. కివీస్ ఓపెనర్లు మున్రో, సీఫెర్ట్... ఖలీల్ వేసిన రెండో ఓవర్ నుంచి జోరందుకున్నారు. ఈ ఓవర్లో మున్రో రెండు ఫోర్లు కొట్టాడు. తర్వాత భువీ బౌలింగ్‌లో సీఫెర్ట్ సిక్స్, ఫోర్, ఖలీల్ ఓవర్లో మున్రో రెండు వరుస సిక్స్‌లతో చెలరేగారు. వీరిద్దరినీ తప్పించి పాండ్యా సోదరులను దింపినా మార్పు లేకపోయింది. ఈ ద్వయం 4.1 ఓవర్లలోనే 42 పరుగులిచ్చింది. కివీస్ ఓపెనింగ్ భాగస్వామ్యం 5వ ఓవర్లోనే 50 దాటింది. సీఫెర్ట్ 30 బంతుల్లోనే టి20ల్లో తన తొలి అర్ధ శతకాన్ని అందుకున్నాడు. అయితే, కృనాల్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన మున్రో లాంగాన్‌లో విజయ్ శంకర్‌కు క్యాచ్ ఇచ్చాడు. సీఫెర్ట్... కృనాల్, చహల్‌లను లక్ష్యంగా చేసుకుని సిక్స్‌లు కొడుతూ చకచకా 80ల్లోకి వెళ్లిపోయాడు. అతడిని ఖలీల్ యార్కర్ లెంగ్త్ బంతితో పెవిలియన్ చేర్చాడు. విలియమ్సన్ ధాటిగా ఆడేందుకు ప్రయత్నించాడు. వరుస బంతుల్లో మిచెల్ (8), విలియమ్సన్ ఔటవ్వగా... గ్రాండ్‌హోమ్ (3) నిలవలేకపోయాడు. రాస్ టేలర్ (14 బంతుల్లో 23; 2 సిక్స్‌లు), స్కాట్ కుగ్లీన్ (7 బంతుల్లో 20 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) జట్టు భారీ స్కోరుకు తోడ్పడ్డారు.

ఛేదనలో చతికిల...

ప్రత్యర్థి స్కోరుకు తోడు సౌతీ తొలి ఓవర్‌తోనే ఛేదన సులువేం కాదని భారత్‌కు తెలిసిపోయింది. అయితే, కుగ్లీన్ వేసిన రెండో ఓవర్లో ధావన్ రెండు వరుస సిక్స్‌లు, ఫోర్‌తో ఆశలు రేపాడు. కానీ, రోహిత్ (1)ను షార్ట్ బంతితో సౌతీ బోల్తా కొట్టించాడు. అతడు భారీ షాట్ ఆడబోగా డీప్ స్క్వేర్ లెగ్‌లో ఫెర్గూసన్ పరుగెడుతూ క్యాచ్ పట్టాడు. శంకర్ సైతం కుగ్లీన్ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్ బాదడం, ధావన్ టచ్‌లో ఉండటంతో జట్టు పరిస్థితి ఆశావహంగా కనిపించింది. కానీ, ఫెర్గూసన్ 151 కి.మీ. వేగంతో సంధించిన యార్కర్ ధావన్ వికెట్లను గిరాటేసింది. పదేపదే షాట్లకు యత్నిస్తున్న రిషభ్ పంత్ (4) తక్కువ ఎత్తులో వచ్చిన సాన్‌ట్నర్ ఫుల్ టాస్‌కు బౌల్డయ్యాడు. రెండు బంతుల వ్యవధిలో శంకర్ కూడా ఔటయ్యాడు. పూర్తిగా ఆఫ్ సైడ్ పడిన సోధి బంతులను షాట్లకు యత్నించి దినేశ్ కార్తీక్ (5), హార్దిక్ పాండ్యా (4) వికెట్లు ఇచ్చుకున్నారు. అప్పటికి జట్టు స్కోరు 77/6. 54 బంతుల్లో 143 పరుగులు చేయాల్సిన దశలో ధోని, కృనాల్ (18 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్) పోరాటం సరిపోలేదు. బంతులు, పరుగుల మధ్య అంతరం పెరుగుతూ పోయింది. 17 నుంచి 20వ ఓవర్ మధ్య వీరిద్దరితో పాటు భువీ (1), చహల్ (1) ఔటవడంతో మరో నాలుగు బంతులు ఉండగానే భారత ఇన్నింగ్స్ ముగిసింది.

మనకిదే భారీ ఓటమి...

పరుగుల (80) పరంగా టి20ల్లో భారత్‌కిదే అతి పెద్ద ఓటమి. గతంలో ఎప్పుడూ 50 పరుగుల కంటే ఎక్కువ వ్యత్యాసంతో ఓడలేదు. 2010లో ఆస్ట్రేలియాపై 49 పరుగులతో పరాజయం పాలైంది.

తేడా అతడే...

క్రీజులో కదిలే విధానంతో పాటు బంతిని కసిదీరా బాదడం, ప్రారంభం నుంచే విరుచుకుపడే తీరుతో మ్యాచ్‌లో సీఫెర్ట్ ఇన్నింగ్స్ కివీస్ దిగ్గజం మెకల్లమ్ ఆటను తలపించింది. అతడు కొట్టిన షాట్లన్నీ బుల్లెట్‌లా దిగాయి. సిక్స్‌లు సైతం అలవోకగా కొట్టాడు. అతడి ధాటికి జట్టు స్కోరు 11వ ఓవర్లలోనే 100 పరుగులు దాటింది. 13వ ఓవర్లోనే 80ల్లోకి చేరిన సీఫెర్ట్ సెంచరీ ఖాయం అనుకుంటుండగా వెనుదిరిగాడు. లేకుంటే కివీస్ స్కోరు ఎక్కడికో వెళ్లేదే.



టిమ్ సీఫెర్ట్

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫెర్ట్ (బి) ఖలీల్ 84; మున్రో (సి) శంకర్ (బి) కృనాల్ 34; విలియమ్సన్ (సి) హార్దిక్ (బి) చహల్ 34; మిచెల్ (సి) దినేశ్ కార్తీక్ (బి) హార్దిక్ 8; రాస్ టేలర్ (సి) ఖలీల్ (బి) భువనేశ్వర్ 23; గ్రాండ్‌హోమ్ (సి) సిరాజ్ (సబ్‌స్టిట్యూట్) (బి) హార్దిక్ 3; సాన్‌ట్నర్ (నాటౌట్) 7; కుగ్లీన్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 6;
మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 219.
వికెట్ల పతనం: 1–86, 2–134, 3–164, 4–164, 5–189, 6–191.
బౌలింగ్: భువనేశ్వర్ 4–0–47–1; ఖలీల్ 4–0–48–1; కృనాల్ 4–0–37–1; హార్దిక్ 4–0–51–2; చహల్ 4–0–35–1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) ఫెర్గూసన్ (బి) సౌతీ 1; ధావన్ (బి) ఫెర్గూసన్ 29; శంకర్ (సి) గ్రాండ్‌హోమ్ (బి) సాన్‌ట్నర్ 27; రిషభ్ పంత్ (బి) సాన్‌ట్నర్ 4; ధోని (సి) ఫెర్గూసన్ (బి) సౌతీ 39; దినేశ్ కార్తీక్ (సి) సౌతీ (బి) సోధి 5; హార్దిక్ పాండ్యా (సి) మిచెల్ (బి) సోధి 4; కృనాల్ పాండ్యా (సి) సీఫెర్ట్ (బి) సౌతీ 20; భువనేశ్వర్ (సి) సీఫెర్ట్ (బి) ఫెర్గూసన్ 1; చహల్ (బి) మిచెల్ 1; ఖలీల్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.2 ఓవర్లలో ఆలౌట్) 139.**
వికెట్ల పతనం: 1–18, 2–51, 3–64, 4–65, 5–72, 6–77, 7–129, 8–132, 9–136, 10–139.
బౌలింగ్: సౌతీ 4–0–17–3; కుగ్లీన్ 2–0–34–0; ఫెర్గూసన్ 4–0–22–2; సాన్‌ట్నర్ 4–0–24–2; మిచెల్ 2.2–0–13–1; సోధి 3–0–26–2.



సౌతీ

“నాతో పాటు జెమీమా కూడా వెంట వెంటనే ఔట్ కావడం ఫలితాన్ని మార్చింది. ఇలా జరిగినప్పుడు కోలుకోవడం చాలా కష్టం. ఈ రోజు మా ప్రణాళిక ఫలించలేదు. వచ్చే సారి మరింత మెరుగ్గా ఆడాల్సి ఉంటుంది. మేం మ్యాచ్ గెలవాలంటే నేను 20వ ఓవర్ వరకు కూడా బ్యాటింగ్ చేయాలి. మిడిలార్డర్ కుప్పకూలిపోకుండా ఉండాలంటే అదొక్కటే సరైన మార్గం. కనీసం 18వ ఓవర్ వరకైనా క్రీజ్‌లో ఉంటే మిగతా వారికి సమస్య ఉండదు. తర్వాతి మ్యాచ్‌లో అలా చేసేందుకు ప్రయత్నిస్తాను. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. నిజానికి మేం లక్ష్యాన్ని ఛేదించాల్సింది.”

–స్మృతి మంధాన, భారత వైస్ కెప్టెన్

మహిళలు చేజేతులా...

భారత మహిళల విజయలక్ష్యం 160 పరుగులు... స్మృతి మంధాన జోరు మీదుండగా ఒక దశలో స్కోరు 102/1... మరో 52 బంతుల్లో 58 పరుగులు చేయాల్సి ఉంది. ఇలాంటి పటిష్ట స్థితిలో ఉండి కూడా మన జట్టు కుప్పకూలింది. 34 పరుగులకే చివరి 9 వికెట్లు కోల్పోయి న్యూజిలాండ్ ముందు తలవంచింది. ఈ పోరుకు ముందు భారత్ తమ చివరి టి20 మ్యాచ్‌ను దాదాపు రెండున్నర నెలల క్రితం ప్రపంచ కప్ సెమీస్‌లో ఆడింది. నాడు 23 పరుగులకే చివరి 8 వికెట్లు కోల్పోయిన తీరును తాజా ఫలితం మళ్లీ గుర్తు చేసింది. సరిగ్గా అప్పటిలాగే స్మృతి, జెమీమా మినహా అంతా విఫలం కావడంతో హర్మన్ బృందం కుదేలైంది.

తొలి టి20లో భారత్ ఓటమి
- 23 పరుగులతో కివీస్ విజయం
- స్మృతి రికార్డు అర్ధ సెంచరీ వృథా



స్మృతి మంధాన

వెల్లింగ్టన్: స్మృతి మంధాన సూపర్ హిట్... భారత్ అట్టర్ ఫ్లాప్... న్యూజిలాండ్ మహిళల జట్టుతో జరిగిన తొలి టి20 మ్యాచ్ ఫలితంపై సంక్షిప్త వ్యాఖ్య ఇది! అద్భుతమైన ఆరంభం లభించినా దానిని కొనసాగించలేక మన అమ్మాయిలు చతికిల పడ్డారు. చివరకు 23 పరుగుల తేడాతో న్యూజిలాండ్ విజయం సాధించింది. స్మృతి భారత తరఫున టి20ల్లో వేగవంతమైన అర్ధ సెంచరీ (24 బంతుల్లో) నమోదు చేసినా జట్టును మాత్రం గెలిపించలేక పోయింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. సోఫీ డెవిన్ (62; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ సెంచరీ సాధించగా, కెప్టెన్ సాటర్‌వైట్ (33; 4 ఫోర్లు) అండగా నిలిచింది. అనంతరం భారత్ 19.1 ఓవర్లలో 136 పరుగులకే ఆలౌటైంది. స్మృతి మంధాన (34 బంతుల్లో 58; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో పాటు జెమీమా రోడ్రిగ్స్ (33 బంతుల్లో 39; 6 ఫోర్లు) కూడా రాణించింది. వీరిద్దరు రెండో వికెట్‌కు 98 పరుగులు జత చేశారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్ (17) విఫలం కాగా... మిగతా ఎనిమిది మంది ఒక్కో అంకె స్కోరుకే పరిమితయ్యారు. లీ మేరీ తహుహు (3/30) భారత్‌ను దెబ్బ తీసింది. రెండో టి20 మ్యాచ్ రేపు ఆక్లాండ్‌లో జరుగుతుంది.

కీలక భాగస్వామ్యం...

ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే సుజీ బేట్స్ (7)ను ఔట్ చేసి పూనమ్ యాదవ్ భారత్‌కు శుభారంభం అందించింది. ఆ తర్వాత కొద్ది సేపటికే గ్రీ (15)ని కూడా పూనమ్ బౌల్డ్ చేసింది. ఈ దశలో డెవిన్, సాటర్‌వైట్ కలిసి జట్టును ఆదుకున్నారు. 69 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యాన్ని హైదరాబాద్ బౌలర్ అరుంధతి రెడ్డి విడగొట్టింది. అరుంధతి ఓవర్లో తొలి రెండు బంతులను బౌండరీ దాటించిన డెవిన్ తర్వాతి బంతికి వెనుదిరిగింది. తర్వాతి ఓవర్లోనే సాటర్‌వైట్‌ను దీప్తి ఔట్ చేసింది. పూనమ్ వేసిన ఆఖరి ఓవర్లో మార్టిన్ రెండు సిక్సర్లు బాదడంతో కివీస్ చెప్పుకోదగ్గ స్కోరు సాధించింది.


టపటపా...

వన్డేల్లో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన స్మృతి అదే ఫామ్‌ను టి20ల్లోనూ కొనసాగించింది. అయితే కెరీర్‌లో తొలి మ్యాచ్ ఆడిన మరో ఓపెనర్ ప్రియా పూనియా (4) మొదటి ఓవర్లోనే వెనుదిరిగింది. ఆ తర్వాత స్మృతి, జెమీమా కలిసి అలవోకగా పరుగులు సాధించారు. రోజ్‌మేరీ వేసిన ఆరో ఓవర్లో స్మృతి 2 సిక్సర్లు, ఫోర్ బాదడంతో 18 పరుగులు వచ్చాయి. కాస్పరెక్ వేసిన తర్వాతి ఓవర్లో జెమీమా వరుసగా 3 ఫోర్లు కొట్టింది. డెవిన్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో స్మృతి రికార్డు అర్ధసెంచరీ నమోదైంది. వీరిద్దరు జట్టును గెలుపు దిశగా నడిపిస్తున్న తరుణంలో ఒక్కసారిగా మ్యాచ్ మలుపు తిరిగింది. కెర్ బౌలింగ్‌లో డీప్ ఎక్స్‌ట్రా కవర్‌లో రోవ్ అద్భుత క్యాచ్ పట్టడంతో స్మృతి ఇన్నింగ్స్ ముగిసింది. మరో నాలుగు బంతులకే జెమీమాను తహుహు ఔట్ చేసింది. ఆమె తర్వాతి ఓవర్లో భారత్ 2 వికెట్లు కోల్పోయింది. గెలుపు కోసం 17 బంతుల్లో 37 పరుగులు చేయాల్సిన స్థితిలో భారీ సిక్సర్ కొట్టిన హర్మన్...తర్వాతి బంతికే ఔటవ్వడంతో భారత్ ఆశలు కోల్పోయింది.

మిథాలీకి చోటు లేదు...

ఊహించినట్లుగానే తుది జట్టులో వన్డే కెప్టెన్ మిథాలీ రాజ్‌కు అవకాశం దక్కలేదు. వరల్డ్ కప్ సెమీస్ వివాదం తర్వాత ఆమె టి20 టీమ్‌లో కొనసాగినా... పొట్టి ఫార్మాట్ నుంచి మిథాలీ రిటైర్మెంట్‌పై వార్తలు వస్తున్న నేపథ్యంలో మ్యాచ్‌లో ఆడించడం సందేహంగానే కనిపించింది. చివరకు అదే జరిగింది. కొత్త అమ్మాయిలకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలనే ఉద్దేశంతోనే మిథాలీని ఆడించలేదని ఈసారి కెప్టెన్ హర్మన్ ముక్తసరి సమాధానంతో ముగించింది.

10 మంది సున్నా... 10 ఆలౌట్!



రాక్సెన్

సిడ్నీ: ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్ (మహిళల డివిజన్) మ్యాచ్‌లో అనూహ్య రికార్డు నమోదైంది. న్యూసౌత్‌వేల్స్‌తో జరిగిన 'నేషనల్ ఇండిజినస్ క్రికెట్ చాంపియన్‌షిప్' పోరులో సౌత్ ఆస్ట్రేలియా జట్టు 10 పరుగులకే కుప్పకూలింది! ఇందులో ఓపెనర్ మాన్సెల్ (33 బంతుల్లో 4) మాత్రమే పరుగులు చేయగలిగింది. మిగతా పది మంది 'సున్నా'కే పరిమితమయ్యారు. ఎక్స్‌ట్రాలుగా వచ్చిన 6 పరుగులే జట్టు ఇన్నింగ్స్‌లో టాప్ స్కోర్ కావడం విశేషం. ప్రత్యర్థి బౌలర్లు 'వైడ్'ల ద్వారా ఈ అదనపు పరుగులు ఇచ్చారు. టీమ్ ఇన్నింగ్స్ 10.2 ఓవర్ల వరకు సాగగలిగింది. న్యూ సౌత్‌వేల్స్ బౌలర్ రాక్సెన్ వాన్ వీన్ 2 ఓవర్లలో 1 పరుగిచ్చి 5 వికెట్లు పడగొట్టింది. అనంతరం న్యూసౌత్‌వేల్స్ 2.5 ఓవర్లలో 2 వికెట్లకు 11 పరుగులు చేసి విజయాన్నందుకుంది.

పాక్‌తో భారత్ డేవిస్‌కప్ పోరు

తటస్థ వేదికపై నిర్వహణ?

నాగ్‌పూర్: చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు డేవిస్ కప్‌లో తలపడనున్నాయి. విదేశీ గడ్డపై ఆడాల్సిన ఈ టెన్నిస్ పోరులో భారత్... పాక్‌తో పోటీపడుతుంది. అయితే పాక్‌లో భారత్ ఆడే పరిస్థితి లేకపోవడంతో తటస్థ వేదికపై ఈ పోరు జరిగే అవకాశముంది. చివరి సారిగా భారత్ 1964లో పాకిస్తాన్‌లో డేవిస్ కప్ మ్యాచ్‌లు ఆడింది. తాజా 'డ్రా'లో భాగంగా భారత్, పాక్‌లు ఈ సెప్టెంబర్‌లో తలపడతాయి. ఇందులో గెలిచిన జట్టు వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తుంది. గతంలో మలేసియా (1973) తటస్థ వేదికపై చిరకాల ప్రత్యర్థులు తలపడ్డాయి.

విదర్భ... విజయం ముంగిట

సౌరాష్ట్రకు రంజీ ఫైనల్ మరో'సారీ' చెప్పేసింది. పరాజయానికి బాట వేసింది. విదర్భ వరుసగా విజయగర్వానికి సిద్ధమైంది. కీలకమైన పుజారాను డకౌట్ చేయడంతోనే మ్యాచ్‌ను చేతుల్లోకి తెచ్చుకున్న విదర్భ... ప్రత్యర్థి 60 పరుగులైనా చేయకముందే సగం వికెట్లను పడగొట్టింది.

- డకౌటైన పుజారా
- విదర్భను నిలబెట్టిన సర్వతే
- సౌరాష్ట్ర లక్ష్యం 206; ప్రస్తుతం 58/5
- రంజీ ట్రోఫీ ఫైనల్

నాగ్‌పూర్: డిఫెండింగ్ చాంపియన్ విదర్భ రంజీ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు సై అంటోంది. భారత స్టార్ చతేశ్వర్ పుజారా అందుబాటులో ఉన్న సౌరాష్ట్ర జట్టు స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక విలవిల్లాడుతోంది. విదర్భ చాంపియన్‌షిప్‌కు ఐదు వికెట్ల దూరంలో ఉంటే... లోయర్ ఆర్డర్, టెయిలెండర్లే ఉన్న సౌరాష్ట్ర ఇంకా 148 పరుగులు చేయాల్సివుంది. విదర్భను ఆదిత్య సర్వతే తన ఆల్‌రౌండ్ షోతో నిలబెట్టాడు. నాలుగో రోజు ఆటలో బ్యాటింగ్‌లో విఫలమైన విదర్భ బౌలింగ్‌లో జూలు విదిల్చింది. మొత్తానికి బుధవారం ఆటను ఇరు జట్ల బౌలర్లు శాసించారు. ముందుగా 55/2 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 92.5 ఓవర్లలో 200 పరుగుల వద్ద ఆలౌటైంది. ఆదిత్య సర్వతే (49; 5 ఫోర్లు) ఒక్కడే ప్రత్యర్థి బౌలింగ్‌కు ఎదురు నిలిచాడు. సౌరాష్ట్ర బౌలర్ ధర్మేంద్రసింగ్ జడేజా (6/96) స్పిన్ ఉచ్చులో 73 పరుగులకే 5 వికెట్లను కోల్పోయిన విదర్భను టెయిలెండర్ ఆదిత్య 200 పరుగుల దాకా లాక్కొచ్చాడు. మోహిత్ కాలే 38, గణేశ్ సతీశ్ 35 పరుగులు చేశారు. కమలేశ్ మక్వానాకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కలుపుకొని 206 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌరాష్ట్రను సర్వతే (3/13)స్పిన్‌తో కొట్టాడు. ఓపెనర్లు హర్విక్ దేశాయ్ (8), స్నెల్ పటేల్ (12)లతో పాటు పుజారా (0)ను ఖాతా తెరువకుండానే సాగనంపాడు. క్వార్టర్స్, సెమీస్‌లో జట్టును నడిపించిన పుజారా ఫైనల్లో మాత్రం చేతులెత్తేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో అతను ఒక పరుగే చేశాడు. అర్పిత్ వాసవద (5)ను ఉమేశ్, షెల్డన్ జాక్సన్ (7)ను అక్షయ్ వఖారే పెవిలియన్ చేర్చడంతో సౌరాష్ట్ర 55 పరుగులకే 5 కీలక వికెట్లను కోల్పోయింది. ఆట నిలిచే సమయానికి విశ్వరాజ్ జడేజా (23 బ్యాటింగ్, 3 ఫోర్లు), కమలేశ్ మక్వానా (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.



ఆదిత్య సర్వతే

కొచ్చి బ్లూ స్పైకర్స్ రెండో విజయం

కొచ్చి: ప్రొ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)లో కొచ్చి బ్లూ స్పైకర్స్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో కొచ్చి 10–15, 15–11, 11–15, 15–12, 15–12తో అహ్మదాబాద్ డిఫెండర్స్‌పై గెలుపొందింది. కొచ్చి తరఫున డేవిడ్ లీ 10, ప్రభాకరన్ 9, మను జోసెఫ్ 7 పాయింట్లతో రాణించగా, అహ్మదాబాద్ జట్టులో విక్టర్ సిసావ్ (13), గురిందర్ సింగ్ (12) అదరగొట్టారు. నేడు జరిగే పోరులో చెన్నై స్పార్టన్స్‌తో బ్లాక్‌హాక్స్ హైదరాబాద్ తలపడుతుంది.

24న యాదవ ధర్మయుద్ధ మహాసభ


రామచంద్రయ్య యాదవ్

నెల్లూరు(వేదాయపాళెం): యాదవ శంఖారావ రథయాత్ర ముగింపు సందర్భంగా విజయవాడలోని జింఖానా మైదానంలో ఈనెల 24న మధ్యాహ్నం 2 గంటలకు యాదవ ధర్మయుద్ధ మహాసభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు పెద్ద సంఖ్యలో యాదవ సంఘీయులు తరలిరావాలని అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు అన్నా రామచంద్రయ్య యాదవ్ పిలుపునిచ్చారు. యాదవ శంఖారావ రథయాత్ర నెల్లూరుకు వచ్చిన సందర్భంగా బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కళ్యాణమండపంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 70 లక్షల మంది యాదవులు ఉన్నారని, జనాభా దామాషా ప్రకారం పార్టీలు తమ కులానికి 25 అసెంబ్లీ, 5 పార్లమెంటు, ఒక రాజ్యసభ, 6 ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో సన్నిధి గొల్ల కైంకర్యాలు కొనసాగించాలని, యాదవుల వసతిగృహాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. అఖిల భారతీయ యాదవ మహాసభ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం యాదవులకు అన్ని రంగాల్లో దక్కాల్సిన వాటాను సాధించడంతోపాటు, బడుగు, బలహీనవర్గాల రాజ్యస్థాపనకై యాదవ శంఖారావ రథయాత్ర చేపట్టినట్లు చెప్పారు. అమరావతిలో 10 ఎకరాల్లో యాదవ హాస్టల్, జిల్లాలో రెండెకరాల హాస్టల్‌ను ప్రభుత్వమే నిర్మించాలని, గొర్రెలు, మేకలు, పశువులు మేపుకునేందుకు ప్రత్యేక అటవీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా నాయకులు ఎస్ఎస్ యాదవ్, ఉడతా శ్రీహరి యాదవ్ పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

T.N.No.G/C79/Catg/ Milk Stalls/1/2019 తేదీ: 11-01-2019 రద్దు

టెండరు ప్రకటన నం. G/C79/Milk Stalls/1/2019 తేదీ: 11-01-2019 ప్రకారం 5 సంవత్సరాల కాలానికి గుంతకల్ డివిజన్‌లోని 15 ప్రదేశాల వద్ద మిల్క్ స్టాల్స్ ఏర్పాటు "కోసం పిలువబడిన టెండర్లు **రద్దు చేయబడినవి.**

సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్/గుంతకల్

T.N.No.35-CWM/LGD-E Tender-2018-19 తేది: 31-01-2019

టెండరు నం. 35-CWM/LGD-E Tender-2018-19 కు సంబంధించి భారత రాష్ట్రపతి తరఫున వ్యవహరిస్తున్న CWM/LGDS వారు ఇ-టెండర్లు కోరబడుచున్నారు. ముగింపుతేది 21-02-2019న 15:00 గంటలకు. బిడ్డర్లు ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే తమ అసలు/సవరించిన బిడ్లు దాఖలు చేయగలుగుతారు. ఈ టెండరు నిమిత్తం మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అందిన అటువంటి ఏదేని మాన్యువల్ ఆఫరు తిరస్కరించబడుతుంది.
కంట్రాక్టర్లు టెండరు డాక్యుమెంట్ ధర మరియు బయానా నిమిత్తం ఈ టెండరుకు సంబంధించిన చెల్లింపులను నెట్‌బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డు మొ॥ వంటి IREPS పోర్టల్‌లో లభించే ఆన్‌లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే చేయాలి. డిమాండ్ డ్రాఫ్ట్ బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రశీదులు, FDR మొ॥ వాటి ద్వారా మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.

క.సం.: 1: **టెండరు నం.:** 35-CWM/LGD-E Tender-2018-19 తేదీ: 31-01-2019, **పని వివరణ:** క్యారేజి వర్క్‌షాప్ లాలాగూడ వద్ద ఇన్స్‌ఫెక్షన్ క్యారేజ్ (GM సెలూన్) నెం.11235 ఫర్నీషింగ్. **సుమారు వ్యయం (రూ.):** 34,27,789.28 (ముప్పై నాలుగు లక్షల ఇరవై ఏడు వేల ఏడువందల ఎనభై తొమ్మిది రూపాయలా ఇరవై ఎనిమిది పైసలు మాత్రమే), **బయానా (రూ.):** 68,560/-(అరవై ఎనిమిది వేల ఐదు వందల అరవై రూపాయలు మాత్రమే), **పూర్తిచేయ వలసిన కాలం:** 4 నెలలు. **ముగింపు తేదీ:** 21-02-2019న 15:00 గంటలకు.
వెబ్‌సైట్ వివరాలు: **www.ireps.gov.in**
టెండరు పూర్తి వివరాలు చూసేందుకు ఉంచబడిన నోటీసు బోర్డు ప్రదేశం: చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజి వర్క్‌షాప్, లాలాగూడ, సికింద్రాబాద్-500017.

చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, CWS, లాలాగూడ, సికింద్రాబాద్

T.N.No.36-CWM/LGD-E Tender-18-19 తేది: 31-01-2019

టెండరు నం. 36-CWM/LGD-E Tender-18-19 కు సంబంధించి భారత రాష్ట్రపతి తరఫున వ్యవహరిస్తున్న CWM/LGDS వారు ఇ-టెండర్లు కోరబడుచున్నారు. ముగింపు తేది 04-03-2019న 15:00 గంటలకు. బిడ్డర్లు ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే తమ అసలు/సవరించిన బిడ్లు దాఖలు చేయగలరు. ఈ టెండరు నిమిత్తం మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అందిన అటువంటి ఏదేని మాన్యువల్ ఆఫరు తిరస్కరించబడుతుంది.
కంట్రాక్టర్లు టెండరు డాక్యుమెంట్ ధర మరియు బయానా నిమిత్తం ఈ టెండరుకు సంబంధించిన చెల్లింపులను నెట్‌బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డు మొ॥ వంటి IREPS పోర్టల్‌లో లభించే ఆన్‌లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే చేయాలి. డిమాండ్ డ్రాఫ్ట్ బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రశీదులు, FDR మొ॥ వాటి ద్వారా మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.

క.సం.: 1: **టెండరు నం.:** 36-CWM/LGD-E Tender-18-19 తేదీ: 31-01-2019, **పని వివరణ:** క్యారేజి వర్క్‌షాప్ లాలాగూడ, సికింద్రాబాద్ వద్ద వాయు &జల కాలుష్య స్థాయిల పర్యవేక్షణ. **సుమారు వ్యయం (రూ.):** 2,41,028.56 (రెండు లక్షల నలభై ఒక వేల ఇరవై ఎనిమిది రూపాయలా యాభై ఆరు పైసలు మాత్రమే), **బయానా (రూ.):** 4,830.00 (నాలుగు వేల ఎనిమిది వందల ముప్పై రూపాయలు మాత్రమే), **పూర్తిచేయ వలసిన కాలం:** అంగీకరాలేఖ జారీ తేదీ నుంచి ఇరవై నాలుగు నెలలు. **ముగింపు తేదీ:** 04-03-2019న 15:00 గంటలకు.
వెబ్‌సైట్ వివరాలు: **www.ireps.gov.in**
టెండరు పూర్తి వివరాలు చూసేందుకు ఉంచబడిన నోటీసు బోర్డు ప్రదేశం: చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజి వర్క్‌షాప్, లాలాగూడ, సికింద్రాబాద్-500017.

చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, CWS, లాలాగూడ, సికింద్రాబాద్

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)

దిగువ తెలిపిన పనుల కోసం చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (వర్క్స్) దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు భారత రాష్ట్రపతి తరఫున సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుచున్నారు.

క్ర.సం.: 1: **NIT No.:** టెండరు నం. 15-18-19-E-GS-CN-BZA తేదీ: 31-01-19. **పని పేరు:** గుంటూరు డివిజన్: నడికుండి నుంచి శ్రీకాళహస్తి స్టేషన్ల మధ్య (308.7 kms) కొత్త B.G లైను నిర్మాణానికి సంబంధించి 4 నం. క్రాసింగ్ స్టేషన్లు వెంకటగిరి, అల్లూరుపాడు, రావూరు మరియు అదురిపల్లి మరియు 2 నం. హాల్ట్ స్టేషన్లు బాలసముద్రం మరియు వల్లంపల్లె స్టేషన్ల వద్ద రిలే, బ్యాటరీ, ఎక్విప్‌మెంట్, ఎఎస్ఎం, స్విచ్ కమ్ టూల్ రూమ్, గూమ్‌టీస్, టెలికాం రూమ్, దయాగ్నాస్టిక్ రూమ్, ప్లాట్‌ఫారాలు, సర్క్యులేటింగ్ ఏరియాలు విద్యుదీకరణ-విద్యుత్ ఏర్పాట్లు. **అంచనా వ్యయం (రూ.) :** 2,19,81,670/-, **బయానా (రూ.):** 2,59,910/-, **డాక్యుమెంట్ ధర :** రూ. 10,000/-. **పూర్తిచేయు కాలం:** 12 (పన్నెండు) నెలలు. **ముగింపు తేది :** 12-03-2019న 15:00 గంటలకు.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ **http://ireps.gov.in**కు లాగాన్ అవండి.
2. బయానా మరియు టెండరు డాక్యుమెంట్ ధర చెల్లింపు IREPSలో ఆన్‌లైన్‌లో లభించే నెట్ బ్యాంకింగ్ / పేమెంట్ గేట్‌వే సదుపాయం ద్వారా మాత్రమే చేయాలి.
3. టెండరుదారు టెండరు దాఖలు కాలంలో ఆన్‌లైన్‌లో తమ ఆఫర్లను దాఖలు చేయాలి. అది టెండరు ముగింపు తేదీ కాలానికి పదిహేను రోజులు ముందు ఉంటుంది.
4. టెండరుదారు టెండరు దాఖలు కాలము ప్రారంభ తేదీ వరకు ఏవేని సవరణలను (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేసినవి) కోసం గమనించవలెను.

ఎగ్జిక్యూటివ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (కన్‌స్ట్రక్షన్), విజయవాడ

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)

దిగువ పనుల కొరకు టెండరింగ్ సింగిల్ ప్యాకెట్ విధానంలో చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (పనులు), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు భారత రాష్ట్రపతి తరఫున ఇ-టెండర్ కోరుచున్నారు.

క్ర.సం:1, NIT No: టెండర్ నం.16-18-19 -E-GS-CN-BZA, తేదీ: 04.02.2019 **పనిపేరు:** విజయవాడ డివిజన్: భద్రాచలం రోడ్ నుండి సత్తుపల్లి స్టేషన్ల (53.20 కి.మీలు) మధ్య కొత్త B.G. లైన్ నిర్మాణంకు సంబంధించి XEN ఆఫీస్ బిల్డింగ్ & 3 నం.లు క్రాసింగ్ స్టేషన్లు కొయ్యగూడెం, సీతంపేట, చంద్రుగొండ స్టేషన్ల వద్ద రిలే, బ్యాటరీ, ఎక్విప్‌మెంట్, ASM, టూల్‌రూమ్, గూమ్‌టీస్, టెలికాం రూం, డయాగ్నోస్టిక్ రూమ్, క్యాబిన్స్, OHE రూమ్స్, ప్లాట్‌ఫామ్స్, సర్క్యులేటింగ్ ఏరియాస్ మొ॥ వాటి యొక్క విద్యుదీకరణ - ఎలక్ట్రికల్ అరేంజ్‌మెంట్స్, **అంచనా వ్యయం:** రూ.1,92,16,483.50/-, **బయానా:** రూ.2,46 ,090/-, **డాక్యుమెంట్ వ్యయం:** రూ.5000/-, **పూర్తిచేయు కాలం:** 12 (పన్నెండు) నెలలు, **ముగింపు తేదీ:** 13.03.2019, 15.00. గం॥

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు వెబ్‌సైట్ **http://ireps.gov.in** కు లాగిన్ అవండి.
2) బయానా మరియు టెండర్ డాక్యుమెంట్ ధరను IREPS లోని ఆన్‌లైన్ లో లభించే పేమెంట్ గేట్‌వే ఫెసిలిటీస్/ నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించవలెను.
3) టెండర్‌దారు వారి ఆఫర్లను టెండర్ దాఖలు కాలంలో ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను. అది టెండర్ ముగింపు కాలానికి పదిహేను రోజులు ఉంటుంది.
4) టెండర్‌దారు టెండర్ దాఖలు కాలం ప్రారంభ తేదీ వరకు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును) కొరకు గమనించవలెను.

ఎగ్జిక్యూటివ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ కన్‌స్ట్రక్షన్, విజయవాడ

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)

దిగువ తెలిపిన పనుల కొరకు చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (వర్క్స్), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు భారత రాష్ట్రపతి తరఫున సింగిల్ పాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం:1, NIT No: టెండర్ నం.16A-18-19-E-GS-CN-BZA తేదీ: 04.02.2019 **పనిపేరు:** విజయవాడ డివిజన్: భద్రాచలం రోడ్ నుండి సత్తుపల్లి స్టేషన్ల (53.20 కి.మీలు) మధ్య కొత్త B.G. లైన్ నిర్మాణంకు సంబంధించి 3 నం.లు క్రాసింగ్ స్టేషన్లు భావన్నపాలెం, పెనుబల్లి, సత్తుపల్లి స్టేషన్ల వద్ద రిలే, బ్యాటరీ, ఎక్విప్‌మెంట్, ASM, టూల్‌రూమ్స్, గూమ్‌టీస్, టెలికాం రూం, డయాగ్నోస్టిక్ రూమ్, క్యాబిన్స్, OHE రూమ్స్, ప్లాట్‌ఫామ్స్, సర్క్యులేటింగ్ ఏరియాలు మొ॥ వాటి యొక్క విద్యుదీకరణ-విద్యుత్ ఏర్పాట్లు. **అంచనా వ్యయం:** రూ.1,90,14,543.10/-, **బయానా:** రూ.2,45,080/-, **డాక్యుమెంట్ వ్యయం :** రూ.5000/-, **పూర్తిచేయు కాలం:** 12 (పన్నెండు) నెలలు, **ముగింపు తేదీ:** 13.03.2019, 15.00.కు

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు వెబ్‌సైట్ **http://ireps.gov.in** కు లాగిన్ అవండి.
2) బయానా మరియు టెండర్ డాక్యుమెంట్ ధరను IREPS లోని ఆన్‌లైన్ లో లభించే పేమెంట్ గేట్‌వే ఫెసిలిటీస్/ నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించవలెను.
3) టెండర్‌దారు వారి ఆఫర్లను టెండర్ దాఖలు కాలంలో ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను. అది టెండర్ ముగింపు కాలానికి పదిహేను రోజులు ఉంటుంది.
4) టెండర్‌దారు టెండర్ దాఖలు కాలం ప్రారంభ తేదీ వరకు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును) కొరకు గమనించవలెను.

ఎగ్జిక్యూటివ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ కన్‌స్ట్రక్షన్, విజయవాడ

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)

దిగువ తెలిపిన పనుల కొరకు చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (వర్క్స్), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు భారత రాష్ట్రపతి తరఫున సింగిల్ పాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం:1, NIT No: టెండర్ నం.17-18-19-E-GS-CN-BZA తేదీ: 31.01.2019 పనిపేరు: విజయవాడ డివిజన్: కోటిపల్లి నుండి నర్సాపూర్ స్టేషన్ల (57.207 కి.మీ) మధ్య కొత్త B.G. లైన్ నిర్మాణంకు సంబంధించి 4 నం.లు క్రాసింగ్ స్టేషన్లు కోటిపల్లి, అమలాపురం, రాజోల్, నర్సాపూర్ మరియు 5 నం.లు హాల్ట్ స్టేషన్లు మాగ, పేరూరు, పాసర్లపూడి, జగ్గన్నపేట మరియు చించినాడ స్టేషన్ల వద్ద రిలే, బ్యాటరీ, ఎక్విప్‌మెంట్, ASM, స్విచ్ కమ్ టూల్‌రూమ్, గూమ్‌టీస్, టెలికాం రూం, డయాగ్నోస్టిక్ రూమ్, ప్లాట్‌ఫామ్స్, సర్క్యులేటింగ్ ఏరియాల ఎలక్ట్రిఫికేషన్ - ఎలక్ట్రికల్ అరేంజ్‌మెంట్స్, **అంచనా వ్యయం :** రూ.2,36,33,948/-, **బయానా:** రూ.2,68,170/-, **డాక్యుమెంట్ వ్యయం :** రూ.10,000/-, **పూర్తిచేయు కాలం:** 12 (పన్నెండు) నెలలు, **ముగింపు తేదీ:** 12.03.2019, 15.00.కు

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు వెబ్‌సైట్ **http://ireps.gov.in** కు లాగిన్ అవండి.
2) బయానా మరియు టెండర్ డాక్యుమెంట్ ధరను IREPS లోని ఆన్‌లైన్ లో లభించే పేమెంట్ గేట్‌వే ఫెసిలిటీస్/ నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించవలెను.
3) టెండర్‌దారు వారి ఆఫర్లను టెండర్ దాఖలు కాలంలో ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను. అది టెండర్ ముగింపు కాలానికి పదిహేను రోజులు ఉంటుంది.
4) టెండర్‌దారు టెండర్ దాఖలు కాలం ప్రారంభ తేదీ వరకు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును) కొరకు గమనించవలెను.

ఎగ్జిక్యూటివ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ కన్‌స్ట్రక్షన్, విజయవాడ

E-T.N.No.GNT/SECURITY/001/ 2018-19 తేది: 04-02-2019

దిగువ పని కొరకు కాంట్రాక్టర్ల నుండి 26-02-2019న 15:30 గం॥ వరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి.

క్ర.సం.: 1: **టెండరు రెఫరెన్స్ నం.:** GNT/Security/001/2018-19తేదీ: 04-02-2019, **టెండరు టైటిల్:** 02 సంవత్సరాల కాలానికి గుంటూరు డివిజన్, దక్షిణ మధ్య రైల్వే లోని ASC/GNT మరియు IPF/పిడుగురాళ్ల ఉపయోగానికి డ్రైవర్లతో వైట్ కలర్ మల్టీ-యుటిలిటీ వెహికల్స్ (MUVs) నాన్ AC-02 నంబర్లు అద్దెకు తీసుకొనుట మరియు ఒక సంవత్సర కాలానికి గుంటూరు డివిజన్, దక్షిణ మధ్య రైల్వేలోని ASIPF/ దొనకొండ ఉపయోగానికి డ్రైవర్‌తో వైట్ కలర్ మల్టీ-యుటిలిటీ వెహికల్స్ (MUVs) నాన్ AC-01 నంబరు అద్దెకు తీసుకొనుట. మొత్తం 03 వాహనాలు (మహీంద్రా స్కార్పియో/ బొలెరో/ టాటాసుమో/ MUV 300 మొ॥ అనగా (6+1) కెపాసిటీ గలది). **అంచనా విలువ (రూ.):** 23,40,000/-, **బయానా (రూ.):** 46,800/-, **టెండరు ఫారం ధర (వాపస్ రాదు):** రూ. 3,000/-.
ఇ-బిడ్ల ఆన్‌లైన్ దాఖలు కొరకు చివరి తేది మరియు సమయం: 26-02-2019న 15:30 గం॥ వరకు.
ఏదేని పూర్తి సమాచారం కొరకు 26-02-2019న 15:30 గం॥ వరకు వెబ్‌సైట్: **www.ireps.gov.in** కు లాగాన్ అవండి.
ఏదేని తదుపరి సమాచారం/సవరణ ఇ-పోర్టల్ **www.ireps.gov.in** ద్వారా మాత్రమే తెలియజేయబడును.

డివిజినల్ సెక్యూరిటీ కమీషనర్ RPF/గుంటూరు

A0127

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

ఎక్సైజ్ వనంలో గంజాయి దొంగలు!

- స్మగ్లర్లతో ఎక్సైజ్ అధికారుల చెట్టాపట్టాల్
- అండగా అధికార పార్టీ నేతలు
- స్టేషన్లలో సీజ్ చేసిన సరుకును దారి మళ్లిస్తున్న వైనం
- భారీ బహుమతులు అందిస్తున్న స్మగ్లర్లు
- ఆయుధాలు లేకుండా స్మగ్లర్లను ఎలా అడ్డుకోవాలంటున్న అధికారులు
- పోలీసు, ఎక్సైజ్ శాఖల సమన్వయలోపం



సాక్షి, అమరావతి: గంజాయి అక్రమ రవాణా తీగ లాగుతుంటే.. ఇంటి దొంగల డొంక కదులుతోంది. కంచే చేను మేసిన చందంగా ఎక్సైజ్ అధికారులు స్మగ్లర్లతో చేతులు కలిపి గంజాయిని సరిహద్దులు దాటించేస్తున్నారు. విశాఖ మన్యం నుంచి పశ్చిమబెంగాల్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు భారీగా తరలిపోతున్న గంజాయి లోడులకు ఎక్సైజ్ అధికారులే భద్రత కల్పిస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎక్సైజ్ స్టేషన్లలో సీజ్ చేసిన కాంట్రాబండ్ (సీజ్ చేసిన సరుకు దాచే గది)లో గంజాయిని కూడా మాయం చేస్తున్నారు. విశాఖ జిల్లా అనకాపల్లి స్టేషన్లో ఏకంగా రూ. కోటిన్నర విలువైన సరుకు అమ్మేయడం వంటి ఘటనలు వెలుగు చూశాయి. తూర్పు గోదావరి, విశాఖ, విజయనగరం స్టేషన్లలో కూడా గంజాయి నిల్వలు తరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సీజ్ చేసిన గంజాయిని ధ్వంసం చేయాలని నార్కోటిక్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. అయితే అది కూడా పూర్తి స్థాయిలో జరగలేదు. గంజాయి స్మగ్లింగ్‌లో ఎక్సైజ్ అధికారులకు, స్మగ్లర్లకు అధికార పార్టీ నేతలే అండగా నిలుస్తున్నారని కొందరు ఉన్నతాధికారులు చెబుతున్నారు. పైనుంచి వస్తున్న ఒత్తిడుల వల్ల అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు వారు వెనుకాడుతున్నారు. ఇటీవల విశాఖ ఏజెన్సీ నుంచి వస్తున్న గంజాయి లోడు పోలీసులకు పట్టుబడింది. ఓ స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకుని విచారించిన దేవరాపల్లి పోలీసులకు నివ్వెరపోయే నిజాలు వెల్లడయ్యాయి. తమకు ఎక్సైజ్ అధికారులు, అధికార పార్టీ నేతలు సహకరించడం వల్లే రవాణాకు ఇబ్బందులేర్పడటం లేదని చెప్పారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఆధారాలు అందించడంతో కొందరు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

విశాఖ, విజయనగరం జిల్లాల్లో సీఐలుగా పనిచేసిన అబ్కారీ అధికారులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లినా.. ఇక్కడ గంజాయి స్మగ్లర్లతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారని సమాచారం. ఇందుకు స్మగ్లర్లు ఎక్సైజ్ అధికారులకు విలువైన బహుమతులు అందజేస్తున్నారు. ఇటీవల ఓ సీఐకి స్మగ్లర్ ముఠా ఓ స్విఫ్ట్ కారును బహుమతిగా ఇచ్చారని ఆ శాఖలో జోరుగా ప్రచారం జరుగుతోంది.

చెక్‌పోస్టుల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితం

విశాఖ ఏజెన్సీ కేంద్రంగా స్మగ్లర్లు స్థానికులతో గంజాయి సాగు చేయించి అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి అన్ని ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని నాలుగేళ్ల కిందట రూ. 2 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. గతంలో తూర్పుగోదావరి జిల్లా సరిహద్దుల్లో రోడ్డు మార్గం ద్వారా తరలిస్తున్న గంజాయి పట్టుకునేందుకు ఎక్సైజ్ అధికారులు ప్రయత్నిస్తే స్మగ్లర్లు దాడి చేసి పారిపోయారు. ఈ ఘటనలో ఇద్దరు ఎక్సైజ్ అధికారులు మరణించిన సంగతి తెలిసిందే. రెండు నెలల కిందట ఎక్సైజ్ శాఖ గంజాయి సాగు నియంత్రణ, అక్రమ రవాణా అరికట్టడంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, అబ్కారీ పోలీసులను పాడేరులో మోహరించి సాగును ధ్వంసం చేయాలని నిర్ణయించారు. అయితే ఆయుధాలు లేకుండా పాడేరు కేంద్రంగా ఈ ఆపరేషన్ నిర్వహించడమెలా అని ఎక్సైజ్ యంత్రాంగం చేతులెత్తేసింది. మరోవైపు పోలీసులతో సమన్వయం లేకుండా గంజాయి సాగు ధ్వంసం చేయాల్సి ఉంటుంది. ఎక్సైజ్ శాఖలో ఐపీఎస్ హోదాలో కమిషనర్ తప్ప పోలీసు ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకునే అవకాశం ఎక్సైజ్ అధికారులకు లేకుండాపోయింది. ఎక్సైజ్ శాఖకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా సీనియర్ ఐపీఎస్‌ను నియమించలేదు. ఏడాదిగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇటీవలే వెంకటేశ్వరరావును బదిలీ చేసిన తర్వాత ఎవ్వరినీ నియమించలేదు. ఇదిలాఉండగా గంజాయి అక్రమ రవాణా అరికట్టడంలో పోలీసులు, నార్కోటిక్ అధికారులకు బాధ్యత ఉందని, అయితే కేవలం ఎక్సైజ్ అధికారుల మీదే నెట్టేయడం ఎంతవరకు సమంజసమని వారు వాపోతున్నారు.

లోకేష్‌కు తెలిసే కుట్ర!

- రూ.30 లక్షల సుపారీతో ఎమ్మెల్యే చెవిరెడ్డి హత్యకు రంగంలోకి ఇద్దరు నిందితులు
- డ్రైవర్ల ముసుగులో చొరబడ్డ పులివర్తి నాని అనుచరులు
- చెవిరెడ్డి కుటుంబ సభ్యుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం చేరవేత
- ఎమ్మెల్యే అప్రమత్తం కావడంతో దక్కిన ప్రాణాలు
- పోలీస్ స్టేషన్ ఎదుట చెవిరెడ్డి ధర్నా



ఎమ్మార్‌పల్లి స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్: మంత్రి నారా లోకేష్‌కు అత్యంత సన్నిహితుడైన చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని కోసమే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హత్యకు తాము రెక్కీ నిర్వహించినట్లు నిందితులు మీడియా ఎదుట అంగీకరించడం తీవ్ర కలకలం రేపుతోంది. నారా లోకేష్‌కు తెలియకుండా సొంతంగా ఏ చిన్న నిర్ణయం కూడా తీసుకోలేని నాని ఇంత పెద్ద కుట్రను ఆయనకు తెలిసే చేసి ఉంటారని సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుట్రలో భాగంగా రూ.30 లక్షలు సుపారీ ఇచ్చి చిత్తూరు నుంచి నేరచరిత్ర కలిగిన ఇద్దరు వ్యక్తులను డ్రైవర్ల ముసుగులో ఎమ్మెల్యే చెవిరెడ్డి వద్దకు పంపించారు. నెల రోజులుగా వారు ఎమ్మెల్యేతోపాటు ఆయన కుటుంబ సభ్యుల కదలికలను ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా పులివర్తి నానికి చేరవేస్తున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆరా తీయడంతో దిగ్భ్రాంతి కలిగేలా సుపారీ విషయం వెలుగులోకి వచ్చింది.

మొదటి దశలో ఇళ్లు, ఆఫీసు వద్ద నిఘా పెట్టాలని, ఎమ్మెల్యేను ఎవరెవరు కలుస్తున్నారు? ఆయన కుటుంబ సభ్యులు ఎప్పుడు, ఎక్కడికి, ఏ దారిలో వెళ్తారు? మళ్లీ ఎప్పుడు వస్తారు? అనే సమాచారాన్ని నిందితులు సేకరించారు. తర్వాత దశలో సమయాన్ని బట్టి తాము చెప్పినట్లు నడుచుకోవాలని చిత్తూరుకు చెందిన నాని అనుచరులు ఆదేశించినట్లు చిత్తూరు పంద్రంపల్లికి చెందిన నిందితులు నాగభూషణం, సిసింద్రీలు మీడియా ఎదుట వెల్లడించారు. మంగళవారం సాయంత్రం తిరుపతి తుమ్మలగుంటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి తనపై నిందితులు నిర్వహించిన రెక్కీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవారు కొలువైన తిరుపతిలో రెక్కీలు, హత్యలు, అబ్జర్వేషన్లు లాంటి సంస్కృతి ఇప్పటిదాకా లేదన్నారు. నేరచరిత్ర కలిగిన ఇద్దరు వ్యక్తులకు డ్రైవర్ల ముసుగులో రూ.30 లక్షలు ఇచ్చి తనపై, తన కుటుంబంపై రెక్కీ నిర్వహించటం దారుణమన్నారు. రాజకీయల్లో స్నేహపూర్వక పోటీ ఉండాలే తప్ప విద్వేషాలు, వ్యక్తిగత కక్షతో వ్యవహరించటం బాధాకరమన్నారు. పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు. కాగా, తనపై రెక్కీ నిర్వహించి పట్టుపడిన నిందితులు నాగభూషణం, సిసింద్రీలను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అర్బన్ ఎస్పీకి అప్పగించారు. నిందితులను విచారణ నిమిత్తం ఎంఆర్ పల్లి పోలీసులకు అప్పగించారు. తన కుటుంబానికి రక్షణ కల్పించాలని చెవిరెడ్డి వినతిపత్రం అందించారు. తనకు రక్షణ కల్పించాలని నాలుగు నెలల క్రితమే సీమ రేంజ్ డీఐజీ శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వినతిపత్రం అందించినా నేటికీ స్పందన లేదు.

స్టేషన్ ఎదుట ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆందోళన

నిందితులను పోలీసులకు అప్పగించినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడంతో ఎమ్మార్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం రాత్రి ధర్నాకు దిగారు. చట్టప్రకారం కేసు నమోదు చేయాలని కోరుతూ రాత్రి పోలీస్ స్టేషన్ ఎదుటే బైఠాయించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసేవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. నిందితులపై కేసు నమోదు చేయకపోవడం పట్ల పోలీసు అధికారులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి లీగల్ నోటీసులు పంపించారు.

పింఛన్ కోసం వెళితే ప్రాణాలు పోయాయి..

కృష్ణా జిల్లాలో ఘటన


మృతదేహం వద్ద బంధువుల విచారం

కలిదిండి (కైకలూరు): పింఛన్ కోసం ఓ వృద్ధుడు ఎండలో రెండు సార్లు తిరిగి గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ ఘటన బుధ వారం కృష్ణా జిల్లా కలిదిండిలో జరిగింది. కలిదిండి గ్రామానికి చెందిన మహ్మద్ జమీల్ అహ్మద్ (68) ఉదయం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పింఛనుదారులు ఎక్కువగా ఉండటంతో తిరిగి ఇంటికి వచ్చా డు. భోజనం అనంతరం మధ్యా హ్నం మళ్లీ వెళ్లి పింఛన్ తీసుకుని ఇంటికి నడిచి వస్తుండగా ఆశా నర్సింగ్ హోమ్ సమీపంలో గుండె పోటుకు గురై పడిపోయాడు. స్థాని కులు అహ్మద్‌ను వర్మ హాస్పటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. అహ్మద్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పింఛన్ కోస గంటల తరబడి ఎదురు చూసిన తన తండ్రి ఆందోళనకు గురై మరణించారని ఆయన కుమార్తె భర్కత్ ఉన్నీసా బోరున విలపించింది.

ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌తో మాంసం ఉత్పత్తుల్లో వృద్ధి

- ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ దామోదర్‌నాయుడు
- ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో జాతీయస్థాయి సదస్సు



పరిశోధన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

గన్నవరం: ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ పద్ధతి పాటించడం ద్వారా మాంసం ఉత్పత్తుల్లో గణనీయమైన వృద్ధిని సాధించవచ్చని ఎన్‌జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ దామోదర్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో రెండు రోజులపాటు జరగనున్న 'మాంసం పరిశోధనలో నూతన ఆవిష్కరణలు.. నాణ్యత, ఉత్పత్తి'పై నాల్గో జాతీయ స్థాయి సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో మాంసం ఉత్పత్తులకు అవసరమైన భూమి కొరత అధికంగా ఉంటుందని.. దీనిని అధిగమించేందుకు ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ పద్ధతి దోహదపడుతుందన్నారు. ఒకే వ్యవసాయ క్షేత్రంలో కోళ్లు, చేపలు, రొయ్యలు, గేదెలు, పొట్టేలు, మేకలను పెంచడంతో పాటు.. వరి తదితర పంటలను సాగుచేయడం ద్వారా పోషణ, దాణా, పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ ఉత్పత్తులు సాధించవచ్చని వివరించారు.

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ టీఎస్ చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ మాంసం ఉత్పత్తుల్లో నూతన ఆవిష్కరణలకు, నాణ్యత ప్రమాణాలు, ఉత్పత్తి పెంచడానికి మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్ డాక్టర్ సర్జన్‌రావు, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.ఈశ్వరరావు, డాక్టర్ నాగవల్లిక, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 200 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశోధన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

● తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా దేవినేని అవినాష్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం విజయవాడ మొగల్రాజపురంలోని సిద్దార్థ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో ఈ మేరకు జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావ్, మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. కళా వెంకట్రావ్ మాట్లాడుతూ.. అవినాష్ నాయకత్వంలో తెలుగు యువత సమర్థంగా పనిచేయాలన్నారు. అవినాష్ మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు.

SAINIK SCHOOL KALIKIRI, CHITTOOR DIST (AP)
(UNDER THE AEGIS OF MOD, GOVT OF INDIA)
FILE NO. SSKAL/1005/EE/2019-20 DATED 07 FEB 19

CORRIGENDUM

With reference to the AISSEE-2019 Written exam results published on 04 Feb 19; the result of roll no 661539 is withheld till further instructions, due to re-examination to be held in SS Satara, SS Rewari and SS Sujanpur Tira. Sd/- Principal, Sainik School Kalikiri

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఆర్.సి.నం.21/ఎ.టి.ఓ/2018-19 నిట్ నెం.319 నుండి 352 వరకు/2018-19 తేది: 02.02.2019
తెనాలి పరిధిలోని వివిధ నియోజకవర్గములలో సిసి రోడ్లు మరియు అంతర్గత సి.సి రోడ్ల నిర్మాణము, కమ్యూనిటీ హాలు నిర్మాణము సిసి రోడ్లు మరియు డ్రైన్ నిర్మాణము చేయుట 34 పనులు అంచనా విలువ: రూ.193.28 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు 16.02.2019 నుండి ఇ-ప్లాట్‌ఫాం ద్వారా కోరబడుచున్నవి. ఇతర వివరాలకు ఇ-మార్కెట్‌ప్లేస్ అంటే www.apseprocurement.gov.in నుండి పొందగలరు.

సం/-కార్యనిర్వాహక ఇంజినీరు, పంచాయితీ రాజ్ డివిజన్, తెనాలి

DIPR RO.No.4326/CL/Advt/1/1/2018-19, Dt. 06-02-19

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నిట్ నెం.28/టి.ఓ/2018-19, తేది:01-02-2019
కృష్ణా జిల్లాలోని వివిధ ప్రాంతాలలో రోడ్లుకు భద్రతా చర్యలు ఏర్పాటు చేయుటకు, పిరియాడికల్ మెయింటెనెన్స్ చేయుటకు మొదలైన పనులకు గాను టెండర్లు కోరబడుచున్నవి. 7 పనులకు అంచనా విలువ: రూ. 762.00 లక్షలు. టెండర్లు స్వీకరించు తేదిలు: 8.2.2019 నుండి 22.2.2019 మ॥ 3గం.ల వరకు. బిడ్ సబ్మిషన్ క్లోసింగ్ తేది: 22.2.2019 మ. 3.30గం.కు టెక్నికల్ బిడ్ తెరుచు తేది: 22.02.2019 సా॥ 4.00గం. ప్రైస్‌బిడ్ తెరుచు తేది: 25.02.2019 సా॥ 4.00గం.కు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in వెబ్ సైట్ చూడవచ్చును.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, (ర.భ) సర్కిల్, విజయవాడ

DIPR Ro. No.4332/CL/ADVT/1/1/2018-19, Dt: 06-02-2019

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
పర్యవేక్షక ఇంజినీరు వారి కార్యాలయం, నీటిపారుదల వలయము, కడప

1) ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు సంఖ్య,11 SE/2018-19, తేది: 01.02.2019. పనిపేరు: వై.యస్.ఆర్.జిల్లా ఎర్రగుంట్ల మండలము పొట్లదుర్తి గ్రామము బ్రాంచ్ 2 చెక్‌డ్యాము R&B బ్రిడ్జి దిగువ భాగమున ఉన్న పెన్నా నదికి ఫ్లడ్ ప్రొటెక్షన్ బ్యాంక్స్ నిర్మించుట. **అంచనా విలువ:** 250.50 లక్షలు, కాల పరిమితి: 6 నెలలు
2) ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు సంఖ్య,12 SE/2018-19, తేది: 01.02.2019. **పనిపేరు:** వై.యస్.ఆర్. జిల్లా సింహాద్రిపురం మండలము లోమడ గ్రామము సమీపమున గల మొగమేరు వాగుకు ఫ్లడ్ ప్రొటెక్షన్ బ్యాంక్స్ నిర్మించుట. **అంచనా విలువ:** 396.75 లక్షలు. కాల పరిమితి: 6 నెలలు.
3) ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు సంఖ్య, 13 SE/2018-19, తేది: 01.02.2019. **పనిపేరు:** వై.యస్.ఆర్‌జిల్లా సింహాద్రిపురం మండలము కసనూరు గ్రామము సమీపమున గల మొగమేరు వాగుకు ఫ్లడ్ బ్యాంక్స్ నిర్మించుట. **అంచనా విలువ:** 392.92 లక్షలు. కాల పరిమితి: 6 నెలలు. 2) టెండర్లు సమర్పించు తేదీలు: 04.02.2019 నుండి 19.02.2019 సా.5.00 గం. వరకు. 4) సంబంధిత పర్యవేక్షక ఇంజినీరు వారి పేరు/ అడ్రస్సు: శ్రీ పి.శ్రీనివాస్, పర్యవేక్షక ఇంజినీరు, నీటిపారుదల వలయము, కడప. ఫోన్ నంబర్.08562244871 ఇతర వివరముల కొరకు www.apeprocurement.gov.in నందు చూడగలరు.

సం/- పర్యవేక్షక ఇంజినీరు, నీటిపారుదల వలయము, కడప

DIPR RO.No.711 PP/CL/Advt/1/1/2018-19, Dt. 06.02.2019

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ
లెనిన్ సెంటర్, గవర్నర్‌పేట, విజయవాడ-520002

నోటీసు

ఫైల్ నెంబర్. CLU/2378/2017
ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం 2014 నందు సెక్షన్ 41(3) గల అధికారముల ప్రకారం జి.ఓ.ఎం. ఎస్ నె. 77 ఎం.వ, తేది. 12/02/2007 ద్వారా ఆమోదించిన గన్నవరం జోనల్ అభివృద్ధి ప్రణాళికలో ఆర్. ఎస్. నెం. 95/6, 7, 97/1(P) & 99/1, 2(P), 3A, 3B, 4, 5, 6, 8A, బుద్ధవరం గ్రామం & గ్రామ పంచాయతీ, గన్నవరం మండలం, కృష్ణా జిల్లా పరిధి లోని 28288.53 చ. మీ. విస్తీర్ణమును వ్యవసాయ భూవినియోగం నుండి నివాసిత భూవినియోగం కొరకు మార్పు చేయుటకు ప్రతిపాదించటం జరిగింది.
ఏ వ్యక్తి అయినా లేదా ఏ స్థానిక సంస్థ అయినా పైన ప్రతిపాదించిన మార్పు ద్వారా ప్రత్యక్షముగా లేదా పరోక్షముగా ప్రభావితం అయితే గెజిట్ నందు ప్రచురించిన తేది నుండి 15 రోజుల లోపు తమ అభ్యంతరములను లేదా సలహాలను కమీషనర్, ఏ.పీ.సి.ఆర్.డీ.ఏ వారికి అందచేయవచ్చును. తదుపరి వివరాలను సి.ఆర్.డీ.ఏ వెబ్ సైట్ http://crda.ap.gov.in లోను, సి.ఆర్.డీ.ఏ విజయవాడ కార్యాలయంలో, బుద్ధవరం గ్రామ పంచాయతి కార్యాలయంలో పని దినములలో చూడ వచ్చును.

సం/- కమీషనర్, ఏ.పీ. సి.ఆర్.డీ.ఏ

DELHI POLICE

NOTICE

DIRECT RECRUITMENT FOR VARIOUS TRADES OF MULTI-TASKING STAFF (CIVILIAN) IN DELHI POLICE-2017

Soft copy of Answer Keys & Question Booklets of Written Examination for direct recruitment for various trades of Multi-Tasking Staff (Civilian) in Delhi Police-2017 held from 17.12.2018 to 09.01.2019 have been uploaded on the website of Delhi Police i.e. **www.delhipolice.nic.in.** The candidates who are not satisfied with the captured response, may challenge by filing application/ representation along with proof/ documents/solution in support of their claim latest by **21.02.2019** to DCP/ Recruitment, New Police Lines, Kingsway Camp, New Delhi-110009 along with ₹100/- per question/answer challenged. The Demand/Bank Draft/Banker's Cheque as fee shall be in favour of DCP/Recruitment Cell, New Police Lines, Delhi (payable at Delhi). The representation after the stipulated period will not be entertained in any circumstances. The decision of the Commissioner of Police, Delhi shall be final in this regard.

Sd/-
(Vikram K. Porwal)
Dy. Commissioner of Police
Recruitment, Delhi

DP/8862/17

GOVERNMENT OF INDIA-DEPARTMENT OF SPACE
CONSTRUCTION & MAINTENANCE GROUP, SDSC -SHAR, SRIHARIKOTA-524124, NELLORE (Dt.), A.P.

No: SHAR: CMG CIVIL: MAINT: E-PublicTender-30/18-19 **BRIEF E-TENDER NOTICE** Date: 05.02.2019

On behalf of President of India, online item rate tenders are invited through **e-tendering** for the following works from eligible contractors/ agencies having experience in works of similar nature and magnitude.

Title of the work	Providing BT platform at Bus boarding point TOMD Garage PCN & Concrete pathway at Sullurpeta.	Construction of specialist Doctors OP room at SHAR hospital SDSC SHAR.	Providing Vitrified tile flooring (antiskid) in SCS at PHC-II, SDSC SHAR.	Miscellaneous civil works at SPP SDSC SHAR.
Tender No	T/C-18-119	T/C-18-120	T/C-18-121	T/C-18-122
Est. Cost Put to tender	₹ 14.35 Lakhs	₹ 21.85 Lakhs	₹ 22.72 Lakhs	₹ 14.65 Lakhs
Period of completion	02 Months	05 Months	04 Months	03 Months
Earnest Money Deposit	₹ 28,700/-	₹ 43,700/-	₹ 45,500/-	₹ 29,300/-

Period during which tender documents can be requested : 07.02.2019, 10:00 hrs. to 18.02.2019, 14:30 hrs.

Last date & time for uploading of tenders: 19.02.2019 & 14:30 hrs.

Interested tenderers may please refer detailed tender notice available in our office or our website **www.isro.gov.in** or **www.tenderwizard.com/ISRO** further details and purchase of tender documents. Contact Phone 08623 - 226083/6085

Sd/- GROUP DIRECTOR, CMG/ SDSC SHAR


ఫ్రెంచి గయానా అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్తున్న రాకెట్

జీశాట్–31 ప్రయోగం సక్సెస్

- కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి ఉపగ్రహ ప్రయోగం
- దేశ సమాచార వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం

శ్రీహరికోట(సూళ్లూరుపేట)/బెంగళూరు: దేశ సమాచార వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రయోగించిన జీశాట్–31 సమాచార ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 2.31 గంటలకు ఫ్రాన్స్ దేశానికి చెందిన ఫ్రెంచ్ గయానాలోని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి ఏరియన్–5 ఉపగ్రహ వాహక నౌక (రాకెట్ వీఏ 247) ద్వారా జీశాట్–31 కమ్యూనికేషన్ ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ఉపగ్రహాన్ని బెంగళూరులోని యూఆర్ రావు ఉపగ్రహ పరిశోధన కేంద్ర డైరెక్టర్ కున్హికృష్ణన్ పర్యవేక్షణలో సుమారు రూ.400 కోట్ల వ్యయంతో తయారు చేశారు. జీశాట్–31తోపాటు సౌదీకి చెందిన 1/హెల్లాస్ శాట్–4 జియోస్టేషనరీ శాటిలైట్‌ను ఏరియన్ అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. ప్రయోగించిన 42 నిమిషాల్లోనే 2 ఉపగ్రహాలు అత్యంత సునాయాసంగా ముందుగా నిర్ణయించిన సమయానికే నిర్దేశిత కక్ష్యలో ప్రవేశించాయి. జీశాట్–31 ఉపగ్రహాన్ని పెరిజీ (భూమికి దగ్గరగా) 250 కిలోమీటర్లు, అపోజి (భూమికి దూరంగా) 35,850 కిలోమీటర్ల ఎత్తులోని దీర్ఘ వృత్తాకార భూ బదిలీ కక్ష్యలో 3.0 డిగ్రీల కోణంలో విజయవంతంగా ప్రవేశ పెట్టారు. ఉపగ్రహం కక్ష్యలోకి ప్రవేశించిన తర్వాత బెంగళూరు సమీపంలోని హసన్‌లో ఉన్న మిషన్ కంట్రోల్ సెంటర్ శాస్త్రవేత్తలు తమ అధీనంలోకి తీసుకున్నారు. భూ బదిలీ కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఉపగ్రహాన్ని రెండు మూడు విడతల్లో భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టే ప్రక్రియను చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

కౌరునే ఎందుకు..

జూన్, జులైలో మరో జియోస్టేషనరీ శాటిలైట్ జీశాట్30ను ఇక్కడి నుంచే ప్రయోగిస్తామని కౌరు అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఎస్.పాండియన్ చెప్పారు. ఫ్రెంచ్ గయానాతో భారత్‌కు 1981 నుంచి అంతరిక్ష సంబంధాలు కొనసాగుతున్నాయని, ఇవి క్రమంగా మరింత బలపడుతున్నాయన్నారు. ఈ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ మార్క్–2 ద్వారా ప్రయోగించే వీలున్నప్పటికీ ఇక్కడ చంద్రయాన్–2 ప్రయోగాన్ని దృష్టిలో ఉంచుకుని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించాల్సి వచ్చిందని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు.

బహుళ ప్రయోజనకారి..

సుమారు 2,536 కిలోలు బరువున్న ఈ అధునాతన ఉపగ్రహాన్ని ఇస్రో తయారుచేసింది. ఇందులో అత్యంత సాంకేతిక పరిజ్ఞానం గల అత్యంత శక్తివంతమైన కేయూ బాండ్ ట్రాన్స్‌ఫాండర్ల వ్యవస్థను అమర్చారు. ఇది ఇన్‌శాట్, జీశాట్ ఉపగ్రహాలకు ఆధునిక రూపంగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇస్రో గతంలో ప్రయోగించిన ఇన్‌శాట్–4సీఆర్, ఇన్‌శాట్–4ఏ సమాచార ఉపగ్రహాల కాలపరిమితి త్వరలో ముగియనుంది. ఈ రెండు ఉపగ్రహాల స్థానాన్ని కూడా జీశాట్–31 ఉపగ్రహం భర్తీ చేయనుంది. ఈ ఉపగ్రహం ముఖ్యంగా భారత భూభాగం, ద్వీపాలు, అరేబియా సముద్రం, బంగాళాఖాతం, హిందూ మహాసముద్ర పరిసరాలను పర్యవేక్షించి తగిన సమాచారాన్ని అందించనుంది. దీని ద్వారా వీశాట్‌నెట్‌వర్క్స్, టెలివిజన్ అప్‌లింక్స్, డిజిటల్ శాటిలైట్ న్యూస్ గ్యాదరింగ్, సెల్యులార్ బ్యాకప్, డీటీహెచ్ టెలివిజన్ సర్వీసులు, స్టాక్ ఎక్చ్సేంజీ, ఈ–గవర్నెన్స్, ఏటీఎం సేవలన్నీ మెరుగుపడే అవకాశం ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. నూతన టెలి కమ్యూనికేషన్ అప్లికేషన్లకు అవసరమైన సమాచారాన్ని పెద్దమొత్తంలో ట్రాన్స్‌ఫర్ ఇది చేయనుంది.

పారా మిలటరీలో 76 వేల ఉద్యోగాలు

న్యూఢిల్లీ: కేంద్ర పారా మిలటరీ బలగాల్లో 76,578 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు హోంశాఖ తెలిపింది. ఈ మొత్తం ఉద్యోగాల్లో 54,953 కానిస్టేబుల్ పోస్టులు ఉండగా, వీటిలో మహిళల కోసం 7,646 పోస్టులను కేటాయించినట్లు వెల్లడించింది. కానిస్టేబుల్ పోస్టుల్లో సీఆర్పీఎఫ్‌లో అత్యధికంగా 21,566 ఖాళీలు ఉండగా, బీఎస్ఎఫ్(16,984), ఎస్ఎస్‌బీ(8,546), ఐటీబీపీ(4,126) అస్సాం రైఫిల్స్(3,076) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయని తెలిపింది. ఇందుకోసం స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) 2019, ఫిబ్రవరి 11 నుంచి మార్చి 11 వరకూ కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షను నిర్వహించనుంది. ఇక సబ్‌ఇన్‌స్పెక్టర్ హోదాలో 1,073 పోస్టులు ఉండగా వాటిలో బీఎస్ఎఫ్‌లో 508, సీఆర్పీఎఫ్‌లో 274, ఎస్ఎస్‌బీలో 206, ఐటీబీపీలో 85 ఖాళీలు ఉన్నాయి. ఈ పోస్టులకు అదనంగా ట్రేడ్స్‌మెన్, హోంశాఖ, వైద్యం, పారా మెడికల్, కమ్యూనికేషన్, ఇంజనీరింగ్ రంగాల్లో మరో 20,086 పోస్టులను పదోన్నతుల ద్వారా హోంశాఖ భర్తీ చేయనుంది.

గిరిజన భూములను లాక్కున్నారు: రాహుల్


సభలో మహిళకు రాహుల్ నమస్కారం

భవానీపట్నా: గిరిజన భూములను లాక్కున్నారని ప్రధాని మోదీ, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌లపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బుధవారం ఇక్కడి వెనుకబడిన ప్రాంతాల్లో నిర్వహించిన ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఇక్కడి బీజేడీ ప్రభుత్వం దళితులు, గిరిజనులు, రైతులు, పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధిలో విఫలమయ్యాయని విమర్శించారు. గిరిజనుల భూములకు రక్షణ కల్పించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తానన్న బీజేపీ ప్రభుత్వం..దాన్ని విస్మరించిందన్నారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లలో అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడాన్ని ఆయన గుర్తు చేశారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ



సాక్షి ప్రతినిధి, చెన్నై: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ ప్రకటించారు. తమిళనాడులోని 39 స్థానాలు, పుదుచ్చేరిలోని ఒకటి కలిపి మొత్తం 40 స్థానాల్లో పోటీ చేస్తామనీ, ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోబోమన్నారు. పార్టీ బలోపేతమయ్యేందుకు ఐదేళ్లు పడుతుందని తాను భావించాననీ, అయితే అచిర కాలంలోనే పార్టీ ప్రజల్లోకి చొచ్చుకెళ్లిందని తెలిపారు..

పార్టీలతో వాట్సాప్ దుర్వినియోగం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు తమ ప్లాట్‌ఫాంను దుర్వినియోగం చేస్తున్నాయని ప్రముఖ సామాజిక మాధ్యమ సంస్థ వాట్సాప్ ఆరోపించింది. ఇదే ధోరణి కొనసాగితే ఆయా పార్టీల ఖాతాలు తొలగిస్తామని హెచ్చరించింది. ‘రాజకీయ పార్టీలు వాట్సాప్‌ను దుర్వినియోగం చేస్తోన్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి’ అని వాట్సాప్ కమ్యూనికేషన్స్ హెడ్ కార్ల్ వూగ్ చెప్పారు. వాట్సాప్ ప్రసార మాధ్యమం కాదని, దాని నుంచి భారీగా రాజకీయ సందేశాలు పంపకూడదని చాన్నాళ్లుగా రాజకీయ పార్టీలకు సూచిస్తున్నామని తెలిపారు. అక్రమంగా వ్యాప్తిచెందుతున్న సమాచారాన్ని గుర్తించేందుకు సామాజిక మాధ్యమాలు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేయాలని సమాచార, సాంకేతికత చట్టంలో కేంద్రం ప్రతిపాదించిన సవరణల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

‘నోబెల్’కు కేరళ మత్స్యకారులు

తిరువనంతపురం: కేరళలో వరదల సందర్భంగా అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి తోటి ప్రజలను కాపాడిన మత్స్యకారులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ నోబెల్ శాంతి పురస్కారానికి సిఫార్సుచేశారు. ఈ మేరకు ఆయన నార్వే నోబెల్ ఎంపిక కమిటీ చైర్మన్‌కు లేఖ రాశారు. 2019 నోబెల్ పురస్కారాల ఎంపికలో మత్స్యకారులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. గత ఆగస్టులో కేరళలో వరదలు ప్రళయం సృష్టిస్తున్న సమయంలో సహాయక చర్యల్లో పాలుపంచుకుని మత్స్యకారులు ప్రదర్శించిన సమయస్ఫూర్తి, తెగువను కొనియాడారు. ‘కేరళలో అంత పెద్ద విపత్తులో మత్స్యకారులు తమకు జీవనాధారమైన పడవల్ని సైతం పణంగా పెట్టి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. తమ పరిసరాల్లో చిక్కుకున్న వారిని కాపాడటంతోపాటు ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో చిక్కుకున్న సహాయక బృందాల పడవలను బయటపడేశారు’ అని థరూర్ లేఖలో పేర్కొన్నారు. ఓ మత్స్యకారుడు నీటిలో వంగినపుడు వృద్ధుడు అతని వీపుపై కాలుపెట్టి పడవ ఎక్కిన దృశ్యం చిరకాలం గుర్తుండిపోతుందని తెలిపారు.

ఈడీ విచారణకు వాద్రా

- ఆయన విచారణకు రావడం ఇదే తొలిసారి
- ఐదున్నర గంటలు.. 40 ప్రశ్నలు
- దిగబెట్టి వెళ్లిన భార్య ప్రియాంక
- ముడుపులతో లండన్‌లో వాద్రా అక్రమాస్తులు కొన్నారు: బీజేపీ


తన ఆఫీస్‌లో పార్టీ నేతలతో చర్చిస్తున్న ప్రియాంకా గాంధీ

న్యూఢిల్లీ: యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అల్లుడు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా విదేశాల్లో అక్రమాస్తుల కేసుకు సంబంధించి బుధవారం ఢిల్లీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఆర్థిక నేరాలకు సంబంధించిన ఆరోపణలపై వాద్రా ఓ దర్యాప్తు సంస్థ ముందు విచారణకు హాజరుకావడం ఇదే తొలిసారి. వాద్రాకు తోడుగా ప్రియాంక కూడా ఈడీ కార్యాలయం వరకు రావడం విశేషం. బుధవారం మధ్యాహ్నం 3.45 గంటలకు తన న్యాయవాదులతో కలిసి వాద్రా ఈడీ విచారణకు హాజరయ్యారు. దాదాపు ఐదున్నర గంటలపాటు వాద్రాను విచారించిన అధికారులు, 40కి పైగా ప్రశ్నలను అడిగినట్లు సమాచారం. రేపు ఉదయం 10.30కి మళ్లీ విచారణకు రావాల్సిందిగా అధికారులు వాద్రాను ఆదేశించారు. అంతకుముందు వాద్రా మాట్లాడుతూ తనకు విదేశాల్లో ఎలాంటి అక్రమాస్తులూ లేవనీ, రాజకీయ కుట్రతోనే ఇదంతా జరుగుతోందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం తనను వెంటాడి వేధిస్తున్నారన్నారు. అక్రమాస్తుల కేసులకు సంబంధించి తనకు ముందస్తు బెయిలు కావాలంటూ వాద్రా గతంలో ఢిల్లీలోని ఓ కోర్టును ఆశ్రయించగా, ఈడీ విచారణకు సహకరించాల్సిందిగా కోర్టు ఆయనకు సూచించింది. ఆర్థిక లావాదేవీలు, లండన్‌లో వాద్రా కొనుగోలు చేసిన, ఆయన అధీనంలో ఉన్న కొన్ని స్థిరాస్తులు తదితరాలపై వాద్రాను నగదు హవాలా నియంత్రణ చట్టం కింద విచారించి ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేస్తామని అంతకుముందు అధికార వర్గాలు తెలిపాయి. లండన్‌లోని 12, బ్ర్యాన్‌స్టన్ స్క్వేర్‌లో 1.9 మిలియన్ పౌండ్లు ఖర్చు పెట్టి వాద్రా ఓ ఆస్తిని కొన్నాడనీ, ఇందుకు ఆర్థికంగా ఆయన అక్రమ మార్గాలను వాడినట్లు ప్రధాన ఆరోపణ. లండన్‌లో మరికొన్ని ఆస్తులను వాద్రా అక్రమంగా కలిగి ఉన్నట్లు తమ వద్ద సమాచారం ఉందని కోర్టుకు ఈడీ తెలిపింది.

నా కుటుంబం వెంటే ఉంటా: ప్రియాంక

భర్త వాద్రాకు తోడుగా ఈడీ కార్యాలయం వరకు ప్రియాంక వచ్చారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా మీరు బాధ్యతలు తీసుకుంటున్న తరుణంలో ఏదైనా రాజకీయ సందేశం పంపడానికే మీరు ఇక్కడకు వచ్చారా?’ అని మీడియా ప్రియాంకను ప్రశ్నించగా ‘ఆయన నా భర్త. ఆయనే నా కుటుంబం. నేను నా కుటుంబానికి మద్దతుగా ఉంటాను’ అని ఆమె చెప్పారు. రాజకీయ కక్షసాధింపుతోనే ఇది జరుగుతోందా అన్న ప్రశ్నకు ‘ఇదంతా ఎందుకు జరుగుతోందో అందరికీ తెలుసు’ అని ఆమె బదులిచ్చారు. బెంగాల్ సీఎం మమత కాంగ్రెస్ పక్షాన నిలుస్తూ, ఎన్నికలకు ముందు బీజేపీ ప్రభుత్వం కావాలనే ఆరోపించారు. వాద్రాను కేసులో ఇరికించే ప్రయత్నం జరుగుతోందని స్థానిక కాంగ్రెస్ నేత, ఈ కేసులో ఇంతకుముందే ఈడీ విచారణను ఎదుర్కొన్న జగదీశ్ శర్మ అన్నారు. మరో హవాలా కేసుకు సంబంధించి ఈ నెల 12న ఈడీ ఎదుట విచారణకు హాజరు కావాల్సిందిగా రాజస్తాన్ హైకోర్టు గతంలో వాద్రాను ఆదేశించింది. కాగా, వాద్రాకు సన్నిహితుడు, ఆయనకు చెందిన స్కైలైట్ హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పీలో ఉద్యోగి మనోజ్ అరోరాను అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఢిల్లీ కోర్టు ఈ నెల 16 వరకు పొడిగించింది.

పెట్రోలియం, రక్షణ ఒప్పందాల్లో వాద్రాకు ముడుపులు: బీజేపీ

వాద్రా ఈడీ విచారణకు హాజరైన నేపథ్యంలో బీజేపీ ఆయనపై బుధవారం పలు ఆరోపణలు చేసింది. యూపీఏ అధికారంలో ఉన్న కాలంలో పెట్రోలియం, రక్షణకు సంబంధించిన ఒప్పందాల్లో వాద్రాకు ముడుపులు అందాయని ఆ పార్టీ ఆరోపించింది. బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర మాట్లాడుతూ ‘2008–09 కాలంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు అందిన ముడుపులతో వాద్రా లండన్‌లో 8 నుంచి 9 స్థిరాస్తులు కొన్నారు’ అని పేర్కొన్నారు. ‘రోడ్ల వెంట తిరిగే వ్యక్తి కోటీశ్వరుడు అవ్వడానికి సూత్రం ఏంటి? కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం అవినీతికి పాల్పడటమే. ఆ పార్టీకి నాయకత్వం వహిస్తున్న కుటుంబంలో ప్రతి ఒక్కరూ బెయిల్‌పై బయటే ఉన్నారని అందరికీ తెల్సు. అవినీతి ముఠాకు, పారదర్శక మోదీ ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న పోరాటమే 2019 లోక్‌సభ ఎన్నికలు’ అని అన్నారు.

విధుల్లో ప్రియాంక

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పు ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను ఆమె పర్యవేక్షించనున్నారు. భర్త వాద్రాను ఈడీ ఆఫీస్ వద్ద దించిన తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆమె బాధ్యతలను చేపట్టారు. తర్వాత కార్యకర్తలతో మాట్లాడారు. ప్రియాంకను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఆమె అన్న, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గత నెలలో నియమించడం తెల్సిందే. ప్రియాంక పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో గురువారమే తన తొలి కార్యక్రమంలో పాల్గొననున్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం వ్యూహరచనకు రాహుల్ అధ్యక్షతన అందరు ప్రధాన కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల ఇన్–చార్జ్‌లతో ఈ సమావేశం జరగనుంది.

ట్రావెన్‌కోర్ బోర్డు యూటర్న్

- మహిళల ప్రవేశంపై తీర్పునకు సమర్థన
- ‘శబరిమల’పై వాదనలు ముగిశాక తీర్పును రిజర్వు చేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలోకి రుతుస్రావ వయసున్న (18 నుంచి 50 ఏళ్లలోపు) మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకించిన ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు బుధవారం అనూహ్యంగా మనసు మార్చుకుంది. శబరిమల ఆలయంలోకి రుతుస్రావ మహిళల ప్రవేశంపై గతేడాది ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సమర్థిస్తున్నట్లు బోర్డు తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేది కోర్టుకు తెలిపారు. జీవసంబంధమైన లక్షణాల ఆధారంగా మహిళలపై వివక్ష చూపించడం సరికాదని వ్యాఖ్యానించారు. కాగా, ఆలయంలోకి మహిళల ప్రవేశంపై అన్నిపక్షాల వాదనలు విన్న రాజ్యాంగ ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది. కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ బోర్డు గతేడాది సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించగా, నాయర్ సర్వీస్ సొసైటీ, ఆలయ తంత్రి తదితరులు తీర్పును సమీక్షించాలని కోరారు.

మతపరమైన సంస్థలకు వర్తించదు..

మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తున్న నాయర్ సర్వీస్ సొసైటీ(ఎన్ఎస్ఎస్) తరఫున సీనియర్ న్యాయవాది కె.పరశరణ్ వాదిస్తూ.. ‘రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 దేశంలోని అన్ని లౌకికవాద సంస్థలకు వర్తిస్తుంది. కానీ మతపరమైన సంస్థలకు ఇది వర్తించదు. ఆర్టికల్ 15 నుంచి మతపరమైన సంస్థలకు స్పష్టమైన మినహాయింపు దొరుకుతోంది. అంటరానితనం నిర్మూలనకు ఉద్దేశించిన ఆర్టికల్ 17ను సుప్రీంకోర్టు పొరపాటున తన తీర్పులో ఉదాహరించింది. ఎందుకంటే కొందరు మహిళలకు కులాల ఆధారంగా ఆలయ ప్రవేశాన్ని నిరాకరించడం లేదు. శబరిమల అయ్యప్పస్వామి నైష్ఠిక బ్రహ్మచారి. ఈ విషయాన్ని తీర్పు సందర్భంగా కోర్టు పరిగణనలోకి తీసుకుని ఉండాల్సింది’ అని తెలిపారు. మరోవైపు అయ్యప్ప స్వామి ఆలయంలోకి కులం, మతం ఆధారంగా మహిళలు, పురుషులపై నిషేధం లేదని బోర్డు మాజీ చైర్మన్ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వ్యాఖ్యానించారు. మహిళల్లోని ఓ వర్గాన్ని మాత్రమే నిషేధిస్తున్నందున ఆర్టికల్ 17(అంటరానితనం నిర్మూలన) దీనికి వర్తించదని పేర్కొన్నారు.

కర్ణాటక సంకీర్ణంలో గుబులు

అసెంబ్లీకి 9 మంది కాంగ్రెస్ సభ్యుల డుమ్మా


సిద్దరామయ్యతో కుమారస్వామి చర్చలు

బెంగళూరు: కర్ణాటకలో కుమారస్వామి ప్రభుత్వానికి మళ్లీ గుబులు మొదలైంది. విప్‌ను ధిక్కరించి 9 మంది కాంగ్రెస్ సభ్యులు బుధవారం అసెంబ్లీకి డుమ్మా కొట్టారు. జనవరి 18న సీఎల్పీ సమావేశానికి గైర్హాజరైన నలుగురు ఇందులో ఉన్నారు. రిసార్ట్‌లో సహచర ఎమ్మెల్యేపై దాడిచేసి పరారైన జేఎన్ గణేశ్ ఈ 9 మందిలో ఉన్నారు. ఫిబ్రవరి 6 నుంచి 15 వరకు జరిగే బడ్జెట్ సమావేశాలకు అందుబాటులో ఉండాలని కాంగ్రెస్ నేత సిద్దరామయ్య తమ పార్టీ సభ్యులందరికీ విప్ జారీచేశారు. కాంగ్రెస్–జేడీఎస్ సర్కారును అస్థిరపరచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో 9 మంది సభ్యులు సభకు రాకపోవడం సందేహాలకు తావిస్తోంది. అందులో నలుగురు సభ్యులు బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అందుకే వారు సిద్దరామయ్య నోటీసులకు స్పందించలేదని తెలుస్తోంది. మరోవైపు, అసెంబ్లీ సమావేశాలు తీవ్ర గందరగోళం నడుమ ప్రారంభమయ్యాయి. సంకీర్ణం చట్టబద్ధతను ప్రశ్నిస్తూ ప్రతిపక్ష బీజేపీ సభ్యులు నినాదాలు చేశారు. ఉభయ సభల్ని ఉద్దేశించి మాట్లాడుతున్న గవర్నర్ వాజూబాయ్ వాలా ప్రసంగానికి అంతరాయం కలిగించారు. దీంతో గవర్నర్ తన ప్రసంగంలో నేరుగా చివరి పేరా చదివి ముగించారు.

లోక్‌పాల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

చైర్మన్, సభ్యుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం


న్యూఢిల్లీ: సామాజికవేత్త అన్నా హజారే దీక్షను విరమించడంతో లోక్‌పాల్ నియామక ప్రక్రియను కేంద్రం ప్రారంభించింది. అవినీతి వ్యతిరేక అంబుడ్స్‌మన్‌గా భావించే లోక్‌పాల్ చైర్మన్, సభ్యుల పదవులకు దరఖాస్తులు కోరుతూ ప్రకటన జారీ అయింది.

అర్హతలు, నిబంధనలు

- లోక్‌పాల్ చైర్మన్ పదవికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా లేదా న్యాయమూర్తిగా పని చేసిన వారు లేదా అవినీతి వ్యతిరేక విధానాలు, ప్రజా పాలన, విజిలెన్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా, న్యాయ శాస్త్రం, మేనేజ్‌మెంట్ తదితర రంగాల్లో కనీసం 25 ఏళ్లు పనిచేసిన అనుభవం ఉన్నవారు అర్హులు.
- 45 ఏళ్లకు తక్కువగా ఉన్నవారు అనర్హులు.
- లోక్‌పాల్‌లో చైర్మన్‌తో పాటు గరిష్టంగా 8 మంది సభ్యులుంటారు. అందులో నలుగురు న్యాయశాస్త్రంలో అనుభవం కలిగి ఉండాలి.
- కనీసం నలుగురికి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు, మహిళల నుంచి అవకాశం కల్పిస్తారు.
- చైర్మన్, సభ్యుల పదవీకాలం ఐదేళ్లు లేదా వారికి 70 ఏళ్లు వచ్చే వరకు(ఏది ముందైతే అది అమలవుతుంది).
- చైర్మన్ జీతభత్యాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వేతనాలకు సమానంగా ఉంటాయి. సభ్యులకు సుప్రీం కోర్టు జడ్జితో సమానంగా చెల్లిస్తారు.
- పదవీ కాలంలో వారు ఎలాంటి ఇతర లాభదాయక పదవులు నిర్వహించరాదు. ఎన్నికల్లో పోటీచేయరాదు.
- దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీ ఫిబ్రవరి 22.

గోవుల కమిషన్‌కు ఆమోదం

- వ్యవసాయ మార్కెట్ల మౌలిక నిధికి రూ. 2 వేల కోట్లు
- పైరసీకి పాల్పడితే మూడేళ్ల జైలు, పది లక్షల జరిమానా
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు



న్యూఢిల్లీ: ఆవుల సంరక్షణ, వాటి సంతాన వృద్ధి కోసం కొత్తగా ఓ కమిషన్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ‘రాష్ట్రీయ కామధేను ఆయోగ్’ పేరుతో ఏర్పాటయ్యే ఈ కొత్త కమిషన్ ఆవుల సంరక్షణ, వాటి సంతాన వృద్ధికి సబంధించిన అంశాలను పర్యవేక్షిస్తుందనీ, దీని ద్వారా దేశీయ జాతులకు చెందిన పశుసంపద పెరుగుతుందని కేంద్ర మంత్రి రవిశంకర్ చెప్పారు. రైతులు, మహిళల ఆదాయం పెరగడానికి ఈ నిర్ణయం దోహదం చేస్తుందన్నారు. వ్యవసాయ మార్కెట్ మౌలిక నిధి (ఏఎంఐఎఫ్)ను రూ. 2 వేల కోట్లతో సృష్టించేందుకు కేబినెట్ ఓకే చెప్పింది. నాబార్డ్ ద్వారా సృష్టించే ఈ నిధి గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు, క్రమబద్ధీకరించిన హోల్‌సేల్ మార్కెట్లలో మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగపడనుంది.

సినిమాటోగ్రాఫ్ చట్ట సవరణకు ఆమోదం

సినిమాటోగ్రాఫ్ చట్ట సవరణలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పైరసీకి పాల్పడితే మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ. 10 లక్షల వరకు జరిమానా లేదా ఈ రెండూ కలిపి విధించాలని ప్రతిపాదించారు. దీనిద్వారా హరియాణాలో ఉన్న ఎన్ఐఎఫ్‌టీఈఎం, తమిళనాడు తంజావూరులోని ఐఐఎఫ్‌పీటీలకు జాతీయ విద్యా సంస్థల హోదా లభిస్తుంది. ప్రసార భారతికి వచ్చే మూడేళ్లలో వివిధ కార్యక్రమాలు, కార్యకలాపాల కోసం రూ. 1,054 కోట్లను కేటాయించనున్నారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో సవరించిన ఆఫీస్ మెమొరాండం (ఓఎం)కు ఆమోదం తెలిపింది.



దీపికారెడ్డికి సంగీత అకాడమీ అవార్డు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మకమైన సంగీత నాటక అకాడమీ అవార్డుకు తెలుగు మహిళ, ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి దీపికారెడ్డి ఎంపికయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి కోవింద్ దీపికా రెడ్డికి సంగీత నాటక అకాడమీ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన దీపికా రెడ్డి గత 47 సంవత్సరాలుగా కూచిపూడి నాట్య రంగంలో తన సేవలను అందిస్తున్నారు. ఆమె ప్రారంభించిన ‘దీపాంజలి’ నృత్య పాఠశాలలో శిక్షణ పొందిన ఎంతోమంది విద్యార్థులు దేశవిదేశాల్లో తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కాగా, సంగీత నాటక అకాడమీ అవార్డును అందుకున్న దీపికారెడ్డిని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ట్విట్టర్‌లో అభినందించారు. 2017 సంవత్సరానికిగానూ సంగీతం, నృత్యం, నాటకాలు, కళా రంగానికి అందించిన సేవలు, సంప్రదాయ గిరిజన నృత్యం–తోలు బొమ్మలాట విభాగాల్లో 42 మంది కళాకారులకు కోవింద్ సంగీత నాటక అకాడమీ అవార్డులను అందజేశారు.

వలసదారులతో సుసంపన్నం

- చట్టబద్ధంగానే అమెరికాలో అడుగుపెట్టాలి
- ‘స్టేట్ ఆఫ్ ది యూనియన్’ ప్రసంగంలో అధ్యక్షుడు ట్రంప్



వాషింగ్టన్: చట్టబద్ధంగా అమెరికాకు వస్తున్న వలసదారులతో దేశానికి ఎన్నో విధాలుగా మేలు జరుగుతోందని అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ప్రతిభ ఆధారిత వలస విధానం ప్రాముఖ్యత మరోసారి నొక్కి చెప్పిన ట్రంప్.. అమెరికా పౌరుల ఉద్యోగాలు, ప్రాణాల్ని పరిరక్షించే ఒక సుదృఢ వలస వ్యవస్థను రూపొందించాల్సిన నైతిక బాధ్యత తమపై ఉందని ఉద్ఘాటించారు. కాంగ్రెస్‌లోని ఉభయ సభల్ని ఉద్దేశించి ఆయన ‘స్టేట్ ఆఫ్ ది యూనియన్’ పేరిట బుధవారం ప్రసంగించారు. ఏటా జరిగే ఈ జరిగే కార్యక్రమం అధ్యక్ష హోదాలో ట్రంప్‌కు రెండోది కావడం గమనార్హం. ప్రతీకార రాజకీయాలను తిరస్కరించాలని, భేదాభిప్రాయాలు పరిష్కరించుకోకుంటే మరో షట్‌డౌన్ వస్తుందని హెచ్చరించారు. ట్రంప్ తన ప్రసంగంలో వివిధ అంశాలపై చెప్పిన విషయాలు ఆయన మాటల్లోనే..

వలసలు, సరిహద్దు గోడపై..

చట్టాలు గౌరవించి, సక్రమంగా అమెరికాకు వస్తున్న వలసదారులు ఎన్నో విధాలుగా మన సమాజాన్ని సుసంపన్నం చేస్తున్నారు. వారు చట్టబద్ధంగా రావాలని కోరుకుంటున్నా. మన పౌరులందరి ప్రయోజనాల్ని రక్షించే ఒక వ్యవస్థను నిర్మించాల్సిన బాధ్యత మనపైనే ఉంది. మెక్సికోతో సరిహద్దు గోడ కోసం కలసి పని చేద్దాం. రాజీకొద్దాం. అమెరికాను గొప్ప దేశంగా తీర్చిదిద్దే ఒప్పందం చేసుకుందాం.

కాంగ్రెస్‌లో విభేదాలపై..

మరో ప్రభుత్వ షట్‌డౌన్ రాకుండా నివారించాలంటే విభేధాల్ని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. పాత గాయాలు మానేలా, భేదాభిప్రాయాలు పక్కనపెట్టి కొత్త పరిష్కారాలు, ఒప్పందాలు చేసుకుందాం. విదేశీ శత్రువులను ఓడించాలంటే స్వదేశంలో మనం కలసి పనిచేయాలి.

తాలిబాన్‌తో చర్చలపై..

అఫ్గానిస్తాన్‌లో తాలిబాన్ ఉగ్రవాదులతో నిర్మాణాత్మక చర్చలు కొనసాగుతున్నాయి. శాంతి స్థాపనకు ప్రయత్నించే సమయం వచ్చింది. తాలిబాన్లతో చర్చల్లో పురోగతి సాధిస్తే, అక్కడ మన సైన్యాన్ని తగ్గించి, ఉగ్ర వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి సారిస్తాం.

చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లు వేయడంపై

చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లు వేయడం ద్వారా అమెరికాకు ప్రతినెలా బిలియన్ల కొద్ది ఆదాయం వస్తోంది. అంతకుముందు, డ్రాగన్ దేశం మనకు ఒక్క డాలర్ కూడా ఇచ్చేది కాదు. దశాబ్దాలుగా అమెరికాకు ప్రతికూలంగా ఉన్న వాణిజ్య విధానాల్ని రద్దుచేయడానికి అధిక ప్రాముఖ్యత ఇస్తున్నాం.

కొత్త అణు ఒప్పందం!

భారత్, పాక్‌లను చేరుస్తూ ట్రంప్ సరికొత్త అణు ఒప్పందాన్ని ప్రతిపాదించారు. భారత్‌కు చెందిన పృథ్వీ, అగ్ని క్షిపణులు, పాక్‌కు చెందిన బాబర్, షహీన్, ఘోరి లాంటి క్షిపణుల ప్రయోగాలపై నియంత్రణ ఉండేలా ఆయన ఈ ప్రతిపాదన తెచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందంలో ఆయన నేరుగా భారత్‌ను ప్రస్తావించలేదు. కాగా, కార్యక్రమానికి డెమొక్రాటిక్ పార్టీకి చెందిన మహిళా సభ్యులు తెలుపు రంగు డ్రెస్‌లలో వచ్చారు. 20వ శతాబ్దంలో ఓటుహక్కు కోసం ఉద్యమించిన మహిళల జ్ఞాపకార్థం వారీ రంగు దుస్తుల్లో వచ్చారు. కాగా, ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌లు ఈ నెల 27, 28న వియత్నాంలో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

సాక్షి బిజినెస్
గురువారం
7-2-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
358 ▲	128 ▲
36,975	11,062

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	7,375	▼ 27
డోజోన్స్	25,393	▼ 18
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,173	▼ 4
డాక్స్	11,325	▼ 43
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,618	▲ 34
నికాయ్	20,874	▲ 30

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	70.85	72.6
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	91.65	94.03
€	యూరో	థామస్‌కుక్	80.7	82.85
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	63.00	68.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	50.35	52.05
SS	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	51.25	54.07
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.75	20.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.55	11.25

వయసైపోతోంది.. రిస్కు తగ్గుతోంది..!

- ఇక కొంతైనా పొదుపు పథకాల్లో పెట్టాలి
- స్టార్టప్ కంపెనీలతో లాభం లేదు
- రాకేష్ ఝున్‌ఝున్‌వాలా వ్యాఖ్యలు

ముంబై: రిస్కులుండే స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులతో కోటీశ్వరుడిగా ఎదిగిన దేశీ ఇన్వెస్ట్‌మెంట్ గురు రాకేష్ ఝున్‌ఝున్‌వాలా... క్రమంగా ఈక్విటీల విషయంలో జోరు కాస్త తగ్గించుకోవాలనుకుంటున్నారు. కొంతైనా సురక్షితమైన పొదుపు పథకాల్లో దాచుకోవాలని భావిస్తున్నారు. వయస్సు మీద పడుతుండటంతో రిస్కులు తగ్గించుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ఆలోచన చేస్తున్నట్లు స్టార్టప్స్ సదస్సు టైకాన్‌లో పాల్గొన్న సందర్భంగా రాకేష్ వెల్లడించారు. 'నాకూ వయస్సు మీద పడుతోంది. రిస్కులను కొంత స్థాయికి పరిమితం చేసుకోవాలి. నా సంపదలో కనీసం 5- 10 శాతం మొత్తాన్ని పొదుపు పథకాల్లోకి మళ్లించాలి అనుకుంటున్నాను' అని ఆయన చెప్పారు. ప్రస్తుతం రాకేష్ సంపద రూ.19,000 కోట్ల పైచిలుకు ఉంటుంది. ఇందులో కేవలం రూ.50,000 మాత్రమే ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఉండగా, రూ.1 కోటి మాత్రం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో ఉందని ఆయన చెప్పారు. తన సంపదలో 5 శాతాన్ని ఇద్దరు సంతానం కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానన్నారు. ఒకవేళ వాళ్లు తన సంపదంతా జూదమాడి తగలెట్టేసినా.. ఎలాగోలా బతికేందుకు ఆ డబ్బు అప్పుడు ఉపయోగపడుతుందని చెప్పారు.

స్టార్టప్ సంస్థల్లో మూసధోరణులు..

చాలా మటుకు స్టార్టప్ సంస్థలు ఎలాంటి ప్రత్యేకత లేకుండా మూస ధోరణుల్లోనే ఉంటున్నాయని రాకేష్ అభిప్రాయపడ్డారు. వాటిల్లో పెట్టుబడులపరంగా గానీ వ్యాపారపరంగా గానీ లాభం ఉంటుందని తనకైతే అనిపించడం లేదన్నారు. 2000, 2007లో స్టార్టప్స్‌లో ఇన్వెస్ట్ చేసిన రెండు సార్లూ నష్టాలే చవిచూసిన నేపథ్యంలో రాకేశ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'చాలా మటుకు స్టార్టప్స్.. ఏదో కొత్తగా చేస్తున్నామంటాయి. కానీ చూస్తే ఒకేరకమైన మూస ధోరణుల్లోనే కనిపిస్తున్నాయి. పెద్దగా ప్రత్యేకతేమీ ఉండటం లేదు. స్టార్టప్స్ వ్యాపారాలను అర్థం చేసుకోవడం కష్టం. అందుకే వాటికి దూరంగా ఉంటున్నాను' అని రాకేష్ చెప్పారు.

ఇప్పుడు వారానికి రెండు సార్లే..

మార్కెట్ కార్యకలాపాలతో నిత్యం బిజీగా ఉండే తాను రిలాక్స్ అయ్యేందుకు గతంలో ప్రతి రోజూ విస్కీ సేవించే వాడినని, ప్రస్తుతం దీన్ని వారానికి రెండు సార్లకు మాత్రమే పరిమితం చేసుకున్నానని రాకేష్ చెప్పారు. అప్పుడప్పుడు యోగా కూడా చేస్తుంటానన్నారు. అనేక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ఆలోచనా సరళిని మార్చేసిన నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో కూడా బీజేపీనే మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నట్లు రాకేష్ తెలిపారు.



గ్యాంబ్లింగ్ అంటే ఇష్టం..

గ్యాంబ్లింగ్ అంటే తనకు చాలా ఇష్టమని రాకేష్ ఝున్‌ఝున్‌వాలా వెల్లడించారు. దేశీయంగా గోవా తరహాలో మిగతా రాష్ట్రాలు కూడా దీన్ని చట్టబద్ధంగా అనుమతించే రోజు త్వరలోనే వస్తుందన్నారు. ఇక మార్కెట్స్ విషయానికొస్తే.. ట్రేడింగ్ అనేది ప్రియురాలు లాంటిదని, దీర్ఘకాలిక పెట్టుబడి భార్యలాంటిదని ఆయన అభివర్ణించారు. రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటేనే సంపద పోగు చేసుకోవడం సాధ్యపడుతుందన్నారు. పెట్టుబడులను ఆషామాషీగా తీసుకోకూడదన్న రాకేష్... వేతన జీవుల్లాంటి నాన్- ప్రొఫెషనల్ ఇన్వెస్టర్లు సాధారణంగా మ్యూచువల్ ఫండ్స్ మార్గాన్ని ఎంచుకోవచ్చని చెప్పారు. మరోవైపు, భారీ వేల్యుయేషన్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్లే ఇటీవలి మార్కెట్స్ పతనంలో ఇన్వెస్టర్లు భారీగా నష్టపోవాల్సి వచ్చిందని తెలిపారు. నియంత్రణ సంస్థల నిర్లిప్తత సహా పలు అంశాలు ఐఎల్అండ్ఎఫ్ఎస్ సంక్షోభానికి కారణమని రాకేష్ అభిప్రాయపడ్డారు. అయితే, గతంతో పోలిస్తే కంపెనీల్లో కార్పొరేట్ గవర్నెన్స్ విధానాలు 5,000 రెట్లు మెరుగుపడ్డాయన్నారు.

కాగ్నిజెంట్ లాభం 65 కోట్ల డాలర్లు

- ఆదాయం 8 శాతం వృద్ధి
- కొత్త సీఈఓగా బ్రియాన్ హంఫ్రీస్



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ గత ఏడాది నాలుగో క్వార్టర్‌లో 65 కోట్ల డాలర్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందటి ఏడాది ఇదే క్వార్టర్‌లో 1.8 కోట్ల డాలర్ల నష్టాలొచ్చాయని కాగ్నిజంట్ తెలిపింది. ఆదాయం 380 కోట్ల డాలర్ల నుంచి 8 శాతం వృద్ధితో 413 కోట్ల డాలర్లకు పెరిగిందని పేర్కొంది. ఫలితాలపై కాగ్నిజంట్ వైస్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఫ్రాన్సిస్కో డిసౌజా సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక పూర్తి ఏడాదిని పరిగణనలోకి తీసుకుంటే 2017లో 150 కోట్ల డాలర్లుగా ఉన్న నికర లాభం గత ఏడాది 40 శాతం వృద్ధితో 210 కోట్ల డాలర్లకు పెరిగింది. ఆదాయం 1,480 కోట్ల డాలర్ల నుంచి 9 శాతం వృద్ధితో 1,610 కోట్ల డాలర్లకు చేరింది. కాగా కంపెనీ కొత్త సీఈఓగా బ్రియాన్ హంఫ్రీస్ నియమితులయ్యారు. ప్రస్తుతం వొడాఫోన్ బిజినెస్ సీఈఓగా వ్యవహరిస్తున్న ఈయన ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కాగ్నిజెంట్ సీఈఓగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు.

మళ్లీ 11,000 పైకి నిఫ్టీ

- ఐదో రోజూ కొనసాగిన లాభాలు
- ఆర్‌బీఐ వైఖరి మారొచ్చని అంచనా
- అన్ని రంగాల షేర్లలో కొనగోళ్లు
- 358 పాయింట్ల లాభంతో 36,975కు సెన్సెక్స్
- 128 పాయింట్లు పెరిగి 11,062కు నిఫ్టీ...



కీలక రేట్ల విషయమై ఆర్‌బీఐ విధానం మారవచ్చనే అంచనాలతో బుధవారం స్టాక్ మార్కెట్ భారీగా లాభపడింది. వడ్డీ రేట్ల ప్రభావిత రంగ షేర్లతో పాటు ఇతర రంగాల షేర్లలో కూడా కొనుగోళ్లు జోరుగా సాగాయి. స్టాక్ సూచీలు వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభపడ్డాయి. స్టాక్ సూచీలు రెండూ ఐదు నెలల గరిష్ట స్థాయికి చేరాయి. ఎన్ఎస్ఈ నిఫ్టీ కీలకమైన 11,000 పాయింట్లపైకి ఎగబాకగా, బీఎస్ఈ సెన్సెక్స్ ఇంట్రాడేలో 37,000 పాయింట్లపైకి చేరింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగుతుండటంతో ఐటీ, లోహ, ఆర్థిక, ఇంధన, ఫార్మా రంగ షేర్లు లాభపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 358 పాయింట్లు పెరిగి 36,975 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 128 పాయింట్ల లాభంతో 11,062 పాయింట్ల వద్ద ముగిశాయి.

నేడు ఆర్‌బీఐ పాలసీ..

మంగళవారం ప్రారంభమైన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం నేడు (గురువారం) ముగియనుంది. కీలక రేట్లపై నిర్ణయాన్ని ఆర్‌బీఐ నేడు వెల్లడిస్తుంది. రేట్ల కోత ఉండకపోవచ్చని, అయితే ద్రవ్యోల్బణం దిగివస్తుండటంతో రేట్ల విషయమై ఆర్‌బీఐ వైఖరి 'తటస్థ' విధానానికి మారవచ్చని అంచనాలున్నాయి. బాండ్ల రాబడులు తగ్గడం, రూపాయి స్వల్పంగా బలపడటం ఈ అంచనాలకు మరింత బలాన్నిచ్చాయని నిపుణులు పేర్కొంటున్నారు. ముడి చమురు ధరలు తగ్గడం, ఈ నెలలో ఇప్పటి వరకూ విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,624 కోట్ల మేర నికర కొనుగోళ్లు జరపడం, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతం వృద్ధి సాధించగలమని కేంద్రం పేర్కొనడం... సానుకూల ప్రభావం చూపించాయి. లాభాల్లో ఆరంభమైన సెన్సెక్స్ రోజంతా అదే జోరు చూపించింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 388 పాయింట్లు, నిఫ్టీ 139 పాయింట్ల వరకూ లాభపడ్డాయి. జపాన్ మార్కెట్ స్వల్పంగా పెరగ్గా, చైనా, దక్షిణ కొరియా మార్కెట్లు చాంద్రమాన కొత్త సంవత్సరాది కారణంగా పనిచేయలేదు. యూరప్ మార్కెట్లు బలహీనంగా ఆరంభమై, స్వల్ప నష్టాల్లో ముగిశాయి.

ఆల్‌టైమ్ హైకి టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్

ఈ క్యూ3లో నికర లాభం 28 శాతం పెరగడంతో టెక్ మహీంద్రా షేర్ భారీగా లాభపడింది. ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.814ను తాకిన ఈ షేర్ చివరకు 8 శాతం లాభంతో రూ.811 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.5,995 కోట్లు పెరిగి రూ.79,588 కోట్లకు ఎగసింది. ఈ షేర్‌తో పాటు ఇన్ఫోసిస్, దివీస్ ల్యాబ్స్, యాక్సిస్ బ్యాంక్, బాటా ఇండియా తదితర షేర్లు జీవిత కాల గరిష్ట స్థాయిలను తాకాయి.

ఆగని అనిల్ షేర్ల పతనం...

అనిల్ అంబానీ షేర్ల పతనం కొనసాగింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ షేర్ ఇంట్రాడేలో 38 శాతం క్షీణించి రూ.142ను తాకింది. చివరకు 32 శాతం నష్టంతో రూ.154 వద్ద ముగిసింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ షేర్ ఇంట్రాడేలో 11 శాతం తగ్గి ముఖ విలువ రూ.5 కంటే దిగువకు, రూ.4.85ను తాకింది. చివరకు 1 శాతం లాభంతో రూ.5.48 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఇతర గ్రూప్ కంపెనీలు- రిలయన్స్ పవర్ 14 శాతం, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ 12 శాతం, రిలయన్స్ నావల్ అండ్ ఇంజినీరింగ్ 11 శాతం చొప్పున నష్టపోయాయి. గత మూడు రోజుల్లో రిలయన్స్ నిప్పన్ అసెట్ మేనేజ్‌మెంట్ షేర్ మినహా అనిల్ అంబానీ గ్రూప్‌నకు చెందిన ఆరు షేర్లు 22 శాతం నుంచి 53 శాతం రేంజ్‌లో పడిపోయాయి.

మూడు సెన్సెక్స్ షేర్లకే నష్టాలు

31 సెన్సెక్స్ షేర్లలో కేవలం మూడు- యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ.. మాత్రమే నష్టపోగా మిగిలిన 29 షేర్లు లాభపడ్డాయి. స్టాక్ సూచీలు భారీగా లాభపడినప్పటికీ, దాదాపు 400 షేర్లు తాజా ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. అరవింద్, ఏబీజీ షిప్‌యార్డ్, ఇక్రా తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

దాల్మియా-ఓసీఎల్ చేతికి జర్మనీ సంస్థ 'జీఎస్‌బీ'

రూ. 122 కోట్లకు కొనుగోలు

న్యూఢిల్లీ: దాల్మియా భారత్ గ్రూప్‌లో భాగమైన దాల్మియా-ఓసీఎల్ తాజాగా జర్మనీకి చెందిన స్పెషాలిటీ రిఫ్రాక్టరీ తయారీ సంస్థ జీఎస్‌బీ గ్రూప్‌ను కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ 15 మిలియన్ యూరోలని (సుమారు రూ. 122 కోట్లు) సంస్థ వెల్లడించింది. యూరప్ మార్కెట్లో కార్యకలాపాలు విస్తరించడానికి ఇది ఉపయోగపడుతుందని వివరించింది. వేడి నిరోధక పదార్థమైన రిఫ్రాక్టరీని.. సిమెంటు, ఉక్కు, అల్యూమినియం మొదలైన వాటి తయారీలో ఉపయోగిస్తారు. దేశీయంగా ఉక్కుకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రిఫ్రాక్టరీల వినియోగం కూడా పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు దాల్మియా-ఓసీఎల్ సీఈవో సమీర్ నాగ్‌పాల్ చెప్పారు. ఏటా 2,50,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో దాల్మియా-ఓసీఎల్ దేశీయంగా రెండో అతి పెద్ద రిఫ్రాక్టరీ కంపెనీగా ఉంది.

'పన్నుల' అంబుడ్స్‌మన్ రద్దు

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్నులు (ఆదాయపన్ను), పరోక్ష పన్నులకు సంబంధించి అంబుడ్స్‌మన్ వ్యవస్థను రద్దు చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పన్ను చెల్లింపుదారులు ఆన్‌లైన్ ఫిర్యాదులు, పరిష్కార యంత్రాంగానికి ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఆదాయపన్నుకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కార లక్ష్యంతో ఇన్‌కమ్‌ట్యాక్స్(ఐటీ) అంబుడ్స్‌మన్ 2003లో ఏర్పాటైంది. దీనివద్దకొచ్చే ఫిర్యాదుల సంఖ్య సింగిల్ డిజిట్‌కు తగ్గిపోయింది. ఆన్‌లైన్ ఫిర్యాదుల విభాగాన్ని ప్రజలు ఎంచుకుంటున్నందున, అంబుడ్స్‌మన్ వ్యవస్థ దీనికంటే మెరుగ్గా లేకపోవడంతో ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ , ఐటీ అంబుడ్స్‌మన్‌ను రద్దుచేసినట్టు ఓ అధికారి తెలిపారు.

12,000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు

12,000 మెగావాట్ల సామర్థ్యం గల గ్రిడ్ అనుసంధానిత సోలార్ పీవీ విద్యుత్ ప్రాజెక్టులను, రూ.8,580 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో ఏర్పాటుకు గాను కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది.



ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వరంగ కంపెనీలే వీటిని ఏర్పాటు చేయనున్నాయని, ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విద్యుత్‌ను వినియోగించుకుంటాయని ప్రభుత్వం తెలిపింది. 2019-20 నుంచి 2022-23 మధ్య నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, నిర్మాణ సమయంలో 60,000 మందికి, నిర్వహణ దశలో 18,000 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపింది. ఇక, అనియంత్రిత డిపాజిట్ పథకాలను నిషేధించే బిల్లుకు సవరణలు చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది.

లాజిస్టిక్స్ కోసం ప్రత్యేక ఫండ్

న్యూఢిల్లీ: దేశీయంగా లాజిస్టిక్స్ రంగానికి తోడ్పాటునిచ్చే దిశగా కేంద్రం కొత్తగా జాతీయ విధానం ముసాయిదాను ప్రకటించింది. లాజిస్టిక్స్ కోసం ప్రత్యేక ఫండ్ ఏర్పాటు, సింగిల్ విండో ఈ-మార్కెట్‌ప్లేస్ మొదలైన ప్రతిపాదనలు ఇందులో పొందుపర్చింది. దీనిపై ఫిబ్రవరి 19లోగా అభిప్రాయాలు తెలపాల్సిందిగా సంబంధిత వర్గాలకు కేంద్ర వాణిజ్య శాఖ సూచించింది. లాజిస్టిక్స్ రంగ పనితీరు సూచీలో భారత ర్యాంకింగ్‌ను 25-30 స్థాయికి మెరుగుపర్చుకోవడం, వ్యవసాయోత్పత్తుల వ్యర్థాల స్థాయిని 5 శాతం కన్నా తక్కువకి తీసుకురావడం, ప్రస్తుతం జీడీపీలో 13-14 శాతంగా ఉంటున్న లాజిస్టిక్స్ వ్యయాలను 10 శాతానికి పరిమితం చేసుకోవడం తదితర లక్ష్యాలు ఇందులో నిర్దేశించుకుంది.

ఈ-కామర్స్ నిబంధనలు సరైనవే

- కాకపోతే ప్రవేశపెట్టిన తీరే తప్పు
- ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్ వ్యాఖ్యలు

ముంబై: విదేశీ పెట్టుబడులున్న ఈ- కామర్స్ కంపెనీలకు సంబంధించి కేంద్రం కొత్తగా ప్రకటించిన నిబంధనలు సరైనవేనని ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్ వ్యాఖ్యానించారు. ఈ-కామర్స్ సంస్థలు కారు చౌక రేట్లతో.. స్థానిక వ్యాపార సంస్థలను నాశనం చేస్తున్నాయన్నారు. భారత్‌లో అంతర్జాతీయ సంస్థలు గుత్తాధిపత్యం చలాయిస్తే చూస్తూ కూర్చోవాల్సిన అవసరం లేదని టైకాన్ 2019 స్టార్టప్స్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. ఈ-కామర్స్ నిబంధనలను ప్రకటించిన తీరు అభ్యంతరకరంగా ఉన్నా, ఈ నిబంధనలు కొంత సముచితమైనవేనన్నారు. మరోవైపు, ఇందులో వ్యాపారాలకు ప్రోత్సాహన్నిచ్చే కోణం కన్నా ఓటు బ్యాంక్ రాజకీయాల కోణమే ఎక్కువగా కనిపిస్తోందని సదస్సులో పాల్గొన్న స్టార్టప్ సంస్థల లాయర్ కరణ్ కల్రా వ్యాఖ్యానించారు. ఒక ప్రత్యేక వర్గానికి ప్రయోజనం చేకూర్చేందుకే ఈ నిబంధనలు ప్రవేశపెట్టినట్లుగా అనిపిస్తోందని సీనియర్ లాయర్ నిశిత్ దేశాయ్ అభిప్రాయపడ్డారు.



విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులున్న ఈ-కామర్స్ కంపెనీలు.. తమ అనుబంధ సంస్థల ఉత్పత్తులను సొంత ప్లాట్‌ఫాంపై విక్రయించరాదని, ధరలను ప్రభావితం చేసేలా ప్రత్యేక మార్కెటింగ్ ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటివి చేయరాదని కేంద్రం ఎఫ్‌డీఐ నిబంధనలు కఠినతరం చేసింది. ఫిబ్రవరి 1 నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. అంతకు ముందు అమెజాన్ ఇండియా ప్లాట్‌ఫాంపై 4 లక్షల పైచిలుకు చిన్న స్థాయి విక్రేతలు ఉండేవారు. తాజా నిబంధనలతో అమెజాన్‌కి చెందిన క్లౌడ్‌టెయిల్, అపారియో సంస్థల కార్యకలాపాలు నిల్చిపోయాయి.

ఆశావహంగా వాల్‌మార్ట్..

నిబంధనలు కఠినం చేసినప్పటికీ భారత మార్కెట్‌పై ఆశావహంగానే ఉన్నట్లు ఫ్లిప్‌కార్ట్‌లో ఇన్వెస్ట్ చేసిన అమెరికా దిగ్గజం వాల్‌మార్ట్ వెల్లడించింది. భారత మార్కెట్లో దీర్ఘకాలిక వ్యాపారానికి కట్టుబడి ఉన్నామని వాల్‌మార్ట్ ఏషియా రీజనల్ సీఈవో డర్క్ వాన్ డెన్ బెర్గీ తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఉపాధి కల్పన, చిన్న వ్యాపార సంస్థలు ..రైతులకు తోడ్పాటు ఇవ్వడం ద్వారా దేశ ఆర్థిక వృద్ధిలో భాగం అవ్వాలన్నదే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

వొడాఫోన్ ఐడియా నష్టం 5,005 కోట్లు

- రూ.11,983 కోట్లకు ఆదాయం
- సీక్వెన్షియల్‌గా 52 శాతం వృద్ధి
- 4జీ కవరేజ్‌పై మరింత దృష్టి !
- కంపెనీ సీఈఓ బాలేశ్ శర్మ వెల్లడి



న్యూఢిల్లీ: టెలికం కంపెనీ వొడాఫోన్- ఐడియాకు ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.5,006 కోట్ల నికర నష్టాలు(కన్సాలిడేటెడ్) వచ్చాయి. వడ్డీ వ్యయాలు అధికంగా ఉండటం, నెట్‌వర్క్ ఇంటిగ్రేషన్ వ్యయాలు కూడా ఎక్కువగా ఉండటం, మొబైల్ టవర్ వ్యాపారం నుంచి నిష్క్రమించిన వ్యయాలు కూడా అధికంగా ఉండటం వల్ల ఈ స్థాయిలో నష్టాలొచ్చాయని కంపెనీ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఈ రెండు కంపెనీలకు కలిసి రూ.1,285 కోట్ల నష్టాలొచ్చాయి. గత ఏడాది ఆగస్టు 31న ఐడియా, వొడాఫోన్‌ల విలీనం పూర్తయినందువల్ల ఫలితాలను పోల్చడానికి లేదు. అయితే సీక్వెన్షియల్‌గా చూస్తే, నికర నష్టాలు మరింతగా పెరిగాయి.

వడ్డీ వ్యయాలు రూ.2,824 కోట్లు...

ఈ క్యూ3లో మొత్తం ఆదాయం రూ.11,983 కోట్లకు పెరిగిందని వొడాఫోన్ ఐడియా తెలిపింది. ఈ క్యూ2లో సాధించిన మొత్తం ఆదాయం రూ.7,879 కోట్లతో పోల్చితే 52 శాతం వృద్ధి సాధించామని కంపెనీ సీఈఓ బాలేశ్ శర్మ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.6,552 కోట్ల ఆదాయం వచ్చిందని వివరించారు. వడ్డీ వ్యయాలు రూ.2,824 కోట్లుగా ఉన్నాయని, మొబైల్ టవర్ల వ్యాపారం నుంచి బైటకు వచ్చామని, దీనికి గాను వెండర్లకు రూ.725 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. గతేడాది డిసెంబర్ 31 నాటికి కంపెనీ మొత్తం రుణ భారం రూ.1,23,660 కోట్లుగా ఉందని తెలిపారు. ఇండస్ టవర్స్‌లో 11.15 శాతం వాటాను విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ వాటా విలువ రూ.4,960 కోట్లుగా ఉండొచ్చన్నారు. అలాగే 1.58 లక్షల కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ను విక్రయించనున్నామని, ఈ విక్రయాల ద్వారా సమకూరిన నిధులను రుణ భారం తగ్గించుకోవడానికి వినియోగిస్తామని తెలిపారు.

రూ.89కు ఏఆర్‌పీయూ..

ఈ క్యూ3లో ఎబిటా రూ.1,137 కోట్లుగా నమోదైందని, ఈ క్యూ2లో 6 శాతంగా ఉన్న మార్జిన్ ఈ క్యూ3లో 9.7 శాతానికి పెరిగిందని బాలేశ్ శర్మ పేర్కొన్నారు. ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 1.5 శాతం పెరిగి రూ.89కు చేరిందని తెలిపారు. ఒక్కో వినియోగదారుడు వినియోగించే డేటా 5.6 జీబీనుంచి 6.2 జీబీకి పెరిగిందన్నారు. 75 కోట్ల మందికి 4జీ సర్వీసులందేలా 11,123 సైట్లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈ క్యూ3లో కొత్తగా 95 లక్షల 4జీ యూజర్లు జతయ్యారని, దీంతో మొత్తం 4జీ కస్టమర్ల సంఖ్య 7.53 కోట్లకు చేరిందని వివరించారు. 4జీ నెట్‌వర్క్ విస్తరణపై దృష్టి పెట్టామని బాలేశ్ శర్మ చెప్పారు. అలాగే 4జీ యూజర్ల సంఖ్యను మరింతగా పెంచుకోవాలనేది లక్ష్యమన్నారు. మూలధన సమీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని, ఈ ప్రణాళికకనుగుణంగా సమీకరించిన నిధులతో వ్యూహాత్మక లక్ష్యాలను సాధించగలమన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు.

తాజా ఏడాది కనిష్టానికి షేరు..

మార్కెట్ ముగిసిన తర్వాత ఆర్థిక ఫలితాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బీఎస్ఈలో వొడాఫోన్ ఐడియా షేర్ 1.6 శాతం నష్టపోయి రూ.29.80 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో తాజా ఏడాది కనిష్ట స్థాయి, రూ.28.80ను తాకింది.

కొనే సంస్థల అభీష్టం మేరకే..!

- మా వాటాలో మెజారిటీ అడిగినా ఇచ్చేస్తాం
- జీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రమోటర్లు...

న్యూఢిల్లీ: రుణ భారం తగ్గించుకునే క్రమంలో అవసరమైతే కంపెనీలో 50 శాతానికి పైగా వాటా విక్రయించడానికి కూడా జీ ఎంటర్‌టైన్‌మెంట్ (జీ) ప్రమోటర్లు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఇద్దరు ఇన్వెస్టర్లతో ఇందుకు సంబంధించి చర్చలు జరుపుతున్నట్లు సంస్థ ఎండీ పునీత్ గోయెంకా చెప్పారు. డీల్ కుదుర్చుకునేందుకు మార్చి- ఏప్రిల్ దాకా కంపెనీ డెడ్‌లైన్ విధించుకున్నట్లు తెలియజేశారు. 'మా ఉద్దేశంలో ఎలాంటి మార్పు లేదు. ఒకవేళ ఎవరైనా 50 శాతానికి మించి వాటాలు కొనుగోలు చేయదల్చుకున్న పక్షంలో, దానిక్కూడా మేం సిద్ధం' అన్నారాయన. రుణాలు చెల్లించేందుకు నిధులు సమీకరించడం కోసం వ్యూహాత్మక భాగస్వామికి 50 శాతం దాకా వాటాలు విక్రయించే ప్రయత్నాల్లో ఉన్నట్లు జీ ప్రమోటర్ సుభాష్ చంద్ర కొద్ది రోజుల క్రితమే చెప్పిన నేపథ్యంలో తాజాగా గోయెంకా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2018 డిసెంబర్ 31 నాటికి జీ లో ప్రమోటర్లకు 41.62% వాటాలుండగా.. అందులో సగం (20%) వాటాలు విక్రయించేందుకు చంద్ర ఆఫర్ ఇచ్చారు. గత నెల 25న జీ మాతృసంస్థ ఎస్సెల్ గ్రూప్‌లో భాగమైన సంస్థల షేర్లలో భారీ అమ్మకాలు వెల్లువెత్తడం, ఒక్క రోజే రూ.13,352 కోట్ల మేర మార్కెట్ విలువ హరించుకుపోవడం తెలిసిందే. ఇన్‌ఫ్రా తదితర వ్యాపారాలు దెబ్బతినడంతో కంపెనీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటూ ఆ మర్నాడే చంద్ర ప్రకటించారు. తనఖాలోఉన్న షేర్లు అమ్మేయకుండా, పరిస్థితులు చక్కబడేదాకా కాస్త సహకరించాలంటూ బ్యాంకర్లు, ఫండ్ హౌస్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నారు.



సమయమివ్వాలంటూ సెబీకి ఫండ్స్ వినతి..


వ్యూహాత్మక ఇన్వెస్టర్లతో ఎస్సెల్ గ్రూప్ ఒప్పందం కుదుర్చుకునేదాకా ఆ సంస్థల డిబెంచర్ ట్రస్ట్ డీడ్‌ల నిబంధనలు సవరించేందుకు అనుమతించాలంటూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీని మ్యూచువల్ ఫండ్ సంస్థలు కోరాయి. ధర తగ్గే కొద్దీ తనఖాలో ఉంచిన షేర్లను విక్రయించకుండా వ్యూహాత్మక ఇన్వెస్టర్‌ను వెతుక్కునే దాకా ఎస్సెల్ గ్రూప్‌నకు కొంత సమయం ఇచ్చేందుకు కొత్త నిబంధనలు ఉపయోగపడే అవకాశముంది. ఎస్సెల్ గ్రూప్ డిబెంచర్లలో మ్యూచువల్ ఫండ్ సంస్థలు దాదాపు రూ.8,000 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

నెలాఖర్లో మజగావ్ డాక్ ఐపీఓ!



ప్రభుత్వ రంగ సంస్థ, మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ఈ నెలాఖర్లో వచ్చే అవకాశాలున్నాయి. ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.500 నుంచి 600 కోట్ల మధ్య నిధులను సమీకరిస్తుందని అంచనా. గత ఏడాది ఆగస్టులోనే ఈ కంపెనీ సెబీ నుంచి ఐపీఓకు అనుమతి పొందింది. ఐపీఓలో భాగంగా 10 శాతం వాటాకు సమానమైన 2.24 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నామని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ సీఎమ్‌డీ రాకేశ్ ఆనంద్ పేర్కొన్నారు. దీంట్లో 5 శాతం మించకుండా షేర్లను ఉద్యోగులకు రిజర్వ్ చేశామని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.4,500 కోట్ల టర్నోవర్ సాధించామని, ఆర్డర్ బుక్ రూ.52,000 కోట్లుగా ఉందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా విక్రయం ద్వారా రూ.80,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంట్లో భాగంగానే మజగావ్ డాక్ కంపెనీ ఐపీఓకు వస్తోంది.

ఆర్‌బీఐ బోర్డ్ సమావేశం వాయిదా!



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డ్ సమావేశం వాయిదా పడింది. 9వ తేదీన జరగాల్సిన ఈ సమావేశం ఫిబ్రవరి 18న జరుగుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2019– 20 మధ్యంతర బడ్జెట్ తరువాత మొట్టమొదటిసారి జరుగుతున్న ఈ బోర్డ్ సమావేశాన్ని ఉద్దేశించి ఆర్థిక మంత్రి కూడా ప్రసంగించాల్సి ఉంది. దీనితోపాటు కేంద్రానికి మధ్యంతర డివిడెండ్ ఎంత ఇవ్వాలన్న అంశంపై సైతం బోర్డ్ సమావేశం నిర్ణయం తీసుకోనుంది. జూలై నుంచి జూన్ మధ్య కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా ఆర్‌బీఐ అనుసరిస్తుంది. దీని ప్రకారం, ఆర్‌బీఐకి డిసెంబర్‌నాటికి మొదటి ఆరు నెలలూ పూర్తయ్యింది. గత ఆర్థిక సంవత్సరం ఆర్‌బీఐ రూ.10,000 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను కేంద్రానికి అందించింది.

బోర్డ్ మీటింగ్స్

టాటా మోటార్స్, సెయిల్, అరబిందో ఫార్మా, బ్రిటానియా ఇండస్ట్రీస్, అర్వింద్, బజాజ్ ఎలక్ట్రికల్స్, క్యాడిలా హెల్త్‌కేర్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఐవీఆర్‌సీఎల్, ఎమ్ఆర్ఎఫ్, ఎమ్ఆర్‌పీఎల్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఆమ్‌టెక్ ఆటో, బామర్ లారీ అండ్ కంపెనీ, కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్, ఈరోస్ ఇంటర్నేషనల్ మీడియా, జిల్లెట్ ఇండియా, మంగళం సిమెంట్, నవ భారత్ వెంచర్స్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	34,250	0
బంగారం (22 క్యారెట్లు)	32,620	0
వెండి (కిలో)	43,600	▼ 400
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	33,410	▲ 10
బంగారం (22 క్యారెట్లు)	31,820	▲ 10
వెండి (కిలో)	43,600	▼ 400
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	33,410	▲ 10
బంగారం (22 క్యారెట్లు)	31,820	▲ 10
వెండి (కిలో)	43,600	▼ 400
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	33,750	▲ 50
బంగారం (22 క్యారెట్లు)	31,220	▼ 20
వెండి (కిలో)	41,500	0
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	34,060	▼ 200
బంగారం (22 క్యారెట్లు)	31,680	▼ 190
వెండి (కిలో)	42,000	▼ 500
విజయవాడ		
బంగారం(24 క్యారెట్లు)	34,400	0
బంగారం (22 క్యారెట్లు)	31,500	0
వెండి (కిలో)	41,400	▼ 200
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	34,400	▲ 10
బంగారం (22 క్యారెట్లు)	31,820	0
వెండి (కిలో)	41,400	▼ 200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	53.98 (రాత్రి 11.30కు)	$53.66 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	62.57 (రాత్రి 11.30కు)	$61.98 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 07-02-2019

విశాఖ	416-00
చిత్తూరు	443-00
వరంగల్	408-00
చెన్నై	450-00
ముంబై	459-00
విజయవాడ	406-00
నమక్కల్	430-00
గోదావరి	406-00
06-02-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	406-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.65
బెంగళూరు	435-00
కోల్‌కత్త	440-00
ఢిల్లీ	433-00

ఈ ఏడాది 78 స్థాయికి రూపాయి!

- ఆర్థిక సేవల కంపెనీ కార్వీ విశ్లేషణ
- బంగారం, వెండిలకు మెరుపు!

న్యూఢిల్లీ: డాలర్ మారకంలో రూపాయి విలువ ఈ ఏడాది 78 స్థాయిని చూసే అవకాశం ఉందని ఆర్థిక సేవల సంస్థ కార్వీ తెలియజేసింది. ద్రవ్యలోటు, కరెంట్ అకౌంట్ లోటులు దీనికి ప్రధాన కారణం కానున్నాయని సంస్థ తన వార్షిక కమోడిటీ, కరెన్సీ నివేదికలో పేర్కొంది. బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు సైతం ఈ ఏడాది గణనీయంగా పెరిగే అవకాశం ఉందని నివేదిక ఆవిష్కరణ సందర్భంగా కార్వీ కమోడిటీస్ అండ్ కరెన్సీల విభాగం సీఈఓ రమేశ్ వరకేద్కర్ తెలిపారు. నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- 68– 69.50 శ్రేణి బేస్‌గా 73.70– 74.50 శ్రేణి కనిష్ట స్థాయికి రూపాయి చేరవచ్చు. ఈ స్థాయి కిందకు పడితే, ఖచ్చితంగా ఇదే ఏడాది రూపాయి 78 దిశగా పతనం అయ్యే అవకాశం ఉంది.
- ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ఫలితంపై తీవ్ర అనిశ్చితి ఉంటుంది. అందువల్ల అటు విదేశీ వ్యవస్థాగత ఇన్వెస్టర్లు ఇటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిదారులు భారత్‌లో పెట్టుబడులకు తక్షణం దూరంగా ఉండే వీలుంది.
- 2017–18 పూర్తి ఆర్థిక సంవత్సరంలో కరెంట్ అకౌంట్ లోటు (ఎఫ్ఐఐ, ఎఫ్‌డీఐ, ఈసీబీలు మినహా దేశంలోకి వచ్చీ-పోయే విదేశీ మారక ద్రవ్యం మధ్య నికర వ్యత్యాసం) 48.72 బిలియన్ డాలర్లుగా ఉంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలలు గడిచే నాటికే ఈ విలువ 34.94 బిలియన్ డాలర్లకు చేరింది. ఇదే విధంగా రెండవ ఆరు నెలల గణాంకాలూ నమోదయితే, క్యాడ్ దేశానికి తీవ్ర భారంగా తయారయ్యే అవకాశం ఉంది.
- ఒపెక్, రష్యాలు తమ ఉత్పత్తుల కోత నిర్ణయం తీసుకుంటే, అంతర్జాతీయంగా క్రూడ్ ధర కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది.
- వాణిజ్య యుద్ధం, అంతర్జాతీయంగా వృద్ధి భయాల వల్ల కాపర్, అల్యూమినియంసహా బేస్‌మెటల్ ధరలు బలహీనంగానే ఉంటాయి.
- సరఫరాల సమస్యల వల్ల పత్తి ధరలు పెరిగే అవకాశం ఉంది.
- అధిక పంట దిగుబడుల వల్ల సోయాబీన్ మార్కెట్‌లో ఈ ఏడాది రెండవ భాగంలో అమ్మకాలు ఒత్తిడి ఉండే వీలుంది.
- తక్కువ దిగుబడివల్ల జీర, చిక్కుడు ధరలు సానుకూలంగా ఉండవచ్చు.



71.56 వద్ద రూపాయి...

డాలర్ మారకంలో రూపాయి విలువ బుధవారం కేవలం ఒక్కపైసా లాభంతో 71.56 వద్ద ముగిసింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో 71.68–71.49 శ్రేణిలో తిరిగింది. అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. క్రూడ్ ధరలు అంతర్జాతీయంగా ఇటీవలి గరిష్ట స్థాయిల నుంచి అనూహ్యంగా 30 డాలర్ల వరకూ పడిపోతూ వచ్చిన నేపథ్యంలో...రూపాయి క్రమంగా కోలుకుని 69.40 స్థాయిని చూసింది. అయితే మళ్లీ క్రూడ్ ధర తాజా కనిష్ట స్థాయిల నుంచి 10 డాలర్లకుపైగా పెరగడంతో రూపాయి జారుడు బల్లమీదకు ఎక్కింది. ఇప్పటికిప్పుడు రూపాయి 68 దిశగా బలపడే అవకాశం లేదన్న అంచనాలు ఉన్నాయి.



నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	812	8.12
CIPLA	545.1	7.3
ZEEL	388.95	6.46
BAJFINANCE	2,718.00	4.39
TATASTEEL	484.85	4.34

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	329.15	-3.13
INDUSINDBK	1,522.75	-1.23
DRREDDY	2,792.00	-1.04
TITAN	1,059.30	-0.69
AXISBANK	726.1	-0.47

రుణ కట్టడికి పటిష్ట చర్యలు అవసరం

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ సూచన

వాషింగ్టన్: రుణాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని భారత్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) సూచించింది. ద్రవ్యలోటు నియంత్రణ విషయంలో గత ప్రణాళికలకు భిన్నంగా ప్రభుత్వం 2019–20 ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యాలను ప్రకటించిన నేపథ్యంలో ఐఎంఎఫ్ తాజా సూచన చేసింది. ''2024–25 నాటికి జీడీపీలో రుణ నిష్పత్తిని 40 శాతానికి (ప్రస్తుతం దాదాపు 70 శాతం) తగ్గించాలన్న ప్రణాళికను 2018–19 బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం ఉద్ఘాటించింది. అయితే ఈ మధ్య కాలిక రుణ లక్ష్యం దిశగా పురోగతిలో మందగమనం కనబడుతోంది'' అని ఐఎంఎఫ్ మిషన్ (ఇండియా) చీఫ్ రానిల్ సల్‌గాడో పేర్కొన్నారు.



ఆందోళన కలిగిస్తున్న ద్రవ్యలోటు!

ప్రభుత్వానికి వచ్చే ఆదాయం– చేసే వ్యయం మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటును పూడ్చుకునే మార్గాల్లో ప్రభుత్వానికి రుణ సమీకరణ ఒకటి. ద్రవ్యలోటు కట్టుతప్పుతుండడం ఆర్థికవర్గాలకు ఆందోళన కలిగిస్తోంది. 2018–19 ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 3.3 శాతంగా ద్రవ్యలోటు ఉండాలని వార్షిక బడ్జెట్ నిర్దేశించింది. విలువలో ఇది రూ.6.24 లక్షల కోట్లు. అయితే 2018 నవంబర్ పూర్తయ్యే నాటికే ఈ లోటు రూ.7.16 లక్షల కోట్లను తాకింది. మెజారిటీ ఆర్థిక సంస్థలు, విశ్లేషణలకు అనుగుణంగానే 2018–19 ద్రవ్యలోటు అంచనాలను 3.4 శాతానికి పెంచుతున్నట్లు ఆర్థికమంత్రి తన తాజా బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం గమనార్హం.

రాయల్టీపై జుబిలంట్ ప్రమోటర్లు వెనక్కి

- సాయంత్రం నిర్ణయం... రాత్రి ఉపసంహరణ
- వివిధ వర్గాల నుంచి వ్యతిరేకత రావటం వల్లే



న్యూఢిల్లీ: డామినోస్ పిజ్జా ఔట్‌లెట్లను నిర్వహిస్తున్న జుబిలంట్ ఫుడ్ వర్క్స్ ప్రమోటర్లు... తమ సంస్థకు వచ్చే మొత్తం ఆదాయంలో 0.25 శాతాన్ని రాయల్టీగా తమకు చెల్లించాలన్న ప్రతిపాదనపై వెనక్కి తగ్గారు. డామినోస్ బ్రాండ్‌పై పిజ్జా ఔట్‌లెట్లు నిర్వహిస్తోంది కనక ఈ సంస్థ తమ మొత్తం ఆదాయంలో కొంత శాతాన్ని ఇప్పటికే అంతర్జాతీయ సంస్థయిన డామినోస్ బ్రాండ్ యాజమాన్యానికి రాయల్టీ రూపంలో చెల్లిస్తోంది. అయితే జూబిలెంట్ ఫుడ్ వర్క్స్, జూబిలెంట్ లైఫ్ సైన్సెస్, జూబిలెంట్ ఇండస్ట్రీస్ సంస్థలు కార్పొరేట్ బ్రాండ్ పేరును ఉపయోగించుకుంటున్నాయి కనక ప్రమోటర్ గ్రూప్ కంపెనీ జూబిలెంట్ ఎన్‌ప్రోకు తమ తమ ఆదాయాల్లో 0.25 శాతం రాయల్టీ కింద చెల్లించాలంటూ గ్రూప్ మంగళవారం తీర్మానించింది. దీనికి బోర్డు ఆమోదించిందంటూ మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో స్టాక్ ఎక్స్ఛేంజీలకు సంస్థ తెలియజేసింది కూడా.

కాకపోతే ఈ ప్రతిపాదనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ప్రమోటర్లు ఇలాంటి ప్రయత్నాలేవో చేస్తున్నారని మంగళవారం మధ్యాహ్నానికే కొన్ని ఛానెళ్లలో వార్తలు గుప్పుమన్నాయి. దీంతో జుబిలంట్ ఫుడ్‌వర్క్స్ షేరు 5–6 శాతం వరకూ పతనమయింది. అయినా సరే సాయంత్రం బోర్డు నిర్ణయాన్ని ఎక్స్ఛేంజీలకు తెలియజేసిన కంపెనీ... వివిధ వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావటంతో రాత్రి 10 గంటల సమయంలో స్టాక్ ఎక్స్ఛేంజీలకు మరో సమాచారాన్ని పంపించింది. తమ ప్రతిపాదనను వెనక్కు తీసుకుంటున్నట్లు ఇందులో తెలియజేసింది. జుబిలంట్ ఫుడ్‌వర్క్స్ దేశీయంగా 1,200 పైచిలుకు డొమినోస్ పిజ్జా రెస్టారెంట్లు, డంకిన్ డోనట్స్ రెస్టారెంట్లను నిర్వహిస్తోంది. జూబిలెంట్ లైఫ్ సైన్సెస్ సంస్థ ఫార్మా, డ్రగ్ డిస్కవరీ సర్వీసుల వ్యాపారం నిర్వహిస్తుండగా, జూబిలెంట్ ఇండస్ట్రీస్ సంస్థ అగ్రి ఉత్పత్తుల వ్యాపారంలో ఉంది. ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకున్నా కూడా... బుధవారం ఒక దశలో జుబిలంట్ ఫుడ్‌వర్క్స్ షేరు 2.5 శాతం పెరిగి... మళ్లీ 4 శాతం వరకూ పతనమైంది. చివరికి కోలుకుని దాదాపుగా లాభనష్టాలు లేని స్థాయిలో ముగిసింది.

విమానయాన శాఖ కార్యదర్శిగా ఎయిరిండియా చీఫ్



న్యూఢిల్లీ: కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శిగా ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా చీఫ్ ప్రదీప్ సింగ్ ఖరోలా నియమితులయ్యారు. జనవరి 31తో పదవీ విరమణ చేసిన రాజీవ్ నయన్ చౌబే స్థానంలో ఆయనను నియమిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. కర్ణాటక క్యాడర్‌లో 1985 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఖరోలా.. గతేడాది జనవరి 9 నుంచి ఎయిరిండియా సీఎండీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

మార్చి క్వార్టర్‌లో రూ.10,000 కోట్ల టార్గెట్

మొండిబాకీల వసూళ్లపై పీఎన్‌బీ లక్ష్యం



ముంబై: వరుసగా మూడు త్రైమాసికాల నష్టాల నుంచి మళ్లీ లాభాల్లోకి మళ్లిన ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మొండిబాకీల (ఎన్‌పీఏ) రికవరీపై గట్టిగా కసరత్తు చేస్తోంది. మార్చి త్రైమాసికంలో కనీసం రూ.10,000 కోట్లు రాబట్టాలని నిర్దేశించుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా రూ.16,600 కోట్ల మొండిబాకీలను రికవర్ చేసుకోగలిగినట్లు బ్యాంక్ ఎండీ సునీల్ మెహతా విశ్లేషకులకు తెలిపారు. 'మార్చి త్రైమాసికంలో రూ.10,000 కోట్ల ఎన్‌పీఏలను రాబట్టగలమని భావిస్తున్నాం. ఇందులో భూషణ్ పవర్ అండ్ స్టీల్, ఎస్సార్ స్టీల్ నుంచి రూ. 6,000 కోట్లు రావొచ్చు' అని ఆయన పేర్కొన్నారు. దివాలా తీసిన ఈ రెండు కంపెనీలకు వచ్చిన బిడ్లను జాతీయ కంపెనీ చట్టం ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదించడంతో.. రుణపరిష్కార ప్రక్రియ దాదాపు తుది దశలో ఉందని మెహతా చెప్పారు. మిగతా రూ. 4,000 కోట్లు ఇతరత్రా చిన్న ఖాతాల నుంచి ఉంటుందన్నారు. నీరవ్ మోదీ స్కామ్‌తో రూ.14,000 కోట్ల మేర దెబ్బతిన్న పీఎన్‌బీ వరుసగా మూడు త్రైమాసికాల పాటు భారీ నష్టాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మూడో త్రైమాసికానికి గానీ మళ్లీ లాభాలు (రూ. 247 కోట్లు) నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో మూడో త్రైమాసిక ఫలితాల వెల్లడి అనంతరం విశ్లేషకులతో భేటీ అయిన సందర్భంగా సునీల్ మెహతా .. మొండిబాకీల రికవరీ లక్ష్యాల ప్రణాళిక వివరించారు.

తగ్గిన అలహాబాద్ బ్యాంక్ నష్టాలు

- తగ్గిన మొండి కేటాయింపులు
- మిశ్రమంగా రుణ నాణ్యత



ప్రభుత్వ రంగ అలహాబాద్ బ్యాంక్ నికర నష్టాలు ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో తగ్గాయి. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.1,264 కోట్లుగా ఉన్న నికర నష్టాలు ఈ క్యూ3లో రూ.733 కోట్లకు తగ్గినట్లు అలహాబాద్ బ్యాంక్ తెలియజేసింది. మొండి బకాయిలకు కేటాయింపులు తగ్గడం వల్ల నష్టాలు కూడా తగ్గాయి. మొత్తం ఆదాయం రూ.4,755 కోట్ల నుంచి రూ.4,757 కోట్లకు పెరిగింది.

తగ్గిన నికర మొండి బకాయిలు..

స్థూల మొండి బకాయిలు 14.38 శాతం నుంచి 17.81 శాతానికి పెరిగాయి. కాకపోతే నికర మొండి బకాయిలు మాత్రం 8.97 శాతం నుంచి 7.70 శాతానికి తగ్గాయి. అంకెల పరంగా చూస్తే, స్థూల మొండి బకాయిలు రూ.23,261 కోట్ల నుంచి రూ.28,219 కోట్లకు పెరగ్గా, నికర మొండి బకాయిలు రూ.13,647 కోట్ల నుంచి రూ.10,865 కోట్లకు తగ్గాయి. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.2,044 కోట్ల నుంచి రూ.1,900 కోట్లకు తగ్గాయి. మొత్తం కేటాయింపులు కూడా రూ.2,413 కోట్ల నుంచి రూ.1,4,95 కోట్లకు తగ్గాయి. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 69.64 శాతానికి పెరిగింది. బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ 2.66 శాతంగా నమోదైంది. కాగా పీసీఏ (ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్) చట్రం నుంచి ఈ ఏడాది జూన్‌కల్లా బయటపడే ప్రయత్నాలు చేస్తున్నామని బ్యాంక్ ఎమ్‌డీ, సీఈఓ ఎస్.ఎస్. మల్లికార్జున రావు చెప్పారు. బ్యాంక్‌కు మరిన్ని నిధులు సమకూర్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. హాంగ్‌కాంగ్ కార్యకలాపాలను మూసేశామని తెలిపారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో అలహాబాద్ బ్యాంక్ షేర్ 1% తగ్గి రూ.42.35 వద్ద ముగిసింది.

పెబ్స్ పెన్నార్ లాభం రూ.2.7 కోట్లు



డిసెంబరు క్వార్టరులో పెన్నార్ ఇంజనీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్ (పెబ్స్ పెన్నార్) నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 29 శాతానికి పైగా పెరిగి రూ.2.72 కోట్లుగా నమోదయింది. టర్నోవరు 33 శాతం పెరిగి రూ.180 కోట్లకు ఎగసింది. ఎబిటా రూ.9.36 కోట్లుగా ఉంది. ఏప్రిల్– డిసెంబరు కాలంలో రూ.466 కోట్ల టర్నోవరుపై రూ.5.17 కోట్ల నికరలాభం నమోదైంది. పీఈబీ విభాగం 44 శాతం వృద్ధి చెంది రూ.157 కోట్ల టర్నోవరు సాధించింది. సోలార్ విభాగం రూ.18.72 కోట్లు, ఇంజనీరింగ్ డివిజన్ 36 శాతం వృద్ధితో రూ.4.9 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేశాయి. సంస్థ చేతిలో ప్రస్తుతం రూ.520 కోట్ల ఆర్డరు బుక్ ఉంది. బుధవారం బీఎస్ఈలో పెబ్స్ పెన్నార్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే 2.94 శాతం పెరిగి రూ.57.70 వద్ద స్థిరపడింది.

అక్టోబర్-డిసెంబర్ త్రైమాసిక ఫలితాలు

విమ్టా లాభం రూ.5 కోట్లు




డిసెంబరు త్రైమాసికంలో విమ్టా ల్యాబ్స్ నికరలాభం క్రితంతో పోలిస్తే 16.6 శాతం తగ్గి రూ.5 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.47 కోట్ల నుంచి రూ.51 కోట్లకు ఎగసింది. ఏప్రిల్–డిసెంబరు పీరియడ్‌లో రూ.161 కోట్ల టర్నోవరుపై రూ.18.5 కోట్ల నికరలాభం నమోదైంది.

బెర్జర్ పెయింట్స్ నికర లాభం రూ.140 కోట్లు



బెర్జర్ పెయింట్స్ కన్సాలిడేటెడ్ లాభం డిసెంబర్ క్వార్టర్లో 2.7 శాతం వృద్ధితో రూ.133.9 కోట్లుగా నమోదైంది. ఆదాయం రూ.1,616.7 కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.130.4 కోట్లు, ఆదాయం రూ.1338.6 కోట్లుగా ఉంది. స్టాండలోన్ నికర లాభం 7.4 శాతం వృద్ధిచెంది రూ.119.5 కోట్లకు చేరుకుంది. ఆదాయం 21 శాతం వృద్ధితో రూ.1,460 కోట్లకు చేరుకుంది.

సిప్లా లాభం 20% డౌన్



ఫార్మా దిగ్గజం సిప్లా డిసెంబర్ త్రైమాసికంలో రూ.322.24 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది క్యూ3లో కంపెనీ ఆర్జించిన రూ.403.45 కోట్ల లాభంతో పోల్చితే 20 శాతం క్షీణత నమోదైంది. 2017–18 డిసెంబర్ క్వార్టర్ ఆదాయం రూ.3,913.82 కోట్లు కాగా, ఈసారి ఆదాయం రూ.4,007.54 కోట్లుగా ఉంది. ఆదాయంలో వృద్ధి నమోదైనప్పటికీ.. లాభాలు తగ్గడానికి కారణం అధిక పన్ను చెల్లింపులని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో వెల్లడించింది. అంతక్రితం ఏడాదిలో రూ.64.23 కోట్ల చెల్లింపులు చేయగా.. ఈసారి రూ.125.68 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని వివరించింది.

సంఘీ ఇండస్ట్రీస్ లాభం 86 శాతం డౌన్

డిసెంబరు క్వార్టరులో సంఘీ ఇండస్ట్రీస్ నికరలాభం క్రితంతో పోలిస్తే 86.6 శాతం తగ్గి రూ.4.32 కోట్లుగా నమోదయింది. టర్నోవరు రూ.285 కోట్ల నుంచి రూ.271 కోట్లకు తగ్గింది. ఏప్రిల్–డిసెంబరు కాలంలో రూ.805 కోట్ల టర్నోవరుపై రూ.26 కోట్ల నికరలాభం సాధించింది.

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లాభం 10% డౌన్



జేఎస్‌డబ్ల్యూ స్టీల్ రూ.1,603 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అధిక వడ్డీ వ్యయం, సముపార్జన ఆస్తుల తరుగుదల, తగ్గిన ఎగుమతులు కారణంగా గతేడాది క్యూ3తో పోలిస్తే ఈ సారి లాభం 10 శాతం తగ్గినట్లు వివరించింది. 2017–18 డిసెంబర్ క్వార్టర్ ఆదాయం రూ.20,355 కోట్లు కాగా, ఈసారి ఆదాయం 11 శాతం వృద్ధి చెంది రూ.18,306 కోట్లుగా నమోదైంది.

లుపిన్ నికర నష్టం రూ.152 కోట్లు



ఫార్మా కంపెనీ లుపిన్ డిసెంబర్ క్వార్టర్‌లో రూ.151.75 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. యూరప్‌లో పిరిన్‌డోప్రిల్ అనే రక్తపోటును తగ్గించే ఔషధానికి సంబంధించిన కేసుకు ఒకే మొత్తం కింద రూ.342.22 కోట్లను కేటాయించిన కారణంగా క్యూ3లో నష్టాన్ని నమోదుచేసినట్లు కంపెనీ వివరించింది. క్రితం ఏడాది ఇదేకాలంలో రూ.221.73 కోట్ల లాభానకంపెనీ ప్రకటించింది. 2017–18 డిసెంబర్ క్వార్టర్ ఆదాయం రూ.3,900.36 కోట్లు కాగా, ఈసారి ఆదాయం రూ.4,377.94 కోట్లుగా నమోదైంది. వ్యయ నియంత్రణ చర్యలు తీసుకోవడం.. లెవోథైరోక్సిన్, రానోలేజైన్ వంటి నూతన ఔషధాల విడుదల ద్వారా ప్రస్తుత క్వార్టర్లో వృద్ధిని నమోదుచేయనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నీలేష్ గుప్త వ్యాఖ్యానించారు.

అదానీ పోర్ట్స్ లాభం రూ.1,419 కోట్లు



అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో రూ.1,419 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో వచ్చిన నికర లాభం (రూ.1,001 కోట్లు)తో పోల్చితే 42 శాతం వృద్ధి సాధించామని ఏపీసెజ్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.2,925 కోట్ల నుంచి రూ.3,169 కోట్లకు పెరిగిందని పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ.1,331 కోట్ల నుంచి రూ.1,348 కోట్లకు పెరిగాయని వివరించింది.

మరికొన్ని కంపెనీల ఫలితాలు క్లుప్తంగా... (రూ. కోట్లలో)

	నికర లాభం			మొత్తం ఆదాయం		
కంపెనీ	2018-19	2017-18	వృ/క్షీ(%)	2018-19	2017-18	వృ/క్షీ(%)
కమ్మిన్స్	187	173	8	1,463	1,318	11
ఇంద్రప్రస్థ గ్యాస్	198	166	19	1,661	1,294	28
జైడస్ వెల్‌నెస్	40	36	10	156	141	10
జిందాల్ స్టెయిన్‌లెస్	52	135	-52	3,141	3,000	5
ముత్తూట్ ఫైనాన్స్	485	479	1	1,717	1,591	8
మణప్పురం	244	211	42	-	-	-
మిండా ఇండస్ట్రీస్	69	59	17	1,470	1,056	39
సీమెన్స్	228	190	20	2,895	2,500	16
సిడ్బి	540	-	34	726	517	40
ఫ్యూచర్ కన్స్యూమర్	(5)	(6)	-	998	789	26
అదానీ పవర్	(1,180)	(1,313)	-	6,667	4,916	36
పుంజ్ లాయిడ్	(2,795)	(184)	-	511	1,169	-

(నష్టం)

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	330.35	339.8
ASIAN PAINT	1469.4	1450.35
AXIS BANK L	725.75	729.5
BAJAJ AUTO	2770.15	2710.65
BAJAJ FINSE	6208.65	6017.1
BAJAJ FINAN	2711.25	2603.6
BHARTI AIRT	308.75	308.2
BHARAT PETR	339.3	337.95
CIPLA LTD	534.95	508
COAL INDIA	219.95	216.4
EICHER MOTO	21104.25	20479.65
GAIL (INDIA	339.8	332.1
GRASIM INDU	733.5	703.95
HCL TECHNOL	1055.2	1047.75
HDFC LTD	1987.95	1981.4
HDFC BANK	2122.65	2114.05
HERO MOTOCO	2880.05	2854.55
HINDALCO I	211.4	204.75
HPCL	233.9	225.15
HUL	1829.95	1821.45
INDIABULLS	653.85	645.4
ICICI BANK	359.3	352.65
INDUSIND BA	1526.05	1541.75
BHARTI INFR	296.35	288.9
INFOSYS LIM	763.3	754.85
INDIAN OIL	137.85	133.75
ITC LTD	277.7	274.15
JSW STEEL L	279.3	273.55
KOTAK MAHIN	1279.5	1279.15
LARSEN & T	1314.4	1304.6
MAHINDRA &M	695.1	684.9
MARUTI SUZU	7183.4	7093.6
NTPC LTD	137.1	138.05
OIL AND NAT	146.7	142.95
POWER GRID	186.8	186.1
RIL	1310.25	1291.55
SBI	289.05	284.65
SUN PHARMA	416.6	409.9
TATA MOTORS	178.5	175.8
TATA STEEL	485.1	464.7
TCS	2074.8	2044.55
TECH MAHIND	811.35	751
TITAN COMPA	1059.05	1066.7
ULTRATECH C	3510.35	3461.75
UPL LIMITED	805.25	795.95
VEDANTA LIM	163.75	162.6
WIPRO LTD	372.2	368.45
YES BANK L	176.45	176.1
ZEE ENTERTA	388	365.35

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1259.9	1257.75
ADITYA BIRL	82.35	81.85
ACC LIMITED	1401.45	1388.8
AMBUJA CEME	214.5	209.25
ASHOK LEYLA	82.55	82.15
BANDHAN BAN	440.4	416.65
BANK OF BAR	109.2	107.95
BHARAT ELEC	81.9	79.8
BHEL	60.8	58.85
BIOCON LIMI	634.55	649.3
BOSCH LIMIT	19248.25	19056.4
BRITANNIA I	3181.4	3167.05
CADILA HEAL	317.95	314.85
COLGATE PAL	1294.9	1291.1
CONTAINER C	510.45	517.4
DABUR INDIA	453.7	449.05
DLF LIMITED	160.35	159.75
AVENUE SUPE	1512.65	1471.7
GENERAL INS	241.45	247.4
GODREJ CONS	705.25	684.5
HAVELLS IND	737.5	730.8
HDFC LIFE I	369.6	376.25
HINDUSTAN Z	256.9	254.8
ICICI LOMBA	899.05	884.6
ICICI PRU L	288.35	286.3
VODAFONE ID	30	30.45
INTERGLOBE	1197.05	1174.4
L&T FINANCE	128.6	126.4
LIC HOUSING	459.8	459.35
LUPIN LIMIT	842.1	837.7
MARICO LIMI	364.95	363.5
UNITED SPIR	557.4	549.9
MOTHERSON S	137.6	136.5
MRF LTD	59936	60004.3
NHPC LTD	24.2	23.8
THE NEW IND	174.6	176.05
NMDC LTD.	95.1	93.9
ORACLE FIN	3879.7	3828.25
OIL INDIA L	171.35	169.5
PIRAMAL ENT	2171.3	2171.1
PETRONET LN	219.45	220.15
P&G HYGIENE	9977.9	9938.5
PIDILITE IN	1125	1119.3
STEEL AUTHO	47.3	45.35
SBI LIFE IN	579.4	584
SHREE CEMEN	16031.15	15675.65
SIEMENS LTD	1020.55	994.6
SHRIRAM TRA	1068.1	1068.1
SUN TV NETW	543.55	522

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	4.98	4.75
Alphageo	435.15	446.55
Alu Flouride	88.5	84.3
Amar Raja Bat	784	771.2
And Bank	24.4	24.35
And Cemen	4.08	4.29
And Paper	447.1	449.1
And Petro	55.5	55.4
Anjani Portl	102.95	108
Aries Agro Ltd	88.15	89.1
Aurobindo Ph	760.65	744.7
Avantel Soft	225.05	220.3
Avanti Feeds	317.55	324.8
BN Rathi Sec	22.3	24.75
Bakelite	14.25	15
Balaji Amin	392.5	392.6
Bambino Agro	185	180
Bartronics	5.9	6.13
Bhagira Chem	416	400
Bhagya Nag	31.3	32.5
Bhaskar Agro	28.95	28.95
Brilliant Sec	0.74	0.77
CIL Securi	15	15
Cont Coffee	270.55	269.5
CoroFert	445.4	452.1
Country Club	6.17	6.51
Cubex Tub	13	13.68
Cybermate	1.83	1.78
DR Reddy	2784.7	2826.25
Danlaw Tec	85.5	84.75
Divi's Lab	1654.1	1616.45
Divya Granit	88	91
Dolphin Medi	0.66	0.66
Dredgin Corp	409.75	384.25
Empee Sugars	1.14	1.2
Everest Org	164.05	158.05
Fortune Info	38	39.25
Four Soft	39.6	36.45
Fourth Gen	2.47	2.36
GMR Infra	15.1	14.8
GVK Power	5.75	5.54
Gati Corpn	69.25	70
Gayatri Proj	165	165.45
Gayatri Sugrs	2.1	2.21
Gennex Lab	2.8	2.98
GodavDru	22.45	21.35
Goldstn Tele	196	201.2
Goldstone Tech	12.96	13.6
Granules (I)	85.5	85.8
HBL Nife Pow	23.7	24.85
HYDIndus	1760	1856.1
Heritage Food	479.9	481.95
HindFlurocarb	13.3	13.3
IDL Industrs	230	235.9
IQMS Soft	9.23	8.8
IVRCL Infras	0.82	0.86
Incap	35	34.85
IndoNationl	650	661
Infotech En	610.8	606.8
Invinex Lab	46.2	48.6
JSTL	34.45	31.75
KCP LTD	84.35	83.9
KNR Constructio	206.5	205.9
Kabsons Indu	4.7	4.68
KakatiCem	169.1	168
Kallam Spg	16	16.55
Kernex Micro	23	23.2
Krebs Bio	88.5	94.45
LGS Global	2.9	2.88
LancoIndus	165.7	165.25
Lokesh Mach	40.25	40
Lotus Choc	22.7	23.65
MIC Elec	0.8	0.84
Madhucon Proje	5.29	5.53
Maytas Infra	9.69	10.19
Medinova Dia	15.75	16.25
Mold-tek	42.85	42.7
Moldtek Plastic	232.95	231.55
Moschip Semi	19.9	19.85
NCLInd	112.1	114.25
NETTLINX	41.75	41.9
NMDC Ltd	95.15	93.95
NagarAgrich	30.75	28
NagarConst	79.75	78.15
Natco Pharma	673	681.35
Nava Bh Ventur	109.8	107.9
Neha Inter	4.2	4.18
Neuland Lab	490.75	486.5
Nihar Info Glo	11.25	11.8
Nile	297.3	296.6
Northgate Tech	0.55	0.57
Oil Country	12.85	12.87
Ortin Lab	13.36	14.2
Padmalaya Tele	2.2	2.1
Panyam Cemen	7.8	8.36
PennInd	34.2	34.75
Phytochem I	37.5	42.4
Pitti Lamin	54.8	54.5
Pokarna	166.65	170.5
Prajay Engs	7.3	7.5
PremiExpl	213	210.7
Prism Cement	75.15	66.55
Raasi Refrac	17.15	18.05
Rain Industries	106.95	103.2
Raj Packagin	27	27.5
Ram Informat	42.45	41.5
RavilGr	13.75	14.45
Reg.Ceramic	3.5	3.36
Restile Cer	3.82	4.2
Sagar Cem	585	605.65
Samkrg Pist	172.9	171.3
SangInd	53.6	54.65
Satvah. Ispat	8.6	9
Saven Techno	23.85	22.75
Shri Shakti	1.03	1.03
Sibar Auto	26.6	28
Softsol	33.95	35.7
SrRayAlk	32.1	32.65
Srinivasa Ship	38.9	39.6
Starchik Sp	30	30
Sujana Towers	1.55	1.53
Sujana Univers	0.26	0.27
Surana Strip	1.84	1.76
Surana Tele	4.4	4.43
Suryachakra Pow	0.28	0.29
SuvarCem	64.1	64
Suven Pharma	220.3	205.55
TCI Finance	13.26	14
Taj Gvk Hotel	174.95	180.15
Tanla Solutions	35.8	34.1
Tirumala Seu	0.91	0.91
Trans Biotek	4.94	5.04
Transport Co	286.3	286.15
Trendy Knit	0.2	0.19
Usher Agro	2.37	2.49
V&K Soft	4	4
VBC Ferro	37.75	37.75
VST Indus	3200	3200
Vamshi Rubb	28	27.85
Viceroy Hotels	2.57	2.7
VijayTextil	37.85	38.9
Vimta Labs	254	251.5
Virat Crane	27.25	27.3
Virinchi Con	71.95	69.9
VisakaInd	362.2	369.05
Vista Pharma	23.95	24.3
Vivimed Labs	22.55	22.1
Vjil Consult	33.5	32.2
ZenoTech Lab	19.55	21.7

జగన్‌పై హత్యాయత్నం కేసులో కేంద్రం తీసుకున్న చర్యలేంటి?

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీల ప్రశ్న

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్న ఘటనపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటని వైఎస్సార్‌సీపీ ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించడంలో ఉన్న అడ్డంకులేంటో చెప్పాలని కేంద్రాన్ని కోరారు. ఈ లిఖితపూర్వక ప్రశ్నకు బుధవారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ సమాధానమిచ్చారు. 2018 అక్టోబరు 25న విశాఖలో ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఫ్యూజన్ ఫుడ్ రెస్టారెంట్‌కు చెందిన ఉద్యోగి దాడికి పాల్పడ్డారని వివరించారు. ఈ కేసును నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్‌ఐఏ)కి అప్పగించామని వివరించారు.

'భోగాపురం' బిడ్డింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వమే రద్దు చేసింది..

టీడీపీ ఎంపీ టీజీ వెంకటేశ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి జయంత్ సిన్హా జవాబిస్తూ.. భోగాపురం ఎయిర్‌పోర్టును పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం టెండర్లు పిలవగా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అర్హత సాధించిన బిడ్డర్‌గా నిలిచిందని చెప్పారు. కానీ రాష్ట్ర ప్రభుత్వమే ఈ బిడ్డింగ్‌ను రద్దు చేసిందని వివరించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం జాప్యమవ్వడానికి ఇదే కారణమైందని వివరించారు. కాగా, తెలంగాణలోని ఈఎస్‌ఐ ఆస్పత్రుల్లో సిబ్బంది ఖాళీలు 38 శాతమున్నాయని కేంద్రం తెలిపింది. టీడీపీ ఎంపీ టీజీ వెంకటేశ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ జవాబిచ్చారు. వైద్యుల పోస్టులు 67, పారా మెడికల్ సిబ్బంది 349, ఇతర పోస్టులు 135 ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

టీడీపీ నేతలు హద్దుమీరి మాట్లాడుతున్నారు: జీవీఎల్

చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర హోం మంత్రికి ఫిర్యాదు



సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ సభ్యుడైన తనను ఉద్దేశించి టీడీపీ నేతలు హద్దులు మీరి బెదిరింపులకు పాల్పడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో ఎన్నికల సమయం కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహంతో ఆ పార్టీ నేతలు రెచ్చిపోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ, కాల్ మనీ సెక్స్ రాకెట్‌లో నిందితుడైన బుద్దా వెంకన్న తనపై చేసిన బెదిరింపులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర డీజీపీకి ఆదేశాలివ్వాలని బుధవారం ఢిల్లీలో రాజ్‌నాథ్‌సింగ్‌ను కలసి జీవీఎల్ కోరారు. ఇక 2014లో టీడీపీతో పొత్తుకోసం ఎవరు ఎవరి దగ్గరకు వచ్చి అడుక్కున్నారో గుర్తుంచుకోవాలని అమిత్ షాను ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై జీవీఎల్ స్పందిస్తూ.. 2004 నుంచి 2014 వరకు పూర్తిగా నిర్వీర్యమైన టీడీపీని కాపాడుకొనేందుకు బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబే తహతహలాడారన్నారు. 2004 ఎన్నికల తరువాత జన్మలో బీజేపీతో పొత్తు పెట్టుకోబోనని చెప్పిన చంద్రబాబు 2014లో తిరిగి తమతో పొత్తుపెట్టుకున్నారని జీవీఎల్ గుర్తు చేశారు.

నకిలీ ఆర్సీలతో జీఎస్టీకి ఝలక్!



రాజధాని పరిధిలో రూ.350 కోట్ల పన్ను ఎగవేత?

- రాష్ట్రవ్యాప్తంగా సుమారు వెయ్యికోట్లు ఉండొచ్చని అంచనా
- లోపాల ఆసరాగా జోరుగా నకిలీ రిజిస్ట్రేషన్లు
- అధికారులు, డీలర్ల మిలాఖత్
- సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ అధికారుల తనిఖీలతో వెలుగులోకి

సాక్షి, విజయవాడ : జీఎస్టీలోని లోపాలను ఆసరాగా చేసుకుని కొంతమంది డీలర్లు అక్రమాలకు తెగబడుతున్నారు. నకిలీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు (ఆర్సీ) తీసుకుని ఏడాదిన్నరగా రూ.వేల కోట్ల టర్నోవర్ చేసి పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలకు రూ.వందల కోట్ల నష్టం వాటిల్లింది. వాణిజ్య పన్నుల శాఖకు చెందిన కీలక అధికారుల అండదండలు లేకుండా ఇలా చేయడం సాధ్యపడదని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అధికారులు చేస్తున్న తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటకు వస్తున్నాయి.

నకిలీ రిజిస్ట్రేషన్ల జోరు..

వ్యాట్ అమలులో ఉన్న రోజుల్లో ఆర్సీ కావాలంటే సంబంధిత సీటీవో కార్యాలయంలో డీలర్లు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. ఆ దరఖాస్తును ఏసీటీవో పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తరువాతే ఆర్సీ ఇచ్చే వారు. దీంతో వ్యాపారస్తులు పన్నులు ఎగవేస్తే ఆ ఏసీటీఓను బాధ్యుడిని చేసేవారు. అయితే, జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ఆర్సీలను తీసుకోవడం సులభతరం చేశారు. డీలర్లు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, పాన్‌కార్డు, రెంటల్ అగ్రిమెంట్ తదితర డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తు రాష్ట్రంలో ఏదైనా ఒక ఏసీటీఓకు ఆన్‌లైన్‌లో చేరుతుంది. సదరు ఏసీటీవో దాన్ని పరిశీలించి రికార్డులు సరిగా ఉన్నాయని భావిస్తే వెంటనే ఆర్సీకి అనుమతించవచ్చు. డాక్యుమెంట్లలో తేడాలు ఉంటే ఆర్సీని తిరస్కరించవచ్చు. అయితే, మూడు రోజులపాటు నిర్ణయం తీసుకోకపోతే డాక్యుమెంట్లు సరిగానే ఉన్నాయని సాఫ్ట్‌వేర్ భావించి ఆర్సీ మంజూరు చేసేస్తుంది. ఈ పద్ధతిలో ఒక జిల్లాకు చెందిన దరఖాస్తులు మరో జిల్లాకు వెళ్తున్నాయి. ఉదాహరణకు.. శ్రీకాకుళంలో ఒక డీలర్ దరఖాస్తు చేసుకుంటే ఆ దరఖాస్తు అనంతపురంలో ఉన్న అధికారి పరిశీలనకు వెళ్లవచ్చు. ఆయన డాక్యుమెంట్లు పరిశీలించి అనుమతించాల్సిందే తప్ప డీలర్‌తో మాట్లాడేందుకు కాని, వ్యక్తిగతంగా తనిఖీ చేసేందుకు వీల్లేకుండా జీఎస్టీలో ఏర్పాటుచేశారు. ఈ విధానంతో ఆర్సీల జారీలో అవకతవకలు జరుగుతాయని అప్పట్లో వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగ సంఘాలు గగ్గోలు పెట్టాయి. అయితే, ముఖ్యమంత్రి ఆదేశాలంటూ ఉన్నతాధికారులు వీరి అభ్యంతరాలను పట్టించుకోలేదు.

రాజధాని పరిధిలో 500పైగా నకిలీ ఆర్సీలు

ఈ నేపథ్యంలో.. విజయవాడలోని రెండు డివిజన్లతో పాటు గుంటూరు, నరసరావుపేటలోని డివిజన్లలో 500కు పైగా నకిలీ ఆర్సీలు జారీ అయ్యాయి. ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారి ఆధార్ కార్డులు, పాన్‌కార్డులు, ఫొటోలు, తప్పుడు అడ్రస్సుతో రెంటల్ అగ్రిమెంట్స్ పెట్టి ట్రాన్స్‌పోర్టర్లు పెద్దఎత్తున ఆర్సీలు సంపాదించారు. ఈ ఆర్సీలను ఉపయోగించి ఆన్‌లైన్‌లోనే వే బిల్లులు తీసుకున్నారు. జీఎస్టీ ప్రకారం ఆన్‌లైన్‌లోనే 50 రోజుల్లోగా రిటర్న్‌లు దాఖలు చేయాలి. అయితే, 50 రోజులు అయినా వాటిని దాఖలు చేయకపోవడంతో అధికారులకు అనుమానం వచ్చింది. తనిఖీలు చేస్తే డీలరుకానీ, ఆయా సంస్థలు కానీ సంబంధిత అడ్రస్‌లో లేవు. విజయవాడ–1 డివిజన్ పరిధిలోని సామారంగం చౌక్, ఇంద్ర కీలాద్రి, పార్కురోడ్డు, డివిజన్–2 పరిధిలో ఆటోనగర్, మచిలీపట్నం తదితర సర్కిళ్లలో ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఐరన్, వస్త్ర రంగాలకు చెందిన కొందరు వ్యాపారస్తులు ఈ విధంగా నకిలీ ఆర్సీలు తీసుకున్నట్లు తెలిసింది. అలాగే, గుంటూరు, నరసరావుపేట, ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో పలువురు గ్రానైట్, టైల్స్ వ్యాపారస్తులు కూడా నకిలీ ఆర్సీలు తీసుకుని సుమారు రూ.350 కోట్లకు పైగా పన్నులు ఎగవేశారని సమాచారం. గత ఏడాదిన్నర కాలంగా రాష్ట్రంలో సుమారు రూ.వెయ్యి కోట్లు పన్ను ఎగవేసి ఉండవచ్చని సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అధికారులు అంచనా వేస్తున్నారు.

> **జీఎస్టీలోని లోపాల వల్లే..**
>
> నకిలీ ఆర్సీలు బయటపడిన మాట వస్తవమే. జీఎస్టీలోని లోపాలను ఆసరాగా చేసుకుని నకిలీ ఆర్సీలు పొందారు. ఈ విషయం గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. నకిలీ ఆర్సీలను రద్దుచేస్తున్నాం. నిందితులను గుర్తించి కఠిన చర్యలకు తీసుకుంటాం.
>
> – వై. కిరణ్‌కుమార్, జాయింట్ కమిషనర్, వాణిజ్య పన్నుల శాఖ

బయటపడింది ఇలా..

ఇటీవల విజయవాడ ఆటోనగర్‌లో వాణిజ్య పన్నుల శాఖాధికారులు పాత ఇనుము లోడుతో ఓ లారీని పట్టుకున్నారు. దీని యజమాని, అడ్రస్ వివరాలు తెలీలేదు. దీంతో కోట్ల రూపాయలు టర్నోవర్ చేసి పన్నులు చెల్లించని వ్యాపారస్తులపై సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అధికారులు నిఘా పెట్టారు. అడ్రస్ సరిగ్గాలేని కొన్ని ఆర్సీలను వీరు గుర్తించారు. దీంతో వాణిజ్య పన్నుల శాఖాధికారులను అప్రమత్తం చేయడంతో వారు తనిఖీలు చేయగా నకిలీ ఆర్సీలు బయటపడ్డాయి. అయితే, వీటి జారీ వెనుక వాణిజ్య పన్నుల శాఖాధికారుల హస్తం ఉందని సమాచారం. కాగా, విజయవాడ–1 డివిజన్‌లో చనిపోయిన వ్యక్తుల పేరుతోనూ ఆర్సీలు జారీచేయడం గమనార్హం.



విజయవాడలోని రాష్ట్ర పన్నుల కార్యాలయంలో పట్టుబడ్డ ఐరన్ స్క్రాప్ లారీ

గవర్నర్‌తో జస్టిస్ చలమేశ్వర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్‌తో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ భేటీ అయ్యారు. బుధవారం రాజ్‌భవన్‌లో జస్టిస్ చలమేశ్వర్ గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శిగా వెంకటరమణ కుమారి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శిగా ఎం.వెంకటరమణ కుమారి నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ మానవేంద్రనాథ్ రాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యుటేషన్ విధానంలో ఆమెను ఈ పోస్టులో నియమించారు. ఇదిలా ఉండగా, విజయవాడ ఏసీబీ మరియు 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి మరియు అదనపు ఎంఎస్‌జేగా ఉన్న బీవీఎల్ఎన్ చక్రవర్తిని హైకోర్టు బదిలీ చేసింది. ఆయనను విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి మరియు రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా నియమించింది. ఈ రెండో అదనపు జిల్లా సెషన్స్ కోర్టుకు ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టు హోదా ఉంది.

17న ఏలూరులో వైఎస్సార్‌సీపీ బీసీ డిక్లరేషన్

- ప్రాంగణానికి జ్యోతీరావు పూలే పేరు
- ఆ పార్టీ సీనియర్ నేతలు వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ వెల్లడి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఈనెల 17న ఏలూరులో జరిగే బీసీ గర్జన సభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల డిక్లరేషన్‌ను ప్రకటించనున్నారని ఆ పార్టీ నేతలు వెల్లడించారు. సభా ప్రాంగణానికి మహాత్మా జ్యోతిరావు పూలే ప్రాంగణంగా నామకరణం చేస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉభయగోదావరి జిల్లాల కో–ఆర్డినేటర్, మాజీ ఎంపీ వైవీసుబ్బారెడ్డి, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీలు ఆళ్ల నాని, పిల్లి సుభాష్‌చంద్రబోస్, బీసీ అధ్యయన కమిటీ కన్వీనర్ జంగా కృష్ణమూర్తి తెలియజేశారు. ఏలూరులో బీసీ గర్జన సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై పార్టీ నేతలతో బుధవారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు మాత్రమే చంద్రబాబుకు బీసీలు గుర్తుకు వస్తారని, నాలుగున్నరేళ్లుగా ఏ రోజూ బీసీ కార్పొరేషన్ల ఏర్పాటుపై మాట్లాడని చంద్రబాబు వైఎస్ జగన్ నవరత్నాలు, బీసీ కులాలకు కార్పొరేషన్లను ప్రకటించిన తర్వాతే చివరి బడ్జెట్‌లో హడావిడిగా ప్రవేశపెట్టారన్నారు. ఏళ్ల తరబడి బీసీ సామాజికవర్గాల ప్రజలు అభివృద్ధికి నోచుకోలేదని, బీసీల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, సమాజంలో గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తూ, అభివృద్ధి పథాన నడిపించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. ఏలూరు నగర శివారులో ఉన్న సర్ సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని హేలాపురి సిటీ ప్రాంగణంలో 17తేదీ మధ్యాహ్నం 3గంటలకు బీసీ గర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని బీసీ సామాజికవర్గాల ప్రజలు భారీసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



సభా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పార్టీ నేతలు బొత్స, వైవీ సుబ్బారెడ్డి, ఆళ్ల నాని, తదితరులు

ఉద్యోగ సంఘాలు కూడా ఆలోచించాలి

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఒకే సామాజిక వర్గానికి పోస్టులలో అధిక ప్రాధాన్యతనివ్వడంపై ఉద్యోగ సంఘాలు కూడా ఆలోచన చేయాలని కోరారు. అధికారంలో ఉన్న వారిని కొందరు ఉద్యోగ సంఘాల నేతలు వెనకేసుకు వస్తున్నారని, ఉద్యోగుల పదోన్నతులు, ఇతర అంశాల్లో అందరికీ సమాన న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. పలువురు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు ఇచ్చిన సమాచారం మేరకే తాము ఆధారాలతో సహా స్పందించామని చెప్పారు.

బీసీల సంక్షేమానికి జగన్ కృషి

బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి, మాజీ మంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ ప్రజాసంకల్ప పాదయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సామాజికవర్గాల ప్రజల కష్టాలు, సమస్యలను వైఎస్ జగన్ స్వయంగా తెలుసుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే బీసీలకు ఏ విధంగా న్యాయం చేస్తుందో తెలియజేస్తూ విధివిధానాలు ప్రకటిస్తారన్నారు.

తెలుగు భాషను అవమానించిన ఏపీ ప్రభుత్వం: యార్లగడ్డ

సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన తాత్కాలిక హైకోర్టు ప్రారంభోత్సవం, శాశ్వత హైకోర్టుకు శంకుస్థాపనలో శిలాఫలకాలను ఆంగ్ల భాషలో మాత్రమే ముద్రించి ఏపీ ప్రభుత్వం తెలుగు భాషను అవమానించిందని కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మండిపడ్డారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ అధికార భాషా చట్టం ప్రకారం ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇంగ్లిష్, తెలుగు భాషలను ఉపయోగించాలని ఉన్నా ప్రభుత్వం దాన్ని అతిక్రమించిదన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు న్యాయమూర్తులను సీఎం చంద్రబాబు కార్యక్రమంలో కూర్చొబెట్టి వారి ద్వారా కూడా చట్టాన్ని ఉల్లంఘింపజేశారన్నారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని యార్లగడ్డ డిమాండ్ చేశారు.

ప్రభాకరుని ఆస్తులు రూ 30కోట్లకు పైగానే?

నెల్లూరు(క్రైమ్): ఏపీఎస్పీడీసీఎల్‌లో యూడీసీగా పనిచేస్తున్న నెమళ్లపూడి ప్రభాకర్‌రెడ్డి అక్రమాస్తులు భారీగా బయటపడుతున్నాయి. నెల్లూరు ఏసీబీ డీఎస్పీ సీహెచ్.శాంతో ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు శివకుమార్‌రెడ్డి, శ్రీహరి, రామకృష్ణ మంగళవారం వనంతోపులోని ఆయన నివాసంతో పాటు చిట్టమూరు మండలంలోని అత్తమామల ఇళ్లు, ప్రభాకర్‌రెడ్డి పని చేసే ఆఫీసులో తనిఖీలు నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి, అతని భార్య, అత్తమామల పేర్లపై 10 ఇంటి స్థలాలు, జీ+1 భవనం, ఎఎస్‌పేట మండలంలో 26.13 ఎకరాల వ్యవసాయ భూమి, స్విఫ్ట్ కారు, రెండు బైక్‌లు, కేజీన్నర బంగారం, రెండు కేజీల వెండి వస్తువులు, ఇంట్లో రూ.47 వేల నగదును అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 2 కోట్లుగా ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

లాకర్లలో బయటపడ్డ బంగారు, వెండి వస్తువులు

సోదాల సమయంలో ప్రభాకర్‌రెడ్డి, అతని భార్య పేరుపై ఎస్‌బీఐ, సిండికేట్ బ్యాంకుల్లో లాకర్లు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. మంగళవారం రాత్రి ఏసీబీ అధికారులు దర్గామిట్టలోని ఎస్‌బీఐ బ్యాంకు లాకరులో 700 గ్రాముల బంగారు ఆభరణాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సిండికేట్ బ్యాంకు లాకర్‌ను తనిఖీచేయగా సుమారు 300 గ్రాముల బంగారు ఆభరణాలు, 600 గ్రాముల వెండి వస్తువులను గుర్తించారు. రెండు బ్యాంకుల్లో పట్టుబడిన బంగారు, వెండి ఆభరణాల విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీంతో ఇప్పటివరకు ఏసీబీ అధికారులు గుర్తించిన అక్రమాస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.2.30 కోట్లు ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.30 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఏసీబీ అధికారులు మంగళవారం ప్రభాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని బుధవారం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించింది.



ఎస్‌బీఐ బ్యాంకు లాకరులో గుర్తించిన ఆభరణాలు

1000 కోట్లు పాయే!

పాస్‌వర్డ్ చెప్పకుండా మృతిచెందిన క్రిప్టో కరెన్సీ సంస్థ సీఈవో



హ్యాక్ చేయలేక ఐటీ నిపుణుల తర్జనభర్జన

ఒక వ్యక్తి మరణం లక్షలాది మంది ఇన్వెస్టర్లను ఆందోళనలోకి నెట్టేసింది. ఏకంగా 19 కోట్ల కెనడా డాలర్ల (రూ.1,030 కోట్లు) సొమ్ము ఫ్రీజ్ అయిపోయింది. ఈ డబ్బును ఎలా వెనక్కి తీసుకురావాలో తెలియక టెక్ దిగ్గజాలు తలలు పట్టుకుంటున్నారు. ఇంతకీ విషయం ఏమిటంటే క్రిప్టో కరెన్సీ అంటే తెలుసు కదా. కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లుబాటు అయ్యే డిజిటల్ కరెన్సీ. దీనిలో పెట్టుబడి పెడితే భారీ మొత్తంలో లాభాలు ఆర్జించవచ్చని ఈ మధ్య కాలంలో చాలామంది దానివైపే మొగ్గు చూపిస్తున్నారు. ఇలా క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు ఆహ్వానించే ఒక కంపెనీయే కెనడాకు చెందిన క్వాడ్రిగాసీఎక్స్. సంస్థ ప్రస్తుత సీఈవో అయిన కెనడాకు చెందిన గెరాల్డ్ కాటన్ 5 ఏళ్ల కిందట నోవా స్కాటియాలో దీనిని స్థాపించారు. ఈ కంపెనీలో ఇన్వెస్టర్లు డబ్బును క్రిప్టో కరెన్సీ రూపంలో డిపాజిట్లు చేశారు.

భారత్‌లోనే మరణం..

ఇక్కడ వరకు అంతా బాగానే ఉన్నా.. అసలు చిక్కల్లా గతేడాది డిసెంబర్‌లో మొదలైంది. గత డిసెంబర్‌లో ఏదో పనుల నిమిత్తం కాటన్ భారత్‌కు వచ్చారు. 30 ఏళ్ల వయసున్న ఆయనకి అప్పటికే జీర్ణకోశ వ్యాధి బాగా ముదిరిపోయింది. మన దేశంలో పర్యటిస్తుండగానే ఆకస్మికంగా కాటన్ మృతిచెందారు. దీంతో ఒక్కసారిగా క్వాడ్రిగాసీఎక్స్‌లో పెట్టుబడి పెట్టినవారిలో ఆందోళన మొదలైంది. ఎందుకంటే ఈ క్రిప్టో కరెన్సీ లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ వాలెట్ పాస్‌వర్డ్‌లు, రికవరీ కీలు కాటన్‌కు తప్ప మరెవరికీ తెలీదు. ఆయన వాటిని ఎక్కడా రాసి పెట్టి కూడా ఉంచలేదు. దీంతో కోట్లాది డాలర్లను ఎలా రికవరీ చేసుకోవాలో తెలియక ఇన్వెస్టర్లంతా లబోదిబోమంటున్నారు. ఆ పాస్‌వర్డ్‌లను కనుక్కోవడానికి సాంకేతిక నిపుణులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా ఫలితాలు మాత్రం శూన్యం.

అతి భద్రతే కొంపముంచింది

డిజిటల్ కరెన్సీ అంటే అన్నీ ఆన్‌లైన్ లావాదేవీలే కాబట్టి గెరాల్డ్ కాటన్ భద్రత విషయంలో చాలా అప్రమత్తంగా ఉండేవారు. తాను వాడే ల్యాప్‌ట్యాప్‌లు, ఈ మెయిల్, వ్యవస్థలన్నింటినీ ఎన్‌క్రిప్ట్ చేసేశారు. ఆ పాస్‌వర్డ్‌లను కనుక్కోవడంలో ఐటీ దిగ్గజాలు కూడా చేతులెత్తేశారు. ఎకడ్బందీ భద్రతా చర్యల కారణంగా తాము ఆ సొమ్మును రికవరీ చేసే పరిస్థితుల్లో లేమంటూ ఆయన భార్య జెన్నిఫర్ రాబర్ట్‌సన్ కోర్టులో అఫిడవిట్ సమర్పించారు. ఇన్వెస్టర్లు మాత్రం చేసేదేమీలేక న్యాయపోరాటానికి సన్నద్ధమవుతున్నారు. కొందరు ఇన్వెస్టర్లేమో ఈ కంపెనీ కుట్ర పన్ని తమను మోసం చేస్తోందంటూ సామాజిక మాధ్యమాల వేదికగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరికొందరేమో క్వాడ్రిగాసీఎక్స్ డిపాజిట్లు ఆన్‌లైన్‌లో చేతులు మారుతున్నాయని, పాస్‌వర్డ్‌లు తెలీకుండా అదెలా జరుగుతోందంటూ ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద ఒక వ్యక్తి మరణంతో 1,000 కోట్ల సొమ్ముకి అతీగతీ లేకపోవడం విస్మయం కలిగించే విషయమే.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం
7-2-2019





30 రోజుల్లో 3 అవకాశాలు
సినిమా పేజీలో...

అమ్మకు శత్రువులు

మామూలుగా అయితే అతడు భర్త అవుతాడు. కడుపున జన్మించినవాడు కొడుకు అవుతాడు. కానీ భర్త, కొడుకు ఒకరితో ఒకరు ఘర్షణ పడితే వారు ఆమెకు శత్రువులౌతారు. వారు పెట్టే ఒత్తిడి ఆమెను శిథిలం చేస్తుందని ఎప్పటికి గ్రహిస్తారు?

సూపర్ మార్కెట్‌లో కొన్న సరుకులను డ్రైవర్ తీసుకుని కారులో పెడుతుంటే ఫ్రెండ్ కనిపించింది.

'హాయ్ రుక్కూ' సంతోషంగా చేతులు పట్టుకుంది.

'ఊ... లగ్జరీ కారు... డ్రైవరు... బాగుందోయ్ నీ సంగతి' అంది మెచ్చుకుంటూ.

రుక్కు అనబడే రుక్మిణికి కూడా స్నేహితురాలు కనిపించడం బాగనిపించింది.

'ఇంటికి రారాదూ ఒకసారి' అని పిలిచింది.

'వస్తాను.. వస్తాను.. నీ భవంతిని తప్పక సందర్శిస్తాను. ఎలా ఉన్నారు మీ ఆయన నీ పిల్లలు' ఫ్రెండ్ అడిగింది.

'వాళ్లకేం. మా ఫ్యాక్టరీ మెల్లగా లాభాల్లో పడింది. పెద్దాడు ఎంబిఏ చేసి ఫ్యాక్టరీ పనులు చూసుకోవడం రెండు నెలలుగా మొదలెట్టాడు. చిన్నాడి చదువు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. లైఫ్ హ్యాపీగా ఉంది'....

చెప్తున్న రుక్మిణి వైపు స్నేహితురాలు సాలోచనగా చూసింది.

ఇద్దరిదీ దాదాపు ఇరవై ఏళ్ల స్నేహం. చిన్నప్పటి నుంచి కాలేజీ వరకూ కలిసి చదువుకున్నారు.

అందుకే అంది–

'కాని నువ్వు సంతోషంగా లేవు రుక్కూ. ఎందుకో సంతోషంగా లేవు. చెక్ చేసుకో. మళ్లీ కాల్ చేస్తాను' అంటూ సూపర్ మార్కెట్‌లోకి వెళ్లిపోయింది.

రుక్మిణికి కలవరంగా అనిపించింది ఆ మాటలకు.

'ఎలా కనిపెట్టింది?' అనుకుంది.

* * *

ఇంటికి చేరుకునేసరికి మధ్యాహ్నం రెండు దాటింది. అన్నం తినాలనిపించలేదు. ఈ మధ్య ఇలాగే ఉంటోంది. ఏదో ఆందోళన.

ఫ్యాక్టరీలోని రిసెప్షనిస్ట్‌కి ఫోన్ చేసింది.

'సార్ ఎక్కడున్నారు?'

'ఆయన కేబిన్‌లో ఉన్నారమ్మా'

'చిన్న సారు'

'చిన్నసారు తన కేబిన్‌లో ఉన్నారు'

'ఇద్దరూ కలిసి భోజనం చేశారా?'

'లేదు... ఎవరికి వారు చేసినట్టున్నారు'

'ఏం టెన్షన్ లేదు కదా'

'ఏం టెన్షన్ లేదమ్మా'

ఆ అమ్మాయి అంటోంది కాని నమ్మకం కలగడం లేదు. టెన్షన్ ఉంది. ఫ్యాక్టరీలో ఉంది. ఇంట్లో కూడా ఉంది.

* * *

వారం క్రితం జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

తండ్రీ కొడుకులు ఇద్దరూ కోపంగా ఇంటికొచ్చారు. కొడుకు విసురుగా తన గదిలోకి వెళ్లిపోయాడు. తండ్రి బుసలు కొడుతూ డ్రాయింగ్ రూమ్‌లో కూలబడ్డాడు. వాళ్లను అలా చూడటం ఆమెకు అదే మొదలు.

'ఏమైందండీ'

'ఫ్యాక్టరీలో నా పరువు తీశాడు'

'అదేంటి?'

'మన దగ్గర ఇరవై ఏళ్లుగా పని చేస్తున్న సీనియర్ వర్కర్‌ను పనిలో నుంచి తీసేశాడు. వాడొచ్చి నా దగ్గర మొరపెట్టుకున్నాడు. అలా తీయడం కరెక్ట్ కాదని చెప్పాను. అందరి ముందు నా మాట లెక్క చేయకుండా తీసేయాల్సిందే అని అకౌంట్ సెటిల్ చేసి పంపించాడు. ఏంటిది?'

కొడుకు లోపలి నుంచి వచ్చాడు.

'మీ నిర్ణయమే చెల్లుబాటయ్యేటట్టుంటే నాకెందుకు ఫ్యాక్టరీ అప్పజెప్పినట్టు. రెండు నెలలుగా చూస్తున్నాను. నా ప్రతి మాటను మీరు తీసిపడేస్తున్నారు. వర్కర్లు బాగా లెక్కలేనితనానికి అలవాటు పడి ఉన్నారు. ఒక్కరూ సరిగ్గా పని చేయడం లేదు. చాలా అవకతవకలు ఉన్నాయి. సరిచేద్దామంటే చేయనిస్తేగా'

'నోర్మూయ్. నీకేం తెలుసని. నిన్నగాక మొన్నొచ్చావ్. ఏ నిర్ణయానికైనా అనుభవం ఉండాలి'

కొడుకు తల్లివైపు చూశాడు.

'ఇదమ్మా వరుస. ఇలాగైతే నాకు ఫ్యాక్టరీ వద్దూ ఇల్లూ వద్దు. వెళ్లిపోతాను'

'పోరా... పోతే పో. బెదిరిస్తున్నావా'

ఆమెకు మెల్లగా తలనొప్పి మొదలైంది. గుండెదడ మొదలైంది. ఆ రాత్రి డిన్నర్ చేయడానికి అనువైన ఆకలీ చచ్చిపోయింది.

* * *

పెద్దకొడుకును ఎం.బి.ఏ చదివించింది ఫ్యాక్టరీ కోసమే. చదువైపోయాక ఫ్యాక్టరీ అజమాయిషీని చూసుకోవాలన్నది కూడా కుటుంబ నిర్ణయమే. కొడుక్కి ఆ పని ఇంట్రెస్ట్ కూడా. కాని ఈ అధికార

> **రాత్రి భర్తకు సర్దిచెప్పబోయింది. 'చూడు... రూపాయికి గతిలేని రోజుల నుంచి రక్తమాంసాలు కరిగించి ఫ్యాక్టరీని ఈ స్థాయికి తెచ్చాను. వీడిలాగే పిచ్చివేషాలేస్తే దానిని అమ్మిపారేస్తాను' అన్నాడు భర్త.**

బదిలీ స్మూత్‌గా జరగడం లేదు. కొడుకు దూకుడుకి తండ్రి అడ్డం పడుతున్నాడు. అవరోధం అవుతున్నాడు. కంగారు పడుతున్నారు. దీనివల్ల ఒకరినొకరు అవమానించుకుంటున్నారు. శత్రువులుగా మారుతున్నారు.

ఇందుకు వొత్తిడి వారికి ఉండాలి. కాని నలిగిపోతోంది తను.

రాత్రి భర్తకు సర్దిచెప్పబోయింది.

'చూడు... రూపాయికి గతిలేని రోజుల నుంచి రక్తమాంసాలు కరిగించి ఫ్యాక్టరీని ఈ స్థాయికి తెచ్చాను. వీడిలాగే పిచ్చివేషాలేస్తే దానిని అమ్మిపారేస్తాను' అన్నాడు భర్త.

కొడుక్కు సర్ది చెప్పబోయింది.

'అమ్మా... ఆయన నన్ను ఉద్యోగిగా అనుకుంటున్నాడా యజమానిగా అనుకుంటున్నాడా అది తేల్చు ముందు' అన్నాడు.

అప్పటి నుంచి తనకు ఏమిటోగా ఉంటోంది.

మనసులో ఏమిటోగా. మెదడులో ఏమిటోగా. తృప్తిగా భోం చేసి చాలా రోజులు. అసలు ఇంట్లో అందరూ కలిసి భోజనం చేసి చాలా రోజులు. ఈ మధ్యాహ్నం కూడా తన పొట్ట ఖాళీయేనా?

ఇంతలో రిసెప్షనిస్ట్ దగ్గర నుంచి ఫోన్ వచ్చింది.

'అమ్మా.. పెద్దసారు చిన్నసారు కేబిన్‌లోకి వెళ్లారు. ఇద్దరూ అరుచుకుంటున్నారు'

అంతే. అప్రయత్నంగా ఆమె చేయి నుదురును తాకింది. తల కొట్టుకుంటూనే ఉంది. కొట్టుకుంటూనే ఉంది. కొట్టుకుంటూ కొట్టుకుంటూ అలానే పడిపోయింది.

* * *

'ఈమెను తెచ్చారేమిటి... రావాల్సింది మీ ఇద్దరు కదా' అంది లేడీ సైకియాట్రిస్ట్ రుక్మిణి భర్తను, కొడుకును చూస్తూ.

వాళ్లు అర్థం కానట్టు చూశారు.

'నేను ఆమెతో మాట్లాడాను. ఇక మాట్లడాల్సింది మీతోనే. మీ మగవాళ్లు ఎప్పటికి మారతారు? మీరు ఆడవాళ్లతో గొడవ పడితే వొత్తిడికి లోనయ్యేది ఆడవాళ్లే. మీరూ మీరూ గొడవపడినా ఒత్తిడి చెందేది ఆడవాళ్లే. భర్త హోదాలో మీరూ కొడుకు హోదా ఇతనూ చెరోవైపు ఆమెను గట్టిగా లాగేసరికి రెక్కలు తెగి పడిందామె. రామ్మోహన్‌రావుగారూ... కొందరు ఉన్నతోద్యోగులు రిటైరైనా తాము ఇంకా అధికారంలో ఉన్నామనుకుంటారు. అలా ఉంది మీ మానసికస్థితి. మీరు ఫ్యాక్టరీ నుంచి తప్పుకునే సమయం వచ్చిందని మీరు అంగీకరించడం లేదు. మీ కొడుకును ఒక సమర్థుడుగా గుర్తించడం లేదు. అతడు కూడా తప్పులు ఒప్పులు చేసి మీలాగే నేర్చుకుంటాడన్న సంగతి మర్చిపోయి అవమానిస్తున్నారు. మీరు సలహాదారుగా ఉండగలరు తప్ప అజమాయిషీదారుగా ఉండకూడదని ఇప్పటికైనా గ్రహించి మీ కుమారుడికి విలువ ఇవ్వండి. అలాగే నువ్వుకూడా చూడు బాబు.. తండ్రితో ఫ్యాక్టరీలో గొడవపడి తండ్రి మర్యాద పోగొట్టడం పెద్ద హీరోయిజం అని ఫీలవుతున్నావు. ఆయన వల్లే నువ్వు. నీ వల్ల ఆయన కాదు. మీరిద్దరు కొట్లాడుకుంటున్నారన్న సంగతి బయటకు పొక్కితే కుటుంబగౌరవం పోతుంది. ఫ్యాక్టరీ ప్రమాదంలో పడుతుంది. అధికారం నువ్వు పొందలేదు. వారసత్వంగా దక్కించుకున్నావు. దానికి తగ్గ యోగ్యత ప్రదర్శించి నమ్మకాన్ని పొందేవరకు మీ నాన్నగారి సలహాలు పాటించు. ఏ అనుభవమూ వృథాపోదు. అన్నింటికంటే ముఖ్యం... కోపతాపాలు మిషన్లకు తెలియవు. నడుస్తాయి. కాని మనిషికి తెలుస్తాయి. మీ కోపతాపాలు మీ ఇంటి స్త్రీని ధ్వంసం చేయక ముందే మేల్కొనండి'....

తండ్రీ కొడుకులు ముఖాముఖాలు చూసుకున్నారు.

* * *

నెల రోజులు గడిచాయి.

సూపర్ మార్కెట్‌లో రుక్మిణికి మళ్లీ స్నేహితురాలు కనిపించింది.

హుషారుగా కనిపిస్తున్న రుక్మిణిని చూసి 'అమ్మయ్య... నా పాత రుక్కూలానే ఉన్నావ్' అంది దగ్గరకు తీసుకుని కావలించుకుంటూ.

ఆడవాళ్లు సంతోషంగా ఉంటే సమాజం సంతోషంగా ఉన్నట్టే.

– కథనం: **సాక్షి ఫ్యామిలీ**

ఇన్‌పుట్స్: **పద్మ పాల్వాయి**, సైకియాట్రిస్ట్

తండ్రి తిరస్కారం

కన్యాదానం ఇవ్వను



అస్మితా ఘోష్ పోస్ట్ చేసిన పెళ్లి ఫొటో

రెండు రోజులుగా ట్విట్టర్‌లో ఒక విశేషం వైరల్ అవుతోంది. అస్మితాఘోష్ అనే యువతి ఈ మధ్య ఒక పెళ్లికి వెళ్లింది. బెంగాలీ పెళ్లే అది. పెళ్లి తంతును మహిళా పూజారులు నిర్వహించారు! అది ఆ అమ్మాయికి సంతోషంగా అనిపించింది. అస్మిత ఫెమినిస్ట్. గాయని. రచయిత్రి. ఆధునిక భావాలు ఉన్న అమ్మాయి కనుక సహజంగానే ఆమెకు పెళ్లి వేదికపై మహిళా పురోహితులు కనిపించడం సంతోషాన్నిచ్చే సంగతి అయింది. మంత్రోచ్చాటనగా వధువును ఆ పురోహితులు పరిచయం చేసిన విధానం కూడా అస్మితను ఆకట్టుకుంది. మొదట వాళ్లు తల్లి పేరు చెప్పారు. తర్వాత తండ్రి పేరు చెప్పారు. ఆ తల్లిదండ్రుల కూతురే ఈ వధువు అని చెప్పారు. తల్లి పేరు ముందు చెప్పడం అస్మితను ముగ్ధురాలిని చేసింది. కన్యాదానం దగ్గరికి వచ్చేసరికి ఆ తండ్రి.. ''నేను కన్యాదానం ఇవ్వను'' అనేశారు! అస్మిత్ పోస్ట్ చేసిన ఫొటోలో లేరు కానీ, పెళ్లికొచ్చిన అతిథులు ఆ మాటకు నివ్వెరపోయారు. ''అవును. నేను కన్యాదానం చేయబోవడం లేదు. నా కూతురు ఆస్తి కాదు. దానం ఇవ్వడానికి'' అన్నారు. ఇది కూడా అస్మితకు నచ్చింది. వెంటనే వధూవరులున్న ఒక ఫొటోను ఎంపిక చేసుకుని, ఫొటోతో పాటు వివరాలను ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. 'అ యామ్ సో ఇంప్రెస్డ్' అని కామెంట్ కూడా పెట్టింది. ఫిబ్రవరి నాలుగున పోస్ట్ పెడితే ఇప్పటికింకా నిరవధికంగా లైక్‌లు వస్తూనే ఉన్నాయి. దాదాపు అందరి అభిప్రాయం ఒక్కటే. 'మెల్లిమెల్లిగా సంప్రదాయాలను, ఆచారాలను మార్చుకుంటూ వస్తున్నాం. ఇది మంచి విషయం' అని. అషీమా అనే అమ్మాయి.. 'ఇది ఏ గ్రహంలో జరిగింది? అందమైన మనుషులు' అని ట్వీట్ చేసింది. దేవి ప్రసాద్ మిశ్రా అనే అతను 'దిస్ ఈజ్ ఎక్స్‌లెంట్. థ్యాంక్యూ ఫర్ షేరింగ్' అని కామెంట్ ఇచ్చాడు. విమల్ అరోరా 'ప్రోగ్రెసివ్' అన్నాడు. రమేశ్ చంద్ర అనే యువకుడు 'వెరీ బ్రేవ్ ఆఫ్ దెమ్! ఆదర్శప్రాయం' అని ట్వీట్ పెట్టాడు. దీనిని బట్టి యువతరం ఆలోచనా ధోరణి అధునాతనం అవుతోందని తెలుస్తోంది. పూర్వ ఆచారాలను వారేమీ పూర్తిగా నిరాకరించడం లేదు. వాటిలోని అంతరార్థాలు తెలిశాక, అవి నచ్చకపోతే తిరస్కరిస్తున్నారు. ఇలాంటి ఘటనే, పశ్చిమబెంగాల్‌లోనే ఇటీవల ఒకటి జరిగింది. వధువు 'కనకాంజలి' అనే ఆచారాన్ని పెళ్లి పీటల మీదే తిరస్కరించింది. వధువు గుప్పెట నిండా బియ్యం తీసుకుని తలపై పోసుకుంటూ, ''నా తల్లిదండ్రుల రుణాన్ని తీర్చేశాను'' అని చెప్పడమే కనకాంజలి ఆచారంలోని పరమార్థం. అయితే ఆ వధువు.. ''తల్లిదండ్రుల రుణం ఎప్పటికీ తీరేదీ, తీర్చుకోగలిగిందీ కాదు. కనుక నేను ఆ మంత్రాన్ని జపించలేను'' అని ధైర్యంగా పురోహితులతో చెప్పడం అనేక మంది అభినందనలకు కారణమైంది. అస్మితా ఘోష్‌ను కూడా ఇప్పుడు మనం అభినందించాలి. ఆమే కనుక ట్వీట్‌లో తను వెళ్లిన పెళ్లిలోని ప్రత్యేకతల గురించి చెప్పకుంటే ఆ ప్రత్యేకతలు అక్కడితో ఆగిపోయేవి.



అస్మితా ఘోష్

చెట్టు నీడ

లోతైన ఆలోచన

ఓ గురువు తన శిష్యులకు చెప్పిన కథ ఇది.

ఓ పడవలో ఓ దంపతులు ప్రయాణం చేస్తున్నారు. ఉన్నట్టుండి పడవ మునిగిపోయే ప్రమాదానికి లోనైంది. ఆ స్థితిలో ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడటానికి పక్కన ఓ చిన్న పడవ ఉంది.

అయితే భార్యను వెనక్కు నెట్టి భర్త మాత్రం ఆ చిన్ని పడవెక్కి తప్పించుకుపోయాడు. అలా తప్పించుకుపోతున్న భర్తను చూసి భార్య పెద్దగా అరుస్తుంది.

భార్య ఏమని చెప్పి ఉంటుందని గురువుగారు అడిగారు.

శిష్యులు ఒక్కొక్కరూ ఒక్కొక్క జవాబు చెప్పారు. కొందరు చెప్పిన జవాబు దాదాపుగా ఒకేలా ఉన్నాయి.

అయితే ఒక్కడు మాత్రం ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉన్నాడు.

గురువుగారు అతని వంక చూసి ''నువ్వేమీ చెప్పలేదేంటీ'' అని అడిగారు.

'''మన బిడ్డను జాగర్తగా చూసుకోండి' అని చెప్పి ఉండొచ్చు గురువుగారూ...'' అన్నాడా శిష్యుడు.

''అవును నువ్వెలా చెప్పగలిగావు, నీకీ కథ ముందే తెలుసా'' అని అడిగారు గురువు.

''లేదు గురువుగారు, మా అమ్మ కూడా చనిపోవడానికి కొన్ని నిముషాల ముందు ఇలాగే చెప్పింది మా నాన్నతో...'' అన్నాడు శిష్యుడు.

ఆ మాటతో క్లాసంతా మౌనం ఆవరించింది.

కాసేపటి తర్వాత గురువు మౌనాన్ని వీడి కథను కొనసాగించారు...

ఆ భర్త తన కూతురుని కంటికి రెప్పలా చూసుకున్నాడు.

కొంత కాలానికి తండ్రి మరణించాడు. కొన్ని రోజుల తర్వాత ఓ రోజు కుమార్తె తన తండ్రి రాసిన డైరీని చూసింది. అప్పుడే తెలిసింది ఆమెకు. తన తల్లికి నయం చేయలేని జబ్బు ఉన్నట్టు. ఆమె ఎలాగూ ఎక్కువ కాలం బతకదని.

పడవ మునిగిపోతున్న దుర్ఘటనను తన తండ్రి ఇలా రాసుకున్నారు.

నీతోపాటు నేనూ సముద్ర గర్భంలోకి కలిసిపోవలసింది. మన ఇద్దరి మరణమూ ఒకేసారి జరగాల్సింది. కానీ నేనేం చెయ్యను... మన బిడ్డను చూసుకోవడానికి నేను మాత్రమే ఒడ్డుకు చేరుకోవలసి వచ్చింది.

కథను ఇంతటితో ఆపేసి గురువుగారు చెప్పారు...

జీవితంలో మంచీ చెడూ అన్నీ జరుగుతాయి. అన్నింటికీ కారణం ఉంటుంది. కానీ కొన్ని సమయాల్లో అది అర్థం కాకుండా పోవచ్చు. కనుక మనం లోతుగా ఆలోచించకుండా ఓ నిర్ణయానికి రాకూడదు.

– యామిజాల జగదీశ్

ప్రతిభ



గుమ్మడి అనురాధ

సిందూరపు కొండల్లో చదువుల మందారం!

'లా' ప్రొఫెసర్‌గా తొలి కోయ యువతి

కమ్యూనిస్టుల ఖిల్లా అయిన ఒకప్పటి ఖమ్మం జిల్లాలోని ఇల్లెందుకు ఐదుసార్లు శాసనసభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన అసామాన్య ప్రజానేత గుమ్మడి నర్సయ్య తనయ గుమ్మడి అనురాధ. కటిక పేదరికం, ఏ మాత్రం సహకరించని ఆర్థిక ఇబ్బందుల వల్ల లక్ష్యాలు మసకబారినా తన ధ్యేయం నుంచి మాత్రం ఆమె పక్కకు జరగలేదు. తనదైన పంథాలో సమాజం రుణం తీర్చుకోవాలనే ఆమె సంకల్పమూ గురి తప్పలేదు. తీవ్ర ప్రతికూలతల మధ్యే కొలిమిలో కాలిన ఇనుములా ఉక్కు సంకల్పంతో విద్యాసుగంధాలు వెదజల్లే కుసుమమై తొలి కోయ న్యాయ విద్య ఆచార్యురాలిగా తెలుగు రాష్ట్రాల్లోనే చరిత్ర లిఖించారు. తండ్రి పేరు ప్రతిష్టలకు దీటైన వారసురాలిగా ఇల్లెందులో గుర్తింపు పొందారు.

గిరిజన హక్కులపై పీహెచ్‌డీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం టేకులగూడెం గ్రామంలో అనురాధ ఒకటీ రెండు తరగతులు చదివారు. మూడో తరగతి నుండి ఇంటర్ వరకు సుదిమళ్లలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చేశారు. ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఏ (హెచ్ఇపీ గ్రూప్) పూర్తి చేశారు. తర్వాత ఓయూ క్యాంపస్‌లో ఎల్ఎల్‌బి, ఎల్ఎల్‌ఎం పూర్తి చేసి, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ పర్యవేక్షణలో 'ట్రైబల్ ప్రాపర్టీ రైట్స్ ఇన్ తెలంగాణా స్పెషల్ రెఫరెన్స్ టు ఖమ్మం' అన్న అంశంపై 2017 మార్చిలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఎస్టీ బ్యాక్‌లాగ్ అధ్యాపక ఉద్యోగ నియామకాల్లో ఆమెకు న్యాయశాఖలో ఉస్మానియా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అదే ఏడాది జూన్‌లో ఉద్యోగం వచ్చింది. ఉస్మానియా చరిత్రలో ఒక గిరిజనమహిళ, అదీ కోయ తెగకు చెందిన మహిళ న్యాయశాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కావడం ఇదే ప్రథమం.

విద్యా సమస్యలపై పోరాటం

అనురాధకు అన్న, అక్క ఉన్నారు. అన్న గ్రామంలోనే వ్యవసాయం చేస్తారు. అక్క ఊరికి దగ్గర్లో ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. తండ్రి గుమ్మడి నర్సయ్య తన చిన్నతనం నుండే ఎన్నో ఒడిదుడుకులతో జీవితాన్ని గడుపుతూ వచ్చారు. (సీపీఐ ఎమ్ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ఉండేవారు. ఎప్పుడూ ప్రజల్లో మమేకమై పనిచేశారు. అందువల్లనే ఐదుసార్లు ఇల్లెందు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన ఇంట్లో ఉండటం చాలా అరుదు కావడం వల్ల అనురాధ అమ్మ అమ్మక్క కుటుంబ భారాన్ని మోశారు. వ్యవసాయం చేస్తూ, అన్నీ తానై పిల్లలను చదివించారు. ప్రయోజకులను చేశారు. అనురాధ చదువుకునే రోజుల్లో న్యూ డెమోక్రసీ పార్టీకి అనుబంధంగా ఉన్న పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంలో ఉన్నారు. విద్యా అంశాలపై పోరాడి, డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలని చేసిన పోరాటంలో అగ్రభాగాన నిలిచారు. తెలంగాణా పోరాట సమయంలోనే నిరాహార దీక్షలు చేపట్టారు.

నాన్న చెప్పిన మాట

''మా నాన్న ఏనాడూ మమ్మల్ని ఎమ్మెల్యే బిడ్డలమన్న భావంతో పెంచలేదు. సాధారణ మధ్యతరగతి వాళ్ల మాదిరిగానే పెంచారు. నేను చదివే స్కూల్‌లో కూడా నన్ను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చూడలేదు. అందరి పిల్లలతోపాటే చూసేవారు. 'పోరాడుతూ చదవాలి, చదువుతూ పోరాడాలి' అని నాన్న ఎప్పుడూ చెప్పే మాటలు నిజంగా నాకు బలాన్ని ఇచ్చాయి.'' అని చెప్పారు అనురాధ. ఈ పోరాట నేపథ్యం కారణంగానే కెరీర్‌లో ఆమెకు అవరోధాలు అడ్డంకులు ఎదురయ్యాయి. ''వాళ్ల నాన్న నక్సలైట్. నక్సలైట్ కూతురికి ఏ ప్రభుత్వ ఉద్యోగమూ ఇవ్వకూడదు. నక్సలైట్ కూతురు అనే ఇంటెలిజెన్స్ రిపోర్టు కూడా ఉంది'' అని నాకు ఉద్యోగం రాకుండా యూనివర్శిటీలో కొందరు ప్రచారం చేశారు. అయితే తోటి అధ్యాపకులు, స్నేహితులు నాకు పూర్తి మద్దతుగా నిలిచారు. నాకు ఉద్యోగం వచ్చేలా సహకారం అందించారు. నాకున్న మెరిట్‌ను బట్టి అసిస్టెంట్ ప్రొఫెసర్‌ని అయ్యాను'' అని చెప్పారు అనురాధ.

– ఎం.ఏ. సమీర్, 'సాక్షి'



యూనివర్శిటీలో బోధన సాగిస్తున్న అనురాధ

అమ్మాయిలు చదవాలి.. ఎదగాలి

మారుమూల గిరిజన పల్లెల్లో గిరిజన అమ్మాయిలను ఎక్కువ చదువులు (ఉన్నత చదువులు) చదివించడానికి తల్లిదండ్రులు ఇష్టపడటంలేదు. చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేసేస్తున్నారు. ఆర్థిక స్థోమత లేనప్పుడు పై చదువులకు ఏం పంపుతామని నిస్సహాయత వ్యక్తపరుస్తున్నారు. అమ్మాయిలను చదివిస్తేనే ఉన్నత శిఖరాలను అవరోహిస్తారు. తల్లిదండ్రులు అమ్మాయిని అబ్బాయితో సమానంగా చూడాలి. ఎప్పటికైనా పరాయి ఇంటికి వెళ్ల వలసిన అమ్మాయి, మనకే అన్నం ముద్ద పెట్టదు అనే ఆలోచన చాలా మందిలో ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మాయిలే తల్లిదండ్రులను చూస్తున్నారు. అమ్మాయిలను తక్కువ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, అబ్బాయిలను కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించడం లాంటివి మానుకోవాలి. పైలట్ అవుతానంటే వద్దనీ, సైన్యంలో చేరతానంటే కాదనీ అమ్మాయిలను తల్లిదండ్రులు అడ్డుకోకూడదు. వారికి ఏరంగంలో ఆసక్తి ఉందో అదే రంగంలో ఉంచాలి. అప్పుడే వారు ఏ రంగంలోనైనా రాణించగలరు. ప్రభుత్వాలు కూడా విద్య ఆవశ్యకత పట్ల గిరిజనుల్లో అవగాహన పెంచాలి. నా రిసెర్చ్ కూడా గిరిజనుల విద్యాభివృద్ధి పైనే.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ గురువారం
7-2-2019

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ గురూ! నేనొక అమ్మాయిని ప్రాణానికి ప్రాణంగా లవ్ చేస్తున్నాను. తనకి ప్రపోజ్ చేస్తే ఓకే అని కూడా అంది. అయితే వాళ్ల సిస్టర్ నన్ను ఇష్టపడుతోందట. ఆ విషయం తనకి తెలిసి నాకు పూర్తిగా దూరమైపోయింది. కనీసం మాట్లాడే అవకాశం కూడా లేకుండా బ్లాక్ చేసింది. ఇప్పుడు తను ఎక్కడుందో ఎలా ఉందో కూడా తెలియట్లేదు. ఇప్పుడు నేనేం చెయ్యాలి?

– శశిధర్

ఎందుకన్నా... ఇంత పెద్ద కథ అల్లావు??

'ఏంటి సార్, అతను చెప్పిందంతా ఒల్లో ల్లోల్లో... ఉత్తుత్తి స్టోరీనా సార్? అయినా నాకు చాలా సిన్సియర్‌గా అనిపించిన స్టోరీలో మీకు ఒల్లోల్లోల్లో... ఉత్తుత్తి స్టోరీ అని ఎలా కనిపించింది సార్??'

'అంత క్లియర్‌గా అల్లిన స్టోరీలా కనపడుతుంటే... నీలాంటి ఇంటెలిజెంట్ అమ్మాయికి ఎలా కనబడట్లేదు నీలూ???'

'సార్..! ఉత్తరం మళ్లీ చదివినా ఒల్లో ల్లోల్లో... ఉత్తుత్తి స్టోరీ లాగా అనిపించలేదు సార్... మీకెలా తెలిసిందో చెప్పండి సార్ ప్లీజ్!?'

నీలూ..! అమ్మాయి సిస్టర్ కూడా ప్రేమించిందన్న విషయం సిస్టర్ అమ్మాయికి చెప్పి ఉండొచ్చు కానీ శశిధర్‌కి ఎలా తెలుస్తుంది నీలూ? మనోడే సిస్టర్‌కి కూడా ఏదో కనెక్షన్ పెట్టి చచ్చాడేమో?! అక్కడే చచ్చి చెడుంటుంది నీలూ!!

'లేదు సార్..! ఒక వేళ శశిధర్ సిన్సియర్ అయితే ఇంకో ఆన్సర్ చెప్పండి సార్ ప్లీజ్!!'

సిన్సియర్‌గా ప్రేమించేవాడయితే... అమ్మాయికి వీడిలో సిన్సియారిటీ కనబడితే... అమ్మాయికి కూడా వీడి మీద లవ్వు ఉండి చస్తే... వస్తుంది. మెల్ల మెల్లగా వస్తుంది.. మళ్లీ బిస్కెట్ వేస్తుంది..

'వేస్తే వేసింది బిస్కెట్ శశిధర్... కానీ ఈ సారి మళ్లీ తోకాడిస్తే వెంటనే ఒప్పుకోవద్దు. కొంచెం బిగువుగా ఉండి గెలువు' అంది నీలాంబరి.

lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

3	6	4	7	8	9	1	5	2
9	5	8	1	3	2	6	7	4
2	7	1	4	6	5	9	3	8
1	9	3	2	7	8	4	6	5
7	8	6	5	9	4	2	1	3
4	2	5	6	1	3	8	9	7
6	3	9	8	2	7	5	4	1
8	4	7	9	5	1	3	2	6
5	1	2	3	4	6	7	8	9

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే రాయాలి. ప్రతి 3X3 వరుసలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

3	6	4	7	8	9	1	5	2
9	5	8	1	3	2	6	7	4
2	7	1	4	6	5	9	3	8
1	9	3	2	7	8	4	6	5
7	8	6	5	9	4	2	1	3
4	2	5	6	1	3	8	9	7
6	3	9	8	2	7	5	4	1
8	4	7	9	5	1	3	2	6
5	1	2	3	4	6	7	8	9

యాత్ర బుకింగ్‌లు చూస్తుంటే హ్యాపీ

\- 'దిల్' రాజు


మహి. వి. రాఘవ్, 'దిల్' రాజు, విజయ్ చిల్లా

''యాత్ర' సినిమా రేపు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. వైఎస్ రాజశేఖర రెడ్డిగారి పాదయాత్ర ఎంత సెన్సేషన్ అయిందో ప్రేక్షకులందరికీ తెలుసు. పాదయాత్రలో ఉన్న ఎమోషన్స్, మూమెంట్స్‌ని తీసుకుని మహి రెడీ చేసిన కథతో విజయ్ 'యాత్ర' నిర్మించారు. మమ్ముట్టిలాంటి లెజెండ్ నటించారు. ఈ సినిమా టీజర్, ట్రైలర్ చూసినప్పుడు, పాటలు విన్నప్పుడు సినిమా ఎప్పుడు చూస్తామా? అనే ఓ ఎగ్జైట్‌మెంట్ కనిపించింది. మా విజయ్‌కి, మహికి ఆల్ ది బెస్ట్'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. మహి వి. రాఘవ్ దర్శకత్వంలో శివ మేక సమర్పణలో విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించిన 'యాత్ర' సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు ఓవర్సీస్‌లో ఈ సినిమా ఓపెనింగ్స్ చాలా స్ట్రాంగ్‌గా ఉన్నాయి. ఓపెనింగ్స్ స్ట్రాంగ్‌గా ఉంటేనే ఆ సినిమాకి రెవెన్యూ పరంగా మంచి మ్యాజిక్ జరుగుతుంది. ఫస్ట్ మంచి ఓపెనింగ్స్ రావాలి.. ఆ తర్వాత మంచి టాక్ రావాలి. ఓ సినిమాకి ఓపెనింగ్స్ అన్నవి ఎప్పుడూ ముఖ్యమే.. కానీ ఇప్పుడు చాలా ముఖ్యం అయిపోయాయి. ఒకప్పుడు సినిమా ఫర్వాలేదు అంటే మెల్లిగా ఓపెనింగ్స్ పెరిగేవి. ఇప్పుడు అలా లేదు.. మంచి ఓపెనింగ్స్ వస్తేనే సినిమా. 'యాత్ర' అడ్వాన్స్ బుకింగ్‌లు చూస్తుంటే చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమాని నైజాం, వైజాగ్ ఏరియాల్లో మా సంస్థ విడుదల చేస్తోంది. వైఎస్‌గారి పాదయాత్ర మూమెంట్స్‌ని ఆ రోజుల్లో టీవీల్లో చూడటం, పేపర్లో చదవటమే. పాదయాత్రతో ఆయన హీరో అయిపోయారు. దాని తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. జనాలకోసం ఏదైనా చేస్తాను అని పాదయాత్ర ద్వారా చూపించారాయన. ఎన్టీ రామారావు గారి తర్వాత మళ్లీ తెలుగు రాష్ట్రాల ప్రజల్లో వైఎస్ గారికే అంత ఇమేజ్ వచ్చింది. అలాంటి ఆయన నేపథ్యంలో వస్తున్న ఈ 'యాత్ర' పెద్ద హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా'' అన్నారు. విజయ్ చిల్లా మాట్లాడుతూ– ''యాత్ర' కోసం ఏడాదిన్నరగా పని చేస్తున్నాం. రేపు విడుదలవుతోందంటే చాలా ఎగ్జైటింగ్‌గా, సంతోషంగా ఉంది. వైఎస్‌గారు రాజకీయ నేత కావొచ్చు.. సినిమాలో రాజకీయాలు ఉండొచ్చు.. కానీ ఇది పూర్తిగా పొలిటికల్ సినిమా కాదు. ఎటువంటి వివాదాలు లేవు. ఈ సినిమా మొత్తానికి సోల్ అండ్ స్పిరిట్ వైఎస్‌గారే. సినిమా చూడండి.. నచ్చితే ఇతరులకు చెప్పండి. ఇది కేవలం ఆయన అభిమానులకే కాదు.. సినిమాను ప్రేమించే వారెవరైనా చూసి ఎంజాయ్ చేయొచ్చు'' అన్నారు.

'యాత్ర' సినిమాను ఉద్దేశిస్తూ దర్శకుడు మహి వి. రాఘవ్ ఓ ప్రకటన విడుదల చేశారు.

'మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి కథను చెప్పడం చాలా గౌరవంగా భావిస్తున్నా. ఆయన కుటుంబం, అభిమానుల నుంచి మాకు అమితమైన ఆదరణ లభించడం గొప్ప విషయం. చిత్రబృందం చాలా కష్టపడింది. దీన్ని మరో సినిమాతో పోల్చి.. ఓ రేస్‌లా చేయకండి. వైఎస్సార్ ప్రయాణంలా భావించి సెలబ్రేట్ చేసుకుందాం'.

'ఎన్టీఆర్, వైఎస్సార్.. ఇద్దరూ ఈ నేలతల్లి బిడ్డలు, తెలుగు జాతి గర్వించదగ్గ నాయకులు. మన భిన్నాభిప్రాయాలు వారిని అగౌరవపర్చడానికి కారణాలు కాకూడదు. నాకు వైఎస్సార్, చిరంజీవిగార్లపై ఉన్న ఇష్టం, అభిమానం ఎప్పటికీ చెరిగిపోదు. మనకు స్ఫూర్తినిచ్చిన వారి సినిమాను సెలబ్రేట్ చేసుకుందాం. అదే మనం వారికిచ్చే గొప్ప నివాళి'.

'మా 'యాత్ర' సినిమాను ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారో తెలుసుకోవాలని చాలా ఆత్రుతగా ఉంది. నిజాయతీగా మీ స్పందన చెప్పండి. నేను వినయంగా వాటిని స్వీకరిస్తా. ఈసారి ఇంకా మంచి కథతో మీ ముందుకు రావడానికి ప్రయత్నిస్తా.. ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

30 రోజుల్లో 3 అవకాశాలు


అమృతా రావ్

దాదాపు 12 ఏళ్ల క్రితం మహేశ్‌బాబు హీరోగా నటించిన 'అతిథి' సినిమాతో తెలుగు తెరపై కనిపించారు ముంబై బ్యూటీ అమృతా రావ్. ఆ తర్వాత ఆమె ఒక్క తెలుగు సినిమా కూడా చేయలేదు. కొన్ని హిందీ సినిమాలు చేశారామె. 2013 తర్వాత హిందీ సినిమాల్లో కూడా నటించలేదు. ఆరేళ్ల విరామం తర్వాత ఆమె ఈ ఏడాది గత నెల 'థాక్రే' అనే హిందీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. 'అతిథి' తర్వాత తెలుగు సినిమాలు చేయకపోవడానికి గల కారణాన్ని ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారామె. ''అతిథి' నాకు డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్‌గా మిలిగింది. ఆ సినిమాలో మహేశ్‌బాబు పాత్రకు సమానంగా నా పాత్ర ఉంది. ఆ సినిమా లొకేషన్‌లో నాతో మహేశ్‌బాబు, నమ్రత ఫ్యామిలీ మెంబర్స్‌లా ఉండేవారు. వారి ఇంటి భోజనం కూడా తిన్నాను. 'అతిథి' తర్వాత నాకు 30 రోజుల వ్యవధిలో మూడు అవకాశాలు వచ్చాయి. కానీ నేనే వద్దనుకున్నాను. టాలీవుడ్‌లో కథానాయిక పాత్రలు గ్లామర్ కోసమే అనిపించింది. దక్షిణాది సినిమాలు చేసేది తొందరగా డబ్బు సంపాదించుకోవడం కోసమే అని నాతో కొందరు అన్నారు. తెలుగు డైలాగ్స్ పలకడం కోసం పెద్దగా ఇబ్బంది పడవద్దని, సులభంగానే డబ్బింగ్ చెప్పించేయొచ్చని అని కూడా అన్నారు. కానీ నా వర్కింగ్ స్టైల్ అది కాదు. నటనకు సంబంధించి నా దృష్టిలో డబ్బు ముఖ్యం కాదు'' అన్నారు అమృతా రావ్. హిందీలో గత ఆరేళ్లల్లో నచ్చిన పాత్రలు రాకపోవడంవల్లే చేయలేదని స్పష్టం చేశారు.



యాంకర్‌కు ఆస్కారం లేదు

'అండ్ ది అవార్డ్ ఫర్ ది బెస్ట్ మూవీ గోస్ టూ..' అంటూ ప్రతీ అవార్డ్ ఫంక్షన్‌ను రక్తి కట్టించేది యాంకరే. అయితే అన్ని అవార్డ్స్‌లో కల్ల ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్స్‌కు ఈ ఏడాది యాంకర్ (హోస్ట్) ఉండకపోవడం విశేషం. ఈ విషయం అధికారికంగా ఆస్కార్ బృందం నుంచే వచ్చింది. ఇలా యాంకర్ లేకుండా అవార్డ్స్ ఫంక్షన్ జరగడం గడిచిన 30 ఏళ్లలో ఇదే మొదటిసారి. అవార్డ్స్‌ను ప్రదానం చేయడానికి స్టేజ్ మీదకు వచ్చే సెలబ్రిటీలు తదుపరి అవార్డులను ప్రకటిస్తారు. నిజానికి ఈ ఏడాది హోస్ట్‌గా కెవిన్ హార్ట్ షోను నిర్వహించాలి. కానీ గతంలో కెవిన్ చేసిన ట్వీట్స్ వివాదం కావడంతో స్వయంగా ఈ పోస్ట్ నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత ఆ స్థానాన్ని భర్తీ చేయడం కష్టంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారట.


వరుణ్ తేజ్

బొబ్బింగ్ అండ్ బ్లాకింగ్!

అప్‌రైట్ స్టాన్స్, సెమీ క్రౌచ్, ఫుల్ క్రౌచ్, జబ్, క్రాస్, హుక్, బొబ్బింగ్, బ్లాకింగ్... ఇదిగో ఈ పదాలనే మార్చి మార్చి పలుకుతున్నారు వరుణ్ తేజ్. స్పోర్ట్స్ గురించి.. అది కూడా బాక్సింగ్ గురించి తెలిసినవారికి ఈపాటికి అర్థమయ్యే ఉంటుంది ఇక్కడ ప్రస్తావించిన పదాలన్నీ బాక్సింగ్‌కి సంబంధించినవి అని. హీరో వరుణ్ తేజ్ బాక్సింగ్ సాధన మొదలు పెట్టారు. ఈ ప్రత్యేకమైన శిక్షణ కోసం ఆయన లాస్ ఏంజిల్స్ వెళ్లారు. వరుణ్ తేజ్ హీరోగా కిరణ్ కొర్రపాటి అనే నూతన దర్శకుడు ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ బాక్సర్ పాత్ర చేయనున్నారు. ''లాస్ ఏంజిల్స్‌లో బాక్సింగ్ శిక్షణ మొదలైంది'' అంటూ తన ప్రాక్టీస్‌కి సంబంధించిన ఫొటోను బయటపెట్టారు వరుణ్. ఇక కిరణ్ కొర్రపాటి విషయానికి వస్తే... ఇంతకు ముందు వరుణ్ తేజ్ హీరోగా నటించిన 'మిస్టర్, తొలిప్రేమ' సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశారు. వరుణ్‌తో కిరణ్ దర్శకత్వం వహించనున్న తాజా సినిమాకు వరుణ్ తేజ్ కజిన్ అల్లు బాబీ (నిర్మాత అల్లు అరవింద్ కుమారుడు) ఒక నిర్మాత అని తెలిసింది.

వారధిపై వీరబాదుడు


ప్రభాస్

బాంద్రా-వర్లీ వారధి ఎక్కడ ఉంది? అంటే ముంబైలో అని చెబుతారు. కానీ ఇప్పుడీ వారధి హైదరాబాద్‌లో ఉందంటే ఆశ్చర్యపోవడం ఖాయం. అవును.. బాంద్రా-వర్లీ పీ లింక్ బ్రిడ్జ్‌ని 'సాహో' టీమ్ హైదరాబాద్‌లో రీ-క్రియేట్ చేశారని సమాచారం. ప్రభాస్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్న సినిమా 'సాహో'. ఇందులో శ్రద్ధాకపూర్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమా కోసం ముంబైలోని బాంద్రా-వర్లీ సీ లింక్ బ్రిడ్జ్ దగ్గర కీలక సన్నివేశాలను చిత్రీకరించాలట. రద్దీగా ఉండే ఆ ఏరియాలో షూటింగ్ అంటే కష్టమే. అందుకే హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో సెట్ వేయిస్తున్నారని తెలిసింది. ఈ సెట్ కోసం దాదాపు 20 కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్నారట. ఈ సినిమా మొత్తం బడ్జెట్ 300 కోట్లు అయితే.. అందులో దాదాపు 120 కోట్ల రూపాయలను యాక్షన్ సీక్వెన్స్, గ్రాఫిక్స్ వర్క్ కోసమే ఖర్చు చేస్తున్నారని టాక్. ఇప్పుడు బాంద్రా-వర్లీ సీ లింక్ వారధిపై ఓ భారీ చేజింగ్ సీన్‌ను ప్లాన్ చేశారట. ఈ చేజ్‌లో హీరో ప్రభాస్‌తో పాటు విలన్ నీల్ నితిన్ ముఖేష్ కీలకంగా ఉంటారని తెలిసింది. 'ట్రాన్స్‌ఫార్మర్స్' సిరీస్, 'పెరల్ హార్బర్' వంటి హాలీవుడ్ సినిమాలకు యాక్షన్ కొరియోగ్రఫీ చేసిన కెన్నీ బేట్ ఈ సినిమాకు వర్క్ చేస్తున్నారు. యాక్షన్ సీక్వెన్స్ అబ్బురపరిచేలా ఉంటాయట. మార్చి నెలాఖరుకల్లా మొత్తం షూటింగ్‌ను కంప్లీట్ చేయాలనే ఆలోచనలో 'సాహో' టీమ్ ఉన్నట్లు తెలిసింది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానుంది.

మీసం తిప్పాడు


శ్రీవిష్ణు

శ్రీ విష్ణు హీరోగా నటించిన చిత్రం 'తిప్పరా మీసం'. నిక్కి తంబోలీ, రోహిణి హీరోయిన్లుగా నటించారు. 'అసుర' సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు కృష్ణ విజయ్. ఎల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రిజ్వాన్ ఎంటర్టైన్మెంట్స్, శ్రీ ఓం సినిమా బ్యానర్స్‌పై రిజ్వాన్ నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ బుధవారం విడుదలైంది. ''తిప్పరా మీసం' సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌లో బిజీగా ఉంది. వేసవిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు దర్శక, నిర్మాతలు. అచ్యుత్ రామారావు, బెనర్జీ, రవిప్రకాష్, రవి వర్మ, నవీన్ నేని, ప్రవీణ్, నేహా దేశ్ పాండే తదితరులు ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, కెమెరా: సిధ్, సహనిర్మాతలు: ఖుషీ, అచ్యుత రామారావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మనోజ్ మావిళ్ల.

సినీ కార్మికులకు ఆరోగ్యభీమా కల్పిస్తాం

\-ఎఫ్‌డీసీ ఛైర్మన్ పి. రామ్మోహన్‌రావు

''నిత్యం పోటీ ఉండే చిత్ర పరిశ్రమలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం. కాదంబరి కిరణ్‌తో పాటు 'మనం సైతం' బృందాన్ని అభినందిస్తున్నాను. తెలుగు చిత్ర పరిశ్రమలో కొన్ని విభాగాల కార్మికులకు ఆరోగ్య భీమా సౌకర్యం లేదని తెలిసింది. అలాంటి శాఖల సినీ కార్మికులకు ఎఫ్‌డీసీ నుంచి సగం ఖర్చు తగ్గిస్తూ హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తాం'' అని ఎఫ్‌డీసీ ఛైర్మన్ పి. రామ్మోహన్ రావు అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన 'మనం సైతం' కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న రామ్మోహన్ రావు పదిమంది పేదలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ–''చిత్రపురి కాలనీలో ఓ వైద్యశాల నిర్మించాలని ప్రయత్నిస్తున్నాం. 'మనం సైతం' కార్యక్రమానికి నేను ఎప్పుడు అందు బాటులోనే ఉంటాను'' అన్నారు. ''మానవత్వం ఇంకా మిగిలే ఉందని మనం సైతం కార్యక్రమానికి వచ్చిన తర్వాత అనిపిస్తోంది. చాలా మంచి కార్యక్రమం'' అని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి అన్నారు. ''నేను ఎదుర్కొన్న బాధలు, కోపం, కసి, ప్రతీకారం, ఆవేదనల నుంచి మొదలైనదే ఈ మనం సైతం కార్యక్రమం. ఏడుగురు సభ్యులతో మొదలైన మా బృందంలో ఇప్పుడు దాదాపు లక్షా డెబ్బై వేలమంది ఉన్నారు'' అన్నారు కాదంబరి కిరణ్. దర్శకుడు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.


కాదంబరి కిరణ్, దశరథ్, పి. రామ్మోహన్ రావు

భవిష్యత్తుని వెంటాడుతుంది

''సువర్ణసుందరి' లాంటి సినిమాలు రావడం పరిశ్రమకి చాలా అవసరం. దాని వల్ల కొత్త టెక్నీషియన్స్ పరిచయం అవుతారు. సూర్య రాసుకున్న కథ చాలా బాగుంది. తప్పకుండా ఇది ఓ మంచి సినిమా అవుతుంది'' అని దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. జయప్రద, పూర్ణ, సాక్షీ చౌదరి ప్రధాన పాత్రల్లో సూర్య ఎమ్.ఎస్.ఎన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సువర్ణసుందరి. 'చరిత్ర భవిష్యత్తుని వెంటాడుతోంది'' అన్నది ఉపశీర్షిక. ఎస్.టీమ్ పిక్చర్స్ పతాకంపై ఎమ్.ఎల్. లక్ష్మీ నిర్మించిన ఈ చిత్రం అతి త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని దర్శకులు బి.గోపాల్ విడుదల చేశారు. డైరెక్టర్ సూర్య మాట్లాడుతూ– ''సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది. నటీనటులందరూ నాకు చాలా సహకరించారు. విజువల్ ఎఫెక్ట్స్‌కి ఏడాది పట్టింది. అందుకే సినిమా విడుదల లేట్ అయింది. అయినా అవుట్‌పుట్ మాత్రం చాలా బాగా వచ్చింది'' అన్నారు. ''సువర్ణసుందరి' ఎక్స్‌ట్రార్డినరీ చిత్రం. హీరోయిన్స్ చాలా చక్కగా చేశారు. తెలుగు సినీ పరిశ్రమకు అందగత్తె జయప్రద. ఆవిడ కూడా ఈ చిత్రంలో నటించారు. టీమ్‌కి ఆల్ ద బెస్ట్'' అని డైరెక్టర్ సాగర్ అన్నారు. ''ఇది చాలా మంచి సినిమా. పాటలు. ఫైట్స్ చాలా బాగా వచ్చాయి'' అన్నారు సాక్షీ చౌదరి. ''సహనం అంటే అది సూర్య గారి నుంచే నేర్చుకోవాలి. చాలా ఓర్పుగా మంచి నటన రాబట్టుకున్నారాయన'' అని పూర్ణ అన్నారు. హీరోలు ఇంద్ర, రామ్, రచయిత విజయేంద్ర ప్రసాద్, రైటర్ ప్రదీప్, స్టంట్ మాస్టర్ రామ్ సుంకర మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: సాయికార్తీక్, కెమెరా: ఎల్లుమంతి ఈశ్వర్.


పూర్ణ, సాక్షీ చౌదరి



పిల్లలు పుట్టలేదంటే మగవాళ్లు అదేదో భార్యకు ఉండే సమస్య అనుకుంటారు. భార్యకు పరీక్షలు చేయించాలంటే అది చాలా ఖర్చుతో కూడిన పని. అదే మగాడి ప్రాథమిక పరీక్షలు ? రూ. 500/-లకు మించవు. అలాంటప్పుడు 'ఇగో' మాని 'డాడీ' అయితే.. హ్యాపీ కదా!... చాలా చాలా హ్యాపీ కదా!!

సంతానం- సంతోషం 5

డాడీ కావాలంటే... ఇగో వద్దు!

సంతానలేమికి కారణాలు మహిళల్లో ఎన్ని ఉంటాయో వాస్తవానికి పురుషుల్లోనూ అన్నే ఉంటాయి. నిజంగా చెప్పుకోవాలంటే సంతానలేమి అనే సమస్యలో తొలి పరీక్షలు పురుషులు చేయించుకోవడమే మంచిది. దీనికి అనేక కారణాలు ఉంటాయి. పురుషుల్లో కారణాలు కనుగొనడం చాలా సులువు. అది తక్కువ ఖర్చుతోనే జరిగిపోతుంది. మహిళల్లో సమస్యల కోసం మొదటే వెళ్తే, వాటికి సంబంధించిన పరీక్షల ఖర్చులు పురుషుల పరీక్షలతో పోలిస్తే చాలా ఎక్కువే. పైగా అవన్నీ చేయించాక మహిళల్లో ఏమీ లేదని తేలితే ఎంతో డబ్బు, శ్రమ, సమయం వృథా అవుతాయి. అందుకే తొలుత పురుషులు పరీక్ష చేయించుకోవడం మేలు.

కారణాలను కనుగొనడం యాండ్రాలజిస్ట్‌ల పని

పురుషుల్లోని లైంగికతకు సంబంధించిన అంశాలనూ, సంతానలేమికి గల కారణాలను పరిష్కరించే వైద్య విభాగానికి యాండ్రాలజీ అని పేరు. మొదట ఈ పేరును దుర్వినియోగం చేస్తూ చాలామంది నకిలీ డాక్టర్లే సమాజంలో చెలామణీ అవుతున్నారు. అందుకే ముందుగా క్వాలిఫైడ్ యాండ్రాలజిస్ట్‌ను ఎంపిక చేసుకోవాలి. ఇక యాండ్రాలజిస్ట్ అని పిలిచే ఆ డాక్టర్ కూడా తన రోగిని భయపెట్టకుండా, ఆందోళనకు గురిచేయకుండా సాంత్వన పరుస్తూ చికిత్స చేస్తారు. ఏ పరీక్షలూ చేయకుండానే 'మీలో ఏదో లోపం ఉందం'టూ ఒక డాక్టర్ చెబితే దాన్ని నమ్మడం అంత సబబు కాదు. ఆందోళన చెందకుండా రెండో ఒపీనియన్‌కు మరో డాక్టర్ దగ్గరకు వెళ్లాలి.

మాట్లాడటమే మొదటి ఔషధం...

పురుషుల్లో ఉండే సంతానలేమికి కారణాలను తెలుసుకోడానికి డాక్టర్ తొలుత చేయాల్సింది పేషెంట్‌తో మాట్లాడటమే. భౌతిక పరీక్షల కంటే ముందర ఇదెంతో ప్రధానం. ఎందుకంటే... సాధారణంగా మన దేశంలో లైంగిక విజ్ఞానం కాస్త తక్కువే. పైగా సమస్యలూ, వాటి పరిష్కారాల కోసం ఓపెన్‌గా మాట్లాడటానికి కొంత వెనకాడుతుంటారు. అందుకే పేషెంట్ పూర్తిగా మనసు విప్పి మాట్లాడేలా సంసిద్ధం చేయాలి. ఆ తర్వాత ఆ దంపతుల సెక్స్ జీవితంపై కొన్ని ప్రశ్నలు అడగాల్సి ఉంటుంది. అవి...



- పురుషుల్లో సంతానలేమికి కారణాలు కనుక్కనే ముందర అసలు ఆ పురుషుడిలో అంగస్తంభనలు సరిగా ఉన్నాయా లేవా అని తెలుసుకోవడం చాలా ముఖ్యం.
- ఒక నెలలో మహిళకు రుతుస్రావం అయిన 11వ రోజు నుంచి 18వ రోజుల్లో తప్పకుండా కలుస్తూ... ఆ మిగతా రోజుల్లో కూడా క్రమం తప్పకుండా సెక్స్ చేయగలుగుతున్నారా అని కూడా తెలుసుకోవాలి. కలయిక బాగానే జరుగుతున్నప్పుడు పురుషుడి వీర్యం, మహిళ యోనిలోకి సక్రమంగానే వెళ్తోందా, లేదా అని కూడా అడిగి తెలుసుకోవాలి.
- పురుషుడు సెక్స్ సరిగా చేయలేకపోయినా, వీర్యం సక్రమంగా యోనిలోకి ప్రవేశించకపోయినా... మహిళకు ఎన్ని పరీక్షలు, చికిత్సలూ చేయించినా ప్రయోజనం ఉండదు. అందుకే పురుషుల్లో ఈ సమస్యలను యాండ్రాలజిస్ట్ మొదట తెలుసుకోవాలి. పేషెంట్ నమ్మకం చూరగొని ఐదు పది నిమిషాలు మాట్లాడితే చాలా సమస్యలు తెలుస్తాయి. ఆ మాటల్లోనూ కొన్నిసార్లు కొన్ని కారణాలు తెలిసే అవకాశాలుంటాయి.

మాటల తర్వాతి దశ... భౌతిక పరీక్ష

పురుషులతో మాట్లాడటం ముగిశాక తర్వాతి దశ... ఫిజికల్ ఎగ్జామినేషన్ అని పిలిచే భౌతిక అంశాల పరీక్షలు. ఇందులో భాగంగా పేషెంట్‌లోని సెకండరీ సెక్సువల్ క్యారెక్టర్స్ సరిగానే ఉన్నాయా అని చూడటం. సెకండరీ సెక్సువల్ క్యారెక్టర్స్ అంటే... అతడిలో మీసాలు గడ్డాలు బాగానే పెరిగి ఉన్నాయా, అతడికి ప్రైవేట్ పార్ట్స్ దగ్గర వెంట్రుకలు బాగానే వచ్చాయా, పురుషాంగం పరిమాణం ఉండాల్సినంతగా ఉందా, వృషణాల సైజ్ సాధారణంగానే ఉందా... లాంటి అనేక అంశాలను ఫిజికల్ ఎగ్జామినేషన్స్‌లో పరీక్షిస్తారు. ఇవన్నీ చేశాకే ఆ తర్వాత పరీక్షల దశకు వెళ్లాలి.

కొన్ని కొన్నిసార్లు ఇలాంటి సాధారణ ఫిజికల్ ఎగ్జామినేషన్స్‌తోనే కారణం ఏమిటో తెలుసుకోవచ్చు. ఉదాహరణకు వృషణాల సైజు చాలా చిన్నగా ఉన్నప్పుడూ, వ్యాస్ సరిగా లేకపోయినా, పెద్ద పెద్ద పరీక్షలు చేయించినా లాభమే ఉండదు. ఇవన్నీ నార్మల్‌గా ఉంటే... అప్పుడు కేవలం 200 నుంచి 500 రూపాయలు మాత్రమే ఉండే మరికొన్ని పరీక్షలు అవసరమవుతాయి.

ఇప్పుడు చేయించాల్సింది వీర్యపరీక్ష...

వీర్యపరీక్షలో వీర్యకణాల సంఖ్య, నాణ్యత, కదలికలు తెలుస్తాయి. ఈ వీర్యపరీక్ష చేయించడానికి ముందుగా కనీసం మూడు రోజుల పాటు సెక్స్ లేదా హస్తప్రయోగం చేయకూడదు. ఆ పరీక్ష చేసే ల్యాబ్ టెక్నీషియన్ కూడ మంచి తర్ఫీదు పొంది ఉండాలి. ఒక్కోసారి ఒక వీర్యపరీక్షకూ మరో వీర్యపరీక్షకూ కూడా పొంతన ఉండకపోవచ్చు. అందుకే మొదటి పరీక్షలోనే వీర్యకణాల గురించి ఏదైనా ప్రతికూల ఫలితం కనిపిస్తే కుంగిపోకూడదు. చాలా రకాల అంశాలు వీర్యపరీక్ష ఫలితాలపై ప్రభావం చూపిస్తాయి. ఉదాహరణకు... కొందరిలో సాధారణ జ్వరం వచ్చినప్పుడు కూడా వీర్యకణాల ఉత్పత్తి పడిపోతుంది. ఆ సమయంలో పరీక్ష చేస్తే వీర్యకణాల సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్లుగా ఫలితం వస్తుంది. అందుకే ఆరోగ్యంగా, ఆనందంగా, ఉల్లాసంగా ఉన్నప్పుడే వీర్యపరీక్ష ఫలితాలు బాగా వస్తాయి. ఇలా ఉండటం మన మామూలు ఆరోగ్యానికీ అవసరం. మనం ఉల్లాసంగా, సంతోషంగా ఉన్నప్పుడు వీర్యకణాల సంఖ్య, నాణ్యత, కదలికలు చాలా బాగుంటాయి.

సిగరెట్ స్మోకింగ్, ఆల్కహాల్ అలవాటు ఉన్న వారిలో కూడా వీర్యకణాల సంఖ్య తగ్గుతుంది. ఒత్తిడి కూడా వీర్యకణాల సంఖ్యను ప్రభావితం చేస్తుంది. అంతెందుకు...

తీవ్ర ఒత్తిడిలో పనిచేసే వారిలో అంగస్తంభన సమస్య కనిపించడమన్నది చాలా సాధారణం. అంతే కాదు... వీళ్లలో వీర్యకణాల సంఖ్య, నాణ్యత, కదలికలు చురుగ్గా ఉండవు. ఈ కారణం వల్ల కూడా వాస్తవానికి పురుషుల్లో పరీక్షల కంటే ముందుగా యాండ్రాలజిస్ట్ ఆ దంపతుల సెక్స్ జీవితానికి సంబంధించిన వివరాల సేకరణకే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుంటారు.

తొలి అవగాహన దంపతులదే...

సంతానలేమితో బాధపడే దంపతుల్లో చాలా మందికి సెక్స్ పట్ల సరైన అవగాహన ఉండదు. సంతానం కోసం పరితపించే దంపతుల్లో చాలామందికి సంతానం కోసం సెక్స్‌లో ఎప్పుడు పాల్గొనాలో కూడా తెలియదంటే అది అతిశయోక్తి కాదు. సాధారణంగా మహిళకు రుతుస్రావం వచ్చిన 11వ రోజు నుంచి 18వ రోజు వరకు ఏదో ఒక రోజున అండం విడుదలయి ఉంటుంది. అందుకే ఆయా రోజుల్లో దంపతులు తప్పనిసరిగా కలవాలి.

కలయిక ముగిసిన వెంటనే మహిళ పైకి లేవకూడదు, శుభ్రపరచుకోకూడదు. మూత్రవిసర్జన చేయకూడదు. శుక్రకణాలతో కూడిన వీర్యం యోనిలోకి పూర్తిగా వెళ్లేలా చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఒకవేళ మహిళల్లో అర్జెంటుగా మూత్రవిసర్జనకు వెళ్లాల్సి వచ్చేలాంటి మూత్రసమస్య ఏదైనా ఉంటే అలాంటి మహిళలు సెక్స్‌కు ముందే మూత్రవిసర్జనకు వెళ్లిరావడం మంచిది. సెక్స్ అయ్యాక వీర్యం వెంటనే బయటకు రాకుండా ఉండేందుకు గాను మహిళలు తమ ఎడమవైపునకు లేదా కుడివైపునకు ఒరిగిపోయి పూర్తిగా ముడుచుకుపోయినట్లుగా కాసేపు పడుకొని ఉండటం మంచిది. అది శుక్రకణాలన్నీ బయటకు రాకుండా లోపలివైపునకు వెళ్లేందుకు దోహదపడుతుంది. పురుషుడికి స్ఖలనం కాగానే... వీర్యం మొత్తం బయటకు వచ్చేస్తుందని అపోహ పడే దంపతులూ చాలామందే ఉంటారు. నిజానికి వీర్యానికి సంబంధించి ఎంతో కొంత ద్రవం బయటకు వస్తుంది. కానీ వీర్యంలో ఉండే ద్రవమంతా వీర్యకణాలు కాదు. ఇంత ద్రవరాశిలో మొత్తం వీర్యకణాల సంఖ్య దాదాపుగా 60 లక్షల నుంచి 1.20 కోట్ల వరకు ఉంటుంది. వీర్యం ద్రవం కాస్తంత బయటకు వచ్చినా దంపతులు ఆందోళన పడకూడదు. ఎందుకంటే... వీర్యం యోనిలోకి ప్రవేశించగానే... శుక్రకణాలన్నీ తమ ఇన్‌స్టింక్ట్ మేరకు అండంతో కలిసేందుకు ముందుకు వెళ్తూ ఉంటాయి. నిజానికి ఈ అంశాలన్నింటినీ యూరాలజిస్ట్/యాండ్రాలజిస్ట్ దంపతులకు వివరిస్తూ వారిలో లైంగిక విజ్ఞానం పట్ల అవగాహన పెంచేలా కౌన్సెలింగ్ రూపంలో వారికి తెలియజేయాలి. అప్పుడు వారిలో ఉండే ఆందోళన చాలావరకు తగ్గుతుంది.

తర్వాత చేయించాల్సినవి హార్మోన్ పరీక్షలు...

వీర్యరాశిలో వీర్యకణాల సంఖ్య అంతా సక్రమంగా ఉండి, ఆ దంపతుల కలయికలు కూడా బాగానే ఉన్నప్పటికీ గర్భం రాకపోతే అప్పుడు తర్వాత చేయాల్సిన పరీక్షల గురించి ఆలోచించాలి. అప్పుడు వాటిలో మొదట చేయాల్సినవి హార్మోన్ పరీక్షలు.

ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, ప్రోలాక్టిన్, టెస్టోస్టెరాన్ (ఇవి మహిళలకూ చేస్తారు) ఈ నాలుగు పరీక్షలూ చేయించడం వల్ల హార్మోన్ సమతౌల్యత ఉందా లేదా అన్న సంగతి తెలుస్తుంది. ఈ పరీక్షలు కూడా అంత ఖర్చుతో కూడినవేమీ కాదు. ఈ మాట ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే... ముందుగా చెప్పినట్లుగా పురుషుల్లో తక్కువ పరీక్షలతో, తక్కువ ఖర్చుతోనే కారణాలేమిటో నిర్దిష్టంగా తెలుసుకోవచ్చు. అందుకని పురుషులతోనే మొదట పరీక్షలు మొదలుపెట్టాలి.

ఒకవేళ హార్మోన్ పరీక్షలు కూడా నార్మల్‌గా ఉంటే వీర్యకణాల సంఖ్య కూడా నార్మల్‌గా ఉంటే కొన్ని రోజులు విటమిన్ టాబ్లెట్స్ ఇచ్చి మళ్లీ వీర్యకణాల టెస్ట్ చేయించడం మంచిది. అప్పుడు దంపతులు ఆందోళన చెందకూడదు. కొన్నిసార్లు కలయిక సరిగా లేకపోవడం వల్ల గర్భధారణకు రెండుమూడేళ్లు ఆలస్యం కావచ్చు. ఇందుకు ఆందోళన పడాల్సిందేమీ ఉండదు. ఎందుకంటే ప్లానింగ్ తర్వాత రెండుమూడేళ్ల సమయం అంత పెద్దదేమీ కాదు.

వీర్యరాశిలో అసలు వీర్యకణాలే లేకపోతే...

ఇక్కడ మనం ఒక విషయాన్ని విపులంగా తెలుసుకోవాలి. వీర్యం అన్నది వీర్యకణాలు జీవించి ఉంటూ, చురుగ్గా కదలడానికి అవసరమైన ఒక మీడియం. ఈ వీర్యాన్ని ప్రొస్టేట్ గ్రంథి తయారు చేస్తుంది. వీర్యకణాలు వృషణాల్లో ఉత్పత్తి అవుతాయి. అక్కడ ఉత్పత్తి అయిన ఆ కణాలు, వాస్ అనే సన్నటి గొట్టం ద్వారా వీర్యరాశి వరకు చేరి, అక్కడ ఈదుతూ ఉంటాయి. ఏవైనా కారణాల వల్ల కొందరి వీర్యంలో వీర్యకణాలు అస్సలే ఉండకపోవచ్చు. ఈ కండిషన్‌ను అజూస్పెర్మియా అంటారు. కచ్చితంగా ఇది క్లిష్టమైన సమస్య. ఎందుకంటే... కోటికణాలు ఉన్నచోట ఒక్క కణం కూడా లేకపోతే గర్భం వచ్చే అవకాశం ఉండదు కదా. కారణాలను కచ్చితంగా కనుగొంటే... ఈ సమస్యను కూడా అధిగమించడానికి ఆధునిక వైద్య శాస్త్రంలో మార్గాలున్నాయి.

రోగికి వీర్యకణాలు లేవని రిపోర్టు వచ్చినప్పుడు మొదటి నెల విటమిన్ మాత్రలు ఇవ్వాలి. ఆ తర్వాత మళ్లీ ఒకసారి పరీక్ష చేయించాలి. అప్పుడు కూడా వీర్యకణాలు లేవనే రిపోర్ట్ వస్తే అప్పుడు టెస్టిక్యులార్ బయాప్సీ అనే పరీక్ష చేయాల్సి ఉంటుంది. ఇందులో వృషణాల్లోంచి ఒక చిన్న ముక్కను తీసి పరీక్షిస్తారు. అసలు వృషణాల్లో వీర్యకణాల ఉత్పత్తి జరుగుతుందా లేదా అని ఈ పరీక్ష ద్వారా తెలుస్తుంది.

ఇదొక ఆశారేఖ...

వృషణాల్లో వీర్యకణాల ఉత్పత్తి జరుగుతూ ఉండి, అవి వీర్యరాశిలోకి రాని కండిషన్ కూడా కొందరిలో ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో పేషెంట్‌కు మేలు చేసేందుకు డాక్టర్లకు అవకాశం ఉంటుంది. నిజంగానే వృషణాల్లో వీర్యకణాలను ఉత్పత్తి చేసే శక్తి ఉంటే... ఆ వీర్యకణాలను వీర్యరాశి వరకు తీసుకొచ్చే నాళాన్ని (వాస్‌ను) రిపేర్ చేసి వీర్యకణాలు మామూలుగా బయటకు వచ్చేలా చేయవచ్చు. అయితే ఇది చాలా సంక్లిష్టమైన శస్త్రచికిత్స ప్రక్రియ. నూటిలో కేవలం 10 మందికి మాత్రమే సత్ఫలితాలు ఇచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ చేయించుకోవడం వల్ల నష్టమైతే ఉండదు. ఇలాంటి సంక్లిష్టమైన పరీక్షలు యూరాలజిస్ట్/యాండ్రాలజిస్ట్‌ల్లో బాగా నైపుణ్యం ఉన్నవారు చేస్తేనే సత్ఫలితాలు ఇస్తాయి. పేషెంట్‌కు డాక్టర్ చేసే పరీక్ష ఏమిటో, దాని పరిణామాలు ఏమిటో తెలుసుకోవల్సిన బాధ్యత ఎంతో ఉంది. ఇదంతా వృషణాల్లో వీర్యకణాల తయారీ ఉంటేనే ఈ సర్జరీ గురించి ఆలోచించాలి.


ఇది మరో ప్రత్యామ్నాయం...

ఒకవేళ వీర్యకణాల తయారీ బాగుంటే పేషెంట్‌కు మరో ప్రత్యామ్నాయం కూడా ఉంది. అదేమిటంటే... కొన్ని వీర్యకణాలను సేకరించి, వాటిని ల్యాబ్‌లోని ఫ్రిజ్‌లో (క్రయో ప్రిజర్వేషన్ పద్ధతిలో) నిల్వచేసి నెలనెలా టెస్ట్‌ట్యూబ్ బేబీ ప్రక్రియ కోసం వీటిని ఉపయోగించవచ్చు. గైనకాలజిస్ట్ ఆధ్వర్యంలో నడిచే ఇన్‌ఫెర్టిలిటీ సెంటర్‌లో యూరాలజిస్ట్ సహాయంతో వృషణాల నుంచి కనీసం 100 వీర్యకణాలను సేకరించి, కోల్డ్ స్టోరేజీలో పెట్టుకొని, టెస్ట్ ట్యూబ్ బేబీ ప్రక్రియకు వెళ్లడం అనేది కూడా మరో మంచి ప్రత్యామ్నాయం. అయితే ఇందులో కూడా 10% – 20% మాత్రమే సక్సెస్ రేట్ ఉంటుంది. అందుకని పేషెంట్ గానీ, డాక్టర్‌గానీ వీర్యంలో వీర్యకణాలు లేనప్పుడు కౌన్సెలింగ్‌కు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి. నాళాన్ని (వాస్‌ను) రిపేర్ చేసే సర్జరీకి దాదాపు లక్షరూపాయల వరకు ఖర్చు అవుతుంది. అయితే ఇది గనక విజయవంతం అయితే ఒకే బిడ్డ కాకుండా, ఆ తర్వాత బిడ్డలు నార్మల్‌గానే పుట్టే అవకాశం ఉంది.

కానీ సక్సెస్ 10% – 20% అని మాత్రమే పేషెంట్ గుర్తెరగాలి. అలాగే టెస్ట్‌ట్యూబ్ బేబీలో 30% వరకు సక్సెస్ ఉన్నప్పటికీ ప్రతిసారీ దాదాపు లక్ష వరకు ఖర్చవుతుంది. కాబట్టి ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో పేషెంట్, డాక్టర్ల మధ్య పరస్పర చర్చలు, నమ్మకం, ప్రక్రియల పట్ల అవగాహన చాలా ముఖ్యం. ఇక టెస్ట్‌ట్యూబ్ బేబీ ప్రక్రియకు వస్తే కేవలం కొన్ని సెంటర్స్ మాత్రమే చేస్తాయి. ఇదొక టీమ్‌వర్క్.

ఇందులో యూరాలజిస్ట్, గైనకాలజిస్ట్, ఎంబ్రియాలజిస్ట్ మాత్రమే కాకుండా అత్యాధునికమైన ఎక్విప్‌మెంట్‌కు కూడా ప్రాముఖ్యత ఉంటుంది. అందుకని సంతానం లేని దంపతులు అందరూ ఇలాంటి క్లిష్టమైన పద్ధతులను ఎంచుకునే ముందు రెండుమూడేళ్ల మంచి ఆహారం తీసుకుంటూ, రెగ్యులర్‌గా సెక్స్‌లో పాల్గొంటూ, పిల్లల కోసం కాకుండా, వైవాహిక జీవితాన్ని బాగా ఎంజాయ్ చేస్తుంటే పిల్లలు పుట్టడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే నిరాశపడకండి... ఎప్పుడూ ఆనందంగా ఉల్లాసంగా ఉండండి. పిల్లలు వారంతట వారే మీ జీవితంలోకి వస్తారు.

ఒకవేళ వీర్యకణాల సంఖ్య తగ్గితే...



ఒకవేళ వీర్యరాశిలో వీర్యకణాల సంఖ్య తగ్గినా లేదా వీర్యకణాలు నార్మల్‌గానే ఉండి పిల్లలు పుట్టకపోయినా డాప్లర్ అల్ట్రా సౌండ్ స్క్రోటమ్ అనే స్కానింగ్ పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. ఇది ఏమాత్రం నొప్పి లేని సాధారణ పరీక్ష. దీనివల్ల వృషణాల పరిమాణం, వేరికోసిల్ అనే సమస్య ఉందా లేదా తెలుస్తాయి.

వేరికోసిల్ అంటే... వృషణాల్లోని రక్తనాళాల వాపు. ఇది ఉన్నవారిలో చెడు రక్తం తీసుకెళ్లే రక్తనాళాలు ఉబ్బిపోయి రక్త ప్రవాహం సరిగా లేకపోవడం వల్ల వీర్యకణాల సంఖ్య, నాణ్యత తగ్గుతాయి. ఈ సమస్యను చాలా సాధారణ శస్త్రచికిత్స ద్వారా చక్కదిద్దాల్సి ఉంటుంది. వేరికోసిల్ ఆపరేషన్ పూర్తయ్యాక దాదాపు 70 శాతం మంది పురుషుల్లో వీర్యకణాల సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉంటుంది. మైక్రోస్కోప్ ద్వారా గజ్జల్లో చిన్న కోతతో చేసే ఈ సర్జరీని అనుభవజ్ఞులు నిర్వహిస్తే ఫలితాలు చాలా మెరుగ్గా ఉంటాయి. మూడు నెలల తర్వాత ప్రెగ్నెన్సీ రావడానికి అవకాశం పెరుగుతుంది. అయితే కొంతమందిలో మళ్లీ స్కాన్ చేసి చూపినప్పుడు కొంత వేరికోసిల్ సమస్య మళ్లీ కనిపించే అవకాశం ఉంటుంది.



డాక్టర్ వి. చంద్రమోహన్,
యాండ్రాలజిస్ట్ అండ్ యూరాలజిస్ట్,
ప్రీతి యూరాలజీ అండ్ కిడ్నీ హాస్పిటల్స్,
కేపీహెచ్‌బి, హైదరాబాద్

ఫ్యామిలీ డాక్టర్

యానల్ ఫిషర్ సమస్యకు చికిత్స ఉందా?

నా వయసు 39 ఏళ్లు. నేను గత కొంతకాలంగా మలబద్ధకంతో బాధపడుతున్నాను. మలవిసర్జన సమయంలో విపరీతమైన నొప్పి, మంట, మలంలో రక్తం కనిపిస్తున్నాయి. డాక్టర్‌ను సంప్రదించాను. కొన్ని పరీక్షలు నిర్వహించి యానల్ ఫిషర్స్ సమస్యతో బాధపడుతున్నట్లు చెప్పారు. హోమియో మందులతో నాకు పూర్తిగా నయం అవుతుందా?

– ఎమ్. ఆదిత్యానాథ్, కర్నూలు

దీర్ఘకాలికంగా మలబద్ధకం లేదా తరచూ విరేచనాలు అవ్వడం వంటి సమస్యలను ఎదుర్కొనేవారు ఈ యానల్ ఫిషర్స్ బారిన పడే అవకాశం ఎక్కువ. ఇటీవలి కాలంలో ఉన్న పని ఒత్తిడి, ఆహారపు అలవాట్ల వంటి అంశాలు జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపి పైల్స్, ఫిషర్స్, ఫిస్టుల వంటి సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. వీటిల్లో ఫిషర్ అంటే ఏమిటో తెలుసుకుందాం. మలద్వారం దగ్గర ఏర్పడే నిట్టనిలువు చీలికను యానల్ ఫిషర్ అంటారు. ఈ చీలిక వల్ల ఈ ప్రాంతంలో ఉండే కండర కణజాలం బహిర్గతం కావడం వల్ల ఇది మలవిసర్జన సమయంలోగానీ, మలవిసర్జన తర్వాత గానీ తీవ్రమైన నొప్పిని, రక్తస్రావాన్ని కలగజేస్తుంది.

కారణాలు : దీర్ఘకాలిక మలబద్ధకం, తరచూ విరేచనాలు, పేగులకు ఇన్ఫెక్షన్ కలిగించే వ్యాధులు (ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజెస్), ప్రసవ సమయంలో పెద్ద పేగు చివరి భాగం... పురీషనాళానికి (రెక్టమ్‌కు) రక్త ప్రసరణ తగ్గిపోవడం వంటి కారణాల వల్ల ఈ ఫిషర్ ఏర్పడే అవకాశం ఉంది.

చికిత్స : జెనెటిక్ కాన్‌స్టిట్యూషనల్ విధానం ద్వారా ఫిషర్స్ సమస్యను హోమియో మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. సంపూర్ణంగా చికిత్స అందించడం ద్వారా ఆపరేషన్ అవసరం లేకుండానే వాటిని తగ్గించి, అవి మళ్లీ తిరగబెట్టకుండా చేయవచ్చు. మీరు అనుభవజ్ఞులైన హోమియో వైద్యులను సంప్రదించి, మీ లక్షణాలను వివరించి తగిన చికిత్స తీసుకోండి.





డా॥ శ్రీకాంత్ మొర్లావర్,
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్

సయాటికా నొప్పి తగ్గుతుందా?

నా వయసు 40 ఏళ్లు. నేను వృత్తిరీత్యా రోజూ దాదాపు 70 కి.మీ. బైక్ మీద తిరుగుతుంటాను. ఈమధ్య నడుము నొప్పి ఎక్కువైంది. ఒకవైపు కాలి నొప్పితో బాధపడుతున్నాను. డాక్టర్లను కలిస్తే నా సమస్య 'సయాటికా' అని అంటున్నారు. దయచేసి దీనికి తగిన పరిష్కారం సూచించండి.

– ఎల్. వినయ్‌కుమార్, సదాశివపేట

నేటి జీవనశైలితో వచ్చే వ్యాధుల్లో ముఖ్యమైనది సయాటికా. శరీరంలోని నరాలన్నింటిలోనూ పొడవైనది సయాటికా. ఇది వీపు కింది భాగం నుంచి పాదాల వరకు ప్రయాణం చేస్తుంది. ఈ నరంపై ఒత్తిడి కలిగినప్పుడు వచ్చే నొప్పిని సయాటికా నొప్పి అంటారు. ఈ నొప్పి భరింపరానిదిగా ఉండటమే గాక రోజువారీ వ్యవహారాల్లోనూ ఆటంకం కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది ఈ సమస్యతో తమ విధులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారు. ముఖ్యంగా 30 – 50 ఏళ్ల మధ్య వయసు వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. దాదాపు 90 శాతం మంది ప్రజల్లో జీవితకాలంలో ఏదో ఒకసారి ఇది కనిపిస్తుంది.

కారణాలు : • ఎముకల్లో ఏర్పడే ఒత్తిడి వల్ల వెన్నుపాము నుంచి వచ్చే నరాలు కంప్రెస్ అవుతాయి. • దెబ్బలు తగిలినప్పుడు పైరిఫార్మిస్ అనే కండరం వాచి, అది నరాలపై ఒత్తిడిని కలిగిస్తుంది. • గర్భిణుల్లో పిండం బరువు పెరిగి నరాలపై ఒత్తిడి కలిగిస్తుంది. • శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవడం వల్ల కీలు సక్రమంగా పనిచేయక సయాటికా నొప్పి కలగవచ్చు.

లక్షణాలు : • కాళ్లలో నొప్పి సూదులు గుచ్చినట్లుగా ఉండటం • కండరాల బలహీనత, స్పర్శ కోల్పోవడం • రెండు కాళ్లలో లేదా ఒక కాలిలో తీవ్రమైన నొప్పి • బరువులు ఎత్తినప్పుడు, దగ్గినప్పుడు లేదా అధికశ్రమ కలిగినప్పుడు నొప్పి మరింత పెరగడం.



నిర్ధారణ పరీక్షలు : ఎక్స్–రే, సీటీ స్కాన్, ఎమ్మారై

చికిత్స : సయాటికా నొప్పికి, వెన్నుపూసల్లో సమస్యలకు హోమియోలో మంచి చికిత్స ఉంది. రస్టాక్స్, కోలోసింథ్, కాస్టికమ్, సిమిసిఫ్యూగా వంటి మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే రోగి లక్షణాలను బట్టి అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడితే సయాటికా నొప్పి పూర్తిగా నయమవుతుంది.



డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

హోమియో కౌన్సెలింగ్స్

రుమటాయిడ్ ఆర్థరైటిస్ నయమవుతుందా?

నా వయసు 59 ఏళ్లు. నాకు రెండు చేతుల జాయింట్లు (కీళ్లు) నొప్పిగా ఉండటం, కీళ్లవద్ద ఎర్రగా మారాయి. నాకు తగిన సలహా ఇవ్వండి.

– ఎమ్. నాగరాజు, నిడదవోలు

మీరు చెబుతున్న లక్షణాలను బట్టి మీరు రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇది ఒక ఆటో ఇమ్యూన్ డిసీజ్. అంటే తన వ్యాధి నిరోధక శక్తే తనపట్ల ప్రతికూలంగా పనిచేయడం. సాధారణంగా యాభైఏళ్లు పైబడిన వాళ్లలో ఈ నొప్పులు మొదలవుతాయి.

ఈ వ్యాధి ఉన్న వారిలో లక్షణాల తీవ్రతలో చాలా రకాల మార్పులు కన్పిపిస్తుంటాయి. వ్యాధి యాక్టివ్ స్టేజ్‌లో ఉన్నప్పుడు అలసట, ఆకలి లేకపోవడం, లోగ్రేడ్ జ్వరం, కీళ్ళలో, కండరాల్లో నొప్పులు, కీళ్లను సరిగ్గా కదపలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా కీళ్లనొప్పులు ఉదయాన్నే లేవగానే అత్యధికంగా ఉండి కొద్దిగా శరీరం కదిలించిన తర్వాత అదుపులో ఉంటాయి. సాధారణంగా చేతుల్లో కాళ్లలో రెండు వైపులా ఒకే కీళ్ళు ప్రభావితమవుతాయి. కీళ్లు ఎర్రగా, వేడిగా మారి విపరీతమైన నొప్పితో బాధిస్తాయి. వ్యాధి దీర్ఘకాలంగా మారినప్పుడు కీళ్లలోని మృదులాస్తి, ఎముకలు దెబ్బతినడం వలన వేళ్ళు వంకర్లు పోవడం పూర్తిగా కదలికలు ఆగిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వీటినే 'డిఫార్మిటీస్' అంటారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ని నిర్ధారించడానికి ఏ ఒక్క పరీక్ష సరిపోదు. రక్తపరీక్షలతో పాటు ఇతర వైద్యపరీక్షలూ చేయించాల్సి ఉంటుంది. ఆటో ఇమ్యూన్ సమస్యలలో చికిత్స చెయ్యడానికి హోమియోపతిలో మయాజ్మాటిక్ ప్రిస్క్రిప్షన్ ఇస్తారు. సాధారణంగా వాడే పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ వల్ల నొప్పి నుండి తాత్కాలికంగా ఉపశమనం లభించడం లేదా కొన్నిసార్లు అస్సలు ప్రభావమే లేకపోవడం జరుగుతుంది. పైగా ఈ మందుల వలన డిఫార్మిటీస్‌ని నివారించలేం. హోమియోపతి మందుల ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నియంత్రించి నొప్పులను పూర్తిగా తగ్గించడం మాత్రమే కాకుండా డిఫార్మిటీలు రాకుండా నివారించవచ్చు.





డాక్టర్ టి.కిరణ్ కుమార్,
డైరెక్టర్,
పాజిటివ్ హోమియోపతి,
విజయవాడ, వైజాగ్

సాక్షి భవిత

స్పర్థయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

గురువారం
7-2-2019



విజేత బాటలో..!

ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ప్రతిష్టాత్మక అఖిల భారత సర్వీసులకు సివిల్స్ 2018 నోటిఫికేషన్ ఎంపిక ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. విజేతగా మారేందుకు మరో అడుగుదూరం మాత్రమే! కానీ, ఈ అడుగు ఎంతో నిర్ణయాత్మకం. సివిల్స్‌ను సాధించడమే లక్ష్యంగా.. ఏళ్లుగా రేయింబవళ్లు నిర్విరామంగా శ్రమిస్తూ.. చివరి దశ ఇంటర్వ్యూ దాకా వచ్చిన అభ్యర్థులు..త్వరలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. తుది జాబితాలో విజేతగా నిలవాలన్నా.. కోరుకున్న సర్వీసును సొంతం చేసుకోవాలన్నా.. ఇంటర్వ్యూలో సాధించే మార్కులు చాలా కీలకం! 275 మార్కులకు నిర్వహించే ఇంటర్వ్యూ (పర్సనాలిటీ టెస్టు) అభ్యర్థుల తలరాతను నిర్దేశిస్తుంది. ఈ నెల 11వ తేదీ నుంచి సివిల్స్ ఇంటర్వ్యూలు ప్రారంభంకానున్న నేపథ్యంలో.. 2017లో ఆల్ ఇండియా టాపర్, తెలుగు తేజం 'అనుదీప్ దురిశెట్టి'.. సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..!!.

- ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న సివిల్స్ ఇంటర్వ్యూలు
- విజేతగా నిలిచేందుకు అత్యంత కీలకంగా మారుతున్న పర్సనాలిటీ టెస్ట్ మార్కులు
- 2017 ఆలిండియా టాపర్ అనుదీప్ దురిశెట్టి సలహాలు..

మెండైన ఆత్మవిశ్వాసం

2017 సివిల్స్ ఇంటర్వ్యూ నాకు రెండో పర్సనాలిటీ టెస్టు. మొదట 2014లో ఇంటర్వ్యూకు హాజరయ్యాను. అప్పుడు వచ్చిన 204 మార్కులు ఇచ్చిన ఆత్మవిశ్వాసంతోనే 2017 పర్సనాలిటీ టెస్టుకు వెళ్లాను. ఎలాంటి ఆత్రుత, ఆందోళన లేకుండా యూపీఎస్సీ ఆఫీసు మెట్లు ఎక్కాను. ఎలాంటి ప్రశ్నలు అడిగినా, లోతుగా ప్రశ్నలు సంధించినా.. ఆ సమయానికి నాకు బెస్ట్ అనిపించే సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నాను.

ఇంటర్వ్యూ రోజున

ఇంటర్వ్యూ రోజున.. అప్పటికే నేను రాసుకున్న నోట్స్‌ను రెండు గంటల పాటు రివిజన్ చేసుకున్నా. అలాగే నా ప్రొఫైల్, నా విజయాల గురించి బోర్డు సభ్యులకు సరిగా చెప్పే విధంగా సన్నద్ధమయ్యాను. ఆ రోజు దినపత్రికలు చదివి యూపీఎస్సీ ఆఫీసుకు బయల్దేరాను. అక్కడికి చేరాక సెక్యూరిటీ చెక్ అనంతరం వెయిటింగ్‌లో కూర్చున్నాం. అప్పుడు ఒక ఆఫీసర్ వచ్చి ఇంటర్వ్యూకు సంబంధించిన మార్గదర్శకాల గురించి చిరునవ్వుతో వివరించారు. ఇంటర్వ్యూకు వచ్చిన అభ్యర్థుల్లో ఒత్తిడిని దూరంచేసే విధంగా ఆ అధికారి కాసేపు మాట్లాడారు. అప్పటివరకు చాలా మందికి యూపీఎస్సీ గురించి పెద్దగా అవగాహన ఉండదు. వేర్వేరు ప్రతికూల ఆలోచనలతో ఉంటారు. ఆ అధికారి సంభాషణతో అక్కడ ఉన్న అభ్యర్థులు కాస్త ప్రశాంతంగా కనిపించారు.

నా ఇంటర్వ్యూ.. వీటిపైనే

సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఇతర పేపర్ వర్క్ ముగిసిన తర్వాత రిటైర్డ్ ఎయిర్ మార్షల్ అజిత్ భోంస్లే ప్యానెల్ ఇంటర్వ్యూ చేస్తారని చెప్పారు. నా ఇంటర్వ్యూ 3 గంటలకు ప్రారంభమైంది. సుమారు 35 నిమిషాల పాటు జరిగింది. బోర్డు సభ్యులు భిన్న అంశాలపై ప్రశ్నలు అడిగారు. ఆర్యుల వలస, ద్వేష పూరిత నేరాలు(హేట్ క్రైమ్స్), ధ్యానం, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), స్వచ్ఛభారత్, ఐఏఎస్ ఎందుకు కావాలనుకుంటున్నావు?.. మొదలైన అంశాలపై ప్రశ్నలు ఎదురయ్యాయి. వీటిలో కొన్ని ముందుగా ఊహించి, సన్నద్ధమైనవే కాబట్టి సమాధానాలు బాగా చెప్పాను. నా వరకు బెస్ట్ అనిపించే సమాధానాలు ఇచ్చాను.

సమాధానాల్లో పరిజ్ఞానం ప్రధానం

- మాక్ ఇంటర్వ్యూల్లో వేషధారణ, దుస్తులు, నడక మొదలైనవి ముఖ్యం అని చెబుతారు. కానీ, వాస్తవంగా ఇంటర్వ్యూ హాల్‌లో వీటికంటే.. మీరు చెప్పే సమాధానాల్లో ఉన్న విషయ పరిజ్ఞానానికే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. మనం చెప్పే సమాధానాలే మన వ్యక్తిత్వాన్ని బోర్డు సభ్యులకు తెలియజేస్తాయి. నప్పే వేషధారణలో ఇంటర్వ్యూకు వెళితే సరిపోతుంది.
- బోర్డు సభ్యులు మన గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. కాబట్టి వారి నుంచి ఎదురయ్యే ప్రతి ప్రశ్నను ఒక అవకాశంగా భావించి నిర్భయంగా మన గురించి తెలిసేలా మాట్లాడాలి. మన సమాధానాల్లో తార్కికత ఉండాలి. మాటల్లో ఆత్మవిశ్వాసం ఉట్టిపడాలి. ఉదాహరణకు బోర్డు నుంచి.. 'మన దేశంలో సుపరిపాలన కోసం చిన్న రాష్ట్రాల అవసరం ఉందని మీరు భావిస్తున్నారా?' అనే ప్రశ్న ఎదురైనప్పుడు.. 'అవును', 'కాదు' అనే సూటి సమాధానాలు చెప్పడం వల్ల మీ గురించి తెలుసుకోవడానికి బోర్డుకు అవకాశం లభించదు. 'అవును', 'కాదు' అని చెప్పడానికి దారితీసిన కారణాలు వివరించాలి.
- పై ప్రశ్నకు నా సమాధానం అవును అయితే... 'ఎస్ సార్, చిన్న రాష్ట్రాల వల్ల పరిపాలన సులువుగా ప్రజలకు చేరువ అవుతుందని నేను భావిస్తున్నా. ఉదాహరణకు నా సొంత రాష్ట్రం తెలంగాణలో గతంలో జిల్లాలు, మండలాలు విస్తీర్ణం పరంగా పెద్దవి. కలెక్టర్ నేరుగా ఆయా ప్రాంతాలను చూసే సమయం ఉండేది కాదు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించడం కష్టతరంగా ఉండేది. కానీ, ఇప్పుడు చిన్న రాష్ట్రం, చిన్న జిల్లాల వల్ల ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తవుతున్నాయి. కలెక్టరు, ఇతర అధికారులకు నిత్యం పనులను పర్యవేక్షించే సమయం అందుబాటులో ఉంటుంది. సమస్యలను అక్కడికక్కడే వేగంగా పరిష్కరించవచ్చు. నా అభిప్రాయం మేరకు చిన్న రాష్ట్రాలు, చిన్న జిల్లాలు దేశానికి మేలే' అని ముగిస్తాను.
- ఈ సమాధానంలో బోర్డు సభ్యులు చాలా అంశాలను పరిశీలిస్తారు. మొదట మన తార్కిక అభిప్రాయం, రెండోది.. స్థానికంగా పరిపాలన తీరుతెన్నులపై మనకు అవగాహన ఉందనే విషయాన్ని బోర్డు గుర్తిస్తుంది. మెయిన్స్‌కి, ఇంటర్వ్యూకు ఉన్న మౌలిక భేదం ఇదే. మెయిన్స్‌లో కమిటీలు ఏఆర్‌సీ, నిపుణుల అభిప్రాయాల్ని రాస్తాం. కానీ, ఇంటర్వ్యూలో మన సమాధానాలు పర్సనల్‌గా ఉండాలి. మన అభిప్రాయాలను తార్కికంగా చెప్పాలి.



ఆత్మన్యూనత, అభద్రతాభావం వీడాలి

ముఖ్యంగా అభ్యర్థులు ఆత్మన్యూనత, అభద్రతాభావాన్ని వదిలిపెట్టాలి. పేరున్న కాలేజీలో చదవలేదనో.. ఎంఎన్‌సీ కంపెనీల్లో పనిచేసిన అనుభవం లేదనో.. వయసు 30 కంటే ఎక్కువ వంటి అపోహలను దూరం పెట్టాలి. నాకు తెలిసిన చాలామంది ఐఐటీల నుంచి పట్టాలు పొంది, బహుళజాతి కంపెనీల్లో పని అనుభవమున్నా.. ఇంటర్వ్యూలో మంచి స్కోరు చేయడంలో విఫలమయ్యారు. బోర్డు ఇంటర్వ్యూ సాగే అర్ధగంటలో మనతో మాట్లాడి మన గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి నేపథ్యంతో సంబంధం లేకుండా.. పూర్తి ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూను ఎదుర్కోవాలి. మనం ఒక సినిమాకు వెళ్లినప్పుడు అందులోని పాత్రల పేర్లు, డైలాగులు, లొకేషన్లు గుర్తించుకోం.. కానీ, బయటికి వచ్చేటప్పుడు ఆ సినిమా డీసెంట్‌గా ఉందా, ఎక్స్‌లెంట్‌గా ఉందా, భయంకరంగా ఉందా.. అనే ఒక నిర్దిష్ట అభిప్రాయానికి వస్తాం. ఇంటర్వ్యూ ప్యానెల్ కూడా అంతే..! మనం చెప్పే ప్రతి సమాధానాన్ని వారు గుర్తుంచుకోరు. మొత్తంగా జరిగిన సంభాషణ మేరకు ఒక నిశ్చిత అభిప్రాయానికి వస్తారు. బోర్డుకు, మీకు మధ్య అర్థవంతమైన మేధో సంభాషణ జరిగి, ఉద్యోగానికి మీరు సరైన అభ్యర్థి అని నమ్మించగలిగితే చాలు కచ్చితంగా మీరు మంచి స్కోరు చేస్తారు.

ప్రతికూల భావన కూడదు

- ఇంటర్వ్యూ బోర్డు మీద ముందుగానే ప్రతికూల భావనకు రాకూడదు. గతంలో ఈ బోర్డు ఇచ్చిన సగటు స్కోరు గణాంకాలు చూసి ఆందోళన అవసరం లేదు. అసలు బోర్డు గురించి పట్టించుకోనవసరం లేదు. బోర్డుతో సంబంధం లేకుండా వారిని మెప్పించే రీతిలో సమాధానాలు ఇవ్వాలి.
- మనిషిలో ఉండే హైపర్ కాన్సియస్ మన మాటలను, మనం ఏం సమాధానాలు చెబుతున్నామో నిరంతరం 'సెల్ఫ్ ఎవాల్యూషన్' చేస్తూ ఉంటుంది. కాబట్టి అతిగా 'కాన్సియస్'లో ఉండకుండా సహజంగా సమాధానాలు చెప్పండి.
- అభిప్రాయాన్ని తెలుసుకునే విధంగా ప్రశ్నలు అడిగినప్పుడు మరీ షార్ట్‌గా కాకుండా, మరీ సుదీర్ఘంగా పొడిగించకుండా సమాధానాలు చెప్పాలి. మీ అభిప్రాయాన్ని నిజాయితీగా చెప్పి.. అందుకు గల కారణాలు వివరించాలి.

ఫ్లాట్ ప్రశ్నలు

- కొన్ని సందర్భాల్లో బోర్డు సభ్యులు 'ఫ్లాట్' ప్రశ్నలు అడుగుతుంటారు. ఉదాహరణకు 'దేశంలో రాజకీయాల వల్ల సమస్యలు ఏంటి' అని అడిగినప్పుడు.. మెయిన్స్‌లో రాసిన విధంగా.. రాజకీయాలు నేరమయం కావడం... ధన బలం.. మొదలైన సమాధానాలతోనే సరిపెట్టకుండా వాటిని కొంత విపులంగా చర్చించాలి. –'Sir the problem with Indian politics is that capturing power has become an end in itself, rather than a means to do greater good.' అనే సమాధానం చెప్పినప్పుడు... ఎథిక్స్, పాలిటిక్స్ మీద చర్చకు దారితీస్తుంది. ఫ్లాట్ ప్రశ్నలు అడిగినప్పుడు ఆ సందర్భాన్ని తెలివిగా ఉపయోగించుకొని అర్థవంతమైన చర్చకు దారితీసేలా వ్యవహరించాలి.
- బోర్డు సభ్యుల నుంచి ప్రశ్న ఎదురైనప్పుడు కాసేపు ఆలోచించి, ప్రశాంతంగా సమాధానాలు చెప్పేంత సమయం బోర్డు సభ్యులు ఇస్తారు. వారు చాలా ఓపికతో ఉంటారు. అనవసర విషయాలు చెబుతుంటే తప్ప మిగతా సందర్భాల్లో అభ్యర్థులకు సమయం ఇస్తారు. కొన్ని ప్రశ్నలకైతే పెన్సిల్‌తో సమాధానాలు రాసుకునే వీలు కూడా ఉంటుంది.

'బ్యాలెన్స్' తప్పొద్దు

బోర్డు సభ్యులు కొన్నిసార్లు సరదాగా ఉన్నా, ప్రశంసించినా, విభేదించినా.. వాటితో సంబంధం లేకుండా ప్రశాంతంగా 'బ్యాలెన్స్‌డ్'గా నడుచుకోవాలి. మీరు చెప్పే సమాధానాల్లోనూ అది ప్రతిబింబించాలి. ఉదాహరణకు వారు 'ఆధార్ చర్చ' మీద ప్రశ్న అడిగినప్పుడు నా సమాధానం.. 'సర్ ఆధార్ –గోప్యత... గెలుపు–ఓటమి (జీరో సమ్ గేమ్) చర్చ కాదు. మనకు ఆధార్, వ్యక్తిగత సమాచార గోప్యత రెండూ అవసరమే. ప్రస్తుతం చర్చ ఆధారా లేకా గోప్యతా.. అనే కోణంలో పూర్తిగా వక్రీకరణకు గురైంది. కానీ మనకు ఆ రెండింటి మధ్య ఉన్న స్వల్ప భేదం తెలియాల్సి ఉంది.' సభ్యులకు ఈ సమాధానం చెప్పినప్పుడు వారి నుంచి ఆధార్ వల్ల ప్రయోజనాలు, ప్రైవసీ చట్టం, ఉల్లంఘనలు మొదలైన ప్రశ్నలు రావచ్చు. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలి. కాబట్టి ఇటీవల వార్తల్లో నిలిచిన అంశాలను లోతుగా అధ్యయనం చేసి బ్యాలెన్స్‌డ్ అభిప్రాయాలు ఏర్పరచుకోవాలి.

బయోడేటా లోతుగా

అభ్యర్థులు తమ బయోడేటా(డీఏఎఫ్)లో పేర్కొన్న అంశాలపై ఎలాంటి ప్రశ్న ఎదురైనా చెప్పేలా సిద్ధమై వెళ్లాలి. డీఏఎఫ్‌లో పేర్కొన్న అంశాల్లో నుంచి మీరే ప్రశ్నలు సిద్ధం చేసుకొని..వాటి సమాధానాల కోసం కసరత్తు చేసి నాణ్యమైన సమాధానాలు రాసుకోవాలి. ఊహించిన ప్రశ్నలకు సిద్ధమైతే.. ఊహించని ప్రశ్నలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో సమాధానాలు చెప్పొచ్చు. అలాగే ఒకవేళ ఏదైనా ప్రశ్నకు సమాధానం తెలియకుంటే.. తెలియదని నిజాయితీగా చెప్పడం మేలు. కానీ, డీఏఎఫ్‌లో పేర్కొన్న అంశాలపై అడిగిన ప్రశ్నలకు తెలియదు అని సమాధానం చెప్పడం వల్ల మీరు డీఏఎఫ్‌లో అబద్ధాలు రాసారనే అభిప్రాయం బోర్డు సభ్యుల్లో కలుగుతుంది. అది అంతిమంగా మీ మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి డీఏఎఫ్‌లో పేర్కొన్న, వాటికి సంబంధించిన ప్రశ్నలను ప్రిపేరై వెళ్లాలి.

ఇవెంతో ప్రధానం

- బోర్డు సభ్యులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అబద్ధాలు చెప్పకూడదు. మీ వయసు కంటే ఎక్కువగా బోర్డులోని వారికి పబ్లిక్ లైఫ్ అనుభవం ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. మీరు ఒక్క అబద్ధం చెప్పినా ఇట్టే పసిగట్టగలరు.
- ఓపెన్ మైండ్‌తో, స్పష్టమైన అభిప్రాయాలతో ఇంటర్వ్యూకు వెళ్లండి. మీ గురించి ప్యానెల్‌కు ఏం చెప్పాలనుకున్నారో స్పష్టత తెచ్చుకోవాలి. అకడమిక్ ప్రాజెక్టులుగానీ, వృత్తి జీవితంలో సాధించిన విజయాల గురించి నేరుగా చెప్పమని అడగకపోయినా మీరే ఆ అవకాశాన్ని సొంతంగా కల్పించుకోవాలి. మాక్‌టెస్టుల్లో భాగంగా దీన్ని ప్రాక్టీస్ చేయాలి. ఉదాహరణకు 'మంచి నాయకుడికి ఉండాల్సిన లక్షణాలు ఏంటి' అనే ప్రశ్న అడిగినప్పుడు.. పుస్తకాల్లో ఉన్నవాటిని ఉదహరించకుండా.. మీ కాలేజీలో విజయవంతంగా చేసిన ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ.. దాన్ని సమర్థంగా పూర్తిచేయడానికి దోహదపడిన విలక్షణతలు ఏంటో వివరించాలి.

భాష సరళంగా

అభ్యర్థులు ఇంటర్వ్యూలో సరళమైన పదాల్లో సమాధానాలు చెప్పాలి. ఉదాహరణకు లింగవివక్ష మీద సమాధానం చెప్పాల్సి వచ్చినప్పుడు.. మహిళా సాధికారత, సమ్మిళిత వృద్ధి, భాగస్వామ్య విధానం.. వంటి పదాలు కాకుండా... 'అమ్మాయిలకు మంచి విద్య అందించడం.. మహిళా భద్రతకు విధానాలు పటిష్టం చేయడం.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకూ.. రాజకీయాల్లో మహిళలను ప్రోత్సాహించడం.. మహిళల స్వయం సహాయక బృందాలకు పెద్ద ఎత్తున మద్దతు తెలపడం వంటి చర్యల వల్ల లింగ వివక్షలేని సమాజాన్ని నిర్మించవచ్చు' అని సులువుగా సమాధానాలు చెప్పాలి. వీటిల్లో నుంచి సబ్ క్వశ్చన్స్ అడిగే అవకాశం ఉంటుంది.

సివిల్స్‌కు ఎందుకు?!

సివిల్ సర్వీసులోకి ఎందుకు రావాలనుకుంటున్నారు..? అనే ప్రశ్న ఎదురైనప్పుడు.. ఉద్యోగంలో వైవిధ్యం, పనిలో సంతృప్తి, ప్రజాసేవ, సవాళ్లతో కూడిన ఉద్యోగం వంటి అలవాటుపడిన పదబంధాలు కాకుండా.. మీ లైఫ్ స్టోరీ, నమ్మకాలు, కోర్ వాల్యూస్ గురించి చెప్పాలి. నిజాయితీగా చెప్పే సమాధానాలతో సభ్యుల మన్ననలు పొందవచ్చు. ఇప్పటికే సివిల్స్ సర్వీసులకు ఎంపికైన వారైతే .. సర్వీసులో చూసిన సానుకూల అంశాలను వివరించాలి. నెగిటివ్‌గా మాట్లాడకూడదు.

బెస్ట్ ఇచ్చామా అన్నదే ముఖ్యం

మీకున్న సమయాన్ని బట్టి కనీసం 4–5 మాక్ ఇంటర్వ్యూలకు హాజరవ్వాలి. వీటిలో వచ్చే ఫీడ్‌బ్యాక్ సరిగా లేకుంటే మరోసారి హాజరవ్వచ్చు. వేర్వేరు మాక్‌టెస్టుల్లో భిన్నమైన ఫీడ్‌బ్యాక్ వస్తే తికమక పడకుండా.. మీకు విశ్వాసం గల సరైన దాన్ని అనుసరించండి. అంతిమంగా సివిల్స్ ఇంటర్వ్యూ ప్రిపరేషన్ మన గురించి మనం పూర్తిగా తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. అలానే అత్యున్నత మేధోసంపత్తి వర్గాలతో సంభాషించే చక్కటి అవకాశం యూపీఎస్సీ ఇంటర్వ్యూ ద్వారానే సాధ్యమవుతుంది. కాబట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కొన్నిసార్లు మార్కుల విషయంలో మనం ఊహించిన ఫలితాలు రాకపోవచ్చు. మార్కుల గురించి ఎక్కువ ఆలోచించకుండా మన బెస్ట్ ఇచ్చామా లేదా అన్నదే ముఖ్యం!!



అనుదీప్ దురిశెట్టి, ఆల్ ఇండియా టాపర్ – 2017
బ్లాగు: https://anudeepdurishetty.in

విద్య, ఉద్యోగ సమాచారం

పీజీ డిప్లొమా ఇన్ టెలికాం టెక్నాలజీ

టెలికాం రంగంలోకి 5జీ టెక్నాలజీ ప్రవేశించనున్న నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్.. అపెక్స్ లెవల్ మేనేజ్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్ (ఎన్ఏటీఎఫ్ఎం) ద్వారా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతో కలిసి దూరవిద్య విధానంలో 'టెలికాం టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్'లో పీజీ డిప్లొమా కోర్సును అందించనుంది.

- **కోర్సు వ్యవధి:** ఏడాది (రెండు సెమిస్టర్లు).
- **అర్హత:** బీటెక్ (ఈసీఈ, ఈఈఈ, ఈఐఈ, ఈటీసీ, ఐసీటీ)/ఎంఎస్సీ (ఎలక్ట్రానిక్స్), బీఎస్సీ (ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/మ్యాథ్స్/కంప్యూటర్ సైన్స్)/డిప్లొమా (ఈసీఈ, ఈఈఈ) ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో.
- **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ, ప్రొఫెషనల్ ఎక్స్‌పీరియన్స్ ఆధారంగా.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 28, 2019.
- **వెబ్‌సైట్:** www.natfm.bsnl.co.in

ఇండియన్ కోస్ట్ గార్డ్ రిక్రూట్‌మెంట్

ఇండియన్ కోస్ట్‌గార్డ్.. యాంత్రిక్ పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు ఎలక్ట్రికల్/మెకానికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాల్లో డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయసు:** 18–22 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 21
- **వెబ్‌సైట్:** www.joinindiancoastguard.gov.in

సైన్స్ అండ్ టెక్నాలజీ



సివిల్స్/గ్రూప్స్ ప్రత్యేకం

త్వరలో జరగబోయే ఏపీపీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలోనూ, తెలంగాణలో రానున్న గ్రూప్ 1, 2 పరీక్షల్లోనూ, ఇతర అనేక పోటీ పరీక్షల్లోనూ సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం అంశాల ప్రాధాన్యత పెరుగుతోంది. ఏపీ గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలోని రెండో పేపర్‌లో సుమారు 30 మార్కులకు గాను ఈ అంశాలకు సంబంధించి అయిదు యూనిట్లు ఉన్నాయి.

తొలుత బేసిక్స్‌పై పట్టు సాధించి, తర్వాత సమకాలీన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని చదివితే సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రశ్నలకు తేలిగ్గా సమాధానాలు గుర్తించొచ్చు. అంతేకాకుండా గ్రూప్–1 మెయిన్స్‌కు సంబంధించిన అంశాలపైనా పట్టు లభిస్తుంది. గ్రూప్ 1, 2 పరీక్షల్లో ప్రశ్నల సరళి మారుతున్న నేపథ్యంలో ఇలాంటి సబ్జెక్టులను ఎలా చదవాలి? అనే అంశంపై అభ్యర్థులు అవగాహన ఏర్పరచుకోవడం ముఖ్యం.

- కేవలం సమాచారం ఆధారంగా (ఇన్ఫర్మేషన్ ఓరియెంటెడ్) ప్రశ్నలు అడుగుతారు అనే ఆలోచనలో మార్పు రావాలి. సమాచారం ఆధారంగా అడిగినప్పటికీ.. కొన్ని ప్రశ్నల సరళిలో మార్పు వచ్చింది. సివిల్స్ తరహాలో ప్రశ్నలు వస్తున్నాయి. ఈ అంశాన్ని దృష్టిలోపెట్టుకొని ప్రిపరేషన్ కొనసాగించాలి.

పర్యావరణ అంశాలు కూడా..

ఏపీ గ్రూప్–1 ప్రిలిమినరీ రెండో పేపర్‌లో పార్ట్ బిలో 5 యూనిట్లలో సిలబస్‌ను పొందుపరిచారు. వీటిలో మొదటి 4 యూనిట్లు సైన్స్, టెక్నాలజీకి సంబంధించినవి. చివరిది పర్యావరణం, జీవ వైవిధ్యం, కాలుష్యం, శీతోష్ణ స్థితి మార్పులు, విపత్తుల నిర్వహణ, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పర్యావరణ అంశాలకు సంబంధించినవి.

- సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలను నాలుగు యూనిట్లలో పొందుపరిచారు. మొదటి యూనిట్లో సైన్స్, టెక్నాలజీ అంటే ఏమిటి; దాని పరిధి–దైనందిన జీవితంలో ఉపయోగాలు, దేశ సైన్స్ విధానాలు, నవీకరణ, దేశ పరిశోధన సంస్థలు, ప్రముఖ భారత శాస్త్రవేత్తలు అనే అంశాలున్నాయి. వీటికోసం తొలుత సైన్స్, టెక్నాలజీ విభాగాలు, వాటి నిర్వచనాలు, మనిషికి చేకూరే ప్రయోజనాలపై దృష్టిపెట్టాలి. ముఖ్యంగా ప్రస్తుతం బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన వాటిపై కూడా దృష్టిసారించాలి. ఉదాహరణకు బయోటెక్నాలజీలో ఇటీవల కాలంలో వార్తల్లో ఉన్న జీన్ ఎడిటింగ్, చైనాలో దానిపై నెలకొన్న వివాదం; బయో సిమిలర్స్, మూల కణాల చికిత్స (కార్డ్ బ్యాంకింగ్), దేశంలోకి అందుబాటులోకి వచ్చిన రోటా వ్యాక్సిన్ వంటి దేశీయ టీకాలు, బయో ఇన్ఫర్మేటిక్స్ వంటి వాటిపై దృష్టిపెట్టాలి. ఇదే విధానాన్ని ఐటీ, స్పేస్ టెక్నాలజీ, నానో టెక్నాలజీ, అణుశక్తి, ఎలక్ట్రానిక్స్, బయోనిక్స్, రక్షణ రంగ టెక్నాలజీకి కూడా వర్తింపజేయాలి.
- దైనందిన జీవితంలో మనం ప్రస్తుతం వినియోగిస్తున్న స్మార్ట్‌ఫోన్లు, వైద్య రంగ డయాగ్నస్టిక్ పరికరాలు (ఎంఆర్ఐ, సిటీ, యూఎస్ స్కానింగ్‌లు), వ్యాధి నిర్ధారణ పద్ధతులు, ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, ఎలక్ట్రికల్ వ్యవస్థలు వంటి వాటిపై సమాచారాన్ని సేకరించుకోవాలి.
- 1958, 1983, 2003, 2013లో భారత్ విడుదల చేసిన సైన్స్ విధానాలతోపాటు బయోటెక్నాలజీ, ఐటీ, నానో టెక్నాలజీ విధానాలను, వాటి లక్ష్యాలను అధ్యయనం చేయాలి. నవీకరణ అంటే ఏమిటి? దాని విధానాలు, నవీకరణను ప్రోత్సహించేందుకు భారత్ ఇప్పటికే నిర్వహిస్తున్న కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకోవాలి. జాతీయ నవీకరణ నిధి, ఐఐజీపీ 2.0, ఇంప్రింట్ నిధి, ప్రయాస్, అటల్‌ఇన్నోవేషన్ మిషన్, మిషన్ ఇన్నోవేషన్ లాంటి కార్యక్రమాలను చదవాలి.
- ప్రాచీన కాలం నాటి శుశ్రుతుడు, చరకుడు, ఆర్యభట్ట మొదలుకొని... అబ్దుల్ కలాం, విక్రమ్ సారాభాయి, సి.వి.రామన్ వరకూ... అదే విధంగా ప్రస్తుత కాలం నాటి టెస్సీ థామస్, వాలార్మతీ వరకూ భారత శాస్త్రవేత్తలు, భారత్ సాధించిన కీలక విజయాలను చదువుకోవాలి. నోబెల్ పురస్కారం పొందిన భారతీయ శాస్త్రవేత్తలు, ఇటీవల కాలంలో భట్నాగర్ అవార్డులు, అంతర్జాతీయ సైన్స్ అవార్డులు పొందిన భారత శాస్త్రవేత్తల సమాచారం తెలుసుకోవాలి.

ఐసీటీ అంశాలు

రెండో యూనిట్‌లో ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ అంశాలు ఉన్నాయి. వ్యవసాయం, వైద్యం, విద్య, పారిశ్రామిక, వాణిజ్య, సాంకేతిక పరిశోధన, నెట్‌వర్కింగ్, విపత్తు నిర్వహణ రంగాల్లో ఐసీటీ ద్వారా పొందుతున్న సేవల గురించి తెలుసుకోవాలి. ముఖ్యంగా ఈ–నామ్, డిజిటల్ ఇండియా, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల ఈ–గవర్నెన్స్ కార్యక్రమాల (మీసేవ, మీకోసం, ఈ–ప్రగతి)పై అవగాహన పెంపొందించుకోవాలి. ఇక్కడే ప్రస్తుతం వార్తల్లో ఉన్న బిగ్‌డేటా, డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధ, రోబోటిక్స్, ఐవోటీ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల ప్రాథమిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి. దేశ ఐటీ, బీపీఎం రంగాల ప్రగతికి సంబంధించి నాస్కామ్ నివేదికలను చదవాలి. దేశ ఐటీ విధానంలో సైబర్ భద్రత విధానంపై దృష్టిసారించాలి. ఇటీవల కాలంలో సైబర్ ముప్పుగా వార్తల్లో ఉన్న ఫిషింగ్, రాన్సమ్‌వేర్ (పెట్యా, వన్నాక్రై) వంటి వాటిపై సమాచారం సేకరించుకోవాలి. బ్లాక్‌చైన్ టెక్నాలజీకి సంబంధించిన బేసిక్స్ తెలుసుకోవాలి. అంతర్జాల నియమావళిగా నెటికెట్ గురించి అవగాహన అవసరం.

అంతరిక్ష కార్యక్రమం

మూడో యూనిట్‌లో భారత అంతరిక్ష కార్యక్రమాన్ని సిలబస్‌లో పొందుపరిచారు. భారత అంతరిక్ష కార్యక్రమం ప్రారంభ దశ, వ్యవస్థాపక అంశాలను, పరిశోధనలను, మొదటి ప్రయోగాలను చదువుకోవాలి. కార్యాచరణ దశలో భాగంగా.. ఇన్‌శాట్, ఐఆర్ఎస్, నావిక్, గగన్ వ్యవస్థలను; పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ నౌకల అభివృద్ధి, నిర్మాణం, రకాలు, గత రెండేళ్ల ప్రయోగాల సమాచారాన్ని తెలుసుకోవాలి. రోదసీ అన్వేషణలో భాగంగా చంద్రయాన్ –1, చంద్రయాన్–2, మంగళయాన్, ఆస్ట్రోశాట్, ఆదిత్య ఎల్–1, గగన్‌యాన్‌ల గురించి అవగాహన పెంచుకోవాలి. గత రెండేళ్లలో భారత్ ఏఏ దేశాలకు చెందిన ఉపగ్రహాలను ప్రయోగించిందన్న అంశంపై దృష్టిపెట్టాలి. కీలక ప్రయోగాలైన పీఎస్ఎల్‌వీ–సీ 37, జీశాట్–29, జీశాట్–11ల గురించి అవగాహన పెంచుకోవాలి. సమకాలీన విదేశీ అంతరిక్ష కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి. స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ హెవీ, నాసాకు చెందిన పార్కర్ సోలార్ ప్రోబ్, చైనాకు చెందిన చాంగే 4 వంటి వాటిని ఏమాత్రం విస్మరించకూడదు.

- ఇదే యూనిట్‌లో డీఆర్‌డీవో కార్యకలాపాలను ప్రస్తావించారు. దేశంలో ఇప్పటి వరకూ అభివృద్ధి చేసిన క్షిపణులు, వాటి పరిధి, పేలోడ్ సామర్థ్యం, గత రెండేళ్ల పరీక్షలు, ఇతర ప్రయోగాల గురించి చదువుకోవాలి.ముఖ్యంగా అగ్ని 4, అగ్ని 5, అస్త్ర, బ్రహ్మోస్, బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ సిస్టమ్ వంటి వాటిపై దృష్టిసారించాలి. అదనంగా దేశ నావికా దళానికి సంబంధించిన వివిధ యుద్ధ నౌకలు, జలాంతర్గాములపై సమాచారం సేకరించుకోవాలి. దేశవ్యాప్తంగా ఉన్న డీఆర్‌డీవో అనుబంధ సంస్థల గురించి తెలుసుకోవాలి.

శక్తి వనరులు

- నాలుగో యూనిట్‌లో పూర్తిగా శక్తి వనరులు అంశాలను ఇచ్చారు. ప్రస్తుతం దేశంలో శక్తి వనరుల వర్గీకరణ, వాటి లభ్యత, స్థాపిత సామర్థ్యం గురించి తెలుసుకోవాలి. దేశం పూర్తిస్థాయి విద్యుదీకరణ దిశగా విజయం సాధించిన నేపథ్యంలో.. విద్యుదీకరణ కార్యక్రమాలు, ఉదయ్, సౌభాగ్య, కుసుం, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజనపై సమాచారం అవసరం. దేశ శక్తి విధానాలు, మార్పులు, డిమాండ్‌లు, కొరత, ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన అంశాలను వీలైనంత విస్తృతంగా చదువుకోవాలి. పునరుత్పాదక, నవీన శక్తి వనరులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి. సౌర, పవన, జీవ శక్తి, చిన్నతరహా జల విద్యుత్, వ్యర్థాల నుంచి విద్యుత్‌తో పాటు జియోథర్మల్, ఓషన్ థర్మల్, టైడల్, హైడ్రోజన్ శక్తి వంటి నవీకరణ శక్తి వనరుల గురించి తెలుసుకోవాలి. ఇదే తరుణంలో ఫ్యూయెల్ సెల్, బ్యాటరీ వాహనం ఎలా పనిచేస్తాయో తెలుసుకోవాలి. జాతీయ సౌర మిషన్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించాలి. జీవ ఇంధనాలు, రకాలు, జాతీయ బయోడీజిల్ కార్యక్రమం గురించి తెలుసుకోవాలి.

అణుశక్తి

అణుశక్తి మరో ముఖ్యమైన అంశం. దేశంలో అణుశక్తి విభాగం ఆధ్వర్యంలోని కేంద్రాల సమాచారాన్ని సేకరించి, అధ్యయనం చేయాలి. ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా ఎక్కడ రియాక్టర్లు ఉన్నాయి? వాటి సామర్థ్యం ఎంత? తదితరాల గురించి తెలుసుకోవాలి. కొత్తగా ప్రణాళిక పూర్తయిన రియాక్టర్లను ఏఏ ప్రాంతాల్లో నిర్మిస్తున్నారో తెలుసుకోవాలి. దేశ అణుశక్తి విధానం, వాసెనార్ ఒప్పందం, సీటీబీటీ, ఎన్‌పీటీ, ఎంటీసీఆర్, ఐఏఈఏ, ఐసీఏఎన్, న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్, అణు పరిహార చట్టం గురించి తెలుసుకోవాలి.


సి.హరికృష్ణ
సివిల్స్ సీనియర్ ఫ్యాకల్టీ,
హైదరాబాద్